వీక్షణం

VEEKSHANAM, TELUGU MONTHLY
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 12 సంచిక : 9 హైదరాబాద్ 158 సెప్టెంబర్ 2014 పేజీలు : 68 రు. 20

- ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2014-15
- ఆంధ్రప్రదేశ్ రాజధానిపై రగడ
- మాసాయిపేట దుర్ఘటన కారణాలు
- విద్యారంగంలో కాషాయీకరణ
- పెట్రో కెమికల్ కారిడార్ వినాశనం
- మావోయిస్టు పార్టీకి పదేళ్లు
- గాజాలో ఇజ్రాయిల్ నరమేధం

వీక్షణంకు రాయండి, రాయించండి

పన్నెండు సంవత్సరాలుగా ప్రతినెలా దాదాపు ఇరవై వ్యాసాలతో పాఠకుల, ప్రజల సమాచార, అవగాహనా, విశ్లేషణా అవసరాలను తీర్చడానికి వీక్షణం రాజకీయార్థిక మాసపత్రిక చేస్తున్న కృషి మీకు తెలుసు. అయితే ఎంత కృషి చేసినా చేయవలసిన కృషి మిగిలిపోయేంత వైవిధ్యభరితమైన, వైరుధ్యపూరితమైన సమాజం మనది. ఎంత రాసినా సమాజం తన గురించి తాను ఆలోచించుకోవలసిన విషయాలు, రాయవలసిన విషయాలు, వెలుగు ప్రసరించవలసిన విషయాలు, అవగాహన పెంపొందించుకోవలసిన అంశాలు ఇంకా ఎన్నో మిగిలిపోతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవలి అంతర్జాతీయ, దేశీయ, ప్రాంతీయ పరిణామాలు ఇంకా ఎక్కువ రచనలను, ఆలోచనలను కోరుతున్నాయి.

పేదదేశాలను కబళిస్తున్న ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద రాజ్యాల, బహుళజాతి సంస్థల దుర్మార్గాలు, వారు తెచ్చిపెడుతున్న యుద్ధాలు ఎంత రాసిన తరగనివే. మతోన్మాద రాజకీయాల పునాది మీద, అభివృద్ధి భ్రమలతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా రానున్న సంవత్సరాలలో అమలు కానున్న రాజకీయార్థిక విధానాలు నిశితంగా పరిశీలించి, ప్రజలకు తెలియజెప్పవలసినవే. కొత్తగా రూపొందిన రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెల్లుబుకుతున్న ప్రజా సమస్యలు వివరంగా చర్చించుకోవలసినవే. తెలుగుదేశం పాలనలో కొత్త ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటిస్తున్న విజన్ 2020 అభివృద్ధి నమూనా, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అమలై వినాశకరమైనదిగా రుజువైనదే. తెలంగాణలో ప్రజా ఉద్యమ క్రమంలో ఆకాంక్షలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో, వ్యవస్థ మార్పు తప్ప మరేదీ ఆ ఆకాంక్షలను తీర్చలేని స్థితిలో ప్రజా అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. అంటే దేశవ్యాప్తంగానూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రానున్న కాలంలో తీవ్రమైన ప్రజా సమస్యలు, ప్రజా ఆందోళనలు విస్తరించే అవకాశం ఉంది.

సమాజం తనతో తాను జరుపుకునే సంభాషణకు గళంగా, ప్రజానుకూల చర్చావేదికగా వీక్షణం ఈ సామాజిక స్థితికి అద్దం పట్టదలచుకుంది. ఈ సామాజిక స్థితిని విశ్లేషించదలచుకుంది. గ్రామీణ, స్థానిక, ప్రాంతీయ స్థాయిలలో ఎక్కడెక్కడ ప్రజా సమస్యలు వ్యక్తమయినా, ప్రజా అసంతృప్తి పొడసూపినా, ఉద్యమ రూపం ధరించినా ఆ పరిణామాలన్నిటినీ వీక్షణం ప్రచురించదలచుకుంది. ఈ కర్తవ్య నిర్వహణలో భాగం కావలసిందిగా వీక్షణం తన పాఠకులకూ, అభిమానులకూ, ఆలోచనాపరులకూ, రచయితలకూ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నది. ఈ విషయాల మీద రాయడానికి ప్రయత్నించండి. రాయండి, రాయించండి. ప్రధాన స్రవంతి పత్రికలు విస్మరించే అంశాలపై, ప్రధాన స్రవంతి పత్రికలలో వెలువడినా భిన్నమైన ప్రజాకోణం ఉండే అంశాలపై వ్యాసాలు, అన్ని సామాజిక అంశాల మీద ప్రజాదృక్పథాన్ని అందించే వ్యాసాలు ప్రచురించడం వీక్షణం లక్ష్యం.

వీక్షణంకు అటువంటి వ్యాసాలు రాయగలిగిందీ, రాయవలసిందీ, రాయించవలసిందీ మీరే. మీరే.

158

ISSN 2231-6892

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2014
సంపుటి : 12
సంచిక : 9

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; నల్గొండ – జి. వెంకటేశ్వర్లు; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్. **ఆంధ్రప్రదేశ్ :** అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజీ; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; ప్రకాశం – కర్ణ సతీష్‌బాబు; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై 'veekshanam' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో అమెరికా నుండి ఒక పాఠకుడు విరాళంగా రు. 5000, మూల నిధికి ఎల్. సుబ్బయ్య (కర్నూలు) రు. 100, ఆర్. ఎస్. చౌహాన్ (కర్నూలు) రు. 500 ఆర్థిక సహాయం అందజేశారు. అందరికీ కృతజ్ఞతలు. - సం.

వీక్షణం ఆగస్టు సంచికలో గతితర్కం – ఒక వివరణ వ్యాసంలో వై.వి. రమణారావు రాసిన లా ఆఫ్ ఎక్స్‌క్లూడెడ్ మిడిల్‌ను ఎ,బి కాదు అని వివరించారు. నాకు తెలిసినంతవరకు (లాజిక్ చదివి దాదాపు పది సంవత్సరాలు గడిచాయి) లా ఆఫ్ ఎక్స్‌క్లూడెడ్ మిడిల్ సూత్రీకరణ ఎ, బి నాన్ బి కాదు అని (ఎ కెనాట్ బీ బి అండ్ నాన్ బి).

– నరేంద్రమోహన్
ఆస్ట్రేలియా

తెల్ల దొరల నుంచి నల్ల దొరలకు రాజ్యాధికారం బదిలీవల్ల కూడా మానవుడు సర్వత్రా సంకెళ్లలో బంధించబడి ఉన్నాడని చెప్పిన రూసో మాటలు గుర్తుకు వస్తున్నాయి. తెలుగు జాతిని పెట్టుబడీ, భూస్వామ్య పెట్టుబడిదారీ బహుళజాతి సంస్థల దుర్మార్గాల నుంచి కాపాడుకోవడానికి చైతన్యపరుస్తున్న 'వీక్షణ' మాస పత్రికకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అండగా నుండిన వీక్షణంలో ఇటీవల ప్రాంతీయ అసమానతలు పొడసూపుతున్నట్లుగా కొన్ని వ్యాసాలు కోస్తాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఎవరు ఎంత నష్టపోయారో తెలియనప్పటికీ, మెజార్టీ వ్యాసాలు తెలంగాణ అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా కనిపిస్తుంది. ముఖ్యంగా తెలంగాణలో పాలమూరుకు ఎంత వలసల అడ్డాగా ప్రాధాన్యత ఉందో, ఉత్తరాంధ్ర జిల్లాలకు తలసరి ఆదాయం అతి ఎక్కువ కలిగిన ప్రాంతాలుగా ముద్రపడిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా సీమాంధ్ర సామాజిక అంశాల ప్రజా దృక్పథం కలిగిన వ్యాసాలు అరకొరగా వీక్షణంలో వస్తున్నాయి. ప్రపంచ చరిత్ర చూస్తే, ధనికులు, 'పేదకులం' అనే రెండు సామాజిక వర్గాలే ఉన్నాయి. వీటి మధ్య ఉన్న అసమానతలు రూపుమాపడమే మన కర్తవ్యం కావాలి. కేవలం ఒక ప్రాంత సమస్య కోణం కాకుండా ఇతర ప్రాంత సమస్య కోణాల నుండి ఉన్న సామాజిక అంశాలపై కూడా పరిగణనలోకి తీసుకోని తెలుగుజాతి మరింత పురోభివృద్ధి సాధించడానికి వీక్షణం నడుం కట్టాలని మనవి.

– తలగాపు వెంకటరమణ
కోటబొమ్మాళి, శ్రీకాకుళం

తెలంగాణ ప్రభుత్వ విధానాల దిశ ఎటు? (ఆగస్ట్ 2014) వ్యాసం బ్యాలెన్స్‌డ్‌గా బాగుంది.

– వి.సతీష్‌బాబు
హైదరాబాద్

దళిత విద్యార్థులు పూర్ణా, ఆనంద్‌లు సాధించిన మహా విజయం గురించి వీక్షణం వ్యాసంలో రంగనాయకమ్మ కుల మనస్తత్వంతో విషం కక్కింది. సంపాదకుల బ్రాహ్మణ మనస్తత్వం ఆ విషపూరిత వ్యాసాన్ని పత్రికలో అచ్చు వేసింది.

– సంపత్ కుమార్
ప్రధాన కార్యదర్శి, డా. బి.ఆర్. అంబేడ్కర్ మిషన్, కడప
(ఇంగ్లిష్‌లో వచ్చిన మెసేజ్‌కు అనువాదం)

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తొమ్మిది దశాబ్దాల తరువాతనైనా తత్వశాస్త్రం, హెగెల్ గురించి చర్చ జరగడం సంతోషించవలసిన పరిణామం. మార్క్స్, లెనిన్, మావో గతితర్కం ప్రకృతికి వర్తించదని భావించారని రాశారు. మార్క్స్, ఎంగెల్స్ తరుచుగా ఉత్తరాలు రాసుకుంటూ, కలిసి అధ్యయనం చేస్తూ, ఒకరి రచనల మీద ఒకరు వ్యాఖ్యానిస్తూ ఉన్న రోజుల్లో ఎంగెల్స్ ప్రకృతి గతితర్కం (అసంపూర్తి రచన) రాశాడు. దీంతో మార్క్స్ విభేదించాడు అనడానికి ఆధారాలు లేవు. అలాగే లెనిన్ రచన 'మెటీరియలిజం అండ్ ఇంపీరియో క్రిటిసిజం'లో ప్రకృతి నియమాల చర్చ వివరంగానే ఉంది. నాగభూషణా చార్యులు లెనిన్ పోటీ వ్యాసం గురించి చేసిన రచన ప్రస్తుత పరిస్థితికి సంబంధం తెలియం లేదు. విభజన తరువాత కనీసం ఆంధ్రప్రదేశ్‌లో ఎటువంటి విప్లవం జరగలేదు. మరి ఇప్పుడు ఉండే పోటీ పెట్టుబడి కోసం కాక మరిదేని కోసం ఉంటుంది.

– కె. నరేంద్రమోహన్
వీక్షణం బ్లాగ్‌పై

రెండు నెలలే గడిచినందువల్ల ఇప్పుడే ఈ విషయాలు మాట్లాడకూడదని కొందరు అంటున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వ విధానాల గురించి వీక్షణం ఆగస్ట్ 2014 సంచికలో వచ్చిన వ్యాసం బాగుంది. అవసరమైన వైఖరి ప్రకటించింది.

– ఇ.ఎస్. బ్రహ్మచారి
ఒంగోలు

రంగనాయకమ్మ గారి మొరటు తర్కానికి బ్రహ్మాండమైన ఉదాహరణ 'ఎవరెస్టంత భావ కాలుష్యం' (వీక్షణం, ఆగస్ట్ 2014). మనుషులు యంత్రాలు కారనీ, ఉత్పత్తిలో మాత్రమే పాల్గొనరనీ, ప్రయోగం, వినోదం, అన్వేషణ అనే ఎన్నెన్నో ఆసక్తులు ఉంటాయనీ ఆమెకు చెప్పడం కష్టం. అసలు మనిషిని ఇతర జీవజాలం నుంచి వేరు చేసేది కుతూహలం అని ఒక సైన్స్ రచయిత రాశాడు. అక్కడ ఏముంది, అది ఏమిటి, అది ఎలా జరుగుతుంది వంటి ప్రశ్నలు ప్రతి మనిషికీ కలుగుతాయి. మరొకరు చెప్పినది విని ఊరుకుని ఉంటే మానవజాతి ప్రయాణమే ఇక్కడిదాకా వచ్చి ఉండేది కాదు. ఆ కుతూహలంలో, అన్వేషణలో భాగమే పర్వతారోహణ, కొత్త ప్రాంతాలకు వెళ్లడం, కొత్త మనుషులను కలవడం, కొత్త పుస్తకాలు చదవడం, కొత్త అనుభవాలు కలిగించుకోవడం. ఇవన్నీ వద్దని రంగనాయకమ్మ వంటి కొందరు అనుకోవచ్చు. కాని దాన్ని సిద్ధాంతం చేయడం సరి కాదు. ఈ పనికి పెట్టే ఖర్చు మరొక పనికి పెట్టవచ్చు అనేది వినడానికి బాగానే ఉంటుంది గాని, ఆ అన్వేషణా తపన ఉన్నవాళ్లు ఆ బహుమతులు ఉన్నా లేకపోయినా ఆ పనులు చేస్తూనే ఉంటారు. దాన్ని వేలం వెర్రి చేయడాన్ని తప్పుపట్టవచ్చు గాని రంగనాయకమ్మ గారిలా మొరటుగా, అడ్డంగా నరికేస్తూ పోతే, ఇంత సున్నితత్వం తెలియకపోవడమే మార్క్సిజం అయితే మాకది వద్దేవద్దు అని జనం భయపడిపోతారు.

– పి. వెంకటేశ్వర్లు
జహీరాబాద్

నేను గత ఐదు సంవత్సరాలుగా వీక్షణం పత్రిక పాఠకుడిని. పత్రికలో వస్తున్న వ్యాసాలపై మా మిత్రబృందం ప్రతి నెలా చర్చించుకుంటాం. దీనివల్ల మాకు సమాజం పట్ల ఒక అవగాహన ఏర్పరుచుకోవడానికి దోహద పడింది. వీక్షణంకు మా వంతు సహకారంగా మాకు తెలిసిన మిత్రులకూ, టీచర్లకూ, లెక్చరర్లకూ పత్రికను పరిచయం చేసి చందాదారులుగా చేర్పిస్తున్నాం. సామాజిక దృక్పథంతో వస్తున్న ఇలాంటి పత్రికను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావిస్తున్నాం.

– లింగయ్య
నల్గొండ

ప్రణాళికా సంఘానికి మోడీ అంత్యక్రియలు

దేశంలో ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైన నాటి నుంచీ పాలకవర్గాలలో ప్రణాళికా సంఘం పట్ల వ్యక్తమవుతున్న చిన్నచూపు, దానిపైన విమర్శలు, దాన్ని లోలోపలి నుంచి ధ్వంసం చేయడానికి జరిగిన ప్రయత్నాలు ఎట్టకేలకు నరేంద్ర మోడీ పాలన నాటికి పరిపక్వమై అసలు ప్రణాళికా సంఘాన్నే రద్దు చేసే నిర్ణయం జరిగిపోయింది. ఆగస్ట్ 15న ఢిల్లీ ఎర్రకోట శిథిలాల పైనుంచి ప్రధానమంత్రి చేసే లాంఛన ప్రాయమైన ఉపన్యాసంలో నరేంద్ర మోడీ ప్రణాళికా సంఘాన్ని రద్దు చేస్తున్నామని ప్రకటించాడు. దాని అరవై సంవత్సరాల చరిత్రలో భారత ప్రణాళికా సంఘం ప్రజానుకూలంగా ఉండడానికేమీ ప్రయత్నించలేదు గనుక దాని హత్యకు ఎవరూ సంతాపం ప్రకటించనక్కరలేదు. దాని మీద, దాని పనితీరు మీద తప్పనిసరిగా ప్రజా దృక్కోణం నుంచి తీవ్రమైన విమర్శలే చేయవచ్చు. కాని దాన్ని రద్దు చేయడానికి పాలకవర్గాలకు ఉన్న కారణాలు వేరు.

ఈ నేపథ్యంలో అసలు ప్రణాళికాబద్ధ ప్రగతి భావన గురించి ఆలోచించవలసి ఉంది. ఈ దేశంలోకి ప్రణాళికా సంఘం, ప్రణాళికా బద్ధమైన రాజకీయార్థిక విధానాలు, ప్రణాళికలు ఉండాలనే ఆలోచన సోవియట్ సోషలిస్టు ప్రయోగాల నుంచి ప్రవేశించాయి. నిజానికి ప్రణాళికా రచనే ఒకరకంగా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ విజయాల వల్ల ప్రపంచానికి పరిచయమయింది. వనరుల పంపిణీ, ఫలితాల పంపిణీ రాచరికంలో ప్రభువుల ఇష్టారాజ్యంగా సాగగా, పెట్టుబడిదారీ వ్యవస్థలో అరాచకంగా, లాభాపేక్షను అనుసరించే మార్కెట్ ఊగిసలాటల ప్రకారం సాగుతాయి. ఈ రెండు పద్ధతులకూ భిన్నంగా ప్రజల వినియోగ అవసరాలను శాస్త్రీయంగా మదింపు వేసి అందుకు తగినట్టుగా వనరుల పంపిణీ, ఉత్పత్తి, పంపిణీ, వినిమయం, వినియోగం ప్రక్రియలను క్రమబద్ధం చేయడాన్ని సోషలిజం సాధిస్తుందని మార్క్స్, ఎంగెల్స్‌లు సైద్ధాంతిక స్థాయిలో చేసిన ప్రతిపాదనను తొలి సోషలిస్టు రాజ్యంలో లెనిన్ ఆచరణలోకి తేవడానికి ప్రయత్నించాడు. ఆయన మరణం తర్వాత స్టాలిన్ ప్రారంభించిన మొదటి పంచవర్ష ప్రణాళిక నిజానికి నాలుగు సంవత్సరాలలోనే అన్ని లక్ష్యాలు సాధించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఆ ప్రణాళికాబద్ధ విధానమే మిగతా ప్రపంచాన్ని కుదిపేసిన 1929 మహా సంక్షోభం సోవియట్ దరిదాపులకు కూడ రాకుండా కాపాడింది. అందువల్లనే 1930ల ఆలోచనాపరులందరూ ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి గురించి ఆలోచించారు. భారత జాతీయోద్యమం కూడ ఆ అవగాహనలను స్వీకరించింది గనుకనే 1938లోనే సుభాస్ చంద్రబోస్ నాయకత్వాన ప్రణాళికా రచన ప్రారంభించింది. అప్పటికే జవహర్‌లాల్ నెహ్రూ తనను తాను సోషలిస్టుగా భావించుకుంటూ ప్రణాళికాబద్ధ విధానానికి తన అనుకూలతను ప్రకటిస్తూ వచ్చాడు. వలసానంతర భారత ప్రభుత్వం ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాన్ని అనుసరిస్తుందని నిర్ధారణ అయిపోయింది.

1947 తర్వాత రాజ్యాంగంలోనే ప్రణాళికా సంఘం ఏర్పాటుకు అధికరణం చేర్చి, 1950లో ప్రణాళికా సంఘాన్ని ఏర్పరచి, 1951 నుంచీ పంచవర్ష ప్రణాళికలు మొదలయ్యాయి. కాని కొనసాగుతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ ప్రయోజనాలకూ, సోషలిస్టు ప్రణాళికా అవగాహనకూ వైరుధ్యం తలెత్తింది. అందువల్ల ప్రణాళికా సంఘం సామాజిక అవసరాలను, సామాజిక వనరులను సమతుల్యం చేసే ఆదర్శాన్ని విస్మరించి, వర్గదోపిడీని సాధికారం చేసే మేలిముసుగుగా పనిచేస్తూ వచ్చింది. రాష్ట్రాల మధ్య ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి, పేదరికం, అవిద్య, అనారోగ్యం, మౌలికసౌకర్యాల లేమి, నిరుద్యోగం వంటి సమస్యలను పరిష్కరించడానికి పనిచేయవలసిన ప్రణాళికా సంఘం ఆ పనులను పక్కనపెట్టింది. అటు క్రమబద్ధంగా పంచవర్ష ప్రణాళికలను నిర్వహించడంలో గాని, సంక్షేమ రాజ్య భావనలను ఆచరణలో పెట్టడంలో గాని విఫలమై, తన స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి, పాలకవర్గాల, పాలకపక్షాల బంటుగా మారిపోయిన ప్రణాళికా సంఘానికి సంబద్ధత ఎప్పుడో పోయింది.

1990ల తర్వాత నూతన ఆర్థిక విధానాలలో భాగంగా పాత నామమాత్రపు సోషలిస్టు ఆనవాళ్లనైనా తుడిచెయ్య దలచుకున్న ప్రభుత్వాలు ప్రణాళికాసంఘాన్ని మరింతగా నీరు గార్చాయి. అసలు ప్రణాళికలే అవసరం లేదని, వనరుల పంపిణీని మార్కెట్ శక్తులే సక్రమంగా నిర్వర్తించగలవని ప్రచారం ప్రారంభమైంది. ప్రణాళికా రచన అంటేనే గిట్టని వ్యక్తులను ప్రణాళికా సంఘ బాధ్యులుగా నియమించడం మొదలైంది. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో మార్కెట్ శక్తుల ఇష్టారాజ్యానికి, అరాచకానికి సమాజాన్ని వదిలెయ్యాలని నమ్మే, ప్రచారం చేసే మాంటెక్ సింగ్ అహ్లువాలియా వంటి వారి నాయకత్వంలో ప్రణాళికా సంఘం దాని ప్రకటిత లక్ష్యాలకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయింది. దేశ సమస్యలను పరిష్కరించే బాధ్యతను విస్మరించి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే అనేక ప్రభుత్వ సంస్థల్లో ఒకటిగా మారిపోయింది.

ప్రణాళికా సంఘం ఇలా ప్రతిష్ఠను కోల్పోయిన స్థితిలో సంఘపరివార్ కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని చేపట్టింది. సోషలిజం అనే భావనకే పూర్తిగా వ్యతిరేకులైన సంఘపరివార్ శక్తులు ప్రణాళికా సంఘం అనేది ఉంటే, ఎప్పటికైనా దాన్ని మళ్లీ ప్రకటిత లక్ష్యాల దిశగా మళ్లించే అవకాశం వస్తుందని భయంతో అసలు దాన్ని లేకుండా చేయదలిచారు. తమకు అధికారం ఐదు సంవత్సరాలకొరకు మాత్రమే వచ్చినప్పటికీ, ఈ ఐదు సంవత్సరాలలోనే దేశ అధికారిక వ్యవస్థలలో ప్రజానుకూలంగా మారే అవకాశం ఉన్నవాటన్నిటినీ రద్దుచేసి, పునాదులు మార్చివేసి, భవిష్యత్తులో కూడ ప్రజానుకూల విధానాలు రాకుండా చూడడానికి సంఘపరివార్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

ప్రణాళికా సంఘం ఇప్పటివరకూ సాగించిన అస్తవ్యస్త విధానాలను విమర్శించడం ఒక ఎత్తు. కాని ఆ కారణంతో దాన్ని మూసివేయడానికి వీలులేదు. అలా మూసివేయడం సమాజాన్ని పెట్టుబడిదారీ పారిశ్రామిక, వ్యాపార, సంపన్న స్వార్థపర శక్తుల దుర్మార్గాలకు బలిచేయడమే. దాన్ని పునరుద్ధరించి, సక్రమంగా నడపాలని, దాన్ని మూసివేయడం అసలు సామాజిక ఆదర్శాలకే వ్యతిరేకమని డిమాండ్ చేయవలసి ఉంది. వీ

ప్రజా ఆకాంక్షలా? ప్రజావ్యతిరేక విధానాల కొనసాగింపా?


తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి గురించి, బంగారు తెలంగాణ గురించి, తెలంగాణ పునర్నిర్మాణం గురించి చేస్తున్న ప్రకటనలకూ, ఆచరణలో అది అమలు చేస్తున్న, ప్రోత్సహిస్తున్న విధానాలకూ వైరుధ్యం క్రమక్రమంగా పెరిగిపోతున్నది. విదేశీ నిధుల గురించి, ఐటి గురించి, ప్రైవేటు పరిశ్రమల, వ్యాపారాల అభివృద్ధి గురించి చంద్రబాబు నాయుడు పాలనాకాలంలో సాగిన ప్రగల్భాలకు ఏమాత్రం తీసిపోని ఆడంబరమైన ప్రకటనలతో పాలకపక్షం పొద్దుపుచ్చుతున్నది. గ్రామీణ ఆర్థికవ్యవస్థను మెరుగుపరచడం, నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం, వ్యవసాయాన్ని పునరుద్ధరించడం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, ప్రజోపయోగకర, ఉపాధికల్పనా పరిశ్రమలను స్థాపించి, నిరుద్యోగాన్ని రూపుమాపడం, ప్రాథమిక విద్యా, వైద్య, ఆరోగ్య, తదితర ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా రూపొందించి అమలు చేయడం వంటి ఆదర్శాలు, ఉద్యమ క్రమంలో వెలువడిన వాగ్దానాలు పక్కకు పోతున్నాయి. పట్టణీకరణ మీద శ్రద్ధ, తిండిగింజల వ్యవసాయం స్థానంలో మార్కెట్ వ్యవసాయానికి ప్రాధాన్యత, పాలనా విధానాల నుంచి అట్టడుగు పోలీసు వైఖరి వరకూ అప్రజాస్వామికత గత ప్రభుత్వాలలో లాగనే కొనసాగుతున్నాయి. ఉద్యమ వేడి ఇంకా చల్లారలేదు గనుక, తెలంగాణ సమాజంలో ఇంకా వేచి చూద్దామనే ధోరణి హెచ్చు స్థాయిలోనే ఉంది గనుక, అప్రజాస్వామిక పాలనా విధానాలకు పునాదులు నిర్మించే పని ప్రశ్నలు లేకుండా జరిగిపోతున్నది. సర్వేలు జరిపి, ఆ సర్వేల ఫలితాల ప్రకారమే విధాన నిర్ణయాలు జరుగుతున్నాయని ప్రచారం చేయడం చంద్రబాబు నాయుడుకు ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఆదేశమే. సర్వేలలో వెల్లడైన జనాభిప్రాయం ప్రకారమే చంద్రబాబు విద్యుత్‌రంగ సంస్కరణలకు పూనుకున్నాడని ప్రపంచబ్యాంకు పత్రాలలో కూడ రాశారు. సరిగ్గా అలాగే ఇప్పుడు ప్రభుత్వం చేపట్టబోయే విధానాలకు పునాది కల్పించడానికి సర్వే జరిగింది. ఆ సర్వే మీద తెలంగాణ వ్యతిరేకులు చేసిన దుష్ప్రచారాలకు జవాబు చెప్పడానికి తెలంగాణవాదులు దాన్ని సమర్థించవలసి వచ్చింది. ఒకవైపు సర్వే సంపూర్ణంగా, విజయవంతంగా జరిపి, ప్రభుత్వం తలచుకుంటే ఎటువంటి పనులు చేయగలదో నిరూపించినవారే, కేసుల ఎత్తివేత, ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ, రైతుల ఆత్మహత్యల నిరోధం వంటి చిన్న పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సర్వజనుల ఆకాంక్షలు తీరుస్తుందని ఎంత చెప్పుకున్నప్పటికీ, రాష్ట్ర ఏర్పాటు తర్వాత రైతుల ఆత్మహత్యలు, రైతుల మీద, విద్యార్థుల మీద లాఠీచార్జిలు, విప్లవకారులతో ఎదురుకాల్పులు, అవినీతి, బహుళజాతి సంస్థలకు ఎర్రతివాచీలు పరవడం, యథావిధిగా కొనసాగుతున్నాయి. విస్తారమైన ప్రజా ఆకాంక్షల కెరటాల మీద లేచి అధికారపీఠాన్ని అధిరోహించిన ప్రభుత్వం పాత ప్రభుత్వాల విధానాలనే అమలుచేస్తే తెలంగాణ ప్రజల సమరశీల చైతన్యం మౌనంగా సహిస్తుందని మాత్రం అనుకోవడానికి వీలు లేదు. వీ

అదే బడ్జెట్, అదే విజన్, అదే ప్రజావ్యతిరేకత

చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏ విధానాలను అమలు చేశారో అవే విధానాలను విభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడ అమలు చేయడానికి మరింత పట్టుదలతో ప్రయత్నిస్తున్నట్టున్నారు. అప్పటి లాగనే ఇప్పుడూ శ్వేతపత్రాలు ప్రకటించారు. అప్పుడు విజన్ 2020 అన్నట్టుగానే ఇప్పుడు విజన్ 2029 అంటున్నారు. అప్పటిలాగనే బహుళజాతి సంస్థలకు, బడా పెట్టుబడిదారులకు పెద్ద పీట వేస్తూ, వారి ప్రయోజనాలు తీర్చే పథకాలు రచిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి చేస్తామో చెపుతూ బహుళజాతి సంస్థలను ఊరిస్తున్నారు. గతంలో ప్రజాందోళనల వల్ల ఆగిపోయిన బాక్సైట్ తవ్వకాలను కొనసాగించడానికి ఆలోచనలు చేస్తున్నారు. అప్పటిలాగనే అబద్ధాల, అర్ధసత్యాల ప్రకటనలతో కలలు అమ్ముతున్నారు. ఈ విధానాలలో భాగంగానే తెలుగుదేశం ప్రభుత్వం 2014-15 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన బడ్జెట్ ఆనవాయితీగా ప్రస్తావించే సంక్షేమ కార్యక్రమాలతో పాటు, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం కింద మచిలీపట్నం నౌకాశ్రయం అభివృద్ధితో సహా, పద్నాలుగు కొత్త ఓడరేవులను ప్రతిపాదించింది. కాకినాడలో మరొక నౌకాశ్రయాన్నీ, ప్రైవేట్ రంగంలో వాణిజ్య నౌకాశ్రయాన్నీ ప్రతిపాదించింది. విజయవాడ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, విజయవాడ – కాకినాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, కుప్పం, నెల్లూరు, కర్నూలు, శ్రీకాకుళం లలో విమానాశ్రయాలు ప్రతిపాదించింది. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల రంగంలోకి మూడులక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రణాళిక ప్రకటించింది. ఈ పథకాలన్నీ ఎంత పెద్ద ఎత్తున విస్థాపనకు, నిర్వాసితత్వానికి దారి తీస్తాయో ఊహించడమే అసాధ్యం. ఎప్పటిలాగే ఐటి రంగంలో ఐదు లక్షల ఉద్యోగాల వాగ్దానం జరిగింది గాని అందులో పదో వంతయినా సాధ్యమా అనుమానమే. రాష్ట్రాన్నిడిజిటల్ ఆంధ్రప్రదేశ్‌గా, స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తానని పాతకలలనే మరొకసారి అమ్మడానికి ఈ బడ్జెట్ ప్రయత్నించింది. విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల సమస్యలు మరింతగా పెరిగాయి. విద్యా, ఉద్యోగావకాశాల కొరత గాని, వైద్య సౌకర్యాల కొరత గాని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రధాన సమస్యలుగా మారనున్నాయి. సాధారణ ప్రజల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్నవారైనా ఇవాళ తక్షణమే ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పథక రచన చేయవలసి ఉంది. కాని చంద్రబాబు నాయుడు పాత పాలనా కాలంలో అలవాటయిన విధానాలనే యథాతథంగా అమలు చేయడానికి పూనుకుంటున్నారు. ఓటమి తర్వాత ఆత్మవిమర్శ చేసుకుంటున్నానని, ప్రపంచీకరణ విధానాల మానవముఖం పట్ల శ్రద్ధ వహించలేకపోయానని ఆయనే ప్రకటించిన పశ్చాత్తాపాన్ని కూడ మరచిపోతున్నారు. ఒక ప్రత్యామ్నాయం లేని స్థితిలో అధికారం ఇచ్చిన ప్రజలను మరొకసారి మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ దేశంలో పాలకులు ప్రజల నుంచి ఎంత దూరమైపోయారో, తమ అనుభవం నుంచి గుణపాఠాలు నేర్చుకోలేని మొద్దు చర్మాన్ని ఎలా సంతరించుకున్నారో ఈ అనుభవం చూపుతున్నది. పాలకులకు పాఠాలు నేర్పే శక్తీ, నేర్పవలసిన అవసరమూ ప్రజలకు మాత్రమే ఉంటాయి. వీ

ప్రపంచ యుద్ధానికి వందేళ్లు - అటు ఇరాక్, ఇటు గాజా!


మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమై ఈ జూలైకి వంద సంవత్సరాలు గడిచాయి. 'సామ్రాజ్యవాదమంటేనే యుద్ధం' అని లెనిన్ చేసిన సూత్రీకరణను నిజం చేస్తూ ఈ వంద సంవత్సరాలలో వాస్తవంగా యుద్ధం జరగని, లేదా యుద్ధ మేఘాలు కమ్ముకున్న పరిస్థితి లేని దేశమూ ప్రాంతమూ సమయమూ లేవంటే అతిశయోక్తి కాదు. దేశాల మధ్య, ప్రభుత్వాల మధ్య స్నేహ సంబంధాలను, శాంతి సుహృద్భావాలను నెలకొల్పడానికి అంతర్జాతీయ దౌత్య చర్యలు, నానాజాతి సమితి, ఐక్యరాజ్య సమితి, అలీనోద్యమం వంటి సంస్థలు పుట్టుకువచ్చినా భూగోళం మీది నుంచి యుద్ధపు జాడలు చెరిగిపోలేదు. మొదటి ప్రపంచ యుద్ధపు శతాబ్ది స్మరణ జరుగుతున్న ఈ సమయంలో ప్రతి రోజూ ఇరాక్ నుంచీ, గాజా నుంచీ విధ్వంస వార్తలు వస్తున్నాయి. హత్యలు, దాడులు, బాంబు పేలుళ్లు, వైమానిక దాడులు, గృహ దహనాలు – పశ్చిమాసియాను బీభత్సం చుట్టుముట్టి ఉన్నది. నిజానికి ఇది పశ్చిమాసియా ప్రత్యేకత మాత్రమే కాదు, అన్ని దేశాలలోనూ ఏదో ఒక ప్రాంతంలో ప్రజల అసంతృప్తితో, పాలకవర్గాల దమనకాండతో నెత్తురు పారుతూనే ఉన్నది. విధ్వంసం జరుగుతూనే ఉన్నది. సామ్రాజ్యవాద సైన్యాల జోక్యంతో, చొరబాటుతో ఆ విధ్వంసం మరింత పెరిగిపోతున్నది. ఆయా ప్రాంతాలనుబట్టి యుద్ధ భాగస్వాముల పేర్లు మారవచ్చు, నినాదాలు, జెండాలు మారవచ్చు. వారి తక్షణ లక్ష్యాలు మారవచ్చు. ఇరాక్‌లో అది అమెరికా అనుకూల కీలుబొమ్మ ప్రభుత్వానికీ, ఆ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే విభిన్నవర్గాలకూ మధ్య పరస్పరం సమానంగా సాగుతున్న ఘర్షణగా కనబడుతుండవచ్చు. గాజాలో పాలస్తీనా పౌరుల తరఫున హమస్ బలహీనంగానైనా ఎదురుదాడికి, ఆత్మరక్షణకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అది ప్రధానంగా ఇజ్రాయిల్ దళాల ఏకపక్ష మూకుమ్మడి దాడిగానే ఉంది. ఇరాక్‌లో 'ఇస్లాం మత ఛాందసవాదుల అక్రమాలను' ఖండిస్తున్న అమెరికా అనుకూల ప్రభుత్వాలు, ప్రచార సాధనాలు, అంతకు ఎన్నోరెట్లు ఎక్కువగా గాజాలో జరుగుతున్న యూదు మత ఛాందసుల దుర్మార్గాలను మాటమాత్రంగా కూడ ఖండించడం లేదు. అంటే ప్రవహించే నెత్తురంతా ఒకటే కాదన్నమాట. ధ్వంసమవుతున్న జీవితాలన్నిటి విలువ ఒకటి కాదన్నమాట. ఈ వాస్తవమయినా అన్ని చోట్లా హింసను, విధ్వంసాన్ని ఖండిస్తామని ప్రకటించే 'తటస్థ' మానవతావాదుల కళ్లు తెరిపించాలి. ప్రపంచదేశాల మధ్య హింసకూ విధ్వంసానికీ అసలు కారణం మతం కాదు, హింసా ప్రవృత్తి కాదు, అవి ఆజ్యం పోయవచ్చుగాని, అసలు కారణం ఆర్థిక, ఆధిపత్య ప్రయోజనాలు. అన్ని దేశాల, అన్ని ప్రాంతాల సహజవనరులు తనకు మాత్రమే దక్కాలని, అక్కడి మార్కెట్లు తన లాభాల కోసమే పనిచేయాలని, ఎక్కడ మోగిన డాలర్ అయినా తన ఖాతాలోనే పడాలని సామ్రాజ్యవాదం అనుకున్నప్పుడే యుద్ధం మొదలవుతున్నది. అందువల్ల యుద్ధాన్ని తుదముట్టించాలంటే కావలసింది శాంతి తీర్మానాలు కాదు, యుద్ధవిరమణ విజ్ఞప్తులు కాదు. యుద్ధానికి మూలకారణమైన సామ్రాజ్యవాదాన్ని, ఆర్థిక ప్రయోజనాలను అంతం చేయడమే మానవచరిత్రనుంచి యుద్ధాన్ని చెరిపేస్తుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయార్థిక ప్రచారం, సమీకరణ, ప్రతిఘటన ఇవాళ్టి చారిత్రక అవసరం. వీ




మన విద్యా వ్యవస్థ

ఎవరి రంగంలో వాళ్లు ప్రతి ఒక్కరూ మేధావులే. కాని, చెట్టు ఎక్కగలదో లేదో అనే దానిపై చేప సామర్థ్యాన్ని పరీక్షిస్తే, అది తనకు తెలివి లేదనే అనుకుంటుంది. జీవితాంతం ఆ న్యూనతలో బతుకుతుంది.

– ఆల్బర్ట్ ఐన్‌స్టీన్




❖ **రాజధాని - రాయలసీమ ప్రజల హక్కు** - బి. పాండురంగారెడ్డి - శ్రీమతి జెన్నె (ఎం) మాణిక్యమ్మ పబ్లికేషన్స్ - 26 పేజీలు, 1/8 డెమీ, రు. 12, ప్రతులకు: శ్రీమతి జెన్నె (ఎం) మాణిక్యమ్మ పబ్లికేషన్స్, రెండవ అంతస్తు, రూం నెం. 7, మహమ్మద్ కాంప్లెక్స్, ఉపాధ్యాయ భవన్ ఎదురుగా, ఆదిమూర్తినగర్, అనంతపురం - 515001. (ఆం.ప్ర) సెల్: 9885736776, 9966450897




❖ **లెనిన్ అంతిమ పోరాటం** - ఫ్రెంచ్ మూలం: మోషే లెవిన్, ఆంగ్లానువాదం: ఎ.ఎం. షెరిడాన్ స్మిత్, తెలుగు అనువాదం: రావెల సాంబశివరావు - సమీక్ష ప్రచురణలు - 248 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: సమీక్ష ప్రచురణలు, మొదటి అంతస్తు, కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవనం, బందరు లాకులు వద్ద, విజయవాడ - 520002, ఫోన్: 0866-2578454




❖ **మహాప్రస్థానంలో ధగ ధగలు.. నిగ నిగలు..** - డా. ద్వా.నా. శాస్త్రి - కిన్నెర పబ్లికేషన్స్ - 38 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: డా. ద్వా.నా. శాస్త్రి, 1-1-428, గాంధీనగర్, హైదరాబాద్ - 500 080. సెల్: 9849293376




❖ **వాన కురిసిన రాత్రి** - డా. బండి సత్యనారాయణ - పాలపిట్ట బుక్స్ - 102 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 403, విజయసాయి రెసిడెన్సీ, 16-11-20/6/1/1, సలీంనగర్ కాలనీ, మలక్‌పేట్, హైదరాబాద్ - 500036; ఫోన్ 040-27678430; email: palapittabooks@gmail.com




❖ **కరుణ** (కథా సంకలనం) సంపాదకత్వం: పల్లె సీను - శ్రీలేఖ సాహితి ప్రచురణ - 244 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: శ్రీలేఖ సాహితి, ఇ.నెం. 14-5/2, ఎంఆర్ఒ ఆఫీస్ ఎదురుగా, శ్రీలేఖ కాలనీ, హసన్‌పర్తి, వరంగల్ - 506 371, తెలంగాణ, ఫోన్: 0870 2564722; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్




❖ **బహెన్** - బా రహమతుల్లా కథలు - బాబుక్స్ - 218 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: మేరాజ్, బాబుక్స్ ఎడిటర్, బామకాన్, ఎంఎస్ఆర్ కాలేజి వెనుక, సంతనూతలపాడు (పోస్ట్, మండల్), ఒంగోలు, ప్రకాశం జిల్లా; అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో




❖ **తారుమారు** - దేవులపల్లి కృష్ణమూర్తి - డికె ప్రచురణలు - 130 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006, ఫోన్: 23521849




❖ **పూలండోయ్ పూలు** - ప్రసాదమూర్తి - వినూత్న ప్రచురణలు - 138 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: డా. బి.ఆర్.వి. ప్రసాదమూర్తి, / కె. రాజేశ్వరి దేవి, టిజిటి (తెలుగు), జవహర్ నవోదయ విద్యాలయ, ఎచ్‌సియు కాంపస్, గచ్చిబౌలి, హైదరాబాద్ - 46; సెల్: 8499866699, 9705468149; email: pramubandaru@gmail.com




❖ **పోలవరం - ప్రాణాంతక ప్రయోగం** - ముంపు గ్రామాల గోడు - సంపాదకత్వం: అనిశెట్టి రజిత - రుద్రమ ప్రచురణలు - 126 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: అనిశెట్టి రజిత, 3-12-60, కుమార్‌పల్లి, హనుమకొండ - 506 001, సెల్: 98494 82462



❖ **ఆధునిక కవిత్వంలో బాల్య చిత్రణ** - డా. వి.ఆర్. శర్మ - పిల్లల లోకం ప్రచురణలు - 416 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: ఫ్లాట్ నెం. 101, చీలాస్ హరిబాగ్ అపార్ట్‌మెంట్, గోదావరి హోమ్స్ కాలనీ, సుచిత్ర, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల విలేజ్, మం. కుత్బుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ - 500 055; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **వర్గకవి శ్రీశ్రీ** - బి. హనుమారెడ్డి - 190 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: బి. హనుమారెడ్డి, న్యాయవాది, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, రాజా పానగల్ రోడ్, ఒంగోలు - 523 002, సెల్: 94402 88080




❖ **అసంఖ్యాక నక్షత్రాలు - ఒక ఆకాశం** - కవిత్వం - విజయచంద్ర -160 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఆర్. చంద్రశేఖర్, 20, సారధీనగర్, నీలకంఠ నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, బరంపురం - 760002; ఫోన్: 0680-2260065, సెల్: 09438720409; ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **జీవన నానీలు** - భండారి అంకయ్య - సాహితీ సోపతి ప్రచురణలు - 60 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: శ్రీమతి సుశీలాదేవి, ఫ్లాట్ నెం. 204, కమలశ్రీ అపార్ట్‌మెంట్స్, రాజీవ్‌కాలనీ, మంకమ్మతోట, కరీంనగర్ - 505 001, తెలంగాణ; సెల్: 90327 42937



❖ **మోధీత్వ** - ఎం. శ్రీనివాస్ - అడుగుజాడలు పబ్లికేషన్స్ - 72 పేజీలు, 1/8 డెమీ, రు. 45



❖ **విద్య - ప్రపంచీకరణ - అసమానతలు** - ఎం. శ్రీనివాస్ - అడుగుజాడలు పబ్లికేషన్స్ - 280 పేజీలు, 1/8 డెమీ, రు. 175



❖ **తనను తాను వెతుక్కుంటున్న చరిత్ర** - ఎం. శ్రీనివాస్ - అడుగుజాడలు పబ్లికేషన్స్ - 232 పేజీలు, 1/8 డెమీ, రు. 150

పై మూడు ప్రతులకు: అడుగుజాడలు పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. 302, వైష్ణవి నెస్ట్, తిరుమల మ్యూజిక్ సెంటర్ వెనుక, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 036; అన్ని ప్రధాన పుస్తక కేంద్రాల్లో

వర్తమాన చరిత్ర - రాజకీయార్థిక దృష్టి

ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం

దేశంలో గత కొంత కాలంగా క్రోనీ కాపిటలిజం (ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం) అనే మాట ఎంత పెద్ద ఎత్తున వినిపిస్తున్నదంటే, అది వాడుతున్నవాళ్లందరూ దాని అర్థం తెలిసే వాడుతున్నారా అని అనుమానం కలుగుతున్నది. బడా, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల పత్రిక ఎకనమిక్ టైమ్స్ నుంచి కొన్ని విప్లవపార్టీల పత్రికల దాకా, దేశంలో నూతన ఆర్థిక విధానాల నిర్మాత మన్మోహన్ సింగ్ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపకుడు అరవింద్ కేజ్రీవాల్ నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ రఘురామ్ రాజన్ దాకా అందరూ ఆ మాట వాడుతున్నారు, దాన్ని ఖండిస్తున్నారు. ఇటీవలి కాలంలో పెద్దఎత్తున బైటపడిన, బైటపడుతున్న ఆర్థిక కుంభకోణాలు ఈ క్రోనీ కాపిటలిజం వల్ల జరిగిన దుష్పరిణామాలు మాత్రమేనని, అసలు సమస్య క్రోనీయిజం మాత్రమేనని వారిలో చాల మంది అంటున్నారు. ఈ అభిప్రాయాలను స్పష్టంగా, సంపూర్ణంగా వ్యక్తీకరిస్తూ ఎకనమిక్ టైమ్స్ 'కాపిటలిజం కావాలి, క్రోనీయిజం వద్దు' అని సంపాదకీయమే రాసింది. ప్రభుత్వంలో ఉన్నవారి మద్దతుతో పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు 'తప్పుడు మార్గాలు' అవలంబించి పెట్టుబడిదారీ విధానానికి చెడ్డపేరు తెస్తున్నారని, పెట్టుబడిదారీ స్వేచ్ఛా వాణిజ్యం స్వేచ్ఛగా జరగకుండా అడ్డుకుంటున్నారని వీళ్ల అభిప్రాయం. నిజానికి పెట్టుబడిదారీ విధానం, ఆమాటకొస్తే వర్గ సమాజాలన్నీ, ఒక వర్గానికి అనుకూలంగా, ఆ వర్గ ప్రయోజనాల కోసమే రాజకీయార్థిక విధానాలను రూపొందిస్తాయి. ఆ విధానాలను అమలు చేయడమే రాజ్యాంగయంత్రం పని. ప్రభుత్వం రాజ్యాంగ యంత్రంలో ఒకానొక భాగం మాత్రమే. అంటే క్రోనీయిజం లేకుండా పెట్టుబడిదారీ విధానం లేదు. ఆ రెంటినీ వేరు చేసి ఒకదాన్ని విమర్శించి, మరొకదానికి సదుద్దేశాలు, సాధికారత కల్పించడానికి ప్రయత్నించడం అమాయకుల కళ్లలో దుమ్ము కొట్టడానికి మాత్రమే. ఎక్కడైనా రాజ్యం ఆశ్రయంతోనే పెట్టుబడిదారీ విధానం బలపడుతుంది. రాజ్యం ఆశ్రిత వర్గాల అవసరాల కోసమే పనిచేస్తుంది. అది ప్రత్యేకంగా ఏ వర్గానికీ చెందదని, తటస్థమైనదని, అందరినీ సమానంగా చూస్తుందని, మార్కెట్ శక్తులలో జోక్యం చేసుకోకుండా, వాటి స్వేచ్ఛా నర్తనానికి వీలు కల్పిస్తుందని ఒక మాయాజాలాన్ని పాలకవర్గాలు ప్రచారం చేస్తుంటాయి. అమెరికా, యూరప్ పెట్టుబడిదారీ వ్యవస్థలలోనైతే పెట్టుబడిదారీ శక్తులే రాజ్యాన్ని ఎప్పటికప్పుడు సలహాలతో, ఒత్తిళ్లతో, లాబీయింగ్‌తో నడుపుతుంటాయి. అక్కడ రాజ్యమే పెట్టుబడికి ఆశ్రిత రాజ్యంగా పనిచేస్తుంది. రాజ్యానికీ పెట్టుబడిదారీ ప్రయోజనాలకూ తేడా ఉండదు. దక్షిణ కొరియా, ఫిలిప్పైన్స్ వంటి పెట్టుబడిదారీ ఉపగ్రహ దేశాలలో క్రోనీ కాపిటలిజం ఎలా పనిచేస్తుందో వివరమైన అధ్యయనాలు వచ్చాయి. విభిన్న పెట్టుబడిదారీ ప్రయోజనాల మధ్య గట్టి పోటీ ఉండి, ప్రభుత్వానికీ పెట్టుబడిదారీ శక్తులకూ మధ్య సమతుల్యత ఉన్న దక్షిణాఫ్రికాలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం వల్ల ఆర్థిక ప్రగతి సాధ్యమయిందని, ఆ సమతుల్యత లేకుండా అటు ప్రభుత్వమో, ఇటు పెట్టుబడిదారీ శక్తులో బలహీనంగా ఉన్న ఫిలిప్పైన్స్‌లో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, ఆర్థిక ప్రగతికి కాక, అక్రమాలకు, కుంభకోణాలకు దారి తీసిందని పెట్టుబడిదారీ సమర్థకులే నిర్ధారించారు. కాగా భారత సమాజంలో పెట్టుబడిదారీ విధానం ప్రవేశించిన, పనిచేస్తున్న పద్ధతిలో అది అక్రమమూ కాకతప్పదు, ఆశ్రితమూ కాకతప్పదు. భారతదేశం లోని అర్ధవలస అర్ధభూస్వామ్య రాజ్యానికి దాని స్వభావం వల్లనే దళారీ బాధ్యతలు ఎక్కువ. దానికి అంతర్గతంగా పెట్టుబడిదారీ శక్తుల మధ్య సమతుల్యతను సాధించే బాధ్యతతో పాటు, బైటినుంచి వచ్చే సామ్రాజ్యవాద పెట్టుబడికి దళారీగా ఉండే బాధ్యత, అంతర్గత భూస్వామ్య ప్రయోజనాలు చెక్కుచెదరకుండా చూసే బాధ్యత కూడ ఉంటాయి. అంటే రాజ్యమూ, పెట్టుబడిదారీ వర్గమూ, అభివృద్ధి నిరోధక భూస్వామ్య వర్గమూ కలగలిసిన మిలాఖత్తు లేని చోటు ఉండదు. అందువల్ల ఇక్కడి పెట్టుబడిదారీ విధానం సహజంగానే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కాక తప్పదు. అది ఆశ్రయించే శక్తులు ఒకటే రకమైనవి కాదు గనుక అటూ ఇటూ పెనుగులాటలు, ఊగిసలాటలు, ముందువెనుకలు, ఎగుడుదిగుళ్లు కూడ ఉంటాయి. భూస్వామ్యం కొనసాగింపుగా ఆర్థికేతర, పోషక-ఆశ్రిత, కుల-మత, అధికార-సేవక సంబంధాలు కూడ కొనసాగుతాయి. భారత పారిశ్రామిక, వ్యాపార, పెట్టుబడిదారీ వర్గాలకు ఉన్న ఈ ప్రత్యేకతను అర్థం చేసుకోకుండా, పక్కనపెట్టి క్రోనీయిజం చర్చ చేయడం పండిత చర్చే అవుతుంది గాని, భారత వ్యాపారవర్గాల స్వభావాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడదు. 'క్రోనీయిజం ద్వారా, కుంభకోణాల ద్వారా ప్రపంచీకరణ విధానాలకు, పెట్టుబడిదారీ విధానానికి చెడ్డపేరు తేకండి, ఇంత బహిరంగంగా అక్రమాలు చేయకండి' అని భారత పాలకవర్గ మేధావులు భారత పారిశ్రామిక, వ్యాపారవర్గాలకు విజ్ఞప్తులమీద, విజ్ఞప్తులు చేస్తున్నారు. క్రోనీయిజాన్ని ఆపడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చునా అని ఆలోచిస్తున్నారు. మొత్తానికి ఈ క్రోనీ కాపిటలిజం చర్చ భారత సమాజ స్వభావాన్ని, ఆర్థిక వ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నది.

ప్రతీదీ వ్యాపారమే

మాటీవీ అనే తెలుగు టెలివిజన్ ఛానల్‌లో 'మీలో ఎవరు కోటీశ్వరుడు?' అనే జనాకర్షక కార్యక్రమం ఒకటి గత మూడు నెలలలో నలభై సంచికలు ప్రసారమై తెలుగు సమాజంలో సంచలనాన్ని సృష్టించింది. ఆ కార్యక్రమాన్ని ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున నిర్వహించడం, అందులో దాదాపు నలభై మంది తమ ప్రతిభను ప్రదర్శించడం, ప్రతిరోజూ వేసిన ప్రశ్నకు లక్షలాది మంది జవాబు చెప్పడానికి ప్రయత్నించడం, లక్షలాది మంది ఆ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించడం, ఆ కార్యక్రమంలో ఆకర్షణీయమైన సంగీతం, కళాత్మకత, వర్ణసమ్మేళనం, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు ఉండడం వంటి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. వాటిని పక్కనపెట్టి ఆ కార్యక్రమపు రాజకీయార్థిక

కోణాలను విశ్లేషించడం ఆసక్తికరంగానూ, మన సమాజపు అపసవ్య స్థితిని అర్థం చేసుకోవడానికి ఒక సాధనంగానూ ఉపయోగపడుతుంది. సోనీ పిక్చర్స్ టెలివిజన్ అనే బహుళజాతి సంస్థ యునైటెడ్ కింగ్‌డమ్‌లో 1998లో ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా ప్రసారం చేసిన 'హు వాంట్స్ టు బి ఎ మిలియనీర్' కు అనుకరణగా, బిగ్ సినర్జీ అనే వ్యాపార సంస్థ 2000లో హిందీలో తయారు చేసిన 'కౌన్ బనేగా కరోడ్‌పతి' అనే కార్యక్రమానికి తెలుగు అనుకరణ ఇది. తెలుగు కార్యక్రమాన్ని నిర్మించినది కూడ బిగ్ సినర్జీ యే కాగా, మాటీవీ దాన్ని ప్రసారం చేసింది. మొదటి ప్రశ్నకు సరైన జవాబు చెపితే వెయ్యి రూపాయల బహుమతి దగ్గర ప్రారంభించి, ప్రతి ప్రశ్నకూ బహుమతి రెట్టింపు అవుతూ, పదిహేను ప్రశ్నలకు సరైన జవాబు చెప్పినవారికి కోటి రూపాయల బహుమతి అందే కార్యక్రమం ఇది. అలాగే ప్రతిరోజూ వేసే ఒక ప్రశ్నకు జవాబు చెపితే పదివేల రూపాయల బహుమతి ఉంటుంది. అలా పాల్గొన్నవారు, వీక్షించిన వారు ఎంత వినోదాన్ని, విజ్ఞానాన్ని పొందారో తెలియదు గాని ఈ కార్యక్రమాన్ని రూపొందించిన వ్యాపారసంస్థ, ప్రసారం చేసిన టీవీ ఛానల్, ఈ కార్యక్రమ భాగస్వామి, మొబైల్ కమ్యూనికేషన్ సంస్థ ఎయిర్‌టెల్, కార్యక్రమ నిర్వాహకుడు నాగార్జున, వ్యాపార ప్రకటనలు ఇచ్చిన సంస్థలు మాత్రం కోట్లాది రూపాయల వ్యాపారం చేశాయి. ఈ అనవసరపు మాయాజాలపు ఆకర్షక కార్యక్రమం ప్రజాధనం నుంచి కొన్ని వందల కోట్ల రూపాయలను కొందరు వ్యక్తుల సొంత ఖాతాలలోకి బదిలీ చేసింది. ఈ కార్యక్రమం నలభై సంచికలు నిర్వహించినందుకు నాగార్జున మూడు కోట్ల రూపాయల పారితోషికం తీసుకున్నారని ఒక వార్త. కాగా ప్రతి ఎపిసోడ్‌కు కనీసం ఇరవై లక్షల ఎస్ఎంఎస్‌లు వచ్చాయని, వాటి ద్వారా (ఒక్కొక్క ఎస్ఎంఎస్‌కు రు. 5 చొప్పున) ఎయిర్‌టెల్ ఒక కోటి రూపాయల పై చిలుకు సంపాదించిందని, అందులో సగం మాటీవీకి, నాగార్జునకు ఇచ్చిందని మరొక వార్త. అంటే ఈ ఒక్క కార్యక్రమపు ఎస్ఎంఎస్‌లతో ఎయిర్ టెల్ రు. 40 కోట్ల పైన సంపాదించిందని, మాటీవీకి రు. 20 కోట్లు ఇచ్చి ఉంటుందని అనుకోవాలి. అలాగే ఈ కార్యక్రమం కోట్లాది మంది చూశారు గనుక విపరీతంగా వ్యాపార ప్రకటనలు వచ్చాయి. వాటి ద్వారా మాటీవీకి మరెన్ని రెట్ల ఆదాయం వచ్చిందో లెక్కలు లేవు. నలభై రోజుల కార్యక్రమాలలో నలభై మంది కూడ విజేతలు లేరు. వారిలో కోటి రూపాయలకు చేరినవారు ఒక్కరు కూడ లేరు. వెయ్యి, రెండు వేల రూపాయలతో ఆగిపోయిన వారు ఎందరో ఉన్నారు. వారి బహుమతులు, రోజువారీ ప్రశ్నకు జవాబు చెప్పినవారికి ఇచ్చిన బహుమతులు అన్నీ కలుపుకున్నా మొత్తం మీద ఒక కోటి రూపాయలైనా ఖర్చయి ఉండవు. మిగిలిన ఖర్చులన్నీ ఎంత ఉదారంగా లెక్కవేసిన ఐదారు కోట్ల రూపాయలకు మించి ఉండవు. అంటే ఈ కార్యక్రమం పెట్టుబడి మీద కనీసం పదిరెట్లు (వెయ్యి శాతం) లాభాలను సంపాదించిందంటే అతిశయోక్తి కాదు. ప్రజలను మాయ చేసి, ఒక ఆకర్షణీయమైన దృశ్య, శ్రవణ కార్యక్రమంతో ఇలా కోట్లాది రూపాయలు కొల్లగొట్టగలిగే దొంగల దోపిడీ ఆర్థిక వ్యవస్థలో మనం ఉన్నామనడానికి ఇంతకన్న రుజువు కావాలా?

తెలంగాణ పారిశ్రామిక విధానం

ఏ ప్రభుత్వానికైనా ఒక పారిశ్రామిక విధానం ఎందుకు ఉండాలి? రాజకీయార్థిక దృష్టితో ఈ ప్రశ్న అడగడం ఇవాళ చాల అవసరం. ఎందుకంటే ఇవాళ చాల పనులు ఎట్లా చేయాలనే శ్రద్ధ పెరిగి, ఎందుకు చేయాలనే మౌలిక ప్రశ్న మరుగున పడిపోతున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన సొంత పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తానని అధికారానికి వచ్చిన నాటినుంచీ అంటున్నది. ఇంకా ఆ విధాన ప్రకటన రాకముందే కొత్త ప్రభుత్వ పారిశ్రామిక రంగ ప్రయత్నాలు, ఆలోచనలు, ప్రోత్సాహాలు కనబడుతూనే ఉన్నాయి. పనులు మాత్రమే కాదు, మౌనాలు, నిశ్శబ్దాలు కూడ మాట్లాడుతున్నాయి. దేశంలోని దళారీ, బడా పెట్టుబడిదారీ పారిశ్రామిక వ్యాపారవేత్తలందరూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కలవడమో, సంబంధం పెట్టుకోవడమో, తెలంగాణలో పెట్టుబడులు పెడతామని ప్రకటించడమో చేశారు. ప్రజాఉద్యమం వల్ల బెంగాల్ నుంచి పారిపోయిన టాటాలు తెలంగాణకు వస్తున్నారు. పర్యావరణాన్ని కలుషితం చేసి, భూగర్భ జలాన్ని కొల్లగొట్టినందువల్ల ప్రజాగ్రహానికి గురై కేరళలో మూతబడిన కోకాకోలా బాటిలింగ్ ప్లాంట్ తెలంగాణకు వస్తున్నది. అక్రమాలకు పట్టుగొమ్మలుగా పేరుతెచ్చుకున్న అంబానీలు, అదానీలు, హిందుజాలు తెలంగాణ సంపన్న వనరులమీద గద్దల్లా వాలుతున్నారు. ఈ దళారీలు మాత్రమే కాదు, వారి వెనుక ఉన్న దేశదేశాల బహుళజాతి సంస్థలు తెలంగాణ మీద దేగకన్ను వేసి ఉన్నాయి. వారికి ఎర్రతివాచీలు పరుస్తామనీ, ఏ ఇబ్బందీ లేకుండా సింగిల్ విండో అనుమతులు ఇస్తామనీ, లక్షలాది ఎకరాల భూమిని వారి కోసం సిద్ధం చేసి పెట్టామనీ, అన్ని వసతులూ కల్పిస్తామనీ ప్రభుత్వం దాదాపు రోజువారీ ప్రకటనలు చేస్తున్నది. స్వయంగా ముఖ్యమంత్రి సింగపూర్ వెళ్లి అక్కడి పెట్టుబడుదారులకు ఇటువంటి ప్రోత్సాహకాలు చూపి ఆహ్వానించారు. తెలంగాణలో గత ఆరు దశాబ్దాలుగా పారిశ్రామికీకరణ వివక్షకు గురైందని, అందువల్ల ఇటువంటి ఉధృత ప్రయత్నాలు తప్పవని ఒక సమర్థన వినవస్తున్నది. నిజానికి వివక్షకు గురైనది తెలంగాణలో పారిశ్రామికీకరణ కాదు, పారిశ్రామికీకరణ జరిగింది. తెలంగాణ వనరులు తెలంగాణ ప్రజలకు దక్కేలా జరగలేదు. తెలంగాణ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా జరగలేదు. తెలంగాణ సమాజానికి అభివృద్ధి ఫలాలు అందేలా జరగలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోరిన పారిశ్రామికీకరణ ఆ మూడు లక్ష్యాలను సాధించవలసి ఉంది. వనరులు స్థానికులకే దక్కడం, ఉపాధికల్పన జరగడం, అభివృద్ధి ఫలాలు స్థానిక సమాజానికి అందడం అనే మూడు లక్ష్యాలు నెరవేరాలంటే పారిశ్రామికీకరణ సామాజిక యాజమాన్యంలో, ప్రభుత్వరంగంలో జరగాలి. కనీసం తెలంగాణలో ఒక స్వతంత్ర పారిశ్రామిక, వ్యాపారవర్గం అభివృద్ధికి ఇన్నాళ్లూ ఆటంకాలు ఉండేవను కుంటే ఆ ఆటంకాలు తొలగించి, స్థానిక పారిశ్రామిక, వ్యాపార వర్గాలను ప్రోత్సహించే పారిశ్రామిక విధానమైనా ఉండాలి. కాని వీటిలో ఏ లక్ష్యమూ నెరవేర్చని పారిశ్రామిక విధానం ఇప్పుడు అమలవుతున్నది. గత ప్రభుత్వాలు అనుసరించినటువంటి, దేశదేశాల సంపన్నులకు, బహుళజాతి సంస్థలకు, దేశీయ దళారీ పెట్టుబడిదారులకు మాత్రమే అవకాశాలు ఇచ్చే పారిశ్రామిక విధానం యథాతథంగా అమలవుతున్నది. ఆ పెట్టుబడి-ప్రధాన పారిశ్రామిక, వ్యాపార, సేవా సంస్థలు ఎంత పెట్టుబడితో, ఎన్ని ఆకర్షణలతో ప్రవేశించినా అవి తెలంగాణ నిరుద్యోగాన్ని రూపుమాపలేవు. తెలంగాణ వనరులను కొల్లగొట్టుకుని బైటికి తీసుకుపోవడమే తప్ప తెలంగాణ సమాజానికి ఉపయోగపడవు. వీ

మళ్లీ శ్వేతపత్రాలు - విజన్ 2029

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో చంద్రబాబు నాయుడు పాలనా కాలంలోని ప్రచార ఆర్భాటాన్నే మళ్లీ సాగిస్తున్నదని అంటున్నారు **పి.వి. రమణ**

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ 'సరళీకృత విధానాలు విజయవంతం చేయకపోతే నా పదవి పోవడం ఖాయం' అని సరదాగా చెప్పినట్లుగా ఆయన కుమార్తె దమన్ సింగ్ 'స్ట్రిక్లీ పర్సనల్ మన్మోహన్ అండ్ గురుశరణ్' అన్న పుస్తకంలో రాశారు. పైకి సరదాగా కనిపిస్తున్నప్పటికీ ఇది నూటికి నూరుపాళ్లు నిజం. దీన్ని బట్టి మనదేశంలో ప్రధానమంత్రులు గానీ, ముఖ్యమంత్రులు గానీ ఎవరి దయవల్ల ఎన్నికవుతున్నారో సులువుగానే అర్థమవుతుంది.

సామ్రాజ్యవాద విధానాలను అమలు చేయడంలో దేశంలోనే మొనగాడుగా పేరు తెచ్చుకున్న చంద్రబాబు, మళ్లీ అధికారంలోకి రాగానే మొత్తం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తానని రోజూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. పరిపాలన ఎలా ఉండాలో 100 రోజుల్లో చూపిస్తానంటున్నారు. ప్రతి జిల్లాను హైదరాబాద్ లాగ చేసేస్తానని, ప్రపంచమే ఆశ్చర్యపడిపోయే రాజధానిని నిర్మిస్తానంటు న్నారు. ఈ కార్యక్రమాలు కొనసాగించడానికి మళ్లీ బుట్టలోంచి శ్వేత పత్రాలు, విజన్ 2020 లాంటివి పైకి తీశారు.

2014 జూన్ 6న విలేకరులతో మాట్లాడుతూ గతంలో రాష్ట్రాభివృద్ధి కోసం రూపొందించిన 'విజన్ 2020' ద్వారా అభివృద్ధికి బాటలు వేశామని చెప్పారు. గత పదేళ్లలో కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. ఆదాయ వనరులున్నా సరిగా ఖర్చుపెట్టలేదు. డబ్బులు ఎక్కడ ఖర్చుపెడితే ఫలితాలు, ఆదాయం వస్తుందో అనేది ఆలోచించకుండా వారికి ముడుపులు వచ్చిన చోట ఖర్చు చేశారని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి సరైన రీతిలో సాగకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని విమర్శించారు. శాంతి భద్రతలు సరిగా లేనందున వందలాది ఐ.టి. సంస్థలు రాకుండా పోయాయి. రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కొని అనేక తప్పుడు పనులు చేశారన్నారు. వీటన్నిటినీ తిరిగి గాడిలో పెట్టడానికి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం త్వరలోనే వివిధ రంగాలపై శ్వేత పత్రాలు విడుదల చేస్తామని చెప్పారు. మారిన పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని వివిధ రంగాల్లో కొత్త రాష్ట్రంలో అనుసరించాల్సిన విధానాలపై స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలతో కొత్తగా విజన్ 2029 రూపొందిస్తామని చెప్పారు.

జూలై నెలలో విద్యుత్, ఆర్థిక, పారిశ్రామిక, నీటివనరుల, వ్యవసాయ, సుపరిపాలన లాంటి ప్రధాన అంశాలపై చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాలు విడుదల చేసారు. ఆర్థిక పరిస్థితి మీద మాట్లాడుతూ 'సుపరిపాలన ద్వారా వనరులను సద్వినియోగం చేసుకుంటూ సంపద సృష్టిస్తాం. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా ఉండే తెలుగువారి ఆలోచనలను తీసుకొని ముందడుగు వేస్తాం. జాతీయ స్థాయిలో పి.వి. నరసింహారావు, రాష్ట్ర స్థాయిలో నేను ప్రవేశపెట్టిన తొలి, మలి తరం ఆర్థిక సంస్కరణలతో పరుగులెత్తిన ఆర్థిక రంగాన్ని గత పదేళ్ల కాంగ్రెస్ పాలన సర్వనాశనం చేసింది. మూలధనం వ్యయంలో కోత, సాగునీటికి నిరర్థక వ్యయం వల్ల అప్పులు 5 రెట్లు పెరిగి ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. గత 10 సంవత్సరాలలో ప్రజలపై పన్నులు 10 రెట్లు పెరిగాయి' అని అన్నారు.

'1990కి ముందు ఆర్థిక వృద్ధి కానీ, సంపద సృష్టి కానీ జరగలేదు. పి.వి. నరసింహారావు సంస్కరణలు తీసుకురావడంతో దేశం దశ మారిపోయింది. 1996లో ప్రారంభమైన మలి దశ సంస్కరణల ఫలితంగా హైదరాబాద్‌కు ఐ.టి. కంపెనీలు తీసుకురావడంవల్ల తొలి సారి మన ఆదాయం జాతీయ సగటుకు మించిపోయింది. సంస్కరణల ఫలితంగా 2004 వరకూ కనిపించిన ఆర్థిక దూకుడు 2007 నుండి పడిపోయింది. జాతీయ స్థాయిలో ఎన్.డి.ఎ. ప్రభుత్వం వల్ల 2004 వరకూ ఆర్థిక పరిస్థితి బాగుంది. అదే యు.పి.ఎ.కు కలిసివచ్చింది. కాని వారి అసమర్థత, అవినీతి కారణంగా 2009 – 10 నుంచి దిగజారుడు ప్రారంభమైంది. తలసరి పన్ను ఐదు రెట్లు పెరిగిపోయింది. అప్పుల భారాన్ని 5 – 7 రెట్లు పెంచారు. 2004 – 05 లో బహిరంగ మార్కెట్ రుణాలు 19,966 కోట్ల రూపాయలు ఉంటే 2013 – 14 నాటికి 1,11,374 కోట్ల రూపాయలకు పెరిగింది. సాగునీటిపై 94 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఫలితాలు రాలేదు. గత 10 సంవత్సరాలలో 1.40 లక్షల ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఆదాయం తగ్గిపోయింది. జీతాలు, వ్యయం పెరిగింది. ఏమైనా సరే మా హామీలు నిలబెట్టుకుంటూనే అభివృద్ధిపై దృష్టి సారిస్తాం. సహజ, మానవ వనరులను సమీకృతం చేసి అభివృద్ధి సాధిస్తాం. మా ప్రభుత్వాన్ని చూసి పెట్టుబడులు పెట్టడానికి అనేక మంది కొత్త పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారు' అని కూడా అన్నారు.

పారిశ్రామిక, మౌలిక వసతులు, ఉపాధి రంగాలకు సంబంధించిన శ్వేత పత్రాన్ని విడుదల చేస్తూ 'నా అసలు యాక్షన్ మొదలైంది. ప్రాజెక్టులన్నీ ప్రారంభమయ్యాయి. ఇక పరుగు పెట్టిస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను సన్‌రైజ్ కంట్రీగా తీర్చిదిద్దబోతున్నాం. తెలుగుదేశం హయాంలో ఐ.టి.కి ప్రాధాన్యత ఇచ్చాం. ప్రపంచంలో పేరెన్నికగల మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, డెల్, డెలాయిట్, హెచ్.ఎస్.బి.సి., టి.సి.ఎస్., విప్రో లాంటి కంపెనీలను తెచ్చాం. 1997 – 2004ల మధ్య ఐ.టి. రంగం 61.4 శాతం వృద్ధి చెందింది. కాని 2004 – 14 మధ్యలో 29.4 శాతానికి పడిపోయింది. మా కృషి వల్లనే 2012 – 13 నాటికి రాష్ట్రంలో ఐ.టి. వార్షిక టర్నోవర్ 64,351 కోట్ల రూపాయలకు వెళ్లింది. 3.30 లక్షల మందికి ప్రత్యక్షంగా, 10 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి వచ్చింది. ఐ.టి. పై 14 లక్షల కుటుంబాలు ఆధారపడ్డాయి' అన్నారు.

నీటిపారుదల రంగంపై శ్వేతపత్రం విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను

వచ్చే ఐదు సంవత్సరాలలో కరువు రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దుతామన్నారు. దీనికోసం ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వర్షపాతాన్ని సద్వినియోగం చేసుకుని, భూగర్భ జలాలు పెంచి, పైనుంచి వచ్చే నీటిని వినియోగించుకుంటూ రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసి, బిందుతుంపర్ల సేద్యంతో లక్ష్యాలను సాధిస్తామని చెప్పారు. నీరు– చెట్టు కార్యక్రమం అమలు చేస్తామన్నారు. అనంతపురంను కరువురహిత జిల్లాగా మారుస్తామన్నారు. అక్కడ 25 లక్షల ఎకరాల్లో పళ్ల తోటలు పెంచేందుకు అనువుగా ఉందన్నారు.

విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేస్తూ త్వరలో రాష్ట్రమంతా 24 గంటలు విద్యుత్ అందజేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ విద్యుత్ రంగాన్ని నాశనం చేసింది. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి తెచ్చారని విమర్శించారు. విద్యుత్ ప్రమాదాల కారణంగా 7,388 మంది చనిపోయారన్నారు. ఎవరూ ధైర్యం చేయలేని సమయంలోనే తాను విద్యుత్ సంస్కరణలు చేపట్టి ఈ రంగాన్ని గాడిలో పెట్టానని, తనకు విద్యుత్ రంగంపై అపారమైన అనుభవం ఉందని, విద్యుత్ గురించి తనకు ఆమూలాగ్రం తెలుసని అందుకే అధికారులు కూడా చెప్పలేని సాంకేతిక అంశాల లోతుల గురించి తాను అలవోకగా చెప్పగలుగుతున్నానన్నారు. విద్యుత్ రంగంలో జవాబుదారీతత్వాన్ని పెంచి, నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తాను. దేశంలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యుత్ సంస్థను సరిదిద్ది దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చి దిద్దుతానని అన్నారు.

వ్యవసాయరంగంపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో వ్యవసాయాన్ని బలహీనం చేసిందని చంద్రబాబు విమర్శించారు. మేఘ మథనంతో ఒక్క చినుకు పడక పోయినా 127 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. రైతులను అప్పుల సుడిగుండంలో పడేశారు. కాంగ్రెస్ హయాంలో 1,943 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలో ఎక్కడా ఇంతమంది చనిపోలేదు. తెలుగుదేశం హయాంలో 310 మాత్రమే చనిపోయారని చెప్పారు. 70 లక్షల మంది రైతుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. 2 వేలకోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులతో పెద్ద ఎత్తున చెక్‌డ్యాంలు నిర్మించి జలాశయాల మరమ్మత్తులు చేయిస్తామని, పెద్ద ఎత్తున గోదాముల నిర్మాణం, విత్తనాభివృద్ధి సంస్థ, పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తామని, పండ్ల తోటల పెంపకంతో అనంతపురంను మరో ఇజ్రాయెల్ చేస్తామని అన్నారు.

సుపరిపాలనపై శ్వేతపత్రం విడుదల చేస్తూ గత 10 సంవత్సరాల కాగ్రెస్ పాలనలో దేశం 20 సంవత్సరాల వెనక్కిపోయిందన్నారు. ప్రజలు మాకు ఓట్లేసి గెలిపించారు. దూరదృష్టితో ఆలోచించి మానవ వనరులను సద్వినియోగం చేసి వారి జీవితాల్లో వెలుగు తీసుకురావాలి. అవసరమైతే చట్టాలు మారుస్తాం. సుపరిపాలనంటే ఏమిటో, ఎలా ఉండాలో 100 రోజులలో చేసి చూపిస్తాం. ఉగ్రవాదం, తీవ్రవాదం అణచివేయడానికి గ్రేహౌండ్స్ విభాగాన్ని పటిష్టం చేయడం, దీని శిక్షణా కేంద్రం కొరకు విశాఖపట్నం వద్ద 600 ఎకరాల స్థలాన్ని గుర్తించామని, ఆక్టోపస్ కేంద్రాన్ని తిరుపతి, విశాఖలలో ఏర్పాటు చేస్తామని కూడా చెప్పారు.

త్వరలోనే ఐ.టి. విధానాన్ని తీసుకొస్తాం. పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తాం. గుంటూరులో టెక్స్‌టైల్ హబ్, విశాఖలో ఫార్మా, రాయలసీమలోని అనంతపురం, చిత్తూరుల మధ్య హార్టికల్చర్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఫార్ములేషన్ హబ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మచిలీపట్నంలో కొత్త పోర్టు, ఆయిల్ రిఫైనరీ, క్రాకరీ ఫ్యాక్టరీ, భీమవరంలో సీ ఫుడ్ పార్క్, రాజమండ్రిలో పెట్రో విశ్వవిద్యాలయం, పశ్చిమగోదావరి జిల్లాలో సముద్ర విశ్వవిద్యాలయం తీసుకొస్తామని చెప్పారు. పెట్టుబడి దారులు సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, శ్రీలంక, జపాన్‌ల నుండి అనేక పెట్టుబడుల ప్రతిపాదనలతో వస్తున్నారని చెప్పారు.

2029 నాటికి స్వర్ణాంధ్ర చేయడానికి ప్రత్యేక లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తామని చంద్రబాబు చెప్పారు. దీనికోసం 7 మిషన్‌లు (లక్ష్యాలు) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వాటిలో మౌలిక సదుపాయాలు, సేవారంగం, పట్టణాలు, నైపుణ్య అభివృద్ధి, ఉపాధి కల్పన, ప్రాథమిక రంగం, సామాజిక రంగం లాంటివి ఉన్నాయని ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో 3 మెగా సిటీలు, 30 చిన్న నగరాలు అభివృద్ధి చేస్తామని చెప్పారు. సింగపూర్ విదేశాంగ మంత్రి కె. షణ్ముగంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రపంచంలోనే క్రమశిక్షణ, నీతి నియమాలు కలిగిన దేశంగా సింగపూర్ సాధించిన ఘనత తమకు స్ఫూర్తి అని చంద్రబాబు అన్నారు. తను చేయబోయే పోర్టులు, ఐ.టి., హైవే రోడ్ల నిర్వహణ, పెట్రో కారిడార్, పర్యాటక రంగంలాంటి అభివృద్ధి కార్యక్రమాలలో వారి పూర్తి సహకారం అందించాలని కోరారు.

ఐ.టి., ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల అభివృద్ధి, ఈ – పరిపాలన కోసం వివరణాత్మక పథకాన్ని (బ్లూ ప్రింట్) రూపొందించామని చెప్పారు. రానున్న 3 సంవత్సరాలలో 1,785 కోట్ల రూపాయలు వీటి కోసం ఖర్చు చేస్తామని చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో 2000 ఎకరాలలో గ్రీన్ ఫీల్డ్ మెగా ఐ.టి. హబ్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కేవలం ఈ – పరిపాలన కోసం 1000 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామన్నారు. 2020 నాటికి 5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను 2020 నాటికి సిలికాన్ కారిడార్‌గా తీర్చి దిద్దుతామని మంత్రి మండలి ప్రకటించింది. ఇక్కడ పెట్టుబడి పెట్టే ఐ.టి. కంపెనీలకు కార్మిక చట్టాల నుండి, తనిఖీల మినహాయింపుతో పాటు ఎస్మా, భద్రత కల్పిస్తామని చెప్పారు. మెగా ఐ.టి. హబ్‌లో ఉద్యోగం కల్పించినందుకు ప్రతీ ఉద్యోగికీ 60 వేల రూపాయల చొప్పున, ఇతర ప్రాజెక్టులలో ఉద్యోగానికి 40 వేల రూపాయల చొప్పున కంపెనీలకు ప్రోత్సాహకాలు కల్పిస్తామని చెప్పారు.

ఈ విధంగా మొత్తం మీద చంద్రబాబు ప్రభుత్వం తెస్తానంటున్న అభివృద్ధి కార్యక్రమాల వలన భవిష్యత్‌లో భారీ వనరుల విధ్వంసంతో పాటు కోట్లాది మంది రాష్ట్ర ప్రజల జీవితాలు నాశనం కావడానికే దారితీస్తాయి. గతంలో బాబు పాలనలో ప్రజలు ఎటువంటి ఫలితాలు అనుభవించారో అందరికీ తెలుసు. ఆ చరిత్రను మరొకసారి గుర్తు చేసుకుందాం.

1996 జూన్ లో శ్వేతపత్రాలు వెలువడితే 1996 సెప్టెంబర్‌లో 'ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణల కార్యక్రమం' అనే ప్రపంచ బ్యాంకు రహస్య నివేదిక వెలువడింది. అవసరమైన ఏర్పాట్లు చేసుకుని 1997 జనవరిలో ఆ నివేదికనే బహిరంగంగా ప్రకటించింది. ప్రపంచ బ్యాంక్, రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చా పత్రాలు 1997 ఫిబ్రవరిలో విడుదలయ్యాయి. చంద్రబాబు విజన్ 2020 ప్రతిపాదనలు 1998 ఆగస్టులో విడుదలవగా, విధాన ప్రకటన జనవరి 1999లో ప్రకటించారు. ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో జరిగిన కార్యక్రమాలన్నింటిలోనూ శాంతి భద్రతలు, విద్యారంగం ప్రధానమైన అంశాలుగా

ఉండడం గమనార్హం. శ్వేత పత్రాలలో వాడిన భాష, రహస్యపత్రాల రచనలోనూ ఉన్న అంతస్సూత్రం ఒకటే. ప్రభుత్వం అసమర్థమైందని, ప్రైవేట్‌రంగం సమర్థమైనదని, జీవన ప్రమాణాల మెరుగుదలకు బహుళజాతి సంస్థలు ఆవసరమని, ప్రభుత్వం చాలా రంగాల నుంచి తన జోక్యాన్ని ఉపసంహరించుకొని బడ్జెట్ లోటు తగ్గించాలని, సంక్షేమ రంగాల మీద ప్రభుత్వం చేసే వ్యయాన్ని తగ్గించాలని, క్రమ క్రమంగా రద్దు చేయాలని ఇవాళ అంతర్జాతీయంగానే పెట్టుబడిదారీ విధానం ప్రవచిస్తున్న నినాదాలే ఈ రెండు రచనల్లోనూ కనబడతాయి.

సంక్షోభంలో ఉన్న తమ ఆర్థిక వ్యవస్థలను గట్టెక్కించుకోవడానికి, తమ సరుకులకు, పెట్టుబడులకు కొత్త మార్కెట్లను సృష్టించుకోవడానికి, మూడో ప్రపంచ దేశాలలోని మౌలిక సౌకర్యాలలో అంటే విద్యుత్, రోడ్లు, ఓడ రేవులు, విమానాశ్రయాలు, టెలికమ్యూనికేషన్ సౌకర్యాలు వంటి రంగాలలో ప్రభుత్వాన్ని పక్కకు తప్పించి తమ పెట్టుబడులు పెట్టడానికి, మూడో ప్రపంచదేశాల వ్యవసాయాన్ని తమ మార్కెట్‌కు అనుసంధానం చేసుకోవడానికి బహుళజాతి సంస్థలు పన్నుతున్న కుట్రలే ఈ నినాదాలు. ఈ కుట్రను ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థల ద్వారా బహుళజాతి సంస్థలు ఇంత వరకు ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా, తూర్పు యూరప్ దేశాలలో కేంద్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేశాయి. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం పెట్టుకుని ఈ పథకాలను అమలు చేస్తే ఫలితం ఎలా ఉంటుందో బహుళజాతి సంస్థలు ప్రయోగం చేసి చూడదలిచాయి. ఈ ప్రయోగం ప్రపంచంలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరిపారు.

ఈ ప్రయోగానికి తొలి అడుగు శ్వేత పత్రాల ప్రకటన. చంద్రబాబు నాయుడు మలేషియా, సింగపూర్ పర్యటన ముగించుకుని రాగానే, హడావుడిగా తాము ఒక విజన్ 2020 రూపొందించనున్నామని, అది 1 జనవరి 1998 నుంచి అమలులోకి వస్తుందనీ ప్రకటించారు.

ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వ అధికారులలో ముఖ్యుల నాయకత్వాన ప్రాతిపదిక ప్రకటనలూ, ఆయా రంగాలకు ప్రణాళికలు రూపొందించడానికి టాస్క్‌ఫోర్స్‌లూ ఏర్పాటయ్యాయి. ఆ రకంగా 14 టాస్క్ ఫోర్స్‌లను ఏ పరిధులలో, ఏ లక్ష్యాల కోసం దీర్ఘకాలిక ప్రకటనలు రూపొందించాలో సూచించారు. అప్పటివరకూ కేవలం కేంద్ర ప్రభుత్వాలతోనే వ్యవహరిస్తూ, కేంద్ర ప్రభుత్వాలకే అప్పులిస్తూ, కేంద్ర ప్రభుత్వాలకే షరతులు పెడుతూ ఉండిన ప్రపంచబ్యాంకు ఆంధ్రప్రదేశ్‌లో ఒక కొత్త ప్రయోగం మొదలెట్టింది. ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్న ఒక రాష్ట్రంలో అప్పులు ఇచ్చి, ఆర్థిక వ్యవస్థపై విధి నిషేధాలు విధించి, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో వ్యవహారాలు నడిపితే ఎట్లా ఉంటుందో ప్రపంచబ్యాంకు ప్రయోగం చేసి చూడదలచుకుంది. ఆ ప్రయోగంలో భాగంగానే 1996 సెప్టెంబర్‌లో 'ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణల కార్యక్రమం' అనే ప్రపంచబ్యాంకు రహస్య నివేదిక వెలువడింది.

ఆంధ్రప్రదేశ్ విజన్ 2020ని రూపొందించే పని మెకన్సీ అండ్ కంపెనీ అనే అమెరికన్ బహుళజాతి సంస్థకు అప్పగించారు. మన వనరులను వినియోగించుకుని మన భవిష్యత్తును ఎట్లా రూపొందించుకోవాలో సామ్రాజ్యవాద సంస్థలకే మనకన్న ఎక్కువ తెలుసునని చంద్రబాబు విశ్వాసం. ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో బహుళజాతి సంస్థల దోపిడీ ఆర్థిక విధానాలకు సహాయ సహకారాలందించే వాషింగ్టన్‌కు చెందిన మెకన్సీ అండ్ కంపెనీని విజన్ 2020 రచనకు ఆహ్వానించడమంటే, వర్తమాన ప్రణాళికలలోనే కాకుండా భవిష్యత్ ప్రణాళికలలో కూడా ప్రపంచబ్యాంకు ఆదేశాలకు తల ఒగ్గడమే. విజన్ 2020 ప్రాతిపదిక ప్రకటనలన్నిటిలోనూ దృక్పథం, భాషా వ్యక్తీకరణలు, లక్ష్యాలు ప్రపంచబ్యాంకు నివేదిక నుంచి అరువు తెచ్చుకున్నవే!

రాష్ట్రంలోని మొత్తం వనరులను అంచనావేసి, ఆయా వనరులు తమ బొక్కసాలను ఎట్లా నింపగలవో, నింపేందుకు ఏయే స్వల్పకాలిక, దీర్ఘకాలిక పథకాలు అమలుచేయాలో బహుళజాతి సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాయి. పేదరికం నిర్మూలన, అందరికీ విద్య అని 50 సంవత్సరాలుగా అమలు చేయలేక పోయిన ఆదర్శాలను వల్లించి ప్రజల్ని మోసపుచ్చుతూ, విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలికి, వాళ్ల లాభాలవేటలో ఈ రాష్ట్రాన్ని, ఈ రాష్ట్ర ప్రజల జీవితాలను కుక్కలు చింపిన విస్తరిచేయడమే ఈ ప్రణాళిక అసలు లక్ష్యం.

మొత్తం మీద ఈ 352 పేజీల పత్రం ఎన్ని వందలసార్లు ప్రైవేట్ పెట్టుబడి గురించి ప్రస్తావించిందో, ప్రస్తావించినప్పుడల్లా ఎంత భక్తి పారవశ్యంతో మాట్లాడిందో చూస్తే విజన్ 2020 అసలు లక్ష్యం ప్రైవేట్ పెట్టుబడికి పెద్దపీట వేయడమేనని స్పష్టమవుతుంది.

2020 సంవత్సరం నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధికి అనుకూలమైన నియంత్రణలు లేని విధాన వాతావరణాన్ని కల్పించి మార్కెట్ పునాదిగా గల అభివృద్ధికి దోహదకారి అవుతుందని విజన్ 2020 రాసింది.

ఆంధ్రప్రదేశ్ కన్నా అన్నింటా అభివృద్ధిపథంలో ముందు మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటకలను మినహాయించి వరల్డ్ బ్యాంక్, మల్టీనేషనల్స్ సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్‌నూ, ముఖ్యమంత్రి చంద్రబాబునే ఎందుకు యావద్భారతంలోనే 'ఆదర్శం'గా ఎంచుకుంది? ఎన్నికల సమయంలో చంద్రబాబు తరుచుగా కేంద్రంలో తనకు ప్రధానమంత్రి పదవి అవకాశం (యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా కొన్నాళ్లు ఉన్నంత మాత్రానే) వచ్చినప్పటికీ 'రాష్ట్ర ప్రయోజనాల కోసం' వదులుకున్నానని ఒకటికి పదిసార్లు, పదిచోట్ల సభలలో చెప్పి బాధపడ్డారు. అలాగే తాను 'రోజుకు 18-20 గంటలు పనిచేస్తు'న్నందున, రాష్ట్రానికి సేవ చేయడానికి స్వల్ప వ్యవధి (రెండున్నర సంవత్సరాలు లేదా మూడు లేదా ఐదేళ్లు) చాలదు కాబట్టి 'కనీసం 20 ఏళ్లు అధికారం'లో ఉండడం అవసరమని ఆయన భావించారు.' అదే 'స్వర్ణాంధ్ర' అన్నారు. ఈ రెండు ప్రకటనల సారాంశాన్ని సామ్రాజ్య వాద ప్రతినిధులైన అంతర్జాతీయ కాబూలీ సంస్థలు వరల్డ్‌బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్.లు పసికట్టాయి. క్రమంగా చంద్రబాబుకు తగిన గాలం వేశాయి. చేజిక్కించుకున్నాయి. ఆయనలో తమకు మంచి 'పెట్టుబడి' అవకాశాలు చూసుకున్నాయి. అసలు ప్రహసనం అంతా ఇక్కడి నుంచే ప్రారంభమయింది. రోజువారీగా మనకు వినిపిస్తున్న ప్రచార ఊదరలో భాగంగా చెవులలో గింగురుమంటూ రింగులు కొడుతున్న సమాచార సాంకేతిక వ్యవస్థను అటు చంద్రబాబూ, ఇటు అంర్జాతీయ కాబూలీ వాలాల ద్వారా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ మల్టీనేషనల్స్ ఇందుకు మాధ్యమంగా వాడుకున్నారు. 'ముఖ్యమంత్రి తరచుగా ప్రపంచబ్యాంక్ ప్రతినిధి వర్గాలను కలుసుకుని సంభాషణలు సాగిస్తూ వచ్చారు... రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి వారితో చర్చించారు. పరిస్థితిని ఎలా మెరుగు పరచాలో వారితో సమాలోచనలు జరిపారు.' అంతేగాదు, 'చంద్రబాబు చొరవ చేసి అమలు జరుపుతున్న సంస్కరణలన్నీ వరల్డ్ బ్యాంక్ బృందాలు సూచించినవే'.

తమపై వచ్చిన విమర్శలకు జవాబుగా 'మేం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఏ ఆదేశాలూ ఇవ్వలేదు. జరిగే కార్యక్రమాలన్నీ స్వయంగా

ప్రభుత్వం చేపడుతున్నవే. అవి మాకు నచ్చాయి. అందుకే మేం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం' అని అప్పటి ప్రపంచ బ్యాంకు భారత ప్రతినిధి లిమే అనవలసి వచ్చింది.

'రాష్ట్ర బడ్జెట్‌ను శాసన సభకు సమర్పించడానికి ముందే బడ్జెట్ అంశాలను వరల్డ్ బ్యాంక్ మదింపు వేయడానికి భారత దేశంలో మొదటిసారిగా ఒక్క ఆంధ్రప్రదేశ్ తప్ప మరే రాష్ట్రమూ అనుమతించలేదు' అని హిందూ దినపత్రిక వ్యాఖ్యానించింది.

తన గత హయాంలో ఎంతో సాధించానని గొప్పలు చెప్పు కుంటున్న చంద్రబాబు నిజానికి ఆంధ్రప్రదేశ్‌ని అమ్మకానికి పెట్టాడు. అన్నిరంగాల స్వావలంబనను దెబ్బ తీశాడు. చంద్రబాబుకి ముందు 43 సంవత్సరాలలో మారిన 13 మంది ముఖ్యమంత్రుల హయాంలో చేసిన అప్పులు 12 వేల కోట్ల రూపాయలు ఉండగా, కేవలం చంద్రబాబు హయాంలో 16 వేల కోట్ల రూపాయలకు అప్పులు పెరిగిపోయి మొత్తం రుణాలు 28 వేల కోట్ల రూపాయలకు పెరిగిపోయాయి. దీనిపై వడ్డీ ఏడాదికి 4 వేల కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము చెల్లించారు. ఈయన హయాంలోనే లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు ఆల్విన్, రిపబ్లికన్ ఫోర్జ్ లు మూతపడ్డాయి. విద్యుత్ రంగం 3 ముక్కలయ్యింది. విద్యుత్ ఛార్జీలు తగ్గించమని అడిగినందుకు ప్రజలపై దమనకాండతో పాటు ముగ్గుర్ని కాల్చి చంపారు.

1995-96ల్లో సంస్కరణలు అమలు చేసిన తరువాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నా భిన్నమైందని అనేకమంది విశ్లేషకులు పేర్కొన్నారు. రుణభారం నాలుగురెట్లు పెరిగింది. నిరుద్యోగం పెరిగింది. వ్యవసాయపు పంటతగ్గింది. 'రాష్ట్ర స్థూలాదాయం పెరిగిన స్పష్టమైన దాఖలాలు లేవు. తలసరి ఆదాయం ఎప్పుడూ జి.డి.పి. కన్నా తక్కువగానే ఉంటూ రావడమే కాకుండా, వాటి మధ్య అంతరం పెరిగింద'ని సెస్ అధ్యక్షులు డా. సి.హెచ్. హనుమంతరావు, డైరెక్టర్ మహేంద్ర దేవ్ వ్యాఖ్యానించారు.

వ్యవసాయరంగంలో సంస్కరణల కారణంగా రైతు ఆత్మహత్యలు చంద్రబాబు హయాంలోనే ఎక్కువయ్యాయి. 1998 నుండి 2003 వరకూ రాష్ట్రంలో 633 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లుగా ఒక అంచనా. ప్రజారోగ్య వ్యవస్థలో మార్పుల కారణంగా అదిలాబాద్, గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాలలో దాదాపు 3000 మంది మలేరియా రోగానికి బలైపోయారు. మెదడు వాపు వ్యాధికి వందలాది మంది చనిపోయారు. చంద్రబాబు హయాంలోనే సహకార అర్బన్ బ్యాంక్, పనికి ఆహార పథకం, టైమర్లు, నకిలీ స్టాంపుల కుంభకోణాలు లాంటివి అనేకం జరిగాయి.

ప్రజా సంక్షేమ పథకాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం తగ్గిపోయిందని చంద్రబాబు ప్రచారం చేశారు. కేంద్ర ప్రణాళికా సంఘం చంద్రబాబు చెప్పిన తగ్గిన లెక్కల ప్రకారమే నిధులు కేటాయించబోతే 'అబ్బే అప్పుడు సరైన లెక్కలు చెప్పలేదు. మా దగ్గర పేదరికం 22 శాతం కన్నా ఎక్కువే ఉంది' అని ప్రకటించారు. దీన్ని బట్టి అబద్ధాలు, తప్పుడు లెక్కలు చెప్పడంలో చంద్రబాబు ఆరితేరిన వాడని అర్థమవుతుంది.

నేటి చంద్రబాబు మిత్రపక్షమైన రాష్ట్ర బి.జె.పి. 1999 ఎన్నికల ముందు 'నమ్మక ద్రోహుల నగ్నస్వరూపం' అన్న శీర్షికతో చంద్రబాబు నాయుడిపై ఒక ఛార్జ్ షీట్ ప్రచురించింది. దానిలో 'చంద్రబాబు ప్రభుత్వం ప్రచార పటాటోపంతో, వంచనా నైపుణ్యంతో నానా పాట్లు పడుతున్నది. 'హైటెక్ ప్రచారం - లోటెక్ పనితీరు' ఈ ప్రభుత్వం మారు పేరుగా నిలిచిపోయింది. 'ప్రచారంలో ఫస్ట్ - పనితీరులో లాస్ట్' దీని హైలైట్. పేర్లు మార్చి కొత్త కార్యక్రమాల పేరిట ఆర్భాట ప్రకటన, బడ్జెట్ నిధులు మళ్లింపు, ఆకస్మిక తనిఖీలు, దూరదర్శన్ రేడియోలలో ముఖా ముఖి, పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు, వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు నెలకొక కొత్త కార్యక్రమాన్ని ప్రకటించడం, ఆర్భాటంగా ప్రారంభించడం, హెచ్చు స్థాయిలో ప్రచారం చేయడం, ప్రజలలో ఆశలు కల్పించడం, ఈలోగా మరొక కార్యక్రమానికి రూపకల్పన, వైఫల్యాలతో మరొక కార్యక్రమం వైపు దృష్టి మళ్లించడం, పనిచేసేందుకు లేకపోతే ఆకస్మిక తనిఖీల ద్వారా ప్రచారం, కార్యక్రమాల వైఫల్యానికి అధికారులపై ఆగ్రహం ప్రకటించడం లాంటివి చేశారు.

హెలికాప్టర్లలో విస్తృతంగా పర్యటించడం, ఇక్కడ వార్తలకు అవకాశం లేకపోతే ఢిల్లీ వెళ్లి జాతీయ రాజకీయాలలో సంచలన ప్రకటనలు చేయడం, ఏమీ చేయకపోయినా చేస్తున్నట్లుగా, ప్రజా సమస్యలపై ఆరాట పడుతున్నట్లుగా నటించడం ఈ ప్రభుత్వ విధానం అయిపోయింది. దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, మానభంగాలకు హద్దే లేదు. కె.జి. నుండి పి.జి. వరకూ పరీక్షా పత్రాల లీకేజి, పరిశ్రమల మూసివేత, అమ్మకం, ప్రజలపై పన్నుల భారం, ప్రపంచ బ్యాంకు చెప్పినట్లుగా నడుచుకోవడం ఈ ప్రభుత్వ విధానమై పోయింది. రైతులకు గిట్టుబాటు ధర లేదు. కరెంటు కోత భయంకరంగా ఉంది. అక్రమ మద్యం అధికార పార్టీ వారికి వరమైపోయింది. అభివృద్ధి కుంటుపడింది. పేద ప్రజలపై భారం ఎక్కువైంది. అవినీతి విచ్చలవిడిదైపోయింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఘోరంగా తయారైంది'. అని విమర్శించారు. దీని ద్వారా చంద్రబాబు ఎటువంటి వాడో బాగానే అర్థమవుతంది. కానీ నాటి చంద్రబాబుని అంత ఘోరంగా విమర్శించిన వాళ్లే, నేడు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అతని పంథానే అనుసరించడం, అధికారంలో వాటాల కోసమే అని అర్థమవుతుంది.

ప్రపంచ బ్యాంకు ఆదేశాలను పాటించిన అనేక దేశాలు నాశనమైపోయిన చరిత్ర మనకు తెలుసు. ఉదాహరణకు ఫార్చ్యూన్ పత్రికలో ఒక ఫిలిప్పైన్స్ ప్రభుత్వ వ్యాపార ప్రకటనలో 'మీ లాంటి మల్టీ నేషనల్ కంపెనీలను ఆకర్షించేందుకే మేం పర్వతాలను కూలగొట్టాం, అడవుల్ని నరికేశాం. చిత్తడినేలలను బాగుచేశాం. నదుల్ని మళ్లించాం. పట్టణాలను ఉన్న చోటునుండి మార్చాం. ఇవన్నీ మీ కోసం, మీరు వ్యాపారాలు చేసుకోడానికి అన్ని విధాలా సదుపాయాలు కల్పించడమే మా ఉద్దేశ్యం' అని తెలిపారు.

సామ్రాజ్యవాదుల కనుసన్నలలో ఇలాంటి పనుల్నే గతంలో చంద్రబాబు నిర్వహించారు. ఇప్పుడు మళ్లీ పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నానని మరింత గట్టిగా ప్రకటిస్తున్నారు. కోస్టల్ కారిడార్‌లు, విమానాశ్రయాలు, పోర్టులు, స్మార్ట్ సిటీస్, హైటెక్ ప్రపంచం, బాక్సైట్ మైనింగ్ లాంటి కార్యక్రమాల పేరుతో ప్రజలకు రంగు రంగు కలలు చూపిస్తున్నారు. పోరాట చరిత్ర ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు వీటిని ఎదుర్కొంటారని తెలుసు. అందుకే గ్రేహౌండ్స్ విభాగాన్ని పటిష్టం చేస్తానని, ఆక్టోపస్ కేంద్రాన్ని తిరుపతి, విశాఖలలో నిర్మిస్తానని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 15 కోట్లతో పోలీసులకు ఒక వెయ్యి అమెరికా కోల్ట్ 7.62 తుపాకులను వెంటనే సరఫరా చేయడానికి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఇటువంటి ఆలోచనలతోనే అటు కేంద్రంలో మోడీ, ఇటు రాష్ట్రంలో చంద్రబాబు అభివృద్ధి పేరుతో సృష్టించబోతున్న విధ్వంసాన్ని గుర్తించి, ఎదుర్కోవడానికి ప్రజలను సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత కార్మికోద్యమ నాయకుడు) వీ

రాజధానిపై రగులుతున్న రాయలసీమ

***ఆంధ్రప్రదేశ్ రాజధానిని రాయలసీమలో ఏర్పాటు చేయకపోవడం పట్ల నిప్పు రవ్వగా ఉన్న రాయలసీమ ప్రజల ఉద్యమం ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఉద్యమంగా మారుతుందని అంటున్నారు* అరుణ్**

పదేళ్లకాలం పాటు హైదరాబాద్‌నే రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యకలాపాలను జరుపుకోవచ్చని విభజన బిల్లులో స్పష్టపరచినా, రాజధాని ఏర్పాటుకు విధి విధానాల తయారుకై కమిటీ ఏర్పాటు చేసినా, ప్రభుత్వాధినేతలు సొంత రాజధాని ఏర్పాటుకై తహతహ లాడడం అర్థం చేసుకోవచ్చు. విభజన ఉద్యమకాలంలో ఇరు ప్రాంతాల రాజకీయ నాయకుల మధ్య ఏర్పడిన వైమనస్యాలు కారణమని చెప్పుకోవచ్చు. కాని కమిటీ అన్ని ప్రాంతాల ప్రజాభిప్రాయాల సేకరణ జరపక ముందే రాజధానిని, గుంటూరు – విజయవాడ – తెనాలి ప్రాంతాల మధ్య ఏర్పాటు చేయడమే ప్రభుత్వ అభిలాషగా, ఆ ప్రాంత పత్రికల ద్వారా రోజు ప్రజల చెవుల్లో అనునిత్యం ఊదుతూనే ఉన్నారు. దాంతో తమ ప్రాంతంలో రాజధానిని ఆశించిన (దాని సహేతుక కారణాల గురించి తర్వాత చెప్పుకుందాం) వారు, ముఖ్యంగా రాయలసీమ వాసులు గత కొన్ని నెలలుగా అన్ని జిల్లాలలో ఆందోళన జరుపుతున్నారు. మిగతా అభివృద్ధి కార్యక్రమాల పై దృష్టి సారించక వెనుకబడిన (వెనుకకు నెట్టేయబడ్డ) ప్రాంతమైన సీమవాసులు రాజధాని ఏర్పాటుపై ఎందుకు అంతగా పట్టుపడు తున్నారు? ఆ ఆందోళన చివరకు ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి దారితీసే అవకాశముందని తెలిసినా, ప్రభుత్వ పెద్దలు ఏమాత్రం పట్టించుకోకపోవడం ఎందువలన?

అధికారం – అభివృద్ధి

నేటి అభివృద్ధి నమూనాలో అభివృద్ధి, అధికారం విడదీయలేని కవలలు. ఒకే నాణానికి బొమ్మ బొరుసులు. అధికారం కేంద్రీకృతమైన చోటే అభివృద్ధి కేంద్రీకృతమవడం మనం చూస్తున్నాం. అవి రెండు పరస్పర పోషితాలు, ప్రోత్సాహకాలు కూడా. అభివృద్ధి, అధికారం పొందేందుకు వినియోగపడితే, అధికారం మరింత (ఆర్థికంగా) అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుంది. ఇది వ్యక్తుల విషయంలోనూ, ప్రాంతాల విషయంలోనూ వర్తిస్తుంది. అందుకే ఇప్పుడు తమ ప్రాంతంలోనే రాజధాని ఏర్పాటు చేయాలనే డిమాండ్ అన్ని ప్రాంతాల నుండి బలంగా రావడం. ఇక ఆర్థికాభివృద్ధి చెందిన వ్యక్తులూ, ప్రాంతాలూ, దేశాలూ కూడా అభివృద్ధి చెందని వ్యక్తులనూ, ప్రాంతాలనూ, దేశాలనూ తమతో సమానంగా ఎదగనీయవు. ఇది సామ్రాజ్యవాద దశలో మామూలే. అభివృద్ధి చెందిన దేశాలు, వెనుకబడిన దేశాలను తమ వలసలుగా ముడిసరుకుల వనరులుగా పరిగణిస్తాయి. ఈ సూత్రం అభివృద్ధి చెందిన ప్రాంతాలకు వర్తిస్తుంది. అందుకే ఒకే పాలనలో ఉంటున్న ప్రాంతాల మధ్య అసమానతలు కనపడడం కద్దు. తమకు అన్యాయం జరిగిందని భావించి అభివృద్ధికి దూరం చేయబడ్డ వ్యక్తులు, ప్రాంతాలు, దేశాలు అభివృద్ధిలో తమ వాటాకై ప్రశ్నిస్తే మొదట కొన్ని తాయిలాలు అందచేస్తారు. అప్పటికీ వారు అసంతృప్తితో తిరుగుబాటు చేస్తే తీవ్ర అణచివేతకు గురవుతారు. ఈ క్రమంలో అభివృద్ధి చెందిన దేశాలకు, వెనుకబడ్డ దేశాలలోని దళారీ పాలకవర్గాల సహాయం అందుతున్నట్లే. అభివృద్ధి చెందిన ప్రాంతాల నాయకులకు జీహుజూర్ అంటూ తలలూపే నాయకులూ వెనుకబడిన ప్రాంతాలలో లభ్యమవుతారు. వీరికి ఆ దోపిడి వాటాలో కొంత ముడుతుందనుకోండి.

ఏ మాత్రం రాజకీయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తి అయినా, పై సంబంధాలను, దక్షిణ కోస్తా, (ముఖ్యంగా, గుంటూరు, కృష్ణా జిల్లాల) రాయలసీమల మధ్య చూడవచ్చు. దానికి కారణం, కోస్తా ప్రాంతపు రాజకీయ నాయకుల అర్థబలం, అంగబలం (123 ఎంఎల్ఎలు వాళ్లు, 52 మంది సీమ వాళ్లుగా ఉండడం). అంతేగాక మా ప్రాంతపు రాజకీయ నాయకుల స్వార్థం, అధికార దాహం. రాయలసీమ వెనుకబాటు తనాన్ని ప్రశ్నించినపుడల్లా, వెంటనే ముఖ్యమంత్రులంతా మీ వాళ్లే కదా? అనే ప్రశ్న మాకెదురవుతుంది. రాడియా టేప్స్ బయట పడ్డాక, మంత్రుల నియామకం ఎవరి కనుసన్నల్లో జరుగుతుందనేది బహిరంగ రహస్యమే కదా! పదవులు మా వాళ్ల చేతిలో ఉన్నా, అధికారం కోస్తా సంపన్న వర్గానిదే.

అభివృద్ధి చెందని, చెందనీయని, ఏ ప్రాంతాలలోనైన కొత్త ప్రాజెక్టులు నెలకొల్పాలనే ఆలోచన కలిగిన వెంటనే, ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలూ లేవనే వాదన ముందుకు వస్తుంది. ఆ మౌలిక సదుపాయాలు అక్కడ లేకపోవడానికి కారణం, గతంలో అభివృద్ధికి నోచుకోక పోవడమేననే విషయం వాళ్లు విస్మరిస్తారు. నేటి అభివృద్ధి నమూనాలో ఆ మౌలిక సౌకర్యాలు మా ప్రాంతంలో ఒనగూరాలంటే, అధికార కేంద్రం రాయలసీమలో ఉండాలనే వాస్తవాన్ని అధికార రిమోట్ కంట్రోల్ చేతిలో ఉన్న కోస్తా పెట్టుబడిదారీ వర్గం గాని, వారి చెప్పుచేతుల్లో నడుస్తున్న సీమ నాయకులు గాని గుర్తించ నిరాకరి స్తారు. పై సమస్యే కర్నూలులో రాజధాని ఏర్పాటు విషయానికి వర్తిస్తుంది. కర్నూలు నగరంలో రాజధాని ఏర్పాటు చేయాలనే డిమాండ్ వెనుక రెండు బలమైన కారణాలున్నాయి. గతంలో తాము కోల్పోయిన అధికార కేంద్రాన్ని తిరిగి పొందాలనీ, తద్వారా అభివృద్ధికి నోచు కోవాలనే ఆశ. ఇందులో గతంలో తాము కోస్తా ప్రాంత అధినేతల మోసపూరిత చర్యల వల్ల, కోల్పోయిన విద్యావకాశాలు (ఆంధ్ర విశ్వ విద్యాలయ కేంద్రాన్ని మంజూరు అయిన తర్వాత కూడా అనంతపురం నుండి విశాఖకు తరలించడం) అంతకన్నా దుర్మార్గంగా కళ్ల ముందు పారుతున్న కృష్ణా జలాలనూ, మా ప్రాంత

భూములనూ ముంచి, నాగార్జునసాగర్‌కు మళ్లించడం. (1931లోనే మంజూరైన కర్నూలు జిల్లాలోని సిద్ధేశ్వరం దగ్గర నిర్మించాలని తలపెట్టిన కృష్ణా- పెన్నార్ ప్రాజెక్టును గద్దల్లా తన్నుకపోవడం) దాంతో సస్యశ్యామలం కావాల్సిన రాయలసీమను ఎడారిగా మార్చే కుట్ర. అంతా చేసి ఇప్పుడు మీ ప్రాంతం అభివృద్ధి చెందలేదు, మౌలిక సదుపాయాలు లేవు, కాబట్టి రాజధాని ఏర్పాటుకు తగిన అర్హతలు లేవనడం జరుగుతుంది. పై జ్ఞాపకాలతో తమ భవిష్యత్తు విషయంలో ఇక ఎంత మాత్రం ఈ రాజకీయ నాయకులను నమ్మరాదనే నిర్ణయానికి వచ్చారు సీమ జనులు. గతంలోనే కోస్తా వారి మోసపూరిత చర్యల వల్ల కుపితులైన మా సీమ ప్రాంతపు పెద్దలు. పప్పూరి రామాచార్యులు 1937లోనే విజయవాడలో కోస్తా వారు రాయలసీమ భాష, యాషలను తప్పుబట్టి, అది తెలుగు భాషే కాదన్నారు. మాకు, 1916 వరకు ఒక్క కళాశాల లేకపోవుట, జవాను మొదలు దివాను వరకు ఉద్యోగాలన్నింటిని కోస్తావారో, తమిళులో ఆక్రమించుకొని, మమ్మల్ని పాలిత జనులుగా చూస్తూ దారిద్ర దూర బంధువులుగా పరిగణించారు అంటూ తన ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. అంతేగాక, ఆయన, దక్షిణాది (తమిళులు) వారి కన్నా, ఉత్తరాది వారు (కోస్తా వారు) మరింత ప్రమాదకరమని' కుండబద్ధలు కొట్టినట్టు చెప్పారు. 'భాషప్రయుక్త రాష్ట్రాలు' అక్కరలేదనను. అందువల్ల అనేక లాభాలు గలవు. కానీ, చెన్నై (మద్రాస్) నుండి విడివడుట లాభకరమైనచో, ఆంధ్ర రాష్టం నుండి రాయలసీమ విడివడుట మరింత లాభాకారం గదా! ఆంధ్ర విశ్వవిద్యాలయం విషయంలో (వారి ప్రవర్తన) మాకర్థమైనది. వారిలో వారే కలహించినారని అధ్యక్షులు తెలిసినా, మాకు ఇవ్వకూడదనుటలో అందరూ ఏకీభవించిన వారే. కావున ఉత్తరాది వారితో చేరుట కన్నా వేరు రాష్ట్ర స్థాపనే మేలు. 1931 జూన్ 21న జరిగిన సభలో మరో రాయలసీమ నాయకుడు టి.ఎన్. రామకృష్ణారెడ్డి దక్షిణ జిల్లాల వారి (తమిళుల) ఆధిపత్యం వల్ల నిన్నటివరకు అనుభవించిన బాధను మనం మరువలేం. ఇక ఉత్తరాది ప్రాబల్యం రుచి చూస్తున్నాం. మేం మనుషులమన్న గణన కూడా వారికి లేదు. మనం వారికి లెక్కకు రాం. రాష్ట్ర రాజధాని మనకు రాదు. దానికి అప్పుడే ప్రయత్నాలు జరుగుచున్నవి అంటూ ఆనాడే కోస్తా వారి కుట్రపూరిత వైఖరిని బయటపెట్టాడు. ఆయన చెప్పినట్టుగానే మద్రాసు అసెంబ్లీలో ఓటింగ్ జరిపినపుడు కోస్తా వారు చేసుకున్న ఒప్పందానికి వ్యతిరేకంగా కర్నూలు రాజధాని ఏర్పాటును వ్యతిరేకించారు. ఏమంటే తమిళులు ఓటింగ్‌లో పాల్గొనకూడదనే రాజాజీ నిర్ణయానికి వ్యతిరేకంగా 8 మంది తమిళ ప్రతినిధులు ఓటింగులో పాల్గొనడం. ఒక్క ఓటు మెజారిటీతో కర్నూలు రాజధాని ప్రతిపాదన నెగ్గడం చారిత్రక సత్యం. ఆనాటి రామకృష్ణారెడ్డి 'రాష్ట్ర రాజధాని మనకు రాదు. దానికి అప్పుడే ప్రయత్నములు జరుగుచున్నవి' అన్న మాటలు నేటికీ, అక్షర సత్యములుగా నిలవడం, సీమకు విషాదమే. ఇక సంజీవరెడ్డి, సీమవారికి 'రాముడేలినా, రావణుడేలినా రాజ్యమొక్కటే' అని తమిళుల ఆధిపత్య ధోరణికీ, కోస్తావారి ఆధిపత్య ధోరణికీ భేదం లేదని వ్యక్తీకరించారు. ఆ చరిత్రే పునరావృత్తం అవుతుందనుకోవడంలో మా తప్పేమి లేదు. సమైక్య రాష్ట్రంలో మాకు నీటి విషయంలోనూ, ఉద్యోగాల విషయంలోనూ జరిగిన అన్యాయాలు, నాటి మా పెద్దల మాటల్ని ఇక ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదనీ హెచ్చరిస్తున్నాయి. అందుకే సీమ ప్రాంతంలో రాజధాని కోసం ఈ అలజడులు, ఆందోళనలు.

ఇప్పుడు రాజధాని సింగపూర్ తరహాలో ఉండాలనీ, ప్రపంచంలోనే దానిని అందమైన నగరంగా తీర్చిదిద్దాలని అంతేగాక అది కాలుష్య రహితంగా, మురికివాడలు లేకుండా ఉండాలనీ, ప్రపంచ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలనీ తన కోరికను ముఖ్యమంత్రి బయటపెట్టారు. అంటే ఇప్పుడున్న నగరాలూ ఎలా ఉన్న పర్వాలేదు రాజుగారికి. ఆయన పరివారానికి మాత్రం సకల సౌభాగ్యాలతో విలసిల్లె ఒక మహానగరం కావాలి. అందులో మురికి బట్టల వాళ్లు ఉండకూడదు. కాని రాజధాని నగరానికి రాళ్లెత్తే కూలీలు మాత్రం వాళ్లే. వినియోగించుకో - పారేయి (యూజ్ అండ్ త్రో) సంస్కృతీ చిహ్నం మన ముఖ్యమంత్రి. ఇప్పుడాయన ప్రణాళికలు వింటుంటే ఇందిరాగాంధీ 'గరీభి హటావో' అంటూ 'గరీబోంకో హటాదియా' గుర్తుకొస్తుంది. ఆ ప్రణాళికా రూప కల్పనకై ఒక కమిటీని వేసింది. దాని కన్వీనర్ ఒక విద్యా వ్యాపారి అయితే, సభ్యులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉండడం ప్రభుత్వం ఎవరి కోసం స్థల నిర్ధారణ చేస్తున్నదో సులభంగా అర్థం చేసుకోవచ్చు. కంటి తుడుపుకైనా ఆ కమిటీలో అన్ని ప్రాంతాల ప్రతినిధులకు చోటివ్వలేదు. దీన్నిబట్టి ప్రభుత్వం ఎవరి చెప్పుచేతుల్లో నడుస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. గతంలో అన్యాయం జరిగినప్పుడు గొంతెత్తడానికి రామకృష్ణారెడ్డి, పప్పూరు లాంటివారు ఉండేవారు. కాని నేడు అటు పాలక పక్షంలోనూ, ఇటు ప్రతిపక్షంలోనూ సీమకు జరిగిన అన్యాయం గురించి గొంతెత్తే నాయకుడు లేకపోవడం సీమ దౌర్భాగ్యం. 'ఉట్టికెక్క లేనమ్మ, స్వర్గానికి నిచ్చెన వేసినట్లు' ఎన్నికలలో విజయానికి, తానిచ్చిన రుణమాఫీ పథకం అమలుకై రిజర్వు బ్యాంకును దేభారిస్తూ అప్పులు తీర్చడానికి, సీమ ప్రాంత ఎర్రచందనానికి ఎసరుపెడుతున్న ప్రభుత్వం, రాజధాని నిర్మాణానికై వేలకోట్లు ఖర్చుపెట్టాలని భావిస్తుంది. ఇది ప్రజలపై అనవసర భారం మోపడమే. 'పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు' హైదరాబాద్ కన్నా గొప్ప నగరం నిర్మించాలనుకోవడం మూర్ఖత్వం గాక మరేమవుతుంది?

శివరామకృష్ణన్ కమిటీ ఇంకా అన్ని ప్రాంతాల ప్రజల అభిప్రాయ సేకరణ చేసి తన నివేదిక ఇవ్వకముందే ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉన్న మీడియా ద్వారా (మ్యాన్‌ఫాక్చరింగ్ కన్‌సెంట్) సమ్మతి తయారి చేయడం మొదలెట్టింది. అంతేగాక, హిజ్ మాస్టర్ వాయిస్‌లా మంత్రి నారాయణ రాత్రనకా, పొద్దనకా రాజధాని విజయవాడ - గుంటూరు - తెనాలి ప్రాంతంలోనే అని ఊదర గొడుతున్నాడు. ఇప్పటికే పది మందికి ఉపాధి కల్పించే కేంద్ర, రాష్ట్ర, విద్యా వైద్య సంస్థలన్నింటినీ విశాఖ నుండి గుంటూరుకు పరిమితం చేసిన ప్రభుత్వం రాజధాని విషయంలోను రాష్టంలో దక్షిణ కోస్తా జిల్లాలు తప్పా మిగతా ప్రాంతాలు ఉన్నాయనుకున్నట్టు లేదు. అగ్నికి ఆజ్యం పోస్తున్నట్టు రాజధానిలోనే హైకోర్టు ఉంటుందనీ, చివరకు కృష్ణా జలాల పంపిణీ కార్యాలయం కూడా రాజధానిలోనే అంటూ ప్రకటనలు. దీన్ని బట్టి సీమ ప్రాంతమంటే ప్రభుత్వానికి ఎంత అలుసో అర్థమవుతుంది. మా ప్రాంతాన్ని వెలివాడగా భావిస్తున్నప్పుడూ, మేమే వారిని వెలివేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకోవడం మంచిది కదా అని సీమవాసులు గుర్తిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ స్థల నిర్ణయం రాజధాని ఏర్పాటుకై కేంద్రం విధించిన నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉండడం గమనార్హం. వ్యవసాయ, అటవి భూములను సేకరించరాదనీ, ప్రకృతి వైపరీత్యాలు (వరదలు, భూకంపాలు) సంభవించే ప్రదేశం కాకూడదనీ అందులో పేర్కొన్నారు. ప్రభుత్వం సూచిస్తున్న విజయవాడ – గుంటూరు – తెనాలి ప్రాంతం ఆ రెండు సూచనలను కాలరాస్తుంది. సాగర్, కృష్ణా డెల్టాల కింద భూసేకరణ అత్యంత ఖర్చుతో కూడినది. ఆహార కొరతకు దారితీసే చర్య అది. అక్కడి రైతాంగం అంత సులువుగా భూమిని వదులు కోవడానికి సిద్ధపడరు. ఆ రైతులకు ఎంత ధర చెల్లించినా, అది వారికి తాత్కాలిక ఉపశమనం కల్పిస్తుందేమో గాని, దీర్ఘకాలంలో వారు భూమిని కోల్పోయి, పొందిన నష్ట పరిహారాన్ని ఖర్చు చేసి వీధిన పడతారు. ఇది సెజ్‌ల విషయంలో అనుభవమే. భూముల సేకరణ వల్ల ఉత్పన్నమయ్యే సమస్య కేవలం రైతులదే కాదు. వారికి అంతో ఇంతో నష్టపరిహారం ముడుతుంది. కాని వ్యవసాయాధారిత, చేతివృత్తుల వారు, వ్యవసాయ కూలీల మాటేమిటి? మన అభివృద్ధి కార్యక్రమాలన్నీ సేద్యాన్ని నాశనం చేయడం. కాని ప్రత్యామ్నాయంగా దానిపై ఆధారపడ్డ వాళ్లకు ఉపాధి చూపకపోవడం గర్హనీయం. ఇక అటవి భూమి సేకరణ దానిపై ఆధారపడే వాళ్లను రోడ్డుపై పడేయడమే గాక వాతావరణ సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. ఇప్పటికే దేశంలోనూ, రాష్ట్రంలోనూ తగిన నిష్పత్తిలో అడవులు లేవని పర్యావరణ శాస్త్రజ్ఞులు ఘోషిస్తున్నారు కూడా. ప్రభుత్వం రాష్ట్ర రాజధానిని ఎంపిక చేసిన ప్రాంతం వరదలకు, భూకంపాలకు లోనయ్యేదనేది గమనించాలి. అక్కడి భూమి అతి మెత్తగా ఉంటుంది. కాబట్టి బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి తగదనే విషయం మన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొత్తగా చెప్పేది కాదు. ప్రభుత్వపు నిధులు కాబట్టి ఎంత ఖర్చయినా పర్వాలేదు అనుకుంటున్నారేమో?

ముఖ్యమంత్రితో సహా విజయవాడ ప్రాంతం రాజధాని ఏర్పాటుకు మిగతా అన్ని ప్రాంతల కన్నా అనువైనదని చూపే కారణం ఆ ప్రాంతం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉందనే వాదన. ఇది తార్కికంగా చూస్తే సమంజసంగా కనపడుతుంది. కాని తరచి విశ్లేషిస్తే అసలు అది పరిగణలోనికి తీసుకోవాల్సినది కానే కాదు. దూరం గురించి నేడు అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్న కాలంలో ఆ వాదన కాలం చెల్లినది. అర్థరహితమైనది కూడ. అంతే గాక రాజధానిని తరచూ సందర్శించే వాళ్లు, రాష్ట్ర ప్రజలలో 5 శాతం కూడా ఉండరని గణాంకాలు చెపుతున్నాయి. దేశ విదేశాలలో చాలా రాజధానులు ఆయా దేశాలలోని అన్ని ప్రాంతాలకు సమాన దూరంలో లేవనే విషయం మన హైటెక్ ముఖ్యమంత్రికి తెలియదని అనుకోను. అందుకు ఉదాహరణగా బెంగళూరు (కర్నాటక), చెన్నై (తమిళనాడు), ఢిల్లీ, వాషింగ్టన్ (అమెరికా) మచ్చుకకు కొన్ని.

అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేయడం లేదు. కాబట్టి బహుశా రాజధాని విషయంలో సమదూరం పాటించాలని అనుకున్నరేమో మన ముఖ్యమంత్రి. ఇప్పటికే అభివృద్ధి కేంద్రీకరణ దుష్ఫలితాలు తానే అభివృద్ధి చేశానంటున్న హైదరాబాద్ అనుభవాలు ఆయనకు సరిపోలేదేమో. వెనుకబడిన వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించి వాటి అభివృద్ధికి కొంతమేరకైనా దోహదం చేసిన రాజ్యాంగ విలువను, వెనుకబడిన ప్రాంతాల విషయంలోను అమలు చేయాలనీ, అది ప్రజాస్వామ్య ప్రభుత్వాల కనీస ధర్మమని చెప్పాల్సి రావడం నేటి విషాదం.

ఇక కర్నూలుకు రాజధాని అర్హత గురించి మాట్లాడితే, మొదటిది తాను కోల్పోయిన హక్కును తిరిగి పొందడం. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ వాళ్లు 1956 పూర్వ తెలంగాణ ప్రాంతాన్ని డిమాండు చేశారు. దానికి ప్రతిగా ఇక్కడి వారు 56 పూర్వ ఆంధ్ర ప్రాంతం కావాలని భద్రాచలం చుట్టూ ఉన్న 6 మండలాలను కోరారు. పొందారు కూడా. అదే ప్రాతిపదికపై నేడు మేం రాయలసీమవాసులం 1956కు పూర్వాంధ్రలో కర్నూలు రాజధానిగా ఉంది. కాబట్టి ఇప్పుడూ రాజధాని కర్నూలులోనే ఏర్పాటు చేయాలనీ, అది మా హక్కని చెపుతున్నాం. అంతే కాదు కర్నూలులో రాజధాని ఏర్పాటుకు అవసరమైన వసతులన్నీ ఉన్నాయి కూడా. దాదాపు 25 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వం భూసేకరణకై నయా పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. అంతే కాదు కర్నూలు నగరం చుట్టూ హంద్రి, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నాయి. కెసి కాలువ ఉంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పక్కనే ఉన్న మూడు రాష్ట్రాలకు తెలంగాణ, కర్నాటక, తమిళనాడుకు రోడ్డు, రైల్వే సౌకర్యం ఉంది. కర్నూలు నుండి శంషాబాద్ విమానాశ్రయానికి రెండు గంటల ప్రయాణం కాగా, బెంగళూరు విమానాశ్రయానికి 3–4 గంటల ప్రయాణం మాత్రమే. ఇక్కడ ప్రైవేట్ భూములు కూడా చౌక. అంతే గాక ఇక్కడ రాజధాని ఏర్పాటు వల్ల రాయలసీమ మొత్తం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇతర వెనుకబడిన ప్రాంతాలలో శ్రీకాకుళాంధ్ర, పల్నాడులలో ఒక అసెంబ్లీ సెషన్, మరొకచోట హైకోర్టు నెలకొల్పడం ద్వారా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేయవచ్చు.

ఏమైనా ప్రభుత్వం గత అనుభావాల నుండి పాఠాలు నేర్చుకునేటట్టు లేదు. అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రగా భావిస్తే దానివల్ల నష్టపోయేది పాలక పక్షమే. పదిమందికి జీవనాధారం కల్పించే ఏ కర్మాగారాలూ, సంస్థలూ, వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పకుండా అధికారాన్నీ, అభివృద్ధినీ కేంద్రీకృతం చేస్తే రాయలసీమ భగ్గుమనక తప్పదు. గత కొన్ని నెలలుగా, రాయలసీమ వాసులు చేస్తున్న ఆందోళనలను ఇప్పుడెవరూ పట్టించుకోకపోవచ్చు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం మన నేతలకు అలవాటు. తెలంగాణ ప్రజల కల దాదాపు 6 దశాబ్దాల తర్వాత, వేలమంది బలిదానాల తర్వాత నెరవేరింది కదా అని తాచ్చారం చేయవచ్చు కూడా. ఆగస్టు 15 సంబరాలతో స్మార్ట్ నగరాలనీ, విమానాశ్రయాలనీ, మమ్మల్ని సంతృప్తి పరుస్తామని అనుకుంటే అది అమాయకత్వం కాదు, అజ్ఞానం అవుతుంది. గతంలో మా పెద్దలను అంబారి సవారి లెక్కించి, ఆ తర్వాత శ్రీబాగ్ ఒడంబడిక పేరుతో ఏమార్చడం, మేం మరచిపోలేదు. కొందరిని అంతకాలం మోసం చేయవచ్చు, అందరినీ కొంతకాలం మోసం చేయవచ్చేమో గాని, అందరినీ ఎల్లకాలం మోసం చేయలేరు. సీమ రగులుతుంది. ఇది మీకు నిప్పురవ్వగానే కన్పించవచ్చు. అది దావానం లాగా మారేందుకు, ఎక్కువ సమయం తీసుకోదు. రాయలసీమలో తప్ప, ఎక్కడ రాజధాని ఏర్పాటు ప్రకటించినా ఆ ప్రకటన, ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఉద్యమ ప్రకటనే అవుతుంది. తెలంగాణ పోరాట యోధులు మాకు మార్గ నిర్దేశకులవుతారు. మరో నూతన రాష్ట్ర అవతరణను ఎవరూ అడ్డుకోలేరు. వీ

(రచయిత రాయలసీమ విద్యావంతుల వేదిక)

కొత్త బడ్జెట్ - పాత ధోరణులు

***విజన్ 2020 పేరుతో రాష్ట్రాన్ని విదేశాలకు తాకట్టు పెట్టిన చంద్రబాబు, ఇప్పుడు విజన్ 2030 పేరుతో అదే ప్రపంచబ్యాంక్ వెలుగులో బడ్జెట్ రూపొందించారని అంటున్నారు* వి. హనుమంతరావు**

కొత్త రాష్ట్రం, కొత్త బడ్జెట్, 2015 – 16 పూర్తి బడ్జెట్ ఇంకో ఆరు నెలల్లో రాబోతుంది. కాగా వచ్చే ఆరు నెలల్లో కొత్త రాష్ట్రం కాళ్లూనుకునే పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రం ఏమి చేయగలుగుతుంది? పత్రికలు కూడా బడ్జెట్‌కు మామూలుగా ఇచ్చే ప్రాధాన్యత ఇవ్వలేదు. కొన్ని పత్రికలు సంపాదకీయాలే రాయలేదు. అందుచేత చంద్రబాబును ఈసారికి వదిలేద్దాం అని అనిపించింది కాని...

రైతుల రుణమాఫీ విషయంలో ఆయనను వదిలిపెట్టేదిలేదు. ఆయన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా మాఫీ చేస్తానని ప్రకటించాడు. కాగా ఆ వాగ్దానాన్ని నెరవేర్చడం ఆ పార్టీ బాధ్యత, ఆ పార్టీ పేరుతో గెలిచిన శాసన సభ్యుల బాధ్యత, వారంత ఎన్నికల్లో లక్షలు, కోట్లు ఖర్చుపెట్టారు. అంటే నల్ల ధనం వారిదగ్గర గుట్టలు గుట్టలుగా పడి ఉన్నదన్నమాట. తమ పార్టీ నాయకుడు హామీని అమలు పరచలేని పరిస్థితిలో ఉంటే, తల తాకట్టు పెట్టయినా ఆయనకు నిధులు అందచేయాల్సిన బాధ్యత వారిదే. తిరుపతి దేవస్థానం వద్ద కోట్ల డబ్బుంది, అక్కడ నుంచి వడ్డి ఇస్తామని అప్పుతేవచ్చు కదా అంటే గుడిని, గుడిలో లింగాన్ని మింగేసే వస్తాదులున్నారు, అది పరిష్కారం కాదని ఒక మిత్రుడు హెచ్చరించాడు. పార్టీ శాసన సభ్యులనుంచే రుణం తెచ్చుకోవచ్చు కదా. వారంతా కోట్లు ఖర్చుపెట్టి గెలిచింది శాసనసభ్యులుగా అంతకంత మళ్లా సంపాదించుకొని వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కావాల్సిన నిధులను సంపాదించుకొనే బాపతు కాగా వాళ్లు చాంద్రబాబుకు ఎందుకు అప్పు ఇస్తారు? ఎన్నికల్లో పోటీ చేసే బూర్జువా పార్టీలన్నీ ఓటర్లను ఆకర్షించడానికి వాగ్దానాలు కుప్పిస్తుంటాయి. అలాగే చంద్రబాబు కూడా వాగ్దానం చేసి పీకల మీదకు తెచ్చుకున్నాడు. రిజర్వు బ్యాంకు తనను ఈ ఊబిలో నుంచి బయటకు పడేయమని అర్థిస్తేససేమిరా, సాధ్యం కాదని నిష్కర్షగా తేల్చి చెప్పింది. దానినే నిప్పుల్లో పప్పు లేదు... అంటారు. బాధ్యతా రహితంగా వాగ్దానాలు చేయడం ఒకరైతే, ఆ వాగ్దానాన్ని మరొకరు నెరవేరుస్తారా? బ్యాంకర్ల కమిటీ ప్రకారం రుణాలు రు. 87167 కోట్లయితే, ఏదో ముష్టివేయడానికి ముష్టి వేసినట్లు బడ్జెట్‌లో కెటాయింపు అయిదు వేల కోట్లు. ఈ లెక్కన ఎన్ని పంచవర్ష ప్రణాళికలు అమలు పరచాలి. ఏవేవో గిమ్మిక్కిలు ప్రకటిస్తున్నారు.

బ్యాంకులు రైతులకు ఇచ్చే రుణాలు వేరు, వ్యవసాయానికిచ్చన రుణాలు వేరు. బ్యాంకర్ల కమిటీ ఇచ్చిన లెక్కలు నేరుగా రైతులకిచ్చిన రుణాలా, వ్యవసాయానికిచ్చిన రుణాలా? కాసేపు రైతులకిచ్చిన రుణాలే అనుకుందాం. ఆ రైతుల్లో మీసాలు మెలేసే రైతులున్నారు. చిన్న, సన్నకారు రైతుల వాటా చాలా తక్కువగా ఉంటుందనేది తెలిసిన విషయమే. కొంత మంది బడా రైతులు (వారంతా కాంగ్రెస్, తెలుగుదేశం అనుచరులే) పంట రుణాలు తీసుకొని చిన్న రైతులకు ఎక్కువ వడ్డీకి ఆ రుణాలు ఇవ్వడం జరుగుతుంది. ఇలాంటి బడా రైతులకిచ్చిన రుణాలను తీసివేస్తే రుణ భారం చాలా తగ్గుతుంది. చంద్రబాబు ఆపని చేయగలరా? ఇలాంటి వారికి రుణాలివ్వడంలో స్థానిక బ్యాంకు యజమానులు గడ్డితినే పరిస్థితి కూడా ఉంది. చంద్రబాబు అలాంటి వారిని గుర్తించగలరా? తన పార్టీ శాసన సభ్యులే అలాంటి బడాబాబులైన సందర్భాలున్నాయి. చంద్రబాబు పరిపాలనా దక్షుడని బిరుదు సంపాదించుకున్నాడు. కాగా ఈ సమస్య పరిష్కారంలో చిన్న, సన్నకారు రైతులను రక్షించడంలో ఏ మేరకు సఫలమవుతారో చూద్దాం.

ఆర్థిక మంత్రి యనమాల రామకృష్ణుడు తన బడ్జెట్ ఉపన్యాసాన్ని గాంధీ సూక్తులను ఉదహరిస్తూ తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించడం ప్రధాని మోడీ దృష్టికి వెళితే? ఎందుచేతనంటే గాంధీని చంపింది ఆరెస్సెస్. ఆ సంస్థ పుణ్యమా అంటూ ఆయన ప్రధాని కాగలిగాడు. తన సంస్థచే చంపబడిన గాంధీ సూక్తులతో తన బడ్జెట్ ఉపన్యాసాన్ని ప్రారంభించడమా? రామకృష్ణుడు, కాస్త జాగ్రత్తగా ఉండండి.

చంద్రబాబు ప్రభుత్వం గతంలో ప్రపంచ బ్యాంకు సూచన మేరకు విజన్ 2020 పత్రాన్ని ఆవిష్కరించి జ్యోతిష్యుడిలా తాను 30 సంవత్సరాలు పరిపాలిస్తానని అట్టహాసంగా ఆచరణ ప్రారంభించి, ఓడిపోయారు అంటే విజన్ ఆయనకు అచ్చిరాలేదు. అలాంటి అచ్చిరాని విజన్ 2030ని ఆవిష్కరించడమేమిటి? అంటే ఆయన 2030 వరకూ అధికారంలో ఉంటానని అనుకొంటున్నారా? ఆయన పరిపాలనా దక్షత ఏపాటిదో ఇదివరలో ఒక దశాబ్దం పాటు చూశాం. 2004లో ఓడిపోవడమే ప్రపంచ బ్యాంకు నుంచి రుణాలు తెచ్చి పరిపాలన సాగించిన ఆయన సు(స్వ) పరిపాలనకు తార్కానం. తలసరి ఆదాయం లెక్కలిచ్చారు. జిడిపి అంటే రాష్ట్రంలో అన్ని రంగాల్లో చేసిన ఉత్పత్తుల విలువ. జిడిపి పెరిగిందంటే ధరల పెరుగుదల వల్ల కావచ్చు. ఉత్పత్తి పెరుగుదల మాత్రమే కాకపోవచ్చు. ఆ విధంగా చూసినప్పుడు జిడిపి పెరుగుదల ప్రశ్నార్థకం. ఆ మొత్తాన్ని జనాభా సంఖ్యతో భాగిస్తే తలసరి ఆధాయం వస్తుంది. జనాభాలో నిరుపేదల నుంచి కోటీశ్వరుల దాకా ఉంటారు. అలాంటి జనాభా లెక్కల ఆధారంగా తలసరి ఆధాయం పెరిగిందని జబ్బలు చరుచుకోవడం దేనికి?

కొత్త రాష్ట్రం లోటు బడ్జెట్ వచ్చిందని, అందువల్ల రాష్ట్ర పరిస్థితి కష్టాల్లో ఉందని పాలకులు అంటున్నారు. ఈ లోటు బడ్జెట్ల చరిత్రలోకి వెళితే, 1982 – 83లో తెలుగుదేశం అధికారంలోకి రాకముందు గతించిన 27 సంవత్సరాల్లో 21 సంవత్సరాలు మిగులు బడ్జెట్లే. 1956లో రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆ రాష్ట్ర బడ్జెట్ ఎంతో తెలుసా? (90 కోట్లు) అలాంటి బడ్జెట్‌తోనే అప్పటి ప్రభుత్వం ఒక్క నయాపైస అప్పు చేయకుండానే నాగర్జునా సాగర్, పోచంపాడు (శ్రీరం సాగర్) తుంగభద్ర ప్రాజెక్టులను నిర్మంచింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ఒక్కసారైనా మిగులు బడ్జెట్ ప్రవేశపెట్టలేదు. కాగా ఇప్పుడు చూపిస్తున్న లోటు కొత్త విషయమేమి కాదు. అది రాష్ట్ర విభజన వల్ల వచ్చిన లోటు మాత్రమే కాదు. పరిపాలనా దక్షతలోపం.

ఎం.టి. ఖాన్



పీడిత ప్రజా ఉద్యమాల చిరకాల సహచరుడు, కవి, రచయిత, పాత్రికేయుడు, లౌకిక, పౌర, ప్రజాతంత్ర హక్కుల ఉద్యమాల నాయకుడు ఎంటి ఖాన్ ఆగస్ట్ 20న మరణించారు. ఖాన్ సాబ్‌గా ప్రతి ఒక్కరికీ ప్రేమాస్పదుడైన మహమ్మద్ తాజుద్దీన్ ఖాన్ హైదరాబాద్‌లోని పురానాపూల్ దర్వాజా దగ్గర 1935లో పుట్టి, సిటీ కాలేజి హైస్కూల్‌లో పాఠశాల విద్య, వివేక్‌వర్ధని కాలేజిలో ఇంటర్మీడియట్ చదువుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఎ.లో చేరి ఆర్థిక కారణాల వల్ల పూర్తి చేయలేకపోయారు. అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో సాగుతుండిన కమ్యూనిస్టు, రైతాంగ, విద్యార్థి ఉద్యమాల ప్రభావంతో తొలి యవ్వనంలోనే కమ్యూనిస్టుగా మారిన ఎంటి ఖాన్ హైదరాబాద్ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత మఖ్దూం మొహియుద్దీన్‌కు సహచరుడిగా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో ఆయన కొరియర్‌గా పనిచేశారు. హైదరాబాద్ ధర్మవంత్ కాలేజిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే కమ్యూనిస్టు ఉద్యమంలో, సాహిత్య రంగంలో భాగం పంచుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండగానూ, విరమణానంతరం కూడ సియాసత్ వంటి ఉర్దూ పత్రికలలోను, న్యూస్ టైం వంటి ఇంగ్లిష్ పత్రికలలోను పాత్రికేయుడిగా పనిచేశారు. నక్సల్బరీ ప్రజ్వలనం తర్వాత మార్క్సిస్ట్ లెనినిస్ట్ రాజకీయాల వైపు వచ్చి, 1970లో విప్లవ రచయితల సంఘం స్థాపక సభ్యులుగా ఉన్నారు. అప్పటికి అజ్ఞాతంలో ఉన్న కొండపల్లి సీతారామయ్య 1972లో ప్రారంభించిన పిలుపు పక్షపత్రికకు ప్రచురణకర్తగా, ముద్రాపకుడిగా ఉన్నారు. 1973లో ఆంతరంగిక భద్రతా చట్టం కింద, 1974లో సికిందరాబాద్ కుట్రకేసులో ముద్దాయిగా, 1975లో ఎమర్జెన్సీలో మొత్తం మీద రెండు సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడిపారు. చివరిదాకా తనను తాను విప్లవ రచయితల సంఘం సభ్యుడిగానే గుర్తించుకున్న ఖాన్‌సాబ్ ఎమర్జెన్సీ అనంతరం హైదరాబాద్ బుక్ ట్రస్ట్ స్థాపకులలో ఒకరుగా ఉన్నారు. పౌరహక్కుల సంఘంలో క్రియాశీలంగా పాల్గొంటూ 1993-98 కాలంలో రాష్ట్ర అధ్యక్షుడిగా కూడ పనిచేశారు. హైదరాబాద్ మతకల్లోలాలకు వ్యతిరేకంగా ఏర్పడిన ప్రజా సంస్థలకు నాయకుడిగా ఉన్నారు. ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, ఖైదీల హక్కుల కోసం, ప్రజాకార్యకర్తలపై దాడులకు వ్యతిరేకంగా, చలపతి-విజయవర్ధన్‌ల ఉరిశిక్షకు వ్యతిరేకంగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ప్రతి ఉద్యమంలోను అగ్రభాగాన నిలిచారు.

వీ

రెవెన్యూ లోటు	లోటు (రు.కోట్లలో)
2000-01	3595
2001-02	2880
2002-03	3320
2003-04	2428

'గాంధీ దృష్టిలో ఆదర్శ సమాజమనేది కుల రహిత, వర్గ రహిత సమాజం. అక్కడ సమాంతర విభేదాలే తప్ప నిచ్చెనమెట్ల విభేదాలు ఉండవు. ఎక్కువ తక్కువ వ్యత్యాసాలుండవు' అని ఒకపక్క గాంధీని కోట్ చేస్తూ రెండో పక్క కాపులను బిసిలో చేర్చడానికి ఒక కమీషన్‌ను నియమిస్తున్నామని, బ్రాహ్మణుల సంక్షేమానికి పథకాల కోసం బడ్జెట్‌లో కేటాయింపు చేస్తున్నామని ప్రకటించడమేమిటి? అధికారంలోకి వచ్చి రెండు నెలలవ్వలేదు, 'బెల్ట్ షాపుల మూసివేత అమలు జరుప బడుతోందని' అంటే నమ్మాలా? 'వంద రోజుల కార్యాచరణ' ఇది మోడీని కాపీ కొట్టడం కాదా? వివిధ లక్ష్యాల సాధనకు ఏడు మిషన్ల ఏర్పాటు చేస్తున్నామని, వీటన్నిటికీ చంద్రబాబే అధ్యక్షత వహిస్తారని ఆర్థిక మంత్రి ఉవాచ... ఈ కమిటీల్లో శాసన సభలో ఉన్న ప్రతిపక్షాలకు స్థానం ఉంటుందా? ఆయా రంగాల్లో ప్రత్యేక నిపుణత సంపాదించుకున్న నిష్ణాతులుంటారా? లేకపోతే పార్టీలో ముఖ్యమంత్రి చెప్పినదే వేదం. పార్టీ సభ్యులు ఒకే అంటారు, ఆర్థిక మంత్రి అంటారు 50 పేజీల (జిరాక్స్) నిండా 'పరిశీలిస్తున్నది', 'కట్టుబడి ఉంది', 'యోచిస్తున్నది', 'మా ధ్యేయం', 'కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నాం', ఏర్పాటు చేయనున్నాం', మా ముఖ్య లక్ష్యాల్లో ఒకటి', 'చేపడుతున్నది', సంకల్పించింది' లాంటి ప్రయోగాలు ఉపన్యాసం పొడవునా ఉన్నాయి. ఈ పద ప్రయోగాల అర్థమేమిటో చెప్పి పాఠకుల విజ్ఞానాన్ని కించపరచుకోలేదు. సబ్సిడీ బియ్యం 'తగిన ధరలకు' సరఫరా చేస్తారట, అంటే ఏమిటో ఆర్థిక మంత్రి వివరిస్తారా? పంచాయితీరాజ్ ఏ విషయంలో ఏం చేయాలనుకుంటున్నారో చెప్పలేదు. రాజీవ్‌గాంధీ పాలనా కాలంలో నేరుగా నిధులు, ఉద్యోగులు, బాధ్యతలు బదిలీ చేసే రాజ్యాంగ చట్టం సవరణ చేశారు. ఎంత వరకు అమలు పరిచారో కాంగ్రెస్ చెప్పనూ లేదు, తెలుగుదేశం చెప్పలేదు.

ప్రభుత్వ - ప్రైవేట్ సమ్మిళితంగా అమలు పరిచే కార్యక్రమం రాష్ట్రంలో అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్టు రంగంలో మచిలీపట్నం రేవు నిర్మాణంలో ప్రవేశపెడుతున్నామనే ప్రకటన ఇటీవలి వరకు దేశంలో కాంగ్రెస్ శ్రీకారం చుట్టగా, మోడీ పరిపాలనలో కొనసాగిస్తుండగా చంద్రబాబు ఆ బాటనే పట్టారు.

రానున్న కాలంలో రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయబడుతుందని మరో ప్రకటన రానున్న కాలంలో అంటే విజన్ 2030లోనా? చీకటి గ్రామాల్లో నివసిస్తున్న రైతులు కరెంట్ కోసం అంగలార్చుతున్న సమయంలో ఉచితంగాను, తొమ్మిది గంటల సరఫరా చేయనున్నానడం ఇది రైతులతో క్రూర పరిహాసం కాక ఏమిటి? పరిశ్రమలకు 24×7 విద్యుత్ అందించడం జరుగుతుంది అనే హామీ కూడా అదే కోవలోకి వస్తుంది.

చంద్రబాబు, మీరు ఎక్కడ, ఎప్పుడు మాట్లాడినా, అదిచేస్తా, ఇది చేస్తా అని కొత్త వాగ్దానాలలో ప్రజలు తడిసి ముద్దయిపోతున్నారు. ఇప్పటి వరకు చేసిన, ముఖ్యంగా రైతుల రుణమాఫీ అమలు మీద కేంద్రీకరించండి. రైతులు బాగుపడితేనే రాష్ట్రం, దేశం బాగుపడుతుంది.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

పెట్రో కెమికల్ కారిడార్ వినాశనం

ఆంధ్రప్రదేశ్ తీరంలో పెట్రో కెమికల్ బహుళజాతి సంస్థల వల్ల వేలాది ఎకరాల పంట భూములు నిరుపయోగంగా మారి, రైతులూ, మత్స్యకారులూ నిర్వాసితులయ్యే ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలని అంటున్నారు **జి. రఘురామ్**

కోస్తా తీరం వెంబడి మరో అభివృద్ధి పిడుగు పడబోతోంది. విశాఖపట్నం నుండి కాకినాడ దాక 640 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఏడు విశాఖ, మూడు తూర్పుగోదావరి జిల్లాలలోని 110 రెవెన్యూ గ్రామాలు, ఈ అభివృద్ధి పిడుగుకి లక్ష్యం కాబోతున్నాయి. వీటితో పాటు ఇక్కడున్న రక్షిత అడవులు, మంచి నీటి వనరులు, బురద నేలలు, ఉప్పు నీటి కయ్యలు, చెరువులు, అక్కడి చేపలు, భూగర్భ జలాలు, సముద్ర తీరాలు – వాటిలోని మత్స్య సంపద, పచ్చని పొలాలు, పాడి పరిశ్రమ, పశువులూ కోళ్లు, పర్యావరణం, ప్రకృతి సంపద, ప్రజల ఆరోగ్యం, సంప్రదాయ ఉత్పత్తి దాని ఆర్థిక వ్యవస్థ సర్వం ఈ అభివృద్ధి పిడుగు బారినపడి నాశనం కాబోతున్నాయి. అయితే ఇది వెదజల్లే మెరుపులో రాజకీయ నాయకులు, వారి కాంట్రాక్టర్లు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, లంచగొండి అధికారులు, వీరందరి కంటె ఎక్కువగా అమెరికా, దాని బహుళజాతి కంపెనీలు, లక్షల కోట్ల డాలర్ల, రూపాయల లాభాలకి పడగలెత్తబోతున్నాయి. ఇంతకీ మనపై పడబోయే ఈ అభివృద్ధి పిడుగు పేరు పిసిపిఐఆర్ అంటే పెట్రోలియం, కెమికల్, పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్.

పిసిపిఐఆర్ అంటే ఏమిటి?

క్రూడాయిల్, పెట్రోల్, సహజ వాయువులను శుద్ధి చేసేటపుడు కొన్ని వందల రసాయనాలూ, కాలుష్యకారక మలినాలూ వెలువడతాయి. వీటి నుండి మనం నిత్యజీవితంలో వాడే కొన్ని వందల ఉత్పత్తులను తయారు చేస్తారు. ఉదాహరణకు క్రూడాయిల్‌ని శుద్ధి చేసే సమయంలో వెలువడే టోలిన్, ప్రొపిలిన్, బెంజిన్, ఇథలిన్ లాంటి పెట్రో రసాయనాల నుండి ప్లాస్టిక్‌లు, సోపులు, పరిమళాలు, ఫార్మా మందులు, పాలిమర్ దారాలు, కార్ల విడి భాగాలు, సెల్‌ఫోన్ కంప్యూటర్‌ల విడిభాగాలు, పిల్లల ఆట వస్తువులు, ఆఖరికి ఆధునిక విమానం బోయింగ్ 787 డ్రీమ్ లైనర్‌లో 50 శాతం పరికరాలు పెట్రోకెమికల్స్ నుండి తయారైనవే. నేటి ఆధునిక మానవ జీవితంలో 50 శాతం ఉత్పత్తులు పెట్రోకెమికల్స్ నుండి తయారైనవే అంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

పైన చెప్పిన ఉత్పత్తులన్నీ అనుకున్నంత తేలికగా రావు. వీటిని రాబట్టడానికి తీరం వెంబడి డజన్ల కొద్దీ పెట్రో శుద్ధి కర్మాగారాలు, రసాయనిక కర్మాగారాలు, మందుల కంపెనీలు, ఎరువుల కంపెనీలు నిర్మిస్తారు. క్రూడాయిల్‌ని, పెట్రోల్, ప్రమాదకర రసాయన ద్రవాలను సరఫరా చేయడానికి వందల కిలో మీటర్ల పైపు లైనులు నిర్మిస్తారు. ఈ రసాయనాల నిలువకోసం, క్రూడాయిల్, సహజవాయువు నిలువకోసం భారీ ట్యాంకులు నిర్మిస్తారు. నిత్యం వీటి నుండి క్రూడాయిల్, సహజ వాయువులు, విష వాయువులు లీకులవుతూనే ఉంటాయి. వీటి కోసమే తీరం వెంబడి థర్మల్ పవర్ స్టేషన్‌లు నిర్మించి వాటికి లక్షల టన్నుల బొగ్గును లక్షల హెక్టర్ల అడవుల్ని నాశనం చేసి తరలిస్తారు. 300 గ్రామాలను నేల మట్టం చేసి మూడు లక్షల మంది గిరిజనులను నిర్వాసితులను చేసి నిర్మిస్తున్న పోలవరం లక్ష్యం ఈ కంపెనీలకీ వాటి రసాయనాలను శుభ్రపరచడానికీ కావలసిన కోట్ల గ్యాలన్‌ల నీటిని ప్రవహింప చేయడమే. ఇది మాత్రమే కాదు ఈ కంపెనీల నీటిదాహాన్ని తీర్చడానికి వేల అడుగుల లోతుల్లో బోర్లు వేసి భూగర్భ జలాలను ఆవిరి చేస్తారు.

క్రూడాయిల్‌ని శుద్ధి చేసేటప్పుడు సల్ఫర్ ఆక్సైడ్, లెడ్, క్రోమియం, పాదరసం, ఫినాల్, ఆస్‌బెస్టాస్, ఆర్సనిక్‌లు వెలువడ తాయి. వీటితో పాటు తక్కువ రకం అణుధార్మిక పదార్థాలు, నైట్రోజన్ ద్రావణాలు వెలువడి నేలను, గాలిని ఆమ్లత్వానికి గురి చేస్తాయి. దీనివల్ల కాల్షియం, మాంగనీస్ వంటి లోహాలు నేలలో బాగా తగ్గిపోయి మొక్కలకీ, జంతువులకీ, చివరికి మనుషులకీ కూడా శరీరంలో లవణాల శాతం పడిపోయి అనేక రోగాలకు గురవుతారు. నదులు, భూగర్భ జలాలు, చిత్తడి నేలలు, పంట పొలాలు, మంచి నీటి కయ్యలు ఆమ్ల గాఢతతో నిండిపోతాయి. పశువులలో వంధ్యత్వం ఏర్పడుతుంది. పాల దిగుబడి పడిపోతుంది. కూరగాయలలో విష రసాయనాలు, భార లోహాలు చేరుతాయి. సల్ఫర్ ఆమ్ల గాఢత వల్ల ఊపిరితిత్తులు చిల్లులు పడడం, ఆస్తమా క్యాన్సర్, వంధ్యత్వం, రక్తహీనత, గర్భస్రావాలు జరగడం, గర్భస్థ శిశువులలో రక్తహీనత లాంటి ఎన్నో రకాల జబ్బులకు తీర ప్రాంత ప్రజలు గురవుతారు. ఇవన్నీ తెలిసి కూడా ఈ ప్రభుత్వాలు మన భూములను లాక్కొని, మన నదీ జలాలను, సముద్ర తీరాన్ని, ప్రకృతి వనరుల్ని, పర్యావరణాన్ని బహుళజాతి కంపెనీలకూ, వాటి వాటాదారులకూ దోచిపెట్టి, వీళ్ల లంచాలు మరిగి, మనకు వినాశనాన్ని మిగిల్చి ఇదే అభివృద్ధిని మనల్ని నమ్మమంటున్నారు.

ఉద్యోగాలు

పిసిపిఐఆర్ వల్ల ప్రైమరీసెక్టార్‌లో 57,000, ద్వితీయ విభాగంలో 38,000, తృతీయ విభాగంలో 42,000 ఉద్యోగాలు, మొత్తం కలిపి 1,37,000 ఉద్యోగాలు వస్తాయనీ, 2031 కల్లా ఇవే 70,629–2,89,635–2,80,379గా మారి మొత్తంకలిపి 6,40,643 ఉద్యోగాలుగా మారతాయని ప్రభుత్వం ఊదర కొడుతోంది. ఈ కాకి లెక్కల్ని మనం నమ్మలేం. మచ్చుకి కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు ఎంత భూమిని ఆక్రమించాయో, ఎన్ని ఉద్యోగాలిచ్చాయో ఒకసారి పరిశీలిద్దాం.

విశాఖ జిల్లాలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం రైతుల నుంచి 33,000 ఎకరాలు సేకరించారు. కానీ రైతులలో వేలాది మందికి ఉద్యోగాలు లేవు. స్టీల్ ప్లాంట్‌లో సుమారు 16,000 వేల ఉద్యోగాలలో 10 నుండి 12 వేల ఉద్యోగాలు, నాన్ ఎగ్జిక్యూటివ్స్ అయితే 4 నుండి 6 వేల మంది ఎగ్జిక్యూటివ్స్. వీళ్లలో భూములు కోల్పోయిన రైతులు ఎవరూ లేరు. మరి వీళ్లూ వీళ్ల కొడుకులు ఎక్కడున్నారు? 20 వేల మంది కాంట్రాక్ట్ కూలీలలో ఉన్నారు. ఇప్పటికీ ఆ రికార్డులు పట్టుకొని స్టీల్‌ప్లాంట్ చుట్టూ తిరుగుతున్న వేలాది మంది నిరుద్యోగుల్లో ఉన్నారు. మరో పక్క స్టీల్ ప్లాంట్ విస్తరిస్తోంది. ఆధునీకరించబడుతోంది. ఏటేటా ఉత్పత్తి పెరుగుతోంది. లాభాలు పెరుగుతున్నాయి. ఐనా రోజురోజుకీ ఉద్యోగాలు తగ్గుతున్నాయి.

మరో ప్రభుత్వరంగ సంస్థ విశాఖ పోర్టు ఇందుకు విరుద్ధంగా ఏమీ లేదు. ఒకానొకప్పుడు 9000 పైగా ఉన్న ఉద్యోగుల సంఖ్య, ఈనాడు 6669కి పడిపోయింది. వేల ఉద్యోగాలు పనిదినాలు ప్రైవేట్ పరమవు తున్నాయి కాంట్రాక్టు ఉద్యోగులు 20 వేలకి పైగా పెరిగి పోతున్నారు. మరో పక్క ఆధునికీకరణ, విస్తరణ పరుగులు తీస్తున్నాయి. సంవత్సరానికి 700 కోట్ల రెవెన్యూ సంపాదిస్తూ, విశాఖ మొత్తానికీ కాలుష్యాన్ని వెదజల్లుతూ విస్తరిస్తోంది. మరో పక్క రాను రానూ స్థిర ఉద్యోగుల సంఖ్య తగ్గించేస్తోంది.

ప్రజలకి బాసటగా నిలవాల్సిన ప్రభుత్వ రంగం ఇలా ఉంటే, ప్రైవేట్ రంగం ఇంత కన్నా ఘోరంగా ఉంది. 1989లో స్థాపించబడ్డ అరవిందో ఫార్మా కంపెనీ శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో కారు చౌకగా వందల ఎకరాల భూమిని ప్రభుత్వం నుండి అప్పనంగా కొట్టేసి బల్క్ డ్రగ్స్ మానుఫాక్చరింగ్ యూనిట్‌ని స్థాపించింది. 2000 కల్లా దేశంలోని అతిపెద్ద కంపెనీల్లో ఒకటిగా పెరిగింది. వేలకోట్ల రూపాయల లాభాలతో పరుగుతీస్తోంది. దీనిలో ఉన్న మొత్తం పర్మనెంట్ ఉద్యోగులు 2300 అయితే, కాంట్రాక్ట్ ఉద్యోగస్తులు 3700. పర్మనెంట్ ఉద్యోగులను బాగా తగ్గించి అప్రెంటిస్‌లతోటీ, కాంట్రాక్ట్ కార్మికులతోటీ బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేసి అంతర్జాతీయంగా వేల కోట్ల రూపాయల లాభాలను ఆర్జిస్తోంది.

మన భూములనూ, పంట పొలాలనూ లాక్కుంటారు. మన శ్రమనూ, వనరుల్నీ దోచుకుంటారు. గుప్పెడు ఉద్యోగాలుండవు. వేల కోట్ల లాభాలను ఆర్జిస్తారు. మనకి పర్యావరణ కాలుష్యాన్నీ పేదరికాన్నీ మిగిల్చి ఇదే అభివృద్ధి అని ప్రచారం చేస్తారు. ఒక్క అరబిందో మాత్రమే కాదు. హెటిరో, నాగార్జున, దివీస్ లాంటి అనేక ఫార్మా కంపెనీలలో ఇదే పరిస్థితి. వేల ఎకరాల ప్రభుత్వ ప్రైవేట్ భూముల్ని ఆక్రమిస్తారు. స్థానిక వనరుల్ని సంప్రదాయ ఆర్థిక, సామాజిక జీవనాన్ని నాశనం చేసి వాళ్లు వేల కోట్ల డాలర్లని ఆర్జించి, మనకి ప్రకృతి వినాశనాన్నీ, పర్యావరణ కాలుష్యాన్నీ, నిరుద్యోగాన్నీ అభద్రతనీ పేదరికాన్నీ మిగిల్చి దీన్నే అభివృద్ధని ప్రచారం చేస్తున్నారు.

పిసిపిఐఆర్ కోసం వెచ్చించే భూమి

పిసిపిఐఆర్‌వల్ల 1.6 లక్షల ఎకరాల పంట భూమి కబళించేయ బడుతుంది. 2031 కల్లా దీంట్లో 60,571 ఎకరాల భూమిని పిసిపిఐఆర్ అధీనంలోకి తీసుకువచ్చి దాంట్లో పరిశ్రమలు నిర్మిస్తారు. వీటితో పాటు ఓడరేవులు, విమానాశ్రయాలు, హెలీపాడ్‌లు, హైవేలు నిర్మిస్తారు. దీనివల్ల సారవంతమైన కొబ్బరి, జీడిమామిడి, సరుగుడు, చెరుకు తోటలూ, సంవత్సరానికి రెండు పంటలు పండే వరి పొలాలు, వేల ఎకరాల కూరగాయ తోటలు నాశనం కానున్నాయి. అంటే సుమారు 58,000 ఎకరాల పంట భూమి ప్రత్యక్షంగా బీడు కాబోతోంది. మిగిలింది టౌన్‌షిప్‌లకు కేటాయిస్తారు. ప్రస్తుతం పిసిపిఐఆర్ నిర్మాణానికి 20,000 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే మొత్తం ప్రాజెక్టుకి 20 సంవత్సరాలలో వెచ్చించే వ్యయం 3 లక్షల కోట్లు. ఇది అంచనా మాత్రమే. ఇదంతా ప్రజా కష్టార్జితం అనే విషయాన్ని మర్చిపోకూడదు.

మత్స్యసంపద మత్స్యకారుల పరిస్థితి

కోస్తాంధ్రలో తొమ్మిది రెవెన్యూ మండలాలలో సుమారు 1,30,000 మంది మత్స్యకారులు 39,000 పడవలతో సముద్ర జలాల్లో వేట కొనసాగిస్తారు. ఇలాంటి గ్రామాలు 450 దాకా ఉన్నాయి. వీరంతా సంవత్సరానికి 1,20,000 టన్నుల నుండి 1,40,000 టన్నుల దాకా చేపలు పడతారు. లక్షల డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి అందిస్తున్న ఆర్థిక వ్యవస్థ ఇది. ఇప్పుడీ సముద్ర తీరమంతా రాబోయేకాలంలో పెట్రో కంపెనీల వ్యర్థాలతోటి, చమురు గొట్టాల లీకేజీల తోటి కాలుష్యమై చేపల దిగుబడి తగ్గిపోయి మత్స్యకారుల జీవనం కుదేలవబోతోంది. ఆ మేరకు విదేశీ మారక ద్రవ్యాన్ని కూడా మనం కోల్పోతాం.

పిసిపిఐఆర్‌ల నీటి వినియోగం

పెట్రో కెమికల్, క్రిమి సంహారక, ఎరువుల, మందుల పరిశ్రమలు, పాలిమర్, ఫార్మా పరిశ్రమలు రసాయనాలను శుద్ధి చేయడం కోసం ఉపయోగించే నీటికి అంతుండదు. విష రసాయనాలను శుద్ధి చేయడం కోసం ఇవి నదులనీ, వేల అడుగుల లోతులలో ఉన్న భూగర్భ జలాలనూ తాగేస్తాయి. తిరిగి ఈ జలాలను కాలుష్యాలతో బయటకి పంపి నదులనీ, సముద్రాలనీ, భూగర్భ జలాలనీ, పచ్చని పొలాలనూ నాశనం చేస్తాయి. ప్రస్తుతం గుజరాత్‌లోని పిసిపిఐఆర్‌కి రోజుకి 37,800 కోట్ల లీటర్ల నీటిని నర్మదా నది నుండి సరఫరా చేస్తున్నారు. తాగునీటి కోసం, వ్యవసాయం కోసం అని చెప్పి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టి వేలాది మంది రైతులను నిరాశ్రయులను చేసి కట్టిన నర్మదా ప్రాజెక్టు ఇప్పుడు ప్రకృతిని నాశనం చేసే బహుళ జాతి కంపెనీలకి ఉపయోగపడుతోంది. రాబోయే కాలంలో ఈ నది నుండి రోజుకి వందల వేల కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేయాలని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే రకంగా కేరళ, తమిళనాడు, ఆంధ్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని నదీ జలాలను అక్కడి పిసిపిఐఆర్‌లకు తరలించనున్నారు. జాతికే తలమానికమని వందల గ్రామాలలోని లక్షలాది గిరిజనులని తరిమేసి తూర్పు కనుమల అడవులను నాశనం చేసి గోదావరిపై కట్టబోతున్న పోలవరం ప్రాజెక్టు నీళ్లు మన గొంతుక దాహాన్ని తీర్చకపోయినా, పొలాలను తడపకపోయినా రాబోయే పిసిపిఐఆర్, పైపులైన్‌లలో పరవళ్లు తొక్కుతూ ప్రవహించి విష రసాయనాలతో తీరాన్నంతా తడపనుంది.

ఎవరి కోసం ఈ పిసిపిఐఆర్?

150 సంవత్సరాల క్రితమే పెట్రో కెమికల్ పరిశ్రమని అమెరికా, కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలు ఒక ప్రధానరంగంగా ఎంచుకున్నాయి. ఇప్పుడు చైనా, కొరియా కొత్తగా ఈ రంగంలో కాళ్లూని లక్షల కోట్ల డాలర్లను ఆర్జిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా లక్షల కోట్ల డాలర్లతో విస్తరించిన ఈ రంగంలో ఒక్క అమెరికా వాటాయే 2,50,000 కోట్ల డాలర్లు. అమెరికా జాతీయ ఆదాయంలో 7.5 శాతం ఆదాయం కేవలం పెట్రో కెమికల్స్ రంగం నుండే వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 90 లక్షల మంది అమెరికన్ ఉద్యోగులు ఈ రంగంలోనే ఉద్యోగాలు చేస్తున్నారు. కేవలం అమెరికాలో పెట్రో కెమికల్ పరిశ్రమలు 8,50,000 ఉద్యోగాలు ప్రత్యక్షంగానూ, 45,00,000 ఉద్యోగాలు పరోక్షంగానూ కల్పిస్తున్నాయి. సంవత్సరానికి ప్రపంచ వ్యాప్త పెట్రో కెమికల్స్ ఉత్పత్తి నాలుగు లక్షల కోట్ల డాలర్లు అయితే దీంట్లో అమెరికా వాటా సమారుగా లక్ష కోట్ల డాలర్లు.

అమెరికాలో ప్రతి వ్యక్తి సంవత్సరానికి 58 కేజీల పెట్రో కెమికల్స్ ఉత్పత్తులను వాడుతుంటే యూరప్‌లోని ప్రతి వ్యక్తి 43 కేజీల పెట్రో కెమికల్స్ ఉత్పత్తులను వాడుతున్నాడు. ఇంతటి మార్కెట్ ఉన్నా 2015 కల్లా అక్కడున్న 43 అతి పెద్ద బహుళజాతి కంపెనీల్లో 14 కంపెనీలు మూసుకుపోతున్నాయి. ఎందుకని? 1) అక్కడి పర్యావరణ ఉద్యమాల వల్ల, చట్టాల వల్ల, ప్రజలు కంపెనీలపై వేసే పర్యావరణ కేసుల వల్ల కంపెనీలు మూసేస్తున్నారు. 2) అక్కడ ఇస్తున్న జీతాల్లో పదోవంతు జీతాలు చెల్లిస్తే ఆసియా దేశాల్లో రెండింతల ఉత్పత్తి సాధించచ్చు. అందుకే 32 వేల చదరపు కిలో మీటర్ల భారత సముద్ర తీరం, భారత పారిశ్రామిక వ్యవస్థ, భారతదేశ కార్మికులు కారుచౌకగా బహుళ జాతి కంపెనీలకు కనబడుతున్నాయి. పర్యావరణ నాశనం, వనరుల దోపిడీ, దేశీయ ఆర్థిక వ్యవస్థ కుదేలవడం మన వంతైతే, సుస్థిర పర్యావరణం, నిలకడగా సామ్రాజ్యవాద దోపిడీ, చౌకగా పెట్రో ఉత్పత్తుల దిగుమతి, సుఖమయ జీవనం వాళ్లవంతవుతోంది.

ప్రపంచ పెట్రో కెమికల్స్ పరిశ్రమలను డౌ కెమికల్స్, డ్యూపాంట్, ఎక్సాన్, షెల్ బ్రిటిష్ కెమికల్స్, మోబిల్ కార్పొరేషన్, సౌదీ బేసిన్ ఇండస్ట్రీస్, టైటాన్ లాంటి బహుళ జాతి కంపెనీలు శాసిస్తున్నాయి. ఏ దేశంలోనైనా పిసిపిఐఆర్ నిర్మాణ పథక రచనను లి అసెస్‌మెంట్ సౌతాఫ్రికా ప్రైవేట్ లిమిటెడ్, ఇండియా లీ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (కెనడా) చేస్తున్నాయి. ఈ రెండూ బహుళజాతి కంపెనీల అనుబంధ సంస్థలే. 2025–2032 కల్లా దేశంలోని క్రూడాయిల్, సహజ వాయువు నిక్షేపాలు అడుగంటి పోతాయని శాస్త్రజ్ఞుల అంచనా. అప్పుడు బహుళ జాతి కంపెనీలు మన తీరాన్నీ, ప్రకృతిని నాశనం చేసి వీలైనంత లాభాలు గడించి వెళ్లిపోతే మనకు మిగిలేది అప్పుల భారం, పర్యావరణ వినాశనం.

మనకే ఎందుకు ఈ వినాశకర అభివృద్ధి?

యూరప్, అమెరికా దేశాలలోని ప్రజలు పారిశ్రామిక విప్లవం నుండి ఈనాటి వరకూ దారుణమైన పర్యావరణ కాలుష్యాన్ని చవి చూశారు. ఈ కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి గత 30 ఏళ్లుగా అక్కడ అనేక పర్యావరణ పోరాటాలు జరుగుతున్నాయి. వీటి ప్రభావం వల్ల అక్కడున్న పటిష్టమైన చట్టాల వల్ల రాబోయే 30 ఏళ్లలో పెట్రో కెమికల్ కంపెనీలు, వాటి ఉత్పత్తి, వాటి వాడకం తగ్గిపోనుంది. ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి అక్కడి కంపెనీలు ఆసియా దేశాలలో తమ పెట్టుబడులనూ, ఉత్పత్తులనూ పెంచుతున్నాయి. ఇంతేకాక అక్కడి ప్రజల జీవనస్థాయి ఎక్కువ, ఇక్కడ తక్కువ. అక్కడ జీతాలెక్కువ, ఇక్కడ బాగా తక్కువ, అక్కడి ప్రజల ప్రాణాలు ఎంతో విలువగా చూస్తారు. ఇక్కడ వేల మంది మరణించినా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టుండదు. అందుకు భోపాల్ మన కళ్ల ముందు మెదిలే సజీవ ఉదాహరణ. అమెరికాలో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి నష్టాన్ని కలుగ చేస్తోందని 100 కోట్ల డాలర్ల పర్యావరణ కేసులు ఎదుర్కొంటున్న బ్రిటిష్ పెట్రోల్ కంపెనీ 250 కోట్ల డాలర్లకి తన పెట్రో శుద్ధి కర్మాగారాన్ని అమ్మేసుకుని ఆ డబ్బుతో ఆసియా దేశాల మీద పడుతోంది. భారత పెట్రో రసాయన పరిశ్రమలలో 49 శాతం వాటా 20 పేరొందిన బహుళ జాతి కంపెనీల చేతులలో ఉంటే 51 శాతం వాటా 680 చిన్న చిన్న దేశీయ పరిశ్రమల చేతుల్లో ఉంది.

ఇతర దేశాల పిసిపిఐఆర్‌ల అనుభవాలు

నైజీరియా : ఆఫ్రికా ఖండంలో ఆయిల్ ఉత్పత్తుల్లో నైజీరియాది అగ్రస్థానం. అమెరికా తన అవసరాలలో 80 శాతం క్రూడాయిల్ ఇక్కడి నుండే దిగుమతి చేసుకుంటోంది. 1590 చమురు క్షేత్రాలతోటి, వేల కిలో మీటర్లు విస్తరించిన 270 పైపులైన్‌లతోటి బహుళజాతి పెట్రోలియం సంస్థలు నైజీరియాని తూట్లు పొడిచేశాయి. 1958 నుంచి ఇప్పటి వరకూ అనేక ప్రమాదాలలో 25 వందల కోట్ల క్యూబిక్ మీటర్ల సహజ వాయువు బావుల నుండి లీకయి వాతావరణాన్ని కలుషితం చేసింది. 1976 నుంచీ 2011 దాకా 3203 సార్లు పెట్రో కెమికల్ పైపు లైనులు లీకై 70 వేల చదరపు కిలోమీటర్‌ల నైజీరియాలో 50 వేల కిలోమీటర్ల భూమిని పెట్రో రసాయనాల తోటి క్రూడాయిల్ తోటి నింపేశాయి. 2370 చదరపు కిలోమీటర్ల సముద్ర తీరంతో పచ్చటి అరణ్యాలతో, పాడి పంటలతో 8600 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో మంచి నీటితో కప్పబడి నైజీరియా జీవన వైవిధ్యంలో ప్రపంచంలో 2వ స్థానం ఆక్రమిస్తోంది. అయితే 1950 నుంచి బహుళ జాతి కంపెనీల ప్రకృతి విధ్వంసంతో క్రూడాయిల్ బురదతో నిండిపోయి 50 వేల చదరపు కిలోమీటర్ల చిత్తడి నేలలూ, అడవులు నాశనం అయ్యాయి. వేల కోట్ల డాలర్ల క్రూడాయిల్, పెట్రో కెమికల్ వ్యాపారం జరుగుతున్నప్పటికీ 70 శాతం ప్రజలు నిరుద్యోగంలోనూ 40 శాతం ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన బతుకుతున్నారు. ప్రజలు భూములు కోల్పోయి, నదులు కోల్పోయి పాడి పరిశ్రమలనూ, వ్యవసాయాన్నీ, సంప్రదాయ ఉత్పత్తులనూ కోల్పోయి అమెరికా ఇచ్చే డాలర్ల పైనే ఆధారపడుతున్నారు.

సౌతాఫ్రికా : సౌతాఫ్రికా సౌత్ దర్బన్, క్వాజులా నోబెల్ తీర ప్రాంతంలో రెండు పెద్ద పెద్ద పెట్రో శుద్ధి కర్మాగారాలు, పేపర్, ప్లాస్టిక్, రసాయన, క్రిమి సంహారక, ఎరువుల, పాలిమర్ తయారు కర్మాగారాలు లాంటి వన్నీ కలిపి 110 దాకా ఉన్నాయి. ఇదంతా ఒక పెద్ద పిసిపిఐఆర్. తమ భూములను కోల్పోయి, సముద్ర తీరాలు కలుషితమై, చేపల వనరులు కోల్పోయి సుమారు 2,60,000 మంది మత్స్య కార్మికులు తక్కువ రకం ఉద్యోగాలలోనూ, పారిశుద్ధ ఉద్యోగాలలో పని చేస్తుంటే

40,000 వేల మంది ఇతర దేశీయ సాంకేతిక నిపుణులు ముఖ్యంగా బ్రిటన్, అమెరికా, యూరప్ దేశాల వారు ఈ పిసిపిఐఆర్ లలో పని చేస్తున్నారు. వీళ్లకి విలాసవంతమైన టౌన్‌షిప్‌లు వాటిలో సకల సౌకర్యాలు అమరి ఉంటే దక్షిణాఫ్రికా వాసులు వాటి పక్కనే మురికి కూపాల లాంటి వాడలలో నివసిస్తున్నారు.

సౌతాఫ్రికా సౌత్ దర్బన్ గాలిలో సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించిన దాని కంటె 15 రెట్లు ఎక్కువుగా ఉంది. అందుకే ఈ ప్రాంతంలోని ప్రజలు ప్రపంచంతో పోలిస్తే 24 రెట్లు ఎక్కువగా రక్త కేన్సర్‌తో చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసింది.

బ్రెజిల్

దక్షిణ అమెరికా ఖండంలో వెనిజులా తరువాత అత్యధిక పెట్రో, పెట్రో కెమికల్స్‌ని ఉత్పత్తి చేస్తున్న దేశం బ్రెజిల్. 20వ శతాబ్దం మొదటి నుంచే అమెరికా, యూరప్ నుంచి వచ్చిన ప్రైవేట్ కంపెనీలు బ్రెజిల్‌లోని పెట్రోల్, సహజ వాయువుని దోచుకోవడం మొదలు పెట్టాయి. 1938లో బ్రెజిల్ ప్రజలు 'మనదేశం మన పెట్రోల్' అన్న నినాదంతో విదేశీ కంపెనీలను తరిమేశారు. మళ్లీ 1985–90ల కల్లా పరిస్థితి తిరగబడి మొత్తం పెట్రో రసాయన కంపెనీలు విదేశీ బహుళ జాతి కోరల్లో చిక్కుకున్నాయి. ఐఎంఎఫ్ ప్రపంచ బ్యాంక్ కనుసన్నల్లో బ్రిజిల్ ప్రభుత్వం ఒక చట్టం చేసింది. దీని పర్యవసానంగా మొత్తం కంపెనీలు బహుళజాతి సంస్థల వశమయ్యాయి. ఎలాంటి పర్యావరణ రక్షణ చర్యలు లేకుండా ప్రకృతి వనరులు యథేచ్ఛగా దోపిడికి గురయ్యాయి. పెట్రోబార్, షెల్ లాంటి కంపెనీలు వేల కోట్ల డాలర్లకి పడగలెత్తాయి. జాతీయోత్పత్తి, తలసరి ఆదాయం లెక్కలు పెరిగాయి. విదేశీ మారక ద్రవ్యం పెరిగింది. కానీ ప్రజల చేతుల్లో డాలర్లు లేవు. వారి జీవన స్థాయి పెరగలేదు. భూములు కోల్పోయారు. ఎప్పటికప్పుడు క్రూడాయిల్ లీకవుతోంది. తీర ప్రాంతం కాలుష్యంతో నిండి పోయింది. వేల టన్నుల చేపలు మరణిస్తున్నాయి. బ్రెజిల్ ఉత్తరాన అట్లాంటిక్ అడవి ఎండిపోయింది. చెట్లు వంధ్యమైపోయాయి. నదులలో, చిత్తడి నేలల్లో భూగర్భ జలాల్లో విష రసాయనాలు నిల్వ ఉండిపోయాయి.

ఐర్లాండ్ : ఐర్లాండ్‌లో 340 బహుళజాతి కంపెనీలు ఉంటే అందులో 160 పెట్రో కెమికల్, పాలిమర్ కంపెనీలు. ఇవి ఇక్కడ ప్రజలకు స్థిరమైన ఉద్యోగాలు ఇవ్వలేదు గాని స్థిరమైన తీవ్రమైన పర్యావరణ కాలుష్యాన్ని ఇచ్చాయి. ఇతర ఉత్పత్తి రంగాలను నాశనం చేశాయి. అమెరికాకు చెందిన 17 కంపెనీలు ప్రకృతి వనరులను కొల్లగొట్టి క్రూడాయిల్‌ని ఎగుమతి చేసి, ఐర్లాండ్‌కు నది జలాల కాలుష్యాన్ని అందచేశాయి. ప్రపంచంలో మందుల ఉత్పత్తిలో ఐర్లాండు పదో స్థానాన్ని ఆక్రమిస్తుంటే కాలుష్యంలో కూడా పదో స్థానాన్ని ఆక్రమిస్తోంది. రియాక్టర్ల పేలుళ్లు, పొలాల్లో వ్యర్థ రసాయనాల నిల్వలు, కూరగాయల్లో, ధాన్యపు గింజల్లో భార లోహాలు, పశువుల వంధ్యత్వం, స్త్రీలల్లో గర్భస్రావాలు, గర్భస్థ శివువుల్లో రక్తలేమిలాంటి వన్నీ బహుళ జాతి కంపెనీల ఇచ్చిన వరాలు. ప్రతి సంవత్సరం ఐర్లాండ్‌లో 20 వేల టన్నుల విష రసాయనాలు విడుదలవుతున్నాయి. ఇంతా చేస్తే అక్కడి మందుల కంపెనీల ఉద్యోగాలు 14,000 మాత్రమే.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజు పెట్రో శుద్ధి, పెట్రో కెమికల్ కర్మాగాల నుండి 2 కోట్ల లీటర్ల పెట్రోల్ లీకై వాతావరణాన్ని కలుషితం చేస్తోంది. ప్రతి సంవత్సరం 28,800 వందల కోట్ల లీటర్ల క్రూడాయిల్ సముద్రంలో ఒలికి నిర్జీవ ప్రాంతాలు ఏర్పడుతున్నాయి. దీనికంతటికీ పెట్రోలియం, పెట్రోకెమికల్ పరిశ్రమల, బహుళజాతి సంస్థల విధ్వంసకర ఉత్పత్తే కారణం.

లక్షల ఎకరాల పంట పొలాలను స్వాధీనపరుచుకుని మన సముద్రాలనీ, నదీ జలాలనీ నాశనం చేసి పర్యావరణాన్ని విష్యతుల్యం చేసి మన ప్రాణాలను హరించి వేసి బహుళజాతి కంపెనీలకు డాలర్ల వర్షాన్ని కురిపించే ఈ పిసిపిఐఆర్‌లు అవసరమా? మన ప్రాంతీయ ఆర్థిక వనరుల్ని నాశనం చేసి మన ఆర్థిక సామాజిక మనుగడ నుండి మనల్ని దూరం చేసి, మన జీవితాల్ని అభద్రతకి గురి చేసి వాళ్లిచ్చే చప్రాసి ఉద్యోగాల కోసం ఆధారపడడం మనకవసరమా?

ఈ పిసిపిఐఆర్‌ని తరిమికొట్టి మన ప్రాంతాలనీ, పర్యావరణాన్నీ, సముద్రజలాలనీ, పంట పొలాలనీ, నదులనీ, ప్రజలనీ కాపాడుకోవడానికి ఉద్యమించాల్సిన అవసరం ఎంతగానో ఉంది.

(రచయిత పౌరహక్కుల కార్యకర్త) వీ

రాబోయే సంచికలలో...

- **చేతి వృత్తుల్లో మార్పులు - వి. వెంకట్రావు**
- **చేయూత అందని చేనేత - సిలువేరు హరినాథ్**
- **పరిణతమైన సంక్షోభం - ఎన్.వి.ఎస్. నాగభూషణ్**
- **ఒడిశాలో పర్యావరణ మార్పు - దాని ప్రభావం - చక్రాబిసోయి**
- **ఆర్థిక అభివృద్ధిలో సహజ వనరుల పాత్ర - తడికమళ్ల శేఖర్**
- **ప్రపంచీకరణలో భారతీయ వ్యవసాయ రంగం - పోలం సైదులు**
- **తెలంగాణ పునర్నిర్మాణం - సామాజిక శాస్త్రాల అధ్యయనం - డా. అక్కెనపల్లి పున్నయ్య**
- **రాష్ట్రంలో కౌలురైతుల సమస్య - డి. రవీందర్**

చంద్రబాబు'సున్నితమైన' మనస్సు

***చంద్రబాబునాయుడికి రాష్ట్ర విభజనపై ఉన్న బాధ పోలవరం ప్రాజెక్టు వల్ల మునిగిపోతున్న ప్రజల మీద, వారు కోల్పోతున్న జీవన విధానం మీద ఎందుకు లేదో ప్రశ్నిస్తున్నారు* టంకశాల అశోక్**

పోలవరం నిర్మాణంలో దేశ రాజ్యాంగంతో సహా ఉల్లంఘనకు గురికాని చట్టం ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ ప్రాజెక్టు 'నిర్మాణం అవుతున్న తీరు బాధాకరంగా' ఏమీ లేదు.

నిర్మాణం వల్ల, అందుకోసం చట్టాలన్నింటి ఉల్లంఘనల వల్ల వందలాది గ్రామాలు, లక్షలాది మంది గిరిజనులు – ఇతర ప్రజలు, లక్షల ఎకరాల పంట భూములు, వేలాది ఎకరాల అడవులు, వాటిలోని కోట్ల కొద్ది జీవరాశులు, కొన్ని వేల మత్స్యకార కుటుంబాలు, వేలాది మంది దళితులు, సమూలంగా కొన్ని తెగల ఆదిమ సంస్కృతులు, ఉనికి ఏ విధంగా నాశనం కానున్నదీ పుంఖానుపుంఖాలుగా రచనలు, పరిశోధనా పత్రాలు వెలువడ్డాయి. అయినప్పటికీ, ప్రాజెక్టు నిర్మాణం ఎంతగానో నచ్చిన ఆయనకు, అది అమలవుతున్న 'తీరు' మాత్రం ఎటువంటి బాధను కలిగించడం లేదు.

ప్రాజెక్టు వల్ల లాభపడే తమ ప్రాంతపు రైతులు, పారిశ్రామిక వేత్తలు మనుసులో మెదులుతూ ఆయనకు చెప్పలేనంత ఆనందం కలుగుతుండ వచ్చు. కాని అందుకోసం అమాయక గిరిజనులు, మత్స్యకారులు, దళితుల జీవితాలు దేశంలోని మరే ప్రాజెక్టు విషయంలోనూ లేనంత పెద్ద సంఖ్యలో బలి అవుతుండడం, అడవులు, పర్యావరణం విధ్వంసం కానుండడంలోని తీరు మాత్రం బాధాకరంగా లేదు.

వారి కోసం ఆయన ఇంతవరకెప్పుడూ కనీసం మొసలి కన్నీళ్లు అయినా కార్చలేదు. రాష్ట్ర విభజన జరగడమే తగవు పోలవరం కోసం ఖమ్మం మండలాలను కలుపుకోవడం వంటి పనులు మహా వేగంగా జరిపించిన ఆయన, పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటింప చేసుకుని, ఇక ఆ పథకాన్ని 2019 నాటికి పూర్తి చేయగలమని ఆగస్టు 15న కర్నూలులో జరిగిన పతాకావిష్కరణ సమయంలో ప్రకటించారు. కాని ఆయన నోటివెంట ప్రాజెక్టు బాధితుల గురించి ఒక్క పదం అయినా బయటకు రాలేదు. ఎందుకంటే వారి బాధలు ఆయనకు బాధాకరంగా కన్పించలేదు. ఆ తీరులో తనకు అభ్యంతర కరమైనదేమీ లేదు.

తెలంగాణ ఏర్పడడానికి తాను వ్యతిరేకి కాకున్నా రాష్ట్ర విభజన జరిగిన తీరు బాధాకరంగా ఉందని ఇప్పటికి కొన్ని వందల సార్లు అన్న చంద్రబాబు ఆగస్టు 15న కర్నూలులో అదే మాట మరొక సారి చెప్పి ఎంతో చింతించారు. కాని, పోలవరం అవసరమైనందున నిర్మిస్తున్నామని, కాని ఆ నిర్మాణం జరుగుతున్న తీరు బాధాకరమని మాత్రం ఒక్కసారి కూడా పొరపాటునైనా అనలేదు. ఆయనకు రాజ్యాంగం సహా ప్రతి ఒక్క చట్టాన్ని బాహాటంగా ఉల్లంఘించడం గానీ, లక్షలాది మంది ప్రజలకు రకరకాలుగా వాటివల్లనున్న తీవ్ర నష్టాలు గానీ బాధకరమనిపించలేదు.

పోనీ ఇది చూడండి. పోలవరం నిర్వాసితుల కోసం ప్రకటించిన పునరావాస పథకం మొత్తం దేశంలోనే అత్యుత్తమమైనదని అన్నారు. నిజంగా అత్యుత్తమమా కాదా అట్లుంచుదాం. కాని ఏదో ఒకటి ప్రకటించినదైనా సజావుగా అమలవుతున్నదా? కావడం లేదని ఆ ప్రాంతానికి వెళ్లి చూసిన అందరూ చెపుతున్నదే. ఇది ఇప్పుడు కొత్తగా తలెత్తిన పరిస్థితి కాదు. ఏండ్ల తరబడినా మొదటి నుంచి అదే విధంగా జరుగుతున్నది. నిర్వాసితులను రకరకాలుగా మోసం చేస్తున్నారు. పునరావాస పథకాన్ని అనేక విధాలుగా పక్కదారి పట్టిస్తున్నారు. కనీసం ఆ ప్రకటించనదేదో సక్రమంగా అమలవుతుంటే అదొక పద్ధతిగా ఉండేది. కాని అందులోనూ పెద్ద ఎత్తున అక్రమాలున్నాయి. ఇది చంద్రబాబుకు తెలియదనగలమా? ఈ అక్రమాల గురించి బాధితులు కొన్నేళ్లుగా సాగిస్తున్న ఘోష ఆయన చెవిన పడలేదని చెప్పగలమా? అయినప్పటికీ ఈ తీరు ఏదీ ఆయనకు బాధాకరంగా లేదు. రాష్ట్ర విభజన అయిన తీరు మాత్రమే బాధాకరంగా ఉంది. ఆ మాట ఆయన కొన్ని వందల సార్లు అన్నారు.

ఇటువంటి వ్యక్తి బాధలోని నిజాయితీ ఏమిటో? ఆ వ్యక్తి నిజాయితీ ఏమిటీ? అసలు ఒక మానవ మాత్రునిగా తనకున్న మానవత్వం ఎంత? ఒక నాయకునిగా, పాలకునిగా ఆయన విశ్వసనీయత ఏమిటి?

చంద్రబాబుకు కావలసింది తన ప్రాంతపు రైతులు, ధనిక రైతులు, పారిశ్రామికులు, వ్యాపారులు, కొత్తగా రానున్న బయటి కంపెనీల వారు బాగుపడడం. ఇప్పటికే ఒకటో రెండో పంటలు తీసేవారికి మరొక పంట అవకాశం లభించడం. అందులో ఆయనకు ఎక్కడలేని సంతోషం ఉంది. అందుకోసం గిరిజనులు, దళితులు, మత్స్యకారులు, సాధారణ ప్రజలు, వారితో పాటు అడవులు, జంతు జాలాల, పంట భూములు అన్నీ కొరగాకుండా పోయినా సంతోషమే తప్ప బాధ ఏమీ లేదు.

పునరావాస పథకాలు ఎంత గందరగోళంగా సాగుతున్నా విచారం లేదు. కనీసం మొసలి కన్నీళ్లయినా కార్చడు ఆ మహానాయకుడు.

ఒకసారి ఉల్లంఘనల తీరును గమనించండి. ప్రాజెక్టు నిర్మాణంలో రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు, ఆర్టికల్ 338(9) పంచాయితీ రాజ్ (పెసా) చట్టాలు కేంద్రానివి, రాష్ట్రానివి, పునరావాస నియమాలు కేంద్రానివి, రాష్ట్రానివి, జాతీయ గిరిజన విధానం (ముసాయిదా), 2006, భూసేకరణ, పునరావాస చట్టం, 2013, ఏజెన్సీ చట్టాలు – ఇలా ప్రతి ఒక్కటీ ఉల్లంఘిస్తున్నారు. యథేచ్ఛగా, బాహాటంగా.

భూసేకరణకు ముందు గ్రామసభల తీర్మానం తప్పని సరి అని చట్టం చెప్పుతున్నది. కాని ఆ పని చేయకపోగా తీర్మానాలు జరిగినట్లు అసత్యపు రికార్డులు సృష్టించారు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అత్యధిక పంచాయితీలు చేసిన తీర్మానాలను గాలికి వదిలారు. నిరసన ప్రకటించిన వారిపై పోలీసులతో బల ప్రయోగం చేయించారు. చివరకు అతిహీనమైన రీతిలో కొందరిపై రాజద్రోహం వంటి తీవ్రమైన కేసులు మోపి జైళ్లలో తోశారు. ఈ తీరు ఏదీ చంద్రబాబుకు బాధాకరంగా తోచలేదు.

షెడ్యూల్డ్ ప్రాంతాలలోని భూములను గిరిజనేతరులు ఖరీదు చేయడం రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం. అయినప్పటికీ వేలకు వేల ఎకరాలను గిరిజనేతరులు ఆక్రమించగా, అటువంటి ఆక్రమణలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన పద్ధతిలో ఆ భూములను గిరిజనేతరుల నుంచి కొన్నారు. కొంటున్నారు. ఇది టిడిపి అధ్యక్షునికి బాధాకరం కాలేదు.

ప్రాజెక్టు వద్ద స్టిల్‌వే పనులను నిలిపివేయాలని సాక్ష్యాత్తూ సుప్రీంకోర్టు ఆదేశించింది. కాని ప్రభుత్వం, కాంట్రాక్టర్లు కలిసి ఒకే ఒక రోజు పనులు ఆపారు. మరునాటి నుంచే పగలు ఆపి రాత్రుళ్లు కొనసాగించారు. ఇది ముఖ్యమంత్రికి బాధగా తోచలేదు. గిరిజనేతరుల నుంచి ప్రభుత్వం సీలింగ్ భూములు, బంజర్లు కూడా వేల ఎకరాలు కొని వారిని లక్షాధికారులు చేస్తున్నది. అయినా చంద్రబాబు ఎన్నడూ బాధ వ్యక్తపరచలేదు. నిర్వాసితులకు తిరిగి షెడ్యూల్డ్ ప్రాంతంలోనే పునరావాసం కల్పించాలని, లేనట్లయితే ఆ గిరిజనులకు ఉండే రాజ్యాంగపరమైన హక్కులు పోతాయని చట్టాలు నిర్దేశిస్తున్నాయి. అయినా పలువురిని బయట స్థిరపరచ చూస్తున్నారు. ఆ విధంగా కొన్ని కాలనీలు కూడా కట్టారు. అనగా వారికి ఇప్పటి తరంలోనే గాక రానున్న తరాలలో కూడా ఇక ఎప్పటికీ షెడ్యూల్డ్ ప్రాంత హక్కులు ఉండవన్నమాట. ఇది ముఖ్యమంత్రికి బాధాకరంగా లేదు.

భూమికి బదులు భూమి ఇవ్వడమన్నది అరుదుగా మాత్రమే జరుగుతున్నది. ఇవ్వవలసిన దానికన్న తక్కువ ఇవ్వడం, కాలనీ ఒక చోట భూమి మరెక్కడో ఉండడం నాసిరకం భూములివ్వడం వంటివి. పలుచోట్ల జరుగుతున్నాయి. ప్రాజెక్టు నీరు వచ్చే వరకు తమ వెనుకటి భూములను సాగు చేసుకోవచ్చునని గిరిజనులకు చెప్పిన అధికారులు వాటిని కాంట్రాక్టర్ల పనులకు, వెదురు – యూకలిప్టస్ వనాల కోసం పేపరు మిల్లుల వాళ్లకు ఇచ్చేస్తున్నారు. ఈ తీరులో చంద్రబాబుకు బాధపడదగిందేమీ కన్పించడం లేదు.

నిర్వాసితులవుతున్న వారిలో దళితులు, ఉపాధి కోల్పోయే వారిలో మత్స్యకారులు తగినంత సంఖ్యలో ఉన్నారు. వారికి షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలు వర్తించకపోయినా ప్రాజెక్టు వల్ల తీవ్రంగా దెబ్బతింటున్నవారే. వారికి పరిహారాలు, పునరావాసాలు లేనట్లే లెక్క. ఇక వారంతా వీథుల పాలు కావలసిందే. అయినప్పటికీ చంద్రబాబుకు కించిత్ బాధ అయినా కలగడం లేదు.

తన బాధ యావత్తూ రాష్ట్ర విభజన జరిగిన తీరు గురించే. అదే బాధను మరొక మారు వెల్లడిస్తూ ఆయన 2014 ఆగస్టు 17న ఏకంగా ఒక శ్వేతపత్రమే విడుదల చేశారు. అదే పద్ధతిలో తను పోలవరం అమలు తీరుపై కూడా ఒక శ్వేతపత్రం విడుదల చేయగలరా? అందులో నిర్మాణం గురించి, నిర్వాకం గురించి మొదలుకొని పునరావాసం వరకు అంతా ఉండాలి.

నిర్వాసితులవుతున్న లక్షలాది గిరిజనుల మరొక అతిపెద్ద సమస్య, తమ వేల ఏళ్ల చరిత్ర గల స్థిర నివాసాలు, సంస్కృతి యావత్తూ తుడిచిపెట్టుకు పోనుండడం. ఒకటి కాదు వంద కాలనీలు కట్టించినా, లక్ష కాదు కోటి రూపాయలు ఇచ్చినా, తమ చరిత్ర సంస్కృతులు తిరిగి ఎక్కడా నిర్మితమయ్యేవి కావు. తమ సమాజాలకు, గోదావరి నదికి, ఆ కొండలూ అడవులకు, సంస్కృతీ చరిత్రలకు పరస్పర సంబంధం ఉంది. అవి పరస్పరం ఆలవాలమైన విషయాలు. ఒకటి లేనిదే మరొకటి లేదు. తామంతా ఒక సమాజంగా ఒకచోట నివసించనిదే ఏమీ ఉండదు. ఇది వారిని మూలాల్లోంచి తొలిచివేస్తున్న ప్రశ్న. కాని ఇదేమీ చంద్రబాబుకు బాధ కలిగించ గల విషయం కానే కాదు.

అదే విధంగా గిరిజనుల జీవితాలకు వారి నది, వారి కొండలు, వారి అడవులు, వారి భూమి, అక్కడి జంతువులు – పక్షిజాలమే ప్రధానాధారం. వాటన్నింటిని ఒక్కపెట్టున తీసివేసి ఇవేమీ లేని కాలనీకి వారిని పారదోలటమంటే మూడు పంటలు తీసి పళ్లతోటలూ పెంచే రైతును నడి ఎడారిలో వదలడం వంటిదే. అయినప్పటికీ చంద్రబాబుకు ఆ పనిలో గాని, ఆ తీరులో గాని, ఎటువంటి బాధా లేదు. రాష్ట్ర విభజన గురించి మాట్లాడేటపుడు ఈ సారి ఆయన మొహకవళికలను గమనించండి. అందులో ఎంత సున్నితత్వం, ఎంత బాధ ప్రతి ఫలిస్తాయో. పోలవరం గురించి మాట్లాడినపుడు ఎంతటి ఆనందం, పట్టుదల కొట్లవచ్చినట్లు కనిపిస్తాయో.

(రచయిత సీనియర్ జర్నలిస్టు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. – సం.*

వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి.

– సం.

విద్య కాషాయీకరణ - హిందుత్వ ఎజెండా

***లౌకిక దేశంలో విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించకుండా బిజెపి ప్రభుత్వం తన భావజాల వ్యాప్తికోసం విద్యారంగంలో వేదాలు, పురాణాలు, హిందూ సంస్కృతి, ఉపనిషత్తులను చొప్పించేప్రయత్నాన్ని ప్రజాస్వామిక శక్తులు అడ్డుకోవాలని అంటున్నారు** బైరెడ్డి సతీష్*

మీకు తెలుసా? మొట్టమొదటి పైలెట్ శ్రీరాముడని! భూమికి జీవం పోసింది మనువని! మను టిబెట్‌లో జన్మించాడని టిబెట్ కూడా ఇండియాదే అని! స్టెమ్‌సెల్ కనుగొన్నది డా. బాలకిషన్ గణపత్ అని. యోగవిద్య ద్వారా టెలివిజన్‌ను కనుగొని దివ్యదృష్టి పొంది మహాభారతం లో సంజయ లైవ్ అప్‌డేట్ ధృతరాష్ట్రుడికి అందించాడట! ఆర్యులు విదేశీ దండయాత్రికులు కాదు అచ్చంగా భారతీయులేనటా! కుతుబ్ మినార్‌ను సముద్ర గుప్తుడు కట్టించాడనీ దానిని విష్ణుస్తంభం అని అంటారనీ... ఈ సరికొత్త జ్ఞానం పుస్తకాలలో పురుడు పోసుకుంటున్నది. హిందూ రాజ్య స్థాపనకు ఈ మేథో పునాదులను వేస్తున్నది బిజెపికి సైద్ధాంతిక మాతృక అయినటువంటి ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు. 1990లలో రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన బిజెపి అండతో పాఠ్యాంశాల మార్పు, చరిత్రను 'తిరగరాయడం' వంటి అంశాలపై తీవ్రమైన కార్యాచరణనే అమలు చేస్తూ వస్తున్నాయి. ఈ దేశాన్ని 'హైందవ రాజ్యంగా' రూపొందించాలన్న వారి లక్ష్య సాధనకు హిందుత్వ సామాజిక సంస్కృతి ఆధారంగా అందరి వ్యక్తిత్వాలను తీర్చిదిద్దాలి. ఈ లక్ష్య సాధనలో విద్య, సాంస్కృతిక ప్రసార రంగాలు పదునైన సాధనాలు.

ఈ దేశ చరిత్ర సంస్కృతి వేదాలతోనే మొదలయ్యాయని, తొలి బాషా సంస్కృతమనీ, ఆర్యులు విదేశీ దండయాత్రికులు కాదని ఈ దేశ మూలవాసులనీ, సింధూ నాగరికత నిర్మాతలనీ, విజ్ఞాన ద్రష్టలనీ, తొలి నాగరికత పునాదులు నిర్మించింది వారేననీ మనది గొప్ప హైందవ సమాజమనీ, ముస్లింల, క్రైస్తవుల దండయాత్రల తరువాతనే ఈ దేశ సంస్కృతి, చరిత్రలు ధ్వంసం అయినాయనీ. ఈ 'పరాయి ప్రజల' వల్లనే ఈ దేశ ఔన్నత్యం బయటి ప్రపంచానికి తెలియడం లేదని, దీన్నొక హైందవ అగ్రరాజ్యంగా రూపొందించాలంటే చరిత్రను తిరగ రాయాల్సిందే అంటుంది సంఘ్‌పరివార్. ఒకవైపు చరిత్రను తిరగ దోడుతూనే, హైందవ సమాజపు మనువాద బ్రాహ్మణీయ తాత్విక పునాదుల్నీ పటిష్టం చేస్తూ హిందూ రాజ్యస్థాపనకు అనువైన ఆలోచనలన్నీ ప్రాథమిక స్థాయిలోనే జొప్పించి, అనుకూలమైన మేథో వాతావరణాన్ని ఏర్పరిచే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఆర్ఎస్ఎస్ ఏర్పడ్డ తొలినాళ్ల నుంచి పౌరసమాజంలో ఇటువంటి తిరోగమన పాత్ర పోషిస్తున్నా... దాని రాజకీయ రూపమైన బిజెపి రాష్ట్రాల్లో, కేంద్రంలో అధికారంలోకి రావడంతో అధికారం అండతో మరింత దూకుడును పెంచింది. 1990 చివరిలో తొలిసారిగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రవచించిన ఈ ప్రయోగాలను వెంటనే చేపట్టింది. ఏ ప్రభుత్వమైనా ఏర్పడిన వెంటనే ప్రజల తక్షణ సమస్యల పరిష్కారానికై విధాన రూపకల్పనలో నిమగ్నమవ్వాలి. కాని, ఆనాటి మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి మురళిమనోహర్ జోషి భావజాల రంగంపై దృష్టి కేంద్రీకరించి పాఠ్యపుస్తకాల మార్పు (ప్రధానంగా ఎన్‌సిఆర్‌టి), చరిత్రను తిరగరాసే పనికి పూనుకున్నాడు. జ్యోతిష్యం, వాస్తు, పౌరోహిత్యం వంటి అశాస్త్రీయ కోర్సులను ప్రవేశపెట్టే ప్రయత్నం చేశాడు. ప్రగతిశీల ప్రజాస్వామిక లౌకిక శక్తుల వ్యతిరేకత వల్ల, ఆనాటి సంకీర్ణ ప్రభుత్వ పరిమితుల వల్లనైతేనేమి ఆ ప్రయత్నం నిలిచిపోయింది. అయితే అక్కడక్కడ సఫలమైన దాఖాలాలు కూడా లేకపోలేదు. మెజారిటీ రాష్ట్రాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి.

ముందు చెప్పుకున్నట్లు సంఘ్‌పరివార్ శక్తులు రాజకీయ అధికారంతో సంబంధం లేకుండానే పౌరసమాజంలో ప్రత్యేకించి విద్యా, సాంస్కృతిక రంగాలలో తన ఎజెండాను ముందుకు తీసుకు పోతూనే ఉంది. భారతదేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో శిశు మందిర్‌ల విద్యార్థులను హిందూజాతి రక్షకులుగా తయారు చేయాలనే లక్ష్యంతో నడిపిస్తున్నది. విద్యాభారతి గొలుసుకట్టు బడులను దిగువ మధ్య తరగతి వారిని లక్ష్యంగా చేసుకొని, ఆదివాసులను లక్ష్యంగా వనవాసి కళ్యాణ ఆశ్రమం పేరుతో హాస్టల్స్‌ను నిర్వహిస్తున్నది. ఈ ఆశ్రమాలలో ఆదివాసుల సంక్షేమం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణా పాఠాలు కాదు, హైందవ పాఠాలతో, హైందవంతో సంబంధంలేని ఆదివాసులతో వారి సాంస్కృతిక అస్తిత్వాన్ని ధ్వంసం చేసి హైందవీ కరించడమే ప్రధానంగా జరుగుతోంది. ఎకలవ్య విద్యాలయ ఫౌండేషన్ సంస్కృత భాషను రాయడం చదవడంపై శిక్షణను ఇస్తుంది. విద్యా భారతి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 18000 పాఠశాలలు, 1.8 మిలియన్ విద్యార్థులు, 80,000 మంది ఉపాధ్యాయులతో నడుస్తున్నాయి. 60కి పైగా గ్రాడ్యుయేట్ స్థాయి విద్యాలయాలు ఉన్నాయి. విద్యాభారతి అనుబంధ సంస్థ ఆయిన భారతీయ అధ్యాపక్ పరిషత్ హిందుత్వ సిద్ధాంతంపై ఉపాధ్యాయులకు శిక్షణను అందిస్తుంది. 1973లో నెలకొల్పబడిన భారతీయ ఇతిహాస సంకలన్ యోజన 5000 సంవత్సరాల భారత చరిత్రను 'తిరగరాసే' పనిలో నిమగ్నమైంది. 1982లో ప్రారంభమైన సంస్కార్ భారతి 900 శాఖలతో పాశ్చాత్య సంస్కృతిని 'నిలువ'రించే పనిని చేస్తుంది! అంటే భజరంగ్‌దళ్, శ్రీరామ్ సేనా వంటి సంస్థలతో 'ప్రేమికుల దినం', నూతన సంవత్సరంను జరుపుకునే ప్రజలపై భారతీయ సంస్కృతిని మంటగల్పుతున్నారంటూ భౌతికదాడులు చేస్తున్నది! 1948-49లలో పుట్టిన ఎబివిపి అయితే కళాశాల, యూనివర్సిటీ స్థాయిలో కాషాయ విద్యకై కంకణం కట్టుకొని పనిచేస్తుంది. ఈ మధ్యకాలంలో యూనివర్సిటీ హాస్టళ్లలో వినాయక చవితిలను కూడా నిర్వహిస్తున్నది. ఈ సంస్థలన్నీ హైందవం 'ఉన్నతత్వం' గురించి ఇతర మతాల పట్ల అసహనాన్ని, ద్వేషాన్ని నింపే పనిలో నిమగ్నమై ఉన్నాయి. స్వతంత్రానంతర ప్రభుత్వాలన్నీ ప్రజలందరికి ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడంలో వైఫల్యం మూలంగానే ఇలాంటి మతశక్తులు నిర్వహించే విద్యాలయాలను సమాజంలోని కొన్ని వర్గాలు అనివార్యంగా ఆశ్రయించాల్సి వస్తుంది.

అధికారం అండగా ఉండగా...

ఒక దశాబ్దకాలం తర్వాత సంపన్న వ్యాపార పారిశ్రామిక వర్గాల వెన్నుదన్నుతో నరేంద్రమోడీ నాయకత్వంలో బిజెపి సంపూర్ణ మెజారిటీతో అధికార పీఠాన్ని సాధించింది. 2002 గుజరాత్ ముస్లింల ఊచకోతకు బాధ్యుడని ప్రపంచమంతా గుర్తించిన నరేంద్రమోడీని అభివృద్ధి ముసుగులో ఆర్ఎస్ఎస్ తన హిందూత్వ ఎజెండాను అమలుపరిచే 'సమర్థ' నాయకుడిగా ముందు పెట్టింది. సంపూర్ణ మెజారిటీ రావడం, తన మనిషినే ప్రధానిని చేసుకోవడం సంఘ్ పరివార్‌కి తన ఎజెండా అమలు పట్ల విశ్వాసం రెట్టింపయింది. తొలి బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో చూపినంత బహిరంగంగా కాకుండా తన కార్యాచరణను పకడ్బందిగా ఏర్పర్చుకుంటున్నది. పెద్దగా రాజకీయ అనుభవం, సమర్థ నాయకత్వ లక్షణాలు లేని స్మృతి ఇరానీని మానవ వనరుల అభివృద్ధి శాఖకు మంత్రిని చేయడంతో ఆర్ఎస్ఎస్ అదృశ్య హస్తం స్పష్టమైంది. కుర్చీలో ఉన్నది ఆమె అయినా కాషాయ జెండా ఎజెండాను అమలు చేయించుకునే రిమోట్ కంట్రోల్ సంఘ్ చేతిలోనే ఉంది. ఆమె వచ్చిరాగానే దేశంలో ఉన్న విద్యారంగ సమస్యలపైనో, అందరికి అందుబాటులోకి విద్యను తెస్తామనో, బడ్జెట్ కేటాయింపులు పెంచుతామనో చెప్పలేదు. వేదాలు, పురాణాలు, హిందూ స్మృతులు, ఉపనిషత్తులను సిలబస్‌గా 8,9,10 తరగతులలో తీసుకొస్తామని, అదేదో తక్షణమే చేయకపోతే దేశ విద్యారంగ మంతా సంక్షోభంలో కూరుకు పోతుందన్నంత ప్రాధాన్యత అంశంగా ఆమె ఆర్ఎస్ఎస్ ప్రవచిత సంస్కరణలను వెల్లడించింది. దీన్నిబట్టి సంఘ్‌పరివార్ తన లక్ష్యంపట్ల ఎంత దూకుడుగా, ఉత్సాహంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హిందూత్వ విద్యా ఎజెండాను నెత్తికెత్తుకుంది కాబట్టి, దేశ విద్యారంగ దశను, దిశను నిర్దేశించే హోదాలో ఉన్న ఆమెకు కనీస డిగ్రీ కూడా లేదన్న ఆరోపణ అంతగా ప్రాధాన్యం ఉన్న అంశం కాలేకపోయింది.

సరిగ్గా నరేంద్రమోడీ నాయకత్వంలో బిజెపి అధికారంలోకి రాబోతుందని అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి సంస్థలు, కార్పొరేట్ మీడియా ముందస్తుగా ఆమోదాన్ని (మ్యాన్యు ఫ్యాక్చరింగ్ ఆఫ్ కన్‌సెంట్) ప్రజల్లో తయారు చేస్తున్న నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థల కార్యక్రమాల శైలిని పరిశీలిస్తే విద్యా కాషాయీకరణ ప్రణాళికలను ఎంత బలంగా ముందుకు పెట్టదలచారో అర్థమవుతుంది. సాధారణంగా సంఘ్‌పరివార్‌లో వ్యక్తుల పేర్లు, వారి ప్రభావం బయటి ప్రపంచానికి కొంత తక్కువగానే పరిచయం. గత కొద్దికాలంగా ధీనానాథ్ బాత్రా అని 80లలో ఉన్న ఒక పెద్దాయన పేరు దేశస్థాయి మీడియాలో తరచుగా వినపడుతుంది. ప్రత్యేకించి అమెరికన్ స్కాలర్ వెండి డోనిగర్ రాసిన ద హిందూ: అన్ అల్టర్‌నెటివ్ హిస్టరీ అనే గ్రంథం హిందూ మత చరిత్రను వక్రీకరిస్తున్నదని, హిందూ మనోభావాలకు వ్యతిరేకంగా ఉన్నదని కోర్టుకి వెళ్లి నానా హంగామా సృష్టించి పుస్తకాన్ని ఉపసంహరించుకునేల చేసిన వ్యవహారంతో ఈయన పేరు దేశమంతా మారుమోగి ఆర్ఎస్ఎస్‌కు మరింత ప్రీతి పాత్రుడైనాడు. ఆర్ఎస్ఎస్‌తో ఈయనది 70 ఏళ్ల అనుబంధం. ఈయన పశ్చిమ ఢిల్లీలో 'సరస్వతి బాలమందిర్' అనే ఒక పాఠశాలను కూడా నిర్వహిస్తున్నాడు. పైన పేర్కొన్న పుస్తకమే కాదు, ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహచే ఉత్తమ వస్తుగత చరిత్ర రచనగా కొనియాడబడ్డ శేఖర్ బందోపాధ్యాయ చరిత్ర గ్రంథం 'ప్లాసి టు పార్టిషన్' ఎ హిస్టరీ ఆఫ్ మోడ్రన్ ఇండియా ఢిల్లీ యూనివర్సిటీ బిఎ మూడవ సంవత్సరం సెలబస్‌గా ఉండింది. ఆర్ఎస్ఎస్‌ను ద్వేషించేలా విషయాలు ఉన్నాయని సెలబస్ నుండి తొలగించాలని మతశక్తులను రెచ్చగొట్టి ఒత్తిడి తెచ్చింది ఈయనే. మేఘకుమార్ రాసిన 'కమ్యూనలిజం' సెక్సువల్ వైలెన్స్ : అహ్మదాబాద్ సిన్స్ 1969, ఎకె. రామానుజన్స్ ఎస్సేస్ 300 రామాయనాస్ అనే ప్రామాణిక గ్రంథాన్ని 2011లో ఢిల్లీ యూనివర్సిటీ ఉపసంహరించుకునేల చేయడంలో ఈయన పాత్రే ప్రధానం. ఇవ్వన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే హిందూ మతశక్తులు భిన్నమైన అభిప్రాయాలను ఎలా ద్వేషిస్తారో, అసలు ఒక విషయానికి అనేక కోణాలుంటాయనే కనీస ప్రజాస్వామిక స్పృహ లోపించిందని చెప్పడానికే. వీళ్లకు అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛపట్ల గౌరవం, భిన్న అభిప్రాయం పట్ల సహనం లేకుండా అకడమిక్ సంస్కృతిని అగౌరవపరిచే నీచత్వం వెల్లడవు తోంది. సరిగ్గా ఈ విద్వేషపూరిత విష ప్రచారానికి నాయకుడైనా ధీనానాథ్ బాత్రా రూపొందించిన పాఠ్యాంశాలనే దేశమంత విస్తరింప జేయాలని ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నవి.

నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రి కాగానే ఈయన రచించిన పాఠ్యపుస్తకాలనే అక్కడి పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. భారతీయ కావ్యాలన్నీ కాల్పనికం కాదని, అవన్ని భారతదేశ చరిత్రలో భాగమని చారిత్రక వాస్తవాలని వాదిస్తున్నాడు. ఈయన రచనలన్ని మైనారిటీల పట్ల ద్వేషంతో నిండుకొని, ఈ దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో అదీ ఒకటని సూత్రీకరిస్తున్నాడు. గుజరాత్ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో ముస్లిం లీగ్‌ను మతోన్మాద సంస్థగా చూపెడుతూ అదేకాలంలో వచ్చిన హిందూ మతోన్మాద సంస్థల ప్రస్తావన ఏమాత్రం లేకుండా జాగ్రత్త పడ్డాడు. గాంధీ హత్య గురించి చెప్పి హంతకుడు గాడ్సే భావజాల మూలాలు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పలేదు. అంటే తాము నిర్మించదలచిన హిందూ రాష్ట్ర భావనకు పనికి వచ్చే, ఆ దిశగా విద్యార్థుల మనస్తత్వాలను రూపొందించే అంశాలను మాత్రమే బలంగా చొప్పించి ఇతర మతాల పట్ల, భిన్నమైన అభిప్రాయాలున్న అంశాల పట్ల విద్వేష భావాన్ని రగిలిస్తున్నాడు. ధీనానాథ్ బాత్రా పుస్తకాలు ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో కల్పిత గాథాలన్నింటిని వాస్తవాలుగా వక్రీకరిస్తున్నది. ఈ బాత్రా ప్రతిపాదనలతోనే గుజరాత్ పాఠశాలల్లో ఆర్ఎస్ఎస్ పత్రిక 'సాధన' విధిగా ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది. 2000 లో సంస్కృత భాషాధ్యయాన్ని విధిగా చేయాలని కూడా ప్రతిపాదించింది. మధ్యప్రదేశ్ లో బిజెపి ప్రభుత్వానికి పాఠశాలలో సెక్స్ ఎడ్యుకేషన్‌ను తొలగించమని సలహా ఇచ్చింది ఈ దీనానాథ్ బాత్రానే. సూర్య నమస్కారం విధిగా పాటించేలా ప్రభుత్వం ఈయన సూచనతోనే నిర్ణయించింది.

ఇంతటి పచ్చి హిందూ ఛాందసవాది నాయకత్వంలో ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతో శిక్షా సంస్కృతి ఉత్థాన్యాస్‌కు అనుబంధంగా భారతీయ శిక్షానీతి అయోగ్ (బిఎస్ఎన్ఎ) 21 మంది సభ్యులతో ఏర్పడింది. భారతీయ విద్యారంగాన్ని సంపూర్ణంగా సంస్కరించి (ఇండియనైజేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్) విద్యా భారతీయీకరణను చేపట్టబోతుంది. ధీనానాథ్ బాత్రా అయితే ఇప్పటి వరకు ఉన్న చరిత్ర పాఠ్య పుస్తకాలన్ని హిందూ భావనకు వ్యతిరేకంగా ఉన్నాయని వాటన్నింటిని నిషేధించాలని బాహాటంగా ప్రకటించాడు. ప్రధాని మోడీని ఒప్పించి ఈ మార్పులను ప్రవేశపెట్టనున్నట్లు బాత్రా ప్రకటించాడు. విలువల ఆధారంగా విద్యారంగాన్ని నిర్మించాలని పదేపదే ప్రకటించే సంఘ్‌పరివార్ శక్తులకు ఇవాళ రాజకీయపు అధికార అండ పుష్కలంగా ఉన్నది. ఇంతకు ఆ విలువలు ఏవి? సమాజాన్ని చతుర్వర్ణాలుగా, అసంఖ్యాక కులాలుగా విడగొట్టి అసమాన సామాజిక వ్యవస్థను నిర్మించిన మనువాద బ్రాహ్మణీయ విలువలా? అసమానతలు ప్రకృతిలోనే ఉన్నాయని అవి సహజం అని చెప్పే సాంస్కృతిక ఆధిపత్య భావజాల విలువలా? భారతదేశానికి రాజ్యాంగం రాకముందు నుండి సామాజిక జీవితాల్లో అంతర్భాగమైన లౌకికవాద విలువల్నీ బూటకమని చెప్పే మత ఛాందస విలువలా? ఈ దేశ బహుళత్వాన్ని, సాంస్కృతిక వైవిధ్యాన్ని సహించలేని సంఘ్ శక్తులు భారతదేశాన్ని ఏకశిలా సదృశ్యంగా చూపెట్టాలని, చారిత్రక

క్రమంలో ఈ దేశం ఏర్పడింది అనే వాస్తవం కాకుండా ఒక భౌతిక, మానసిక వాస్తవం అనే తన మనో పైత్యాన్ని ప్రపంచంపై రుద్దే హిందూ సామ్రాజ్యవాద ఆధిపత్య విలువలా? విప్లవోద్యమం, జాతి ఉద్యమాలు, అస్తిత్వ ఉద్యమాల ఎదురుదెబ్బతో పలుచబడుతున్న మనువాద, బ్రాహ్మణీయ తాత్విక పునాదుల్ని పునరుద్ధరించే తిరోగమన విలువలా?

చరిత్ర వక్రీకరణ

ఇక్కడ భారతదేశ చరిత్ర అధ్యయనం, ప్రచురణలను అందించే భారతీయ చరిత్ర పరిశోధన మండలి (ఐసిఎచ్ఆర్) కి సుదర్శన్ రావు అనే చరిత్ర మాజీ ఆచార్యున్ని అధ్యక్షుడుగా నియమించింది. ఆయన చరిత్ర అధ్యయనాన్ని ప్రభావితం చేసిన, చరిత్రపై ఉద్గ్రంథాలు రాసిన ఉద్దండుడు ఏమి కాదు. కేవలం ఆయన అర్హతల్లా ఆర్ఎస్ఎస్‌కు సానుభూతిపరుడు అవడమే! ఈయన వచ్చిరాగానే మనువాద చతుర్వర్ణ వ్యవస్థను సమర్థిస్తూ, కులాలు వాంఛనీయమే అంటూ వాటి 'పాజిటివ్' ప్రభావం సమాజంలో ఉందని తన అధ్యక్షుని హోదాలో నోట్ రాసుకున్నాడు. రామాయణ, భారతాలు కాల్పనిక గాథలు కాదని అవి భారతదేశ చరిత్రలో భాగమనీ, చారిత్రక వాస్తవిక ఘట్టాలని కొత్త చరిత్రను చెపుతున్నాడు. ఒక ఐసిఎచ్ఆర్ మాత్రమే కాదు దేశ విద్యారంగ దశా దిశను నిర్దేశించే (దాదాపు – 17 వరకు) అన్ని కేంద్రస్థాయి విద్యా మార్గదర్శక, నియంత్రణ సంస్థలకి సంఘ్‌పరివార్ భావజాల సమర్థకుల్ని అధిపతులుగా నియమించడానికోసం రంగం సిద్ధమవుతుంది. వీటన్నింటిని ఏకంగా రద్దుచేసి ఒకే ఒక అత్యున్నత (సర్వాధికారాలు కలిగిన) వ్యవస్థను రూపొందించే ఆలోచనను కూడా చేస్తున్నది. ఒకవైపు చరిత్రను వక్రీకరిస్తూ, మరోవైపు విద్యారంగంలో కా(ఖ)షాయ విలువల్ని చొప్పిస్తూ సంఘ్‌పరివార్ తన ప్రాపంచిక దృక్పథాన్నే వాస్తవంగా నిలబెట్టి, హైందవం పవిత్రమైన, అత్యున్నతమైన 'జీవన విధాన'మని ముస్లింలు, క్రిస్టియన్‌ల వల్ల ఆ పవిత్రత ధ్వంసం అయిందని గత వైభవోజ్వల ఘట్టం తిరిగి రావాలంటే ఈ లౌకికవాద విద్యను, శ్రామిక శక్తుల, కులాల (నిజానికి పూర్తిగా కాకపోయిన) కోణంలో ఉండే చరిత్రను తిరగరాయాల్సిందే అంటోంది.

మరో ప్రమాదం ఏమిటంటే ఇవాళ ఈ హిందూత్వ ఎజెండా పూర్తిగా అభివృద్ధి ముసుగులో జరుగబోతుంది. గత ప్రభుత్వాల నిర్వాకం, అభివృద్ధిలేమి కూడా ఇవాళ ఈ స్థితికి కారణమే. ఈ అభివృద్ధి ముసుగు వేసుకున్న హిందూత్వ నాయకున్ని 2002 తర్వాత ముస్లిం ఊచకోతకు కారకుడని వీసా నిరాకరించిన అమెరికాకు అధికారంలోకి రాగానే అభివృద్ధి కాముఖుడని ఎర్రతివాచీలు పరచడంలో ఆంతర్యం అర్థం చేసుకోలేని సంక్లిష్టమైందేమి కాదు. సడన్‌గా సాదు జంతువు కాకపోయిన శాంతి ప్రవచకుని అవతారం ఎత్తకపోయిన మోడీకి ఆనాడు వీసాను నిరాకరించి గొప్ప పరమత సహనం ప్రజాస్వామిక లౌకిక విలువలున్న దేశంగా అమెరికా ప్రపంచం ముందు పోజుకొట్టింది. ప్రజల సమిష్టి సంపదైన సమస్త సహజ వనరులను కొల్లగొట్టడానికి, బహుళ భక్షక కార్పొరేట్ల వస్తువులకు విశాల మార్కెట్‌కు గేట్లు బార్లా తెరిచే స్థాయిలో ఉన్నాడు. కాబట్టి నరమేదాలు, మానవీయ విలువలు, వీసా నిరాకరణలు గాలికి కొట్టుకుపోయి ఎర్ర తివాచీలు పరుచుకుంటున్నాయి. భారీ ఎత్తున రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లు సాగిస్తున్న భారతదేశ ప్రభుత్వాధినేత గతం ఏమైతేనేం అమెరికాకు! మరి విద్యను భారతీయీకరించాలి, హైందవీకరించాలి అనే స్వదేశీ వాదులకు అమెరికా దోస్తి ఎలా కుదురు తుందనే ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. అమెరికా సామ్రాజ్యవాద, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి, నయా ఉదారవాద విధానాలకి సహజ వనరుల సంపన్న ప్రాంతాల ప్రజలను వారి స్వయం సంవృద్ధి జీవన విధానాన్ని ధ్వంసం చేసి పునాది రంగంలో మార్పు తెచ్చి, అసమానతలు సృష్టించి సాంస్కృతిక గందరగోళం ఏర్పర్చడం ఎంత అవసరమో హిందూ సామ్రాజ్యవాదులకు కూడా ఇక్కడి సామాజిక జీవన రంగాల్లో అసమానతలు, బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలానికి ఆమోదం తీసుకురావడం అంతే అవసరం. ఎలాంటి మానవీయ విలువలు, ప్రజాస్వామిక దృక్పథంలేని, నిరంతరం గతంలో మాత్రమే జీవించ మనీ, గతకాలపు వైభవాన్ని కీర్తించే గుణం కలిగిన సాంకేతిక నిపుణులను తయారు చేయడం హిందూత్వ వాదులకు ఇవాళ్టి అవసరం. ఈ సాంకేతిక నైపుణ్యం కలిగిన సనాతన వాదులే నరేంద్ర మోడీ గెలుపునకు శ్రమించారు. ఈ శక్తులకు సమతా భావన, సహనం, హేతుబద్ధత, సహేతుకమైన సంభాషణ అంటే అస్సలు గిట్టదు. వీళ్లకి విద్య ద్వారా కేవలం వినయ విధేయతలు, క్రమశిక్షణ కలిగిన సేవకులను సమర్థ సాంకేతిక నైపుణ్యం కలిగిన వ్యక్తులను సృష్టించ మంటుంది. అయితే పరివార్ కుటుంబంలో ఆర్థిక విధానాలపైన చీలికలు ఉన్నా విద్యను కమ్యూనలైజ్ చేసే విషయంలో సంపూర్ణ ఏకాభిప్రాయం ఉంది. వీటి అమలుకు అధికారం అనివార్యం. అది ప్రజామోదం లేకుండా సాధ్యపడదు కాబట్టి ఆ ఆమోదం కోసం ముద్దు ముద్దుగా సుపరిపాలన, అభివృద్ధి అనే ముసుగు వేస్తున్నారు. గత ప్రభుత్వాల అభివృద్ధి రాహిత్యం, అవినీతి పాలన ఎలాగూ కలిసివస్తుంది. హిందూ మత ఛాందసి అమిత్ షా బిజెపి ముద్రే ఉంటుంది అనడం పక్కా సంఘ్‌పరివార్ ఎజెండానే సూచిస్తుంది. జర్మనీ ప్రజలను జర్మన్స్ అనీ, అమెరికా వాళ్లను అమెరికన్స్ అనీ అన్నప్పుడు హిందుస్థాన్‌లో ఉండే వాళ్లను హిందువులు అనీ అనాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అనడం, ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే అనే నినాదం, అమిత్ షా కంటున్న దేశ ముఖచిత్రంపై బిజెపి ముద్ర అనే కల మరేదోకాదు. హిందూత్వ ముద్రనే. వీటికి తోడు జమ్ము – కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేస్తామనే బెదిరింపులు గుజరాత్ పాఠ్యపుస్తకాల్లో ఇండియా, పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, శ్రీలంక, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ చిత్రపటాలను కలిపి అఖండ భారతదేశమని చూపించడం హిందూ సామ్రాజ్యవాద హైందవ అగ్రరాజ్య, హిందూ ఫాసిస్టు ధోరణులను సూచించే ప్రమాద గంటికలు. వీటి ప్రభావమో ఏమోకాని, ఓ సుప్రీంకోర్టు జడ్జి అయితే ఏకంగా నేనే నియంతనైతే భగవత్ గీతను బలవంతంగా పాఠశాలల్లో ప్రవేశపెట్టే వాడినని అనడం న్యాయవ్యవస్థలోకి సైతం హిందూత్వ భావజాల వేర్లు విస్తరిస్తున్నాయనడానికి ఒక సంకేతం.

మన కర్తవ్యం...

ఈ ధోరణుల వల్ల సమాజంలో మరింత సంక్షోభం సంఘర్షణ తలెత్తుతుంది. లౌకికవాద దేశంగా ఈ దేశ రాజ్యాంగ పీఠికలో పొందుపర్చబడిన దాన్ని కూడా మార్చే రోజులు త్వరలోనే రావచ్చు! విద్యను కాషాయీకరించడం అంటే సమత, మమత, మానవీయ లౌకిక విలువల స్థానంలో పరమత అసహనం స్వమత దురాభిమానం పెరిగి మెజారిటీ మతాధిపత్యం రాజ్యమేలుతుంది. కష్టజీవులకు విలువ, గౌరవం లేకుండా, కాషాయదారులై ఉత్పత్తి ప్రక్రియకు, శ్రమకు దూరమైన పరాన్నభుక్కులు పీడించే వర్గాలు పీఠాలెక్కి ప్రజలను శాసిస్తారు. మానవ చరిత్రానుభవాల్లోంచి, ఆమోదంలోంచి వచ్చిన నైతిక సూత్రాల స్థానంలో మతం ఆధారంగా వచ్చే నిర్బంధ, అప్రజాస్వామిక, వ్యక్తి స్వేచ్ఛను హరించే కట్టుబాట్లు, సాంస్కృతిక పోలీసింగ్ పెరిగిపోతుంది. భిన్నమైన విశ్వాసాలు, ఆచరణలు కలిగినవారు అభద్రతలో జీవించాల్సి వస్తుంది. మొత్తంగా సమాజమే ఒక నియంతృత్వ పడగనీడలోకి వెళ్తుంది.

ఈ పెను ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సిన బాధ్యత ఇవాళ సమాజ హితాన్ని, ప్రజాస్వామిక సంస్కృతిని, లౌకిక విలువల్ని కోరుకునే శక్తుల, వ్యక్తుల, వ్యవస్థలపై ఉన్నది. ప్రగతిశీల ప్రజాస్వామిక లౌకిక విలువల్ని

మోడీ రెండు నెలల పాలన - హెచ్చరికలు

మోడీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ, ప్రజలపై మరింత భారం మోపుతున్నారని అంటున్నారు **గడ్డం వెంకటరాజం**

యుపిఎ పది సంవత్సరాల పాలన వల్ల విసుగుచెందిన భారత ప్రజలు ముఖ్యంగా నేటి యువతరం (సామాజిక బాధ్యత తెలియని) నూతన మార్పుకోసం ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో బిజెపి-ఎన్‌డిఎ కూటమికి మెజారిటీ సంపాదించి పెట్టారు. నరేంద్రమోడీ ఎన్నికల ముందు ఎన్నికల సభలలో భూతల స్వర్గాన్ని రూపొందిస్తానని, తానే దేశానికి ఏకైక సమర్థవంతమైన నాయకుడినని, దేశ భవిష్యత్తును మొత్తం మారుస్తానని అనేక గొప్ప గొప్ప ఉపన్యాసాలు, వాగ్దానాలు చేసినాడు. దీనికి తోడు సోషల్ మీడియా, జాతీయ ఎలెక్ట్రానిక్, ప్రింట్ మీడియా, సంఘ్‌పరివార్ శక్తులు అన్ని కూడకలుపుకొని 'మోడీ'ని ఒక యుగ పురుషుడిలా ఎత్తుకొని నిరంతరం అతన్ని గురించి ప్రచారం చేస్తూ ప్రజల ఆలోచనలపైన మానసికంగా ప్రభావం చూపే విధంగా తీవ్రంగా కృషి చేసినారు. ప్రజలు, కొత్త ఓటర్లు వాస్తవమేనని భావించి ఏదో మాయచేసి దేశంలో స్వర్గాన్ని నిర్మిస్తాడని భావించి గెలిపించారు. మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం క్యాబినెట్ తీసుకొనే నిర్ణయాలు చూస్తుంటే ఒక్కొక్కటిగా ఇప్పుడు అర్థం అవుతున్నది. ఇటీవల దేశంలో జరిగిన కొన్ని సంఘటనలు ప్రభుత్వ నిర్ణయాలు కనుక పరిశీలిస్తే మోడీ ప్రభుత్వం ప్రజలవైపా? లేదా కార్పొరేట్, మత శక్తులవైపా అనేది అర్థం చేసుకోవచ్చు. మూడు లక్షల మంది ఆదివాసులను అన్యాక్రాంతం చేసే అక్రమ పోలవరం ప్రాజెక్ట్‌పై ఏకపక్షంగా ఆర్డినెన్స్ జారీ చేయడం. ఖమ్మం జిల్లాకు చెందిన 7 మండలాలను పూర్తిగా ఆంధ్రలో విలీనం చేయడం. మళ్లీ పక్షంరోజులు దాటకముందే ప్రజలపై భారం పడే విధంగా పెట్రోల్, డీజిల్, కిరోసిన్ ధరలను పెంచడం, ఎల్‌పిజి ఒక్కో సిలిండర్‌పై 250 రూపాయలు అదనపు భారం మోపే ప్రయత్నం చేయగా ప్రజలందరూ తీవ్ర నిరసనలు వ్యక్తం చేయగా ఎల్‌పిజి ధర పెంపును వాయిదా వేసినారు. త్వరలో ఏదో ఒకనాడు దీని ధర కూడా పెంచడం ఖాయం. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన రైల్వే, సాధారణ బడ్జెట్‌లను పరిశీలిస్తే మోడీ పయనం (పాలన) ఎటువైపో, ఎవరికోసమో అర్థం చేసుకోవచ్చు.

మోడీ బడ్జెట్ - ప్రమాదం అంచున దేశం

భారత ప్రజలు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి స్వాతంత్ర్యాన్ని సంపాదించారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్ లాంటి వాళ్లెందరో తమ విలువైన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తమ జీవితాలను త్యాగం చేసి దేశాన్ని బ్రిటీష్ వారి నుండి విముక్తి చేశారు. అనంతరం డా. బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగాన్ని రాసుకొని దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర దేశంగా తీర్చి దిద్దుటకు ప్రజలకు సమానత్వాన్ని, న్యాయాన్ని అందించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని రాజ్యాంగ నిర్మాతలు గొప్ప ఆశయాలతో రాజ్యాంగాన్ని రాశారు. ఏ దేశ ప్రజలైతే తమ దేశం సర్వసత్తాక, సార్వభౌమాధికార దేశంగా ఉండాలనుకున్నారో 67 సంవత్సరాల స్వాతంత్ర దేశ పాలనలో పాలకులు మరొకసారి రాజ్యాంగ విలువలకు, ఆశయాలకు తూట్లు పొడుస్తూ అమెరికా, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటిఒలకు దేశ సార్వభౌమాత్వాన్ని తాకట్టు పెట్టే విధంగా ప్రణాళికలు రూపొందిస్తూ పాలన చేస్తున్నారు. భారతదేశం అనేక వర్గాల, జాతుల, మతాలు కలిగిన దేశం. ప్రజలలో సమానత్వాన్ని, లౌకిక తత్వాన్ని పెంపొందించాల్సిన ప్రభుత్వం కులాల విభజన చేసి, మతాల మధ్య చిచ్చుపెడుతూ మధ్య యుగాల కాలం నాటి ఫ్యూడల్, మతాధిపత్యాల వైపుకు ప్రజలను నెట్టి పడేస్తున్నారు. ఆధునికారంభంలో పెట్టుబడి దారీ దేశాలు నూతన మార్కెట్ల అన్వేషణ కోసం, తమ సామ్రాజ్యాలను విస్తరించడం కోసం, వనరుల దోపిడి కోసం వెనుకబడిన దేశాలలోకి వచ్చి ఒప్పందాలు, వ్యాపారాలు చేసుకుని చివరికి ఆ దేశాలను తమ ఆధిపత్యంలోకి తీసుకునేవారు. కాని ఈ సాంకేతిక యుగంలో మన పాలకులే వాళ్ల దగ్గరకు వెళ్లి, వాళ్లను బతిమిలాడి మా దేశంలో పెట్టుబడులు పెట్టండి. లాభాలు సంపాదించండి, దేశాన్ని ఏలండి, మేము గుమస్తాలుగా, దళారులుగా ఉంటాం అని మరొకసారి విదేశీయుల చేతుల్లోకి దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టుపెట్టె విధంగా పాలిస్తూ మధ్య దళారులుగా వ్యవహరిస్తున్నారు.

2014 - 15 రైల్వే బడ్జెట్‌ను జూలై 8న సదానందగౌడ, సాధారణ బడ్జెట్‌ను జూలై 10న అరుణ్ జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌ను పురస్కరించుకుని పెట్టుబడిదారీ మేధావులు దేశాన్ని అభివృద్ధి చేసే బడ్జెట్ అని, దేశ భవిష్యత్తు మార్చివేసే బడ్జెట్ అని రకరకాల కామెంట్స్ చేశారు. ఈ బడ్జెట్‌లోని కొన్ని ముఖ్యాంశాలను కనుక విశ్లేషణ చేస్తే ఎవరి అభివృద్ధి, ఎవరి ప్రయోజనాల కొరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

2014 - 15 బడ్జెట్‌లోని కొన్ని ముఖ్యాంశాలు

1) దేశానికి చెందిన కీలక రంగాలైన రక్షణ, భీమా, రైల్వే శాఖలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) 49 శాతానికి అనుమతించడం, 2) ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల చొరవతో ప్రాజెక్టులు నిర్మించడం,

---

నమ్మే వాళ్లందరు ఐక్యంగా ఈ ముప్పును ఎదుర్కోవాలి. పాలకవర్గ పార్టీలన్నీ ఈ విషయంలో అవకాశవాద ధోరణినే ఆశ్రయిస్తున్నాయి. తాత్కాలిక ప్రయోజనాలే పరమావధిగా ఉండే రాజకీయాలకు స్వస్తి చెప్పి ప్రజలు కేంద్రంగా సమత మమతల, సమాన హక్కుల ప్రాతిపదికనా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో శాస్త్రీయ భావాలతో, ప్రగతి పథంలో ముందుకెళ్లే సమాజాన్ని కాంక్షిస్తూ సంఘర్షించాలి. లేదా మధ్యయుగం కాలం నాటి అనాగరిక జీవనానికైనా సిద్ధం కావాలి! వీ

(రచయిత ప్రభుత్వ ఆంగ్ల ఉపన్యాసకులు)

3) ప్రభుత్వానికి చెందిన కీలక సంస్థల నుండి పెట్టుబడులను ఉపసంహరించడం, 4) సబ్సీడీల కుదింపు, 5) 100 స్మార్ట్ సిటీల నిర్మాణం, 6) చిల్లర వర్తకంలో కూడా 49 శాతం ఎఫ్‌డిఐలకు అవకాశం, (7) సెజ్‌ల నిర్మాణం మొదలైనవి.

ఈ వార్షిక బడ్జెట్‌లో కొన్ని ముఖ్యమైన అంశాలు

ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే శాఖ. కొన్ని సంవత్సరాలుగా తన వంతు సామాజిక బాధ్యతగా లక్షలాది మంది ప్రయాణీకులను, సరుకులను ఒక చోటు నుండి మరొక చోటుకు తరలిస్తూ తక్కువ ఖర్చుతో సేవలను అందిస్తున్నది. సాధారణ పౌరుడు సైతం విశాల భారతదేశాన్ని సందర్శించడానికి ఉన్నటువంటి ఏకైక మార్గం రైలు మార్గం. కొత్త రైలు మార్గాలను ఏర్పాటు చేయడం, ప్రమాదాలు జరగకుండా చూడడం, ఒకవేళ ప్రమాదాలు జరిగినా నష్టాన్ని పూడ్చుకోవడానికి, నష్టపోయిన వారికి ప్రభుత్వమే సామాజిక బాధ్యతతో సేవలను అందిస్తూ వస్తున్నది అని 'మోడీ' సర్కారు సామాజిక బాధ్యత నుండి తప్పుకోవడానికి రైల్వే శాఖలో 49 శాతం ఎఫ్‌డిఐలకు అనుమతిని ఇచ్చింది. విదేశీ, ప్రైవేట్ పెట్టుబడులతోటి బుల్లెట్ రైళ్లను ప్రవేశపెట్టడం, రైలు మార్గాలను అభివృద్ధి చేయడం, ఇప్పటి వరకు ప్రభుత్వం బాధ్యతతో రైల్వే వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజలకు సేవలను అందించింది. ప్రమాదాల పట్ల కాని, నష్టాల పట్ల కాని ప్రభుత్వమే జవాబుదారీతనంగా ఉన్నది. కాని ఇప్పటి నుండి ప్రైవేట్, విదేశీ శక్తులకు అవకాశం కల్పిస్తూ వారిని భాగస్వామ్యం చేయడం వల్ల భవిష్యత్తులో జరిగే నష్టాలకు, ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహించాలి? ఇప్పటి లాగా తక్షణమే స్పందించే అవకాశం రైల్వే శాఖకు ఉంటుందా? లాభాలే ధ్యేయంగా పనిచేసే ప్రైవేట్ పెట్టుబడి దారులు ఇంతపెద్ద సామాజిక బాధ్యతను స్వీకరిస్తారా? అనేకానేక ప్రశ్నలు మన ముందు ఉన్నాయి. సాధారణ పౌరుడు సైతం ఎంత దూరమైనా ప్రయాణించే అవకాశం ఉన్న ఏకైక ప్రయాణ సౌకర్యం ఇప్పటి నుండి వారికి ప్రయాణం అనేది ప్రశ్నార్థకంగా మారబోతున్నది. ఇప్పటి వరకు కూడా రైలు మార్గాలు లేని పల్లెలు, పట్టణాలు అనేకం ఉన్నాయి. రైలు అంటే చూడని, ఎక్కని ప్రజలు లక్షలాది మంది ఉన్నారు. అటువంటి వారికి ప్రభుత్వమే సౌకర్యాలు అందించాల్సింది పోయి బాధ్యత నుండి తప్పుకొని పెట్టుబడి దారీ, కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే ధ్యేయంగా ఎఫ్‌డిఐలకు అనుమతినిచ్చి దళారి పాత్ర పోషిస్తున్నది.

ఇంకొక అతి ప్రధానమైన అంశం రక్షణ, భీమా రంగాలలో కూడా 49 శాతం ఎఫ్‌డిఐలను అనుమతించడం. రక్షణ రంగం అనేది దేశ సార్వభౌమాధికారానికి అత్యంత కీలకమైనది. విదేశీయుల దాడుల నుండి రక్షణ కల్పిస్తూ, భౌగోళిక సరిహద్దులను కాపాడుతూ దేశాన్ని రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నది. ప్రభుత్వానికి రక్షణ రంగంపై పట్టు, నియంత్రణ ఉన్నప్పుడు మాత్రమే ప్రజలకు రక్షణ కల్పించే అవకాశం ఉన్నది. దేశానికి అత్యంత కీలకమైన రంగంలో ఎఫ్‌డిఐలను అనుమతించడం దేశ సార్వభౌమాధికారానికి చాలా ప్రమాదకరం. దేశభక్తి, హిందూమతం, భారతమాత, స్వదేశీ వస్తువులు అనే గొప్ప పలుకులు పలికే బిజెపి, సంఘపరివార్ శక్తుల దేశభక్తి ఏమైనట్లు? విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం, విదేశీయులకు సార్వభౌమాధికారం అప్పచెప్పడం వీరి దేశభక్తా? అదే విధంగా భీమారంగం పలు భవిష్యత్ ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా తాము సంపాదించిన దాని నుండి కొంత పొదుపు చేసుకుంటారు. ఊహించని రీతిలో ఏదైనా ప్రమాదం జరిగితే ఆ నష్టాల నుండి బయట పడడానికి భీమా తదితర రంగాలలో పొదుపు చేసుకుంటారు. ఇది కూడా ఒక రకంగా ప్రజల భద్రతకు సంబంధించినది కూడా. మోడీ సర్కార్ ప్రజల భద్రత, ప్రయోజనాలు, అవసరాలు లెక్క చేయకుండా దేశ ప్రయోజనాల దృష్ట్యా మంచి చేస్తున్నామని బహిరంగంగా చెపుతూ ప్రజల జీవితాలను, భద్రతను కార్పొరేట్, విదేశీ శక్తులకు అప్పచెప్పే విధంగా మధ్య దళారిగా వ్యవహరిస్తున్నది.

వాజ్‌పేయి ప్రధాన మంత్రి పాలన కాలంలో పెట్టుబడుల ఉప సంహరణ మంత్రిత్వ శాఖను ఒక దానిని ఏర్పాటు చేసి ప్రధాన కీలక పారిశ్రామిక, ఇతర సంస్థల నుండి ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించుకొని ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కల్పించే ప్రక్రియను ప్రారంభించారు. మళ్లీ ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. స్వాతంత్ర్యానంతరం గొప్ప ఆశయాలతో భారతదేశం సామ్యవాద తరహా విధానాలతో ప్రభుత్వం పరిశ్రమలను స్థాపించి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు ఉపాధి కల్పించి ప్రజలలో సమానత్వాన్ని తీసుకురావాలనే సంకల్పంతో ప్రారంభ దశలో రష్యా, బ్రిటన్, జర్మని సహకారంతో ప్రభుత్వ యాజమాన్యంలో పరిశ్రమల స్థాపన చేయడం. కాని ఎన్‌డిఏ, బిజెపి సర్కార్ రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ 'సామ్యవాదం' అనే పదానికి అర్థం లేకుండా చేస్తూ మొత్తం పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్, విదేశీ శక్తులకు అమ్మే కుట్రలు చేస్తున్నది. ప్రజా పంపిణి వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకై, ప్రజల అవసరాలు తీర్చే విధంగా వారికి సబ్సీడీల రూపంలో వస్తువుల, సేవల పంపిణి చేయవలసిన అవసరం ప్రభుత్వ కనీస బాధ్యత. కాని పేద ప్రజలపై భారం మోపే విధంగా ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటిఒల ఒత్తిడి మేరకు సబ్సీడీలను ఎత్తివేసి అంతపెద్ద సామాజిక (కనీస) బాధ్యత నుండి తప్పుకుంటున్నది.

మొత్తంగా మోడీ ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలు, బిజెపి అనుబంధ సంఘాలైన సంఘపరివార్ శక్తులు చేసే కుట్రలు ప్రజలలో మతవిద్వేశాలను రెచ్చగొడుతూ, హిందూ మత ఛాందసవాదాన్ని నెలకొల్పే కుట్రలను తిప్పికొట్టవలసిన బాధ్యత మన మీద ఉన్నది. లౌకిక భారతదేశంలో భిన్న వర్గాల మతాల ప్రజలకు సమాన ప్రాతినిధ్యం, అవకాశాలు, గౌరవం, అభిప్రాయాలకు విలువ ఉండవలసిందే. కాని వీటికి విరుద్ధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా సంస్థలలో సంస్కృత భాష వారోత్సవాలు జరపాలని ప్రకటించగా తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుండి బహిరంగ వ్యతిరేకత వచ్చింది. పార్లమెంట్ హాలులో క్యాంటీన్ యజమాని రోజాలో ఉన్న ఒక ముస్లింపై శివసేన ఎంపి స్వయంగా దాడి చేసి నోట్లో చపాతి కుక్కి తన ఉపవాసాన్ని భగ్నం చేసే విధంగా బలవంతం చేశాడు. కెసిఆర్ తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా సానియా మీర్జాను ప్రకటించిన వెంటనే తెలంగాణ బిజెపి, విఎచ్‌పి వారు వ్యతిరేకించడం, చార్మినార్ కింద భాగ్యవతి దేవాలయం ఉన్నది, చారిత్రక చార్మినార్‌ను కూలదోయాల్సిందే అని ఒక బిజెపి నాయకుడు హెచ్చరించడం మళ్లీ రామమందిర నిర్మాణాన్ని పైకి తీసుకురావడం. ఇటువంటి సంఘటనలన్ని కూడా భవిష్యత్తులో మైనారిటీలకు అభద్రతను కల్గించే విధంగా ఉన్నాయి. ఇంత జరుగుతున్నా మన నేషనల్ మీడియాకు, సోషల్ మీడియాకు కనిపించడం లేదా అనేది ప్రశ్న? ఏదోరకంగా హిందూ మతశక్తులు తమ ఆధిపత్యాన్ని పెంచుకొని రాజకీయ మనుగడ సాగించడానికి అనేక కుట్రలు చేస్తూ ఉంటాయి. వీటన్నింటిని లౌకిక, ప్రజాస్వామ్య వాదులుగా మనందరం సంఘటితంగా ప్రతిఘటించి పోరాడవలసిన బాధ్యత మనమీద ఉన్నది. లేకపోతే మధ్య యుగాల నాటి కాలానికి దిగజారిపోయే ప్రమాదం ఉన్నది. వీ

(రచయిత ఉపాధ్యాయుడు)

మావోయిస్టు పార్టీ పదేళ్ల పురోగమనం

పది సంవత్సరాల కింద ఏర్పడిన మావోయిస్టు పార్టీ విశిష్టతలను, ఈ దశాబ్ది విజయాలను వివరిస్తున్నారు

వరవరరావు

జైళ్లు పోలీసులు లేని ప్రజారాజ్యం కార్మికుల నాయకత్వంలో ఎక్కడైనా కొద్దికాలమైనా నడిచిందంటే అది ప్యారిస్ కమ్యూన్ కాలంలో. బూర్జువా వర్గాన్ని సాయుధంగా కూలదోసి కార్మికులు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుని డెబ్బై రోజులపాటు శ్రామిక రాజ్యం అంటే ఎట్లా ఉంటుందో ప్రజల అనుభవానికి తెచ్చారు. కార్మికులే పాలకులుగా, శాసనకర్తలుగా, న్యాయనిర్ణేతలుగా మాత్రమే కాదు కవులు, కళాకారులుగా, సంపూర్ణ మానవులుగా రూపొందే క్రమం ఎట్లా సాధ్యమో ఒకదారి చూపారు. రోడ్లు, కాలువలు ఊడ్చేవాళ్లు, పాలమ్మే వాళ్లు, పత్రికలమ్మేవాళ్లు, యంత్రాలు నడిపేవాళ్లు తమను తాము పరిపాలించు కోవడంలోని కష్ట సుఖాలేమిటో స్వానుభవానికి తెచ్చుకున్నారు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌గా ఈనాటికీ కమ్యూనిస్టు శ్రేణులు, కార్మికులు అన్ని భాషలలో పాడుకునే అంతర్జాతీయ గీతాన్ని రాసిన యూజిన్ పోటియార్ ఈ ప్యారిస్ కమ్యూన్ కార్మికుల నుంచి ప్యారిస్ కమ్యూన్ అందించిన ఒక కళాకారుని నమూనాయే. ఈ కార్మికవర్గ విప్లవంలో స్వయంగా మార్క్స్, ఎంగెల్స్ పాల్గొన్నారు. అయితే తమకు ఒక ఉక్కు శిక్షణ నిర్మాణం లేదు గనుక బూర్జువా వర్గాన్ని కూలదోసే శక్తి ఉన్నా, తమ అధికారాన్ని ఎక్కువ కాలం కొనసాగించగల స్థితి లేదు గనుక తొందరపడవద్దని కార్మికులను హెచ్చరించారు గానీ బూర్జువావర్గ నియంతృత్వం కింద నలిగిపోతున్న కార్మికుల సహనం కట్టలు తెగింది. ఒడ్డున కూర్చోవడం కాకుండా ప్రవాహంలో దూకి మార్క్స్, ఎంగెల్స్ ఆ విప్లవానికి నాయకత్వం వహించారు. ప్యారిస్ కమ్యూన్ పతనం అయిన తర్వాత దాని నుంచి తాము తీసుకోవాల్సిన గుణపాఠంగానూ, భవిష్యత్ తరాలు తీసుకోవాల్సిన పాఠంగానూ – పటిష్ఠమైన నిర్మాణావశ్యకతను మార్క్స్ అప్పుడే చెప్పాడు. ప్రజల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి శ్రామికవర్గ నియంతృత్వ ఆవశ్యకత – అందువల్లనే ఏ మార్క్సిస్ట్ మేధావి బుర్రలో పుట్టింది కాదు – చరిత్ర గమనాగమన సంఘర్షణ లోంచి గ్రహించింది.

రష్యన్ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో లెనిన్‌కు కరదీపికగా పనికి వచ్చింది ఈ ప్యారిస్ కమ్యూన్ పతన అనుభవమే.

మార్క్స్, ఎంగెల్స్ శాస్త్రీయ సామ్యవాదాన్ని ప్రతిపాదించడానికి ఊహాజనిత, ఉదారవాద సామ్యవాద సిద్ధాంతకర్తలతో పోరాటం చేయవలసి వస్తే లేదా భావవాద సిద్ధాంతకర్తలతో, గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథంతో పోరాడాల్సివస్తే, లెనిన్ రష్యన్ విప్లవంలో అడుగడుగునా రివిజనిజంతో పోరాడాల్సి వచ్చింది. రివిజనిజం తిరగదోడేవాదం, వెనక్కి తీసుకువెళ్లేవాదం. విప్లవాభాసతో యథాతథ స్థితి. భావవాదం. దానినంతా క్రోడీకరిస్తే రెండు ధోరణుల మధ్య, రెండు పంథాల మధ్య పోరాటం. మెన్షివిక్కులతో పోరాటం. అందులోంచి పుటంపెట్టిన బంగారంలా, పులుగడిగిన ముత్యంలా వెలికొచ్చిందే బోల్షివిక్‌పార్టీ. బోల్షివిక్ పార్టీ నాయకత్వంలో బోల్షివిక్ విప్లవం. అది 1917 ఫిబ్రవరిలో బూర్జువా విప్లవంగా విజయవంతమై అక్టోబర్ నాటికి సామ్యవాద విప్లవంగా సాకారమైంది. 1924లో లెనిన్ మరణానంతరం, 1953 వరకు సోవియెట్ రష్యాలో స్టాలిన్ నాయకత్వంలో సామ్యవాద సమాజంగా 36 ఏళ్లు ప్రపంచ ప్రజలకు ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయావగాహనను, అనుభవాన్ని ఇచ్చింది.

బోల్షివిక్ పార్టీ, బోల్షివిజం (స్నేహభావన, సేవాభావన, త్యాగ భావన – కామ్రేడరీ), బోల్షివిక్ స్పిరిట్, బోల్షివీకరణ – ఇవ్వాళ ముందు చూపుకు– అబోవ్ ది బోర్డు – ఉండడానికి పర్యాయపదాలుగా రాజకీయ పరిభాషలోనే కాదు సాహిత్యంలోనూ చేరిపోయాయి.

ఉక్కు శిక్షణ గల కార్మిక వర్గ పార్టీ – కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం లేకుండా విప్లవం విజయవంతం కావడం గానీ, విజయవంతమైన విప్లవం నిలదొక్కుకోవడం గానీ సాధ్యం కాదని లెనిన్ తీసుకున్న సారం దాఖలాలే పైన పేర్కొన్న విజయాలు. కనుక విప్లవ విజయానికి బోల్షివిక్ పార్టీ నిర్మాణం ఒక ఆవశ్యకత.

రష్యా విప్లవంలో కార్మికవర్గం అత్యధిక శాతంగా పాల్గొన్న, అందులో రైతాంగం కూడ పాల్గొన్నది. జాతులు పాల్గొన్నాయి. లెనిన్ నిర్మాణం చేసిన ఎర్ర సైన్యంలోకి జార్ చక్రవర్తి సైన్యం నుంచి చీలిపోయి కూడ గణనీయ సంఖ్యలో వచ్చారు. రష్యా విప్లవం సాయుధ తిరుగుబాటు (రిసరెక్షన్)గా వచ్చింది. ఎనిమిది నెలల్లో బూర్జువా విప్లవం సామ్యవాద విప్లవంగా పరివర్తన చెందింది.

మావో సే టుంగ్ నాయకత్వంలో చైనా విప్లవం నాటికి రైతాంగ పోరాట అనుభవం నుంచి, ఆచరణ నుంచి విప్లవంలో రెండు దశలు ఏర్పడినవి. అది నూతన ప్రజాస్వామిక విప్లవంగానూ, సుదీర్ఘకాలపు సాయుధ పోరాటంగానూ ఎజెండా మీదికి వచ్చింది. పార్టీలో రివిజనిజానికి వ్యతిరేకంగా దీర్ఘకాలం పోరాటం చేయాల్సి వచ్చింది. అందుకు హూనాన్‌లో భూసంబంధాలు, వర్గాల అధ్యయనం చేసి పార్టీ ఆచరణానుభవంగా రుజువు చేయాల్సి వచ్చింది.

నూతన ప్రజాస్వామిక విప్లవంలో నాలుగు వర్గాల ఐక్య సంఘటన కార్మికవర్గ నాయకత్వంలో పోరాడి అధికారంలోకి రాగలదని తేలింది. పెటీబూర్జువా కర్షక శక్తులు విప్లవకర వర్గాలుగా, చిన్న, మధ్యతరగతి, పెటీబూర్జువా ఆధారపడదగిన స్నేహితులుగా, ధనిక రైతులు, జాతీయ బూర్జువావర్గం అనుకూలం చేసుకునే శక్తులుగా మార్చుకొని భూస్వామ్య పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శక్తులతో పోరాటం నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమమైంది.

ఇందులో భూస్వాధీన పోరాటం ప్రధాన ఆర్థిక కార్యక్రమంగా, వ్యవసాయ విప్లవం ఇరుసుగా, గెరిల్లా పోరాటం సైనికరూపంగా ముందుకువచ్చాయి. ఈ సుదీర్ఘకాల రైతాంగపోరాటం తనకు తాను

ప్రజల నుంచి ప్రజాసైన్యాన్ని రూపొందించుకోవాల్సి వచ్చింది. ఈ ప్రజా సైన్యం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో చేసిన లాంగ్ మార్చ్‌యే జపాన్ సామ్రాజ్యవాదాన్ని, చాంగ్‌కై షేక్ నాయకత్వంలోని దళారీవర్గ నాయకత్వాన్ని కూలదోసి చైనా విముక్తిని, విప్లవాన్ని 1 అక్టోబర్ 1949న నిజం చేశాయి. ఈ నూతన ప్రజాస్వామిక విప్లవం 1949 నుంచి 1956 దాకా రెండుకాళ్లపై నడిచి వ్యవసాయాన్ని, పరిశ్రమలను అభివృద్ధి పరిచే క్రమంలో ఒక పెద్ద గెంతుగా 1956లో సామ్యవాద దశలో ప్రవేశించింది.

1956 నుంచి 1966 వరకు అభివృద్ధి, ప్రయోగం, వర్గపోరాటం అనే మూడు అంశాల గతితార్కిక సంబంధంలో సాగిన సామ్యవాద కృషిలో వచ్చిన సమస్యలను పరిష్కరించుకోవడానికే 1966లో శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం మళ్లీ స్వయంగా మావో సే టుంగ్ చేపట్టాల్సి వచ్చింది.

అదే కాలానికి ఒక దశాబ్దం పాటు వర్గ సామరస్య సిద్ధాంతంతో వర్గపోరాట సిద్ధాంతం చేసిన మహత్తర చర్చ ముగిసింది.

మన దేశంలోనూ 1951 తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విరమణ కాలం నుంచి కమ్యూనిస్టు పార్టీలో రివిజనిజం మీద జరుగుతున్న పోరాటం 1964 చీలిక భ్రమల నుంచి కూడ బయటపడి 1967లో నక్సల్బరీ వసంత గర్జనగా విప్లవం మళ్లీ అజెండా మీదికి వచ్చింది.

చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం పార్టీ నిర్మాణంతోపాటు ముందుకు తెచ్చిన మరో రెండు అత్యావశ్యక అద్భుత ఆయుధాలు – ఐక్య సంఘటన, ప్రజాసైన్యం.

'పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' అని కమ్యూనిస్టు ప్రణాళిక రచన కాలంలో మార్క్స్ కార్మికవర్గానికి ప్రబోధించిన కాలం నుంచి కార్మికవర్గ విప్లవ పురోగతికి ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు దక్కేదేమీ లేదు – అనే ఒక పోరాట అనుభవాన్ని ఇచ్చింది.

ఈ చారిత్రక విప్లవ పోరాట అనుభవాల నుంచి, ఆచరణ నుంచి రివిజనిజం మీద చేసిన చారిత్రాత్మక పోరాటంగా ముందుకు వచ్చింది నక్సల్బరీ పంథా.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో 1946లో 'చైనా మార్గమే మన మార్గం' అని నూతన ప్రజాస్వామ్య విప్లవ అవసరాన్ని గుర్తించినప్పటికీ ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ఐక్య సంఘటన నిర్మించినంత దృఢంగా పార్టీ నిర్మాణంగానీ, ప్రజాసైన్య నిర్మాణంగానీ చేయలేకపోయింది. రాజ్యాధికారం మీద దృష్టిని కేంద్రీకరించలేక పోయింది. 1946లోనే ప్రారంభమైన రెండు పంథాల మధ్య పోరాటంలో నాయకత్వ విద్రోహం వల్ల 1951 నాటికి రివిజనిజానిది పైచేయి అయింది. సాయుధ పోరాట విరమణ జరిగింది. నాయకత్వం ప్రజలకు విద్రోహమే చేసింది. ఇండియన్ యూనియన్ సైన్యం హైదరాబాద్ రాజ్యంపై దురాక్రమణ చేసి మూడువేల మంది కమ్యూనిస్టులను, సానుభూతిపరులను చంపివేసింది. ఇటువంటి దురాక్రమణ దినాన్ని 17 సెప్టెంబర్ (1948)ను తెలంగాణ స్వాతంత్ర్య దినంగా, విముక్తి దినంగా తెలంగాణ ప్రభుత్వం పాటించాలని కరదు గట్టిన హిందూ మతతత్వపార్టీ కన్న పెద్ద గొంతుక పెట్టుకొని ఇవ్వాళ సిపిఐ కోరడం రివిజనిజం ఏ స్థాయికి దిగజారగలదు అనడానికి నిదర్శనం. ముఖ్యంగా ఇవ్వాళ మోడీత్వ సామ్రాజ్యవాద దళారీ హిందూత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రగతిశీల, లౌకిక, ప్రజాస్వామిక, విప్లవశక్తులు కలిసి పోరాడాల్సిన సందర్భంలో ఇదొక విషాదం.

1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిక రేకెత్తించిన వర్గపోరాటాకాంక్ష వెలుగులో అప్పటి సిపిఐ (ఎం) డార్జిలింగ్ సిలిగురి డివిజన్ కార్యదర్శి చారు మజుందార్ ఎనిమిది దస్తావేజులు రచించాడు. రివిజనిజానికి వ్యతిరేకంగా ఎనిమిది చారిత్రాత్మక పత్రాలు – డాక్యుమెంట్లు, లేదా తెరాయి డాక్యుమెంట్లుగా ప్రసిద్ధమైన ఆ ప్రతిపాదనలే నక్సల్బరీ పోరాటానికి ప్రాతిపదిక అయినవి.

1967 మేలో నక్సల్బరీ విస్ఫోటనం నాటికి విప్లవ శక్తుల ముందుకు అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే కాదు, 1966 నాటికి రివిజనిజం సోషల్ సామ్రాజ్యవాదంగా కూడ పరిణమించిన అవగాహనతో ఆ పోరాటం కూడా అవసరమైంది.

నక్సల్బరీ పంథా ఈ దేశ ప్రజల ముందు నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమంలో భాగంగా నిర్దిష్టమైన కార్యాచరణను ఉంచింది. అశేష ప్రజానీకానికి ఫ్యూడలిజానికి మధ్యనున్న ప్రధాన వైరుధ్యాన్ని పరిష్కరించడానికి వ్యవసాయ విప్లవంలో భాగంగా భూస్వాధీనమనే ఆర్థిక పోరాటం. భూమిలేని నిరుపేదలు, వ్యవసాయ కూలీలు విప్లవకర వర్గాలుగా ఈ పోరాటంలో ముందు శ్రేణిలో ఉంటారు. గ్రామాల్లో ఫ్యూడల్ భూస్వాములే ఈ పోరాట ప్రజలపై తమ తైనాతీలను, గూండాలనే కాకుండా ప్రభుత్వ సహాయంతో పోలీసు బలగాలను కూడ దాడికి తెచ్చుకుంటారు గనుక పోరాట శక్తులు గెరిల్లా పోరాటమనే సైనిక రూపాన్ని చేపట్టాలి. అయితే శత్రువును దెబ్బతీసి గ్రామాలను విముక్తం చేసి పట్టణాలను చుట్టుముట్టి స్థావర యుద్ధం చేసి అంతిమంగా రాజ్యాధికారాన్ని కైవసం చేసుకున్నప్పుడు గానీ ప్రజలకు రాజకీయాధికారం రాదు. కనుక రాజ్యాధికారాన్ని ధిక్కరించే, బలహీనపరిచే, కూలదోసే వర్గపోరాటంగా కార్మికవర్గ నాయకత్వంలో రైతాంగం పోరాడాలి – ఇదే నక్సల్బరీ సందేశం.

1969 ఏప్రిల్ 22న లెనిన్ శతజయంతి రోజు మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుంచి ఒక ఉక్కు శిక్షణ గల పార్టీ నిర్మాణ కృషిలో ఎన్నో నష్టాలు, ఆటుపోటులు, చీలికలు చవి చూడాల్సి వచ్చింది. ఒకవైపు నక్సల్బరీ వెలుగులో శ్రీకాకుళం, లకింపూర్ ఖేరీ, ముషాహరీ, గోపీనల్లభ్‌పూర్, వైనాడు పోరాటాలు, బీహార్‌లో దక్షిణ దేశ పోరాటాలు పెల్లుబికినా, పంజాబ్ దాకా నక్సల్బరీ ప్రభావం విస్తరించినా దెబ్బల ఆరంభానికే సెట్ బ్యాక్‌కు కూడ గురయింది.

ఏడో దశాబ్దమంతా మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీ చీలికల విషాదం గానే మన ముందు చరిత్ర చేదు నిజాలు నిలిపింది. 1974లో శ్రీకాకుళ పోరాట వైఫల్యానికి ప్రజాపంథాను అమలు చేయడంలో లోపాలే కారణమని స్వీయ విమర్శ చేసుకుని ఒక ఐక్యతా ప్రయత్నం మొదలై సిపిఐఎంఎల్‌సిఒసి ఏర్పడింది. 1976లో ఆ పార్టీ తెలంగాణ ప్రాంతీయ కమిటీ 'రోడ్ టు రెవల్యూషన్' (విప్లవానికి బాట) రూపొందించుకొని ప్రజల్లో పనిచేయడం ప్రారంభించింది. అది దేశంలో ఎమర్జెన్సీ కాలం. 1977లో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత ప్రజా పంథాలో విప్లవ వెల్లువ పర్యవసానమే 1978 ఫిబ్రవరిలో రాడికల్ విద్యార్థి సంఘం ఇచ్చిన గ్రామాలకు తరలండి పిలుపు. 1978 మేలో రాడికల్ యువజన సంఘం ఏర్పడి జననాట్యమండలి తోడుగా అది అమలు చేసే క్రమం నుంచే 78 సెప్టెంబర్ 8న జగిత్యాల జైత్రయాత్ర సాధ్యమైంది. నక్సల్బరీ పోరాటం సిపిఐ ఎంఎల్‌కు ప్రాతిపదిక అయినట్లుగానే సిరిసిల్ల జగిత్యాల పోరాటాలు సిపిఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ ఏర్పడడానికి ప్రాతిపదిక అయినవి. ఇంక ఇక్కడి నుంచి మళ్లీ విప్లవ నిర్మాణాల ఐక్యతా కృషి మొదలయింది. 1981లోనే సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ బీహార్,

బెంగాల్‌లో సాయుధ విప్లవంలో నిమగ్నమైన ఎంసిసిఐతోనూ, సిపిఐ ఎంఎల్ పార్టీ యూనిటీతోనూ ఐక్యతా ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఎనిమిది, తొమ్మిది దశాబ్దాలను మళ్లీ విప్లవ నిర్మాణాల ఐక్యతా కృషి దశాబ్దాలుగా పేర్కొనవచ్చు. స్థూలంగా మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీలో ఈ ఐక్యతా ప్రయత్నాల్లో భాగంగా ఒక పోలరైజేషన్ వచ్చింది.

ఎంఎల్ పార్టీగా ఏదో ఒక రాష్ట్రంలో, ప్రాంతంలో సాయుధ దళాలతో విప్లవ ప్రచారంలో, కార్యక్రమంలో ఉంటూనే, పార్లమెంటరీ రాజకీయాల్లో, ముఖ్యంగా ఎన్నికల్లో కూడ పాల్గొంటున్న పార్టీలు ఒకవైపు, నక్సల్బరీ పోరాటంలోనే నిరాకరించబడిన పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరిస్తూ సాయుధ పోరాటంలో నిమగ్నమైన విప్లవ పార్టీలు ఒకవైపు ఐక్యమయ్యే ప్రాసెస్‌గా స్థూలంగా దీనిని పేర్కొనవచ్చు.

సిపిఐ ఎంఎల్ పార్టీ యూనిటీతో సిపిఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ ఐక్యమై 1998లో సిపిఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ ఏర్పడింది. 2004 సెప్టెంబర్ 21న ఈ పార్టీ ఎంసిసిఐతో కలిసి సిపిఐ మావోయిస్టుగా ఏర్పడింది. అప్పటికే మరికొన్ని విప్లవపార్టీలు అటు ఎంసిసిఐలోను, ఇటు పీపుల్స్‌వార్‌లోనూ ఐక్యమై ఉన్నాయి. కనుక 2004 సెప్టెంబర్ 21న ఉక్కు శిక్షణ గల కమ్యూనిస్టు నిర్మాణంలో ఒక కీలకదశగా పేర్కొనవచ్చు. భారత విప్లవోద్యమంలో ఒక ప్రధాన ఘట్టంగా కూడ పేర్కొనవచ్చును. అప్పటికే రెండు రాష్ట్రాలుగా ఏర్పడిన బీహార్ ఝార్ఖండ్‌లలో విప్లవోద్యమం విస్తరించింది. అట్లాగే మధ్యప్రదేశ్ – ఛత్తీగడ్‌లుగా ఏర్పడిన రెండు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గడ్‌లో విప్లవోద్యమం విస్తరించి, పొరుగున మహారాష్ట్రలో ఉన్న గడ్చిరోలిని కూడ కలుపుకొని దండకారణ్య విప్లవోద్యమంగా ప్రసిద్ధమైంది. నక్సల్బరీ పంథాలో దండకారణ్య బీహార్ – జార్ఖండ్ విప్లవ పోరాటాలు వర్ధిల్లాలి అనే నినాదం ప్రజల్ని ఉత్తేజపరిచింది.

1980లో సిపిఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ ఏర్పడి దండకారణ్య పర్‌స్పెక్టివ్ రూపొందించుకున్న కాలంలో చారుమజుందార్ ఎనిమిదవ దస్తావేజులు (1965–67)లో ప్రతిపాదించిన ఒకటికన్నా ఎక్కువ విముక్తి ప్రాంతాలను దేశంలో సాధించాలనే ప్రయత్నాన్ని ఒక విధంగా 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో ఆదిలాబాద్ జిల్లా గిరిజన రైతుకూలీ సంఘం సభలపై పోలీసులు జరిపిన కాల్పులు వేగవంతం చేశాయి.

1980లో పార్టీ గడ్చిరోలికి పెద్దశంకర్ నాయకత్వంలో పంపించిన దళం నవంబర్ 2న 'ఎన్‌కౌంటర్'లో ఆయన అమరత్వంతో కొంత నష్టపోయినప్పటికీ బస్తర్‌కు పంపించిన ఏడు దళాలు ఇంచుమించు తక్కువ నష్టాలతో ఇవ్వాల్టికీ నిలదొక్కుకొని విస్తరించినవి. మొదట ఆదివాసులతో కలిసి మెలిసి వాళ్ల విశ్వాసాన్ని చూరగొని, వాళ్ల భాషా సంస్కృతులను అలవరచుకొని, వాళ్లకు జననాట్య మండలి పాటల ద్వారా తెలంగాణ, ఆంధ్ర ప్రాంతపు పోరాటాలను పరిచయం చేసి వాళ్లు తీవ్రంగా ద్వేషిస్తూ భయపడుతూ తిరగబడుతూ ఉన్న అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని స్థిరపడింది. గోండ్వానా రాజ్యంలో రాజవంశాలుగానూ, తెగ పెద్దలుగానూ ఉన్న భూస్వామ్య వర్గాలను ప్రతిఘటించి లొంగదీసుకొని వాళ్ల ఆక్రమణలో ఉన్న వందలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవడం రెండవ దశ అయింది. ఈ దశలోనే భూస్వాములకు అండగా రాజ్యం పోలీసు బలగాలను దించి అణచివేత అభియాన్‌లను ప్రారంభించింది. 1995 పీపుల్స్‌వార్ స్పెషల్ కాన్ఫరెన్స్ మొదటిసారిగా ఇటు ఉత్తర తెలంగాణలోనూ, అటు దండకారణ్యంలోనూ గ్రామరాజ్య కమిటీల నాయకత్వంలో గ్రామాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసింది.

1991లో ప్రారంభమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయంగా పార్టీ చేపట్టిన అభివృద్ధి నమూనా ఇది. విప్లవోద్యమానికి, కమ్యూనిస్టు పార్టీకి ఎల్లవేళలా ఉండే దున్నేవారికే భూమి – భూస్వాధీన పోరాటంతో పాటు, వనరుల మీద అధికారం, అభివృద్ధి పథకాలను వ్యవసాయ, నీటిపారుదల, విద్య, వైద్య, న్యాయరంగాల్లో అమలు చేయడం వంటి ప్రజాస్వావలంబన విధానాల రూపకల్పన జరిగి అది ఉత్తర తెలంగాణలో తీవ్ర రాజ్యహింసవల్ల నష్టపడినప్పటికీ దండకారణ్యంలో 2004 నాటికి తీవ్ర నిర్బంధంలో కూడా మునుసాగింది. అప్పటికి విప్లవోద్యమానికి ఆదివాసులలో ప్రజా పునాది బలపడింది.

2004లో ఏకకాలంలో విప్లవోద్యమంలో మూడు కీలక ఘటనలు జరిగాయి. అవి 1) సిపిఐ ఎంఎల్ పీపుల్స్ వార్ ఎంసిసిఐల ఏకీకరణ. ఐక్య మావోయిస్టు నిర్మాణం, 2) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు విప్లవ పార్టీలతో జరిపిన చర్చలు, 3) ఈ రెండు విప్లవోద్యమ అనుకూల పరిణామాల నుంచి బయట పడడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకున్న అణచివేత, రాజ్యహింస. అందుకు ఏపిలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఎన్‌కౌంటర్ హత్యలు, కోవర్టు హత్యలు, పార్టీపై, ప్రజాసంఘాలపై నిషేధం, అరెస్టులు, ప్రజాసంఘాల నాయకుల హత్యలు ఎంచుకుంటే, చత్తీస్‌గడ్ ప్రభుత్వం సాల్వాజుడుంను ఎంచుకున్నది. ఆదివాసులలోనే ఒక సెక్షన్‌ను భయపెట్టి, ప్రలోభపెట్టి లొంగదీసుకొని సాయుధం చేసి విశృంఖల హింసకు పురికొల్పింది. గ్రామాలకు గ్రామాలు తగులబెట్టింది. వందలాది మంది ఆదివాసీ మహిళలను సామూహిక అత్యాచారాలకు గురిచేసింది. వందలాది మంది ఆదివాసులను మావోయిస్టుల ముద్ర వేసి చంపింది. గృహ దహనాలు, ధాన్యాగారాల దహనాలకు పూనుకొని విధ్వంసాన్ని సృష్టించింది.

ఆ నిర్బంధాన్నంతా నిలవరించి ఐక్య మావోయిస్టు పార్టీ గ్రామ రాజ్య కమిటీల ఉన్నత రూపమైన జనతన సర్కార్ నిర్మాణాన్ని చేపట్టింది. శ్యాం, మహేశ్, మురళిల అమరత్వం తొలి సంవత్సరంలో ప్రకటించిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీని ప్లటూన్‌లలోకి పీపుల్స్ మిలీషియాలోకి పెంపొందించింది. 2010 గుండాదుర్ శతజయంతి కాలానికి దానికి గుండాదుర్ మిలిషియా అని పేరుపెట్టింది. (గుండాదుర్ వంద సంవత్సరాలకు పూర్వం బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని సాయుధంగా ప్రతిఘటించిన ఆదివాసీ యోధుడు.) జనతన సర్కార్ నాలుగు వర్గాల ఐక్యసంఘటన, 1) భూమిలేని నిరుపేదలు, వ్యవసాయ కూలీలు; 2) చిన్న; 3) మధ్యతరగతి రైతులు; 4) ధనిక రైతులు. ఐక్య సంఘటనకు దృఢమైన కార్మికవర్గ నాయకత్వం ఉంటుంది. లక్షలాది ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని ఏ ఒక్క కుటుంబానికీ మూడెకరా లకు తగ్గకుండా పంచి చదును చేసుకొని పోడు (మాడ్ ప్రాంతంలో) దశ నుంచి స్థిర వ్యవసాయ దశ దాకా అభివృద్ధి చేసి సహకార, సమష్టి రంగాల్లో వ్యవసాయం చేస్తూ గ్రామ, సహకార భావాలతో, స్వావలంబన, ప్రజాసార్వభౌమాధికార లక్ష్యంగా ఈ పురోగమనం సాగుతున్నది. విద్య, ఆరోగ్యాలే కాకుండా, న్యాయం, పర్యావరణ, సంస్కృతి, మహిళా రంగం వంటి అన్ని రంగాలను స్పృశిస్తూ దండకారణ్యంలో ప్రజలకు సర్కార్ గుర్తించబడే స్థాయికి చేరింది. అందుకే ఇప్పుడది 2009 నుంచి క్రాంతికారి జనతన సర్కార్‌గా పిలవబడుతున్నది. నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో ఇది నాలుగు వర్గాల ఐక్య సంఘటనగా ఉంటుందనేది మనం గుర్తించవలసిన ముఖ్యమైన అంశం.

ఐక్య మావోయిస్టు పార్టీ నిర్మాణంలో 2004 నాటికే ఎంసిసి

ప్రజా ఉద్యమ కొత్త కెరటానికి పదేళ్లు

***రెండు ప్రధానమైన విప్లవ పార్టీలు ఏకమై పది సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ పది సంవత్సరాల విజయాలను, లోపాలను అంచనా వేస్తున్నారు* ఎస్. జనార్ధన్**

భారత పీడిత ప్రజా ఉద్యమాల చరిత్రలో 2004 సెప్టెంబర్ 21 ఒక కీలకమైన మైలురాయి. పాలకవర్గాల దోపిడీకీ, పీడనకూ, ఆధిపత్యానికీ వ్యతిరేకంగా భారత సమాజంలో వేలాది సంవత్సరాలుగా సాగుతున్న పీడిత ప్రజా ఉద్యమాలు 1967 నక్సల్బరీ వసంతమేఘ గర్జనతో ఒక శాస్త్రీయ మార్గం చేపట్టాయనుకుంటే, నాలుగు దశాబ్దాల నక్సల్బరీ పంథా జయాపజయాల కలనేత చరిత్రతో సాగింది. అణచివేత, అపారమైన త్యాగాలు, ఉద్యమపు వెనుకంజ, సమీక్ష, పునరాగమనం, ప్రజాసంఘాల నిర్మాణం, విస్తరణ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఏర్పాటు, బీజరూప గ్రామ రాజ్యాధికార సంస్థల నిర్మాణం వంటి మెట్లు ఒకటొకటిగా ఎక్కుతూ సాగింది. సెప్టెంబర్ 21, 2004 ఆ చరిత్రకు కొనసాగింపుగా, భారత పీడిత ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రజాశక్తుల ఐక్యత దిశగా ఒక పెద్ద ముందంజగా చరిత్రలో నిలిచిపోతుంది. ఆరోజున భారత పీడిత ప్రజా ఉద్యమంలోని రెండు ప్రధానశక్తులు - భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు) (పీపుల్స్ వార్), మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా - విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడింది. ఆ పార్టీ ఏర్పడి ఏడాదిన్నర నిండకుండానే స్వయంగా దేశ ప్రధాని దాన్ని 'దేశంలో అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదం'గా అభివర్ణించాడు. అంతకుముందు నుంచే సాగుతున్న దమనకాండ మరింత పెచ్చరిల్లింది. ఈ పది సంవత్సరాలలో దేశంలో విప్లవోద్యమం చెప్పుకోదగిన విజయాలూ సాధించింది, బలమైన ఎదురుదెబ్బలూ తిన్నది. ఆ పార్టీ ఏర్పడి ఒక దశాబ్ది గడిచిన సందర్భంగా దాని గమనాన్ని, జయాపజయాలను, దానికి వ్యతిరేకంగా పాలకవర్గ దమనకాండను అంచనావేసి, భవిష్యత్తు గురించి ఆలోచించడం అవసరం.

మొట్టమొదట భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఈ దశాబ్ది కాలంలో గణనీయమైన విజయాలెన్నిటినో సాధించిందని గుర్తించకతప్పదు. అందులో అంతర్భాగమైన రెండు పార్టీలుగాని, ఇతర పార్టీలు గాని విడివిడిగా అంతకుముందరి మూడు దశాబ్దాలలో సాధించిన విజయాల కన్న ఈ దశాబ్ది విజయాలు రాశిలోనూ, వాసిలోనూ విస్తృతమైనవి, ఉన్నతమైనవి. ఏ ప్రజా ఉద్యమానికైనా ఐక్యత, విస్తరణ, సమీకృత శక్తి తప్పనిసరిగా మెరుగైన ఫలితాలను ఇస్తాయని చెప్పడానికి ఈ దశాబ్ది కాలమే ఉదాహరణగా నిలుస్తుంది.

ఈ పది సంవత్సరాలలో భౌగోళికంగానూ, ప్రజాపునాదిలోనూ ఉద్యమం సాధించిన విస్తరణ అపారమైనది. నక్సల్బరీ ప్రజ్వలనం తర్వాత రెండు మూడు సంవత్సరాలలో ఉద్యమం దేశంలోని చాల రాష్ట్రాలకు విస్తరించినప్పటికీ, అప్పటి విస్తరణ కన్న ప్రస్తుత విస్తరణ భాగస్వామ్యంలోనూ, సామర్థ్యంలోనూ, ప్రభావంలోనూ మెరుగైనది. అప్పుడు బెంగాల్ లో ఒక గ్రామంలో మొదలైన నిప్పురవ్వ ఆంధ్రప్రదేశ్, కేరళ, బీహార్,

పీపుల్స్‌వార్ మాత్రమే కాకుండా సెకండ్ సిసి, పంజాబ్‌లోని లాల్‌తారా, చమక్‌తే లాల్‌తారా వంటి పార్టీలు, సిపిఐ నుంచి గణనీయమైన సంఖ్యలో వచ్చిన విప్లవశ్రేణులు అన్నీ చేరాయి. 2014 మేలో సిపిఐ ఎంఎల్ నక్సల్బరీ చేరికతో ఇది మరింత బోల్షివీకరణవైపు పురోగమించింది. ఇంకా బయట కొన్ని విప్లవ పార్టీలు, గ్రూపులు, శక్తులు, వ్యక్తులు మిగిలే ఉన్నారని భావించవలసి ఉంటుంది. అట్లాగే పార్లమెంటరీ రాజకీయాలు వదలకుండానే విప్లవ రాజకీయాలు మాట్లాడుతున్న ఎంఎల్ పార్టీలు, రివిజనిస్టు పార్టీల వెనుక ఉన్న విప్లవ శ్రేణులను కూడ కలుపుకోకుండా భారత విప్లవాన్ని విజయవంతం చేయగల బోల్షివిక్ పార్టీ నిర్మాణం పూర్తి చేసినట్లు కాదు. అందుకే ఒక సంవత్సరం పైగా ఐక్య మావోయిస్టు పార్టీ నిర్మాణం, ఉద్యమం బోల్షివీకరణపై దృష్టి పెట్టింది.

మూడు అద్భుతాలుగా మావో సే టుంగ్ పేర్కొన్న పార్టీ, ఐక్య సంఘటన, ప్రజాసైన్యాల నిర్మాణాలు గత పది సంవత్సరాల్లో సాధించిన విజయాలు దండకారణ్యంలో క్రాంతికారి జనతన సర్కార్ నిర్మాణం మాత్రమే కాకుండా, జార్ఖండ్, బీహార్‌లలో విముక్త ప్రాంత నిర్మాణ దిశగా పురోగమనం, జంగల్ మహల్, నారాయణపట్నా పోరాటాలు పేర్కొనదగినవి.

ఈ దశాబ్దంలో ఈ ఐక్య విప్లవోద్యమ పురోగమనాన్ని, లక్ష్యాలను సమీక్షించుకోవడానికి, అధ్యయనం చేసి చర్చించడానికి అఖిల భారత స్థాయిలో ఒక రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక ఏర్పడింది. ఆ వేదిక తరపున సెప్టెంబర్ 21న హైదరాబాద్‌తో ప్రారంభించి దేశవ్యాప్తంగా సదస్సులు, సభలు నిర్వహించనున్నది. ప్రజల సార్వభౌమాధికారం పట్ల, ప్రకృతి సంపద, మానవసారం, మానవ సంబంధాల పట్ల వ్యగ్రతతో ఆరాటపడుతున్న, ఆందోళనచెందుతున్న, పోరాడుతున్న దేశాభిమానులు, ప్రజాస్వామ్యవాదులు, పర్యావరణవాదులు, విప్లవాభిమానులు ఈ చర్చలో పాల్గొని దేశంలో ప్రజల ప్రత్యామ్నాయ రాజకీయాలకొక ఉద్యమాన్ని, నిర్మాణాన్ని దృఢపరిచే కృషిలో పాలు పంచుకోవాల్సిన క్లిష్ట సమయంలో మనమున్నాం. ఇజ్రాయిల్ జియోనిస్ట్ క్రిస్టియానిటీ అమెరికన్ సామ్రాజ్యవాదానికి దన్నుగానిలిచి పాలస్తీనా విధ్వంసానికి పూనుకున్నట్లుగా మన దేశంలో హిందుత్వ మోడీత్వ అభివృద్ధి నమూనా పేరుతో సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తుల కోసం తూర్పు, మధ్య భారతాల్లో ప్రజలపై యుద్ధమే ప్రకటించిన సమయమిది. ఐక్య విప్లవోద్యమ నాయకత్వం లేకుండా, యుద్ధాన్ని ప్రజాయుద్ధంలో ప్రతిఘటించకుండా ప్రజల చేతికి రాజ్యాధికారం రాకుండా ఈ ప్రమాదాన్ని మనం అధిగమించలేం.

(రచయిత విప్లవ కవి, విప్లవ రచయితల సంఘం నాయకులు) వీ

ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలకు ప్రధానంగా విస్తరించగా, 2004 విలీనం వల్లగాని, విలీనానంతర విస్తరణ వల్ల గాని ఉద్యమం కనీసం పదహారు రాష్ట్రాలలో నిర్మాణాలను ఏర్పాటు చేసుకుందని పాలకవర్గాలే ప్రకటిస్తున్నాయి. వీటిలో తొమ్మిది రాష్ట్రాల అధికారులు నిరంతర సంబంధాలతో ఉమ్మడి అణచివేత చర్యలు చేపడుతున్నారు. దేశంలోని అంతర్గత ప్రమాదాలన్నిటిలోకీ తీవ్రమైనదని ప్రకటించిన ప్రధానమంత్రి, ఆ కూటమి అధికారం కోల్పోయినా, ఆ తర్వాతి ప్రధానమంత్రి, హోంమంత్రిత్వ శాఖా అదే మాట వల్లిస్తున్నాయి.

ఈ భౌగోళిక విస్తరణను పాలకవర్గాలకు అలవాటయిన 'ఘటనల'తో చూడనక్కరలేదు. 'ఘటనలు' జరగకపోయినా మావోయిస్టు నాయకత్వం లోని ప్రజా ఉద్యమ క్రమం ఎలా విస్తరిస్తున్నదో చూస్తే ఈ పది సంవత్సరాలలో ఉద్యమ ప్రజా పునాదిలో వచ్చిన విస్తరణ, దాని ప్రభావం మరింత లోతైనవి. అంతకుముందు నుంచీ ఆదివాసులలో ఉన్న పునాది ఈ పది సంవత్సరాలలో మరింత బలపడింది. ఆదివాసులు విప్లవోద్యమ నిర్మాణాలలోకి మరింత ఎక్కువగా రావడం మాత్రమే కాదు, నాయకత్వం వహించడం ప్రారంభించారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, అభివృద్ధి పేరుతో విస్థాపన, అవినీతి వంటి కారణాలవల్ల దేశవ్యాప్తంగానే దళిత, మైనారిటీ, వెనుకబడిన కులాల సామాజిక వర్గాలలో అసంతృప్తి పెరిగింది. ఉద్యమ ప్రభావం, ఉద్యమం పట్ల సానుభూతి సమాన స్థాయిలో కాకపోయినా కొంతవరకు పెరిగాయి. మధ్యతరగతిలో ఒక చిన్న భాగం ప్రపంచీకరణ ఫలాలలో వాటా పొంది, ఆ ప్రభావానికి లోను కావడం వల్ల కొంత దూరం జరిగి ఉండవచ్చు గాని, ఒక పెద్ద భాగం అవే ప్రపంచీకరణ విధానాల వల్ల, మతోన్మాదం పెచ్చరిల్లడం వల్ల నేరుగా ఈ ఉద్యమ ప్రభావంలోకి రాకపోయినా, రాలేకపోయినా మొత్తంగా సామాజిక మార్పు అవసరమనే ఆలోచనలోకి వచ్చారు. అలాగే ప్రపంచీకరణ విధానాల వల్ల కార్మికవర్గంలో పెరిగిన అసంతృప్తి, సమరశీల వైఖరి విప్లవోద్యమం వైపు చూసేలా చేస్తున్నది. గుర్ గావ్, మానేసర్, యానాం ల సమరశీల కార్మిక పోరాటాలన్నిటిలో పాలకవర్గాలు మావోయిస్టు ప్రభావాన్ని చూడడం యాదృచ్ఛికం కాదు. ఇలా అన్ని మౌలిక వర్గాలలోను విప్లవోద్యమం పట్ల అనుకూలత మాత్రమే కాదు, విశ్వాసం కూడ పెరిగింది.

ఈ పది సంవత్సరాలలోనే భారత విప్లవోద్యమానికి దేశీయంగా ప్రభావశీలమైన మధ్యతరగతి మేధావి వర్గంలోనూ, అంతర్జాతీయ ప్రగతిశీల వర్గాలలోనూ కూడ సంఘీభావం విస్తృతంగా పెరిగింది.

ఉద్యమ విజయాలలో, ప్రభావ విస్తరణలో ఈ భౌతిక పరిస్థితితో పాటు స్వీయాత్మక శక్తులలో ఒక విజయాన్ని కూడ ప్రత్యేకంగా పరిగణించవలసి ఉంది. ఈ పది సంవత్సరాలలో ఉద్యమ నిర్మాణపు సైనిక పాటవం చెప్పుకోదగినంతగా పెరిగింది. అంతకుముందు మూడు దశాబ్దాలుగా విప్లవానుకూల శక్తులలో కూడ కొంతవరకు ఉండిన అనుమానాలను, భయ సందేహాలను పోగొట్టేలా ఈ పది సంవత్సరాలలో ఉద్యమ నిర్మాణం తన సైనిక పాటవాన్ని పెంచుకుంది. అనేక నష్టాలను చవిచూస్తూ కూడ పురోగమించి, పాలకవర్గ శక్తుల మీద ఎన్నో సైనిక విజయాలు సాధించింది. ఒకరకంగా పాలకవర్గాలలో భయాన్ని వ్యాపింపజేసింది. లక్షలాది పాలకవర్గ పోలీసు, అర్ధసైనిక బలగాల దాడులను, కుట్రలను, దుష్ప్రచారాలను, హత్యలను, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన, మానవరహిత ప్రయోగాన్ని, చివరికి సైనిక బలగాల ప్రయోగం, వైమానిక బాంబుదాడుల ప్రతిపాదనలను కూడ అధిగమించి ఉద్యమం నిలదొక్కుకుంది.

ఈ సైనిక పాటవం పెంపొందడానికి మరొక కోణం బహుశా దేశ చరిత్రలోనే మొదటిసారిగా జనతన సర్కార్ రూపంలో బీజరూపంలోనైనా పీడిత ప్రజా రాజకీయాధికార నిర్మాణాలను ఏర్పాటు చేయడం. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో గ్రామ స్థాయిలో ఈ పని కొంతవరకు జరిగింది గాని, అది ఎక్కువలో ఎక్కువ రెండు సంవత్సరాలకు మించలేదు. కాగా ప్రస్తుత నిర్మాణాలు మొదలైనప్పటినుంచి ఇప్పటికి రెండు దశాబ్దాలుగా సాగుతున్నాయి. ఈ దశాబ్దిలో అవి గుణాత్మకంగా కూడ ఘనమైన విజయాలు సాధించాయి.

ఈ విజయాలన్నీ తప్పనిసరిగా ప్రశంసనీయమైనవే, ఆశాజనక మైనవే. పీడిత ప్రజాశక్తులకు సంతోషకరమైనవే. ఈ దేశంలో పీడిత ప్రజా రాజ్యాధికారం రావాలని, నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావాలని, నిజమైన సోషలిస్టు వ్యవస్థకు మార్గం సుగమం కావాలని ఆలోచించే వారందరికీ ప్రోత్సాహకరమైన, ఉజ్వలమైన అంశాలే. అయితే ఈ విజయాలతో పాటే గుర్తించదగిన లోపాలు, పొరపాట్లు, కొరతలు కూడ ఉన్నాయి. వాటిని సకాలంలో సవరించుకోకపోతే ఈ దశాబ్ది విజయాలు మరొక మెట్టు పైకి ఎక్కజాలవు. ఈ దశాబ్ది విజయాలు ఇచ్చిన ప్రేరణనూ, ఉత్సాహాన్నీ, ఆశాభావాన్నీ మరింత ముందుకు తీసుకుపోవడానికి అపజయాల మననం, సమీక్ష, వాటిని అధిగమించడానికి చేపట్టవలసిన కర్తవ్యాల గురించి ఆలోచించడం అవసరం.

అపజయానికి దారితీస్తున్న, లేదా పురోగమనానికి ఆటంకాలుగా, కొరతలుగా ఉన్న అంశాలు కనీసం నాలుగు రంగాలలో ఉన్నాయి. వాటి మధ్య గిరిగీసినట్టు విభజన లేనప్పటికీ, ఒకదానికీ మరొకదానికీ మధ్య పరస్పర అంతస్సంబంధాలు, అన్యోన్య చర్య ప్రతిచర్యలు ఉన్నప్పటికీ, వాటిని స్థూలంగా రాజకీయ సైద్ధాంతిక అంశాలు, రాజకీయ ఆచరణ అంశాలు, సైనిక అంశాలు, సాంస్కృతిక అంశాలు అనే నాలుగు రంగాలుగా విభజించుకోవచ్చు.

రాజకీయ సైద్ధాంతిక అంశాలలో ప్రధానమైనది ప్రత్యేకంగా ఈ దశాబ్ది కాలానికి మాత్రమే సంబంధించినది కాదు, అది మొత్తంగా భారత విప్లవోద్యమానికీ, అసలు భారత సమాజానికీ సంబంధించిన సమస్య. అదేమంటే మన సమాజంలో ఆచరణతో పోలిస్తే భావనీకరణ, సైద్ధాంతీకరణ స్పృహ తక్కువ. విపరీతమైన పని చేసేవారు, అపారమైన ఆచరణలో పాల్గొంటున్నవారు తమ పనిని భావనీకరించలేకపోవడం, సైద్ధాంతికస్థాయిలో చెప్పలేకపోవడం, సారభూతమైన నిర్ధారణలు తీయలేకపోవడం సాధారణంగా ఉన్న సమస్యలు. తమ నిర్దిష్ట అనుభవం నుంచి సార్వత్రిక భవిష్యత్ ఆచరణకు పాఠాలు చూపడం సాధారణంగా తక్కువ. అది క్రమక్రమంగా పెరుగుతున్నదని గుర్తించవచ్చు గాని, అవసరమైనంత లేదని మాత్రం అంగీకరించక తప్పదు. రష్యా, చైనా విప్లవాలలో, చివరికి కంపూచియా, ఫిలిప్పైన్స్, నేపాల్ విప్లవాచరణలో జరిగినంత కృషి, అమెరికా, యూరప్ లలో అతి తక్కువ ఆచరణతోనే జరిగిన లోతైన సైద్ధాంతీకరణలు, సైద్ధాంతిక చర్చలతో పోల్చినప్పుడు భారత విప్లవోద్యమం, అంతకు ముందరి భారత కమ్యూనిస్టు ఉద్యమం ఈ రంగంలో సాధించవలసినంత సాధించలేదని కనబడుతుంది. మార్క్సిస్టు మహోపాధ్యాయుల ప్రామాణిక, శాస్త్రీయ సంవిధానం, సిద్ధాంతాలు, ఆచరణ నుంచి నిగ్గు తేల్చిన భావనలు అన్ని దేశాల విప్లవోద్యమాలకు ఉపయోగకరమైనవే గాని అవి ఆయా దేశాల విశ్లేషణకు ప్రత్యామ్నాయాలు కావు. ఏ సమాజానికి ఆ సమాజమే ప్రత్యేకంగా తమ నిర్దిష్ట అంశాలను పరిగణనలోకి తీసుకుని సిద్ధాంతాన్ని, భావనలను అభివృద్ధి చేసుకోవాలి. భారత పీడిత ప్రజా ఉద్యమంలో

అటువంటి ఆలోచనే తక్కువ. ఇటీవలి కాలంలో విప్లవోద్యమ నిర్మాణ అనుభవాలు చాల పెద్ద ఎత్తున, ఉజ్వలంగా, ఉత్సాహకరంగా వెలువడ్డాయి గాని వాటి నుంచి రాబట్టదగిన సైద్ధాంతిక విశ్లేషణలు ఉండవలసినంతగా లేవు. అలాగే విప్లవోద్యమం వైపు నుంచి వెలువడుతున్న ప్రకటనలు, రచనలు, సైద్ధాంతిక పత్రాలలో కూడ మార్క్సిస్టేతర భావాలు, పెట్టుబడిదారీ ప్రచారసాధనాల ప్రభావాలు కనబడుతున్నాయి. భారత విప్లవం వంటి మహత్తర కర్తవ్యాన్ని విజయవంతంగా నెరవేర్చడానికి సైద్ధాంతిక పటుత్వం చాల అవసరం.

అలాగే భారత సమాజ స్వభావం అర్ధవలస అర్ధభూస్వామ్యమనీ, అందువల్ల ఇక్కడ దున్నేవారికే భూమి నినాదంగా వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగే నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో ఉన్నామనీ నక్సల్బరీ పంథా విశ్లేషించింది. నాలుగు దశాబ్దాలు గడిచి, సమాజంలో చాల మార్పులు జరిగినందువల్ల ఆ నిర్వచనానికి కాలం చెల్లిందని కొందరు మేధావులు, పోరాటాన్ని వదిలేయాలనే దురుద్దేశంతో గాని, నిజమైన సందేహాలతో గాని వాదిస్తున్నారు. వారికి విప్లవోద్యమమే జవాబు చెప్పవలసి ఉన్నది. సామాజిక స్వభావం, విప్లవ దశ మారలేదని చెప్పడానికి ఎన్నో ఆధారాలున్నాయి గాని, విమర్శకుల, సందేహజీవుల వాదనలను ఖండించి, తమ మార్గపు కచ్చితత్వాన్ని, విశిష్టతను ఎత్తిపట్టడంలో విప్లవోద్యమం అవసరమైనంత కృషి చేయడం లేదనే చెప్పాలి. విప్లవం వైపుగా అంతకంతకూ ఎక్కువ మందిని ఆకర్షించాలంటే అసలు ఆ విప్లవం ఏమిటో ఎప్పటికప్పుడు మళ్లీ మళ్లీ చెపుతూ ఉండవలసిందే. కొత్త కొత్త పద్ధతులలో, ఆధారాలతో, సమాజంలో వస్తున్న మార్పులతో అన్వయిస్తూ, విశ్లేషిస్తూ ఉండవలసిందే.

భారత సమాజం ప్రత్యేకతల గురించి, అంతరాల గురించి, ఎగుడుదిగుళ్ల గురించి, అసమానాభివృద్ధి గురించి అతి ఎక్కువగా మాట్లాడిందీ, మాట్లాడుతున్నదీ విప్లవోద్యమమే. కాని ఆ కారణం వల్లనే ఇంత విశాల అసమాన సమాజ విప్లవానికి ఒకే వ్యూహం – ఎత్తుగడలు ఎలా వర్తిస్తాయనే ప్రశ్న కొందరిలోనైనా తలెత్తుతున్నది. వ్యూహంలోనూ, ఎత్తుగడలలోనూ, పోరాటరూపాలలోనూ మార్పులు అవసరమేమో, వాటి గురించి వెసులుబాటుతో, పట్టువిడుపులతో ఆలోచించవలసి ఉంటుందేమో అనే ఆలోచనలు వస్తున్నాయి. ఎత్తుగడలు, పోరాట రూపాలు ఎప్పటికప్పుడు స్థలకాలాలను బట్టి మారవలసినవే గాని ఒక సామాజిక దశ అంతటికీ సాధారణంగా ఒకే వ్యూహం ఉంటుంది. ఎన్ని పైపై మార్పులు జరిగినట్టు కనబడుతున్నా భారత సమాజం, భారత పాలకవర్గాలు, వర్గాల పొందిక మౌలికంగా మారలేదు గనుక వ్యూహం మారవలసిన అవసరం లేదు. ఈ అవగాహనను రాజకీయ, సైనిక పరిభాషలో కాకపోయినా, సాధారణ ప్రజామోద పరిభాషలోకి అనువదించి ప్రచారం చేయడం ఇంటా బయటా ఉన్న సందేహాలకు జవాబు చెప్పగలుగుతుంది. అటువంటి ప్రచారమే విప్లవం వైపు ఎక్కువమంది ప్రజలను ఆకర్షించ గలుగుతుంది.

అసలు విప్లవ పరిస్థితి ఉన్నదా అని కూడ మధ్యతరగతి లోనూ, విప్లవ పార్టీలుగా చెప్పుకుంటున్న కొన్ని పార్టీలలోను ఒక చర్చ ఇటీవల జరుగుతున్నది. భౌతిక పరిస్థితులు విప్లవానికి సానుకూలంగా ఉన్నాయని, స్వీయాత్మక శక్తులు దాన్ని అందుకోలేకపోవడమే సమస్య అని నక్సల్బరీ నాటినుంచీ చెప్పుకుంటున్న మాట నిజమేనా అని కొందరిలో సందేహం కలుగుతున్నది. ఒక పార్టీ తన అంతర్గత డాక్యుమెంటులో నక్సల్బరీ సమయంలో విప్లవ పరిస్థితి ఉందని భ్రమ పడ్డామని, ఇప్పుడు కూడ విప్లవ పరిస్థితి లేదనీ రాసిందంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. నిజానికి ప్రపంచీకరణ విధానాల తర్వాత, మతోన్మాద రాజకీయాల విజృంభణ తర్వాత, అభివృద్ధి పేరిట విధ్వంసం తర్వాత విప్లవావసరం నానాటికీ పెరుగుతున్నది. ప్రజలలో అసంతృప్తి పెరుగుతున్నది. తప్పనిసరిగా విప్లవశక్తులకు అనుకూలమైన పరిస్థితి పెరుగుతున్నది. ఈ మారుతున్న స్థితిని ఎప్పటికప్పుడు విశ్లేషించి, వివరించి, విప్లవావసరం ఉన్న శక్తులన్నిటినీ సమీకరించడం విప్లవోద్యమపు బాధ్యత. సరిగ్గా ఈ పది సంవత్సరాలలోనే హిందూ మతోన్మాద శక్తులు స్వతంత్రంగా కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని చేపట్టడం విప్లవశక్తుల ముందు బాధ్యతలు ఎంతగా పెరుగుతున్నాయో సూచిస్తున్నది. ఇతరంగా అభ్యంతరాలు ఉన్నప్పటికీ రజనీ పామీ దత్ 'ఫాసిజం అండ్ సోషల్ రెవల్యూషన్' వంటి రచనలలో చేసిన కృషి ఇవాళ అవసరం ఉంది.

ఇక భారత సమాజ ప్రత్యేకతలు అయిన కులం, మతం, ప్రాంతీయ అసమానతలు, భాషాభేదాలు, జాతులసమస్య వంటి అంశాల పట్ల, పితృస్వామ్యం పట్ల విప్లవోద్యమం తన వైఖరిని సునిశితం చేసుకోకుండా, ఇంకా లోతుగా ఆలోచించకుండా విప్లవం ముందుకు కదలడం కష్టం. ముఖ్యంగా ఈ అంతరాలు అలాగే ఉండడం వల్ల ప్రయోజనం పొందే శక్తులు, ఈ అంతరాలను చూపి ప్రయోజనాలు పొందే శక్తులు అవి ఉండడమే ఒక స్వార్థ ప్రయోజనంగా మార్చేశాయి. ఆ స్వార్థప్రయోజ నానికి పార్లమెంటరీ వ్యవస్థ ప్రధాన పునాదిగా ఉంటున్నది. కనుక ఈ సమస్యమీద విశాలంగా, లోతుగా ఆలోచించి, ఈ సమస్యలను సైద్ధాంతిక స్థాయిలోను, నిత్యజీవిత ఆచరణ స్థాయిలోను ఎదుర్కొనవలసి ఉంది.

సైద్ధాంతిక అవగాహనలలో రావలసిన మెరుగుదలతో పాటే గుర్తించదగిన రాజకీయ ఆచరణ సమస్యలు కూడ ఉన్నాయి. భారత విప్లవోద్యమం దాదాపు మొదటి నుంచీ ఐక్యసంఘటన గురించి మాట్లాడుతున్నప్పటికీ, ఐక్యసంఘటన నిర్మాణ ప్రయత్నాలు విజయవంతం కావడం లేదు. ఐక్యసంఘటన అన్నప్పుడే ఐక్యత–ఘర్షణ రెండూ ఉండే శక్తులతో కూడినదని, అది స్పష్టమైన లక్ష్యాలతో, నిర్దిష్టమైన కాల వ్యవధిలో కొన్ని అంశాలలో మైత్రి, కొన్ని అంశాలలో విభేదం ఉంటూనే మొత్తంగా ఐక్యత ప్రధానంగా ఉంటుందని అర్థం. కాని భారత విప్లవోద్యమంలో ఐతే ఐక్యత లేదా ఘర్షణ అనే రెండు కొసలే తప్ప దీర్ఘకాలిక దృష్టితో, పట్టువిడుపులతో, వెసులుబాటుతో సాగే ఐక్యసంఘటన ఇంతవరకూ ఏర్పడలేదు. అంతర్జాతీయంగా ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటన, చైనా విప్లవంలో దేశభక్తియుత ఐక్యసంఘటన ప్రయోగాల వంటివి భారతదేశంలో సమానస్థాయిలో జరగలేదు. నిజానికి విభిన్న ప్రయోజనాలు ఉండే ఇతర వర్గాలతో ఐక్యసంఘటన అలా ఉంచి, ఒకేరకమైన ప్రయోజనాలు, లక్ష్యాలు ఉండే ఒకే వర్గంలోని మిత్రపక్షాలతో కూడ ఐక్యత సాధ్యం కావడం లేదు. ఇంత విశాల దేశంలో, ఇన్నిన్ని అంతరాలలో విడిపోయి ఉన్న సామాజిక బృందాల మధ్య విశాల ఐక్యసంఘటన దృష్టి ఉంటే తప్ప విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడం సాధ్యం కాదు. మిత్రులకూ, శత్రువులకూ మధ్య తేడాలనూ, పోలికలనూ స్పష్టంగా గుర్తించడం, వారిపట్ల తీసుకోవలసిన వైఖరులను నిర్దిష్టంగా, ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా అవగాహనలోకి తెచ్చుకోవడం, వాటిని ఆచరణలో పెట్టడం ఇవాళ్టి అవసరం.

భారతదేశం వంటి బహుభాషల, బహుజాతుల, బహుస్థాయిల దేశంలో ప్రచారం, సమీకరణ, కొత్త రంగాలలోకి ప్రవేశం వంటి అంశాలు రాజకీయాచరణలో ముఖ్యమైనవి. కొత్త ప్రచార పద్ధతులు, కొత్త సమీకరణ పద్ధతులు, కొత్త నినాదాలు, స్థల కాల పరిమితులకు లోబడిన తాత్కాలిక లక్ష్యాలు వంటి సుశిక్షితమైన, విశాలమైన, పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవడం భారత సమాజ ప్రత్యేక అవసరం.

ఆ యంత్రాంగం రూపొందేవరకూ విప్లవం చేరడానికి అవకాశం లేని భాషా బృందాలు, సామాజిక వర్గాలు, ప్రాంతాలు మిగిలిపోతూనే ఉంటాయి. ఆ యంత్రాంగం విప్లవ విస్తరణ క్రమంలో రూపొంద వలసిందే. ఈ విస్తరణకూ ఐక్యసంఘటన పట్ల వైఖరికీ కూడ దగ్గరి సంబంధం ఉంది. నిజానికి ఇవాళ దేశవ్యాప్తంగా సమస్యలు, అసంతృప్తులు, అసంతృప్తి వ్యక్తీకరణలు లేని బృందం, సమూహం, రాష్ట్రం, ప్రాంతం ఒక్కటి కూడ లేదంటే అతిశయోక్తి కాదు. ఆ అసంతృప్తులన్నిటినీ పోరాటాలుగా మలచాలంటే విభిన్న పోరాట రూపాలు అవసరం. సామెత చెప్పినట్టు పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రం పనికి రాదు. అంతిమంగా ప్రజా రాజ్యాధికార స్థాపనకు సాయుధ పోరాటమూ, ప్రజాసైన్యమూ తప్పనిసరి అనే అవగాహన ఉంచు కుంటూనే తాత్కాలిక, పాక్షిక, ప్రాంతీయ, సమూహ సమస్యలకు విభిన్న పోరాట రూపాలను రూపొందించి, ఆ పోరాటాలలో పాల్గొనేవారి చైతన్యాన్ని ఉన్నతీకరించవలసి ఉంటుంది.

ఈ పని సైనిక పాటవం పెంచుకోవడంతోపాటుగా, అంతకన్న ఎక్కువగా ప్రజాసంఘాల ద్వారా సాగవలసి ఉంటుంది. ప్రజాసంఘాల అవసరాన్ని నక్సల్బరీ వెనుకంజ కొట్టవచ్చినట్టుగా చెప్పిన తర్వాత, ప్రజాసంఘాల నిర్మాణం మీద, ప్రజాసమస్యలపై పోరాటాల మీద శ్రద్ధ పెరిగినప్పటికీ, నిర్బంధం కారణంగానో, స్వీయాత్మక శక్తుల కొరత కారణంగానో, ప్రజా సంఘాలను సృజనాత్మకంగా నిర్వహించే సామర్థ్యం కొరత వల్లనో ప్రజాసంఘాల విస్తరణ తగ్గిపోయింది. రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే విప్లవంలో నూటికి నూరు శాతం జనాభా ఎప్పుడూ పాల్గొనక పోవచ్చుగాని, పాల్గొనవలసిన గణనీయమైన జనాభాకు చేరడానికైనా ప్రజాసంఘాలు అనివార్య అవసరం. ఈ పది సంవత్సరాలలో, దండకారణ్య ప్రాంతంలో ప్రజాసంఘాల, నిర్మాణాల విస్తరణ గురించి ఆశావహమైన నివేదికలు వెలువడుతున్నాయి. కాని దేశంలోని ఇతర ప్రాంతాలలో నడుస్తుండిన ప్రజాసంఘాలు తగ్గిపోయాయి. ఆగిపోయాయి. కొత్త ప్రజా సంఘాలు పుట్టి పెరుగుతున్న వార్తలు కనబడడం లేదు. మీడియాలో రావడమే నిదర్శనం అనుకోనక్కరలేదు. కాని ఒక ప్రాంతంలో ప్రజాసంఘాలు ఉన్నాయంటే అక్కడి ప్రజాసంచలనాలు క్రియాశీలంగా మారుతుంటాయి. ఆ క్రియాశీలతే అక్కడ నీళ్లలో చేపల్లా ప్రజాసంఘాల నిర్మాణం, ఉద్యమ నిర్మాణం సాగుతున్నాయనేందుకు సూచన. గత అనుభవాలను బట్టి చూసినా విద్యార్థి, యువజన, రైతుకూలీ, కార్మిక, మహిళా రంగాలలో ప్రజాసంఘాలను స్థాపించడం, సృజనాత్మకంగా నిర్వహించడం మొత్తంగా ఉద్యమ విస్తరణకు ఉపయోగపడుతుందని తెలుతుంది. ప్రజాసంఘాలను నడవనివ్వని ప్రభుత్వ దమనకాండ అమలయినప్పటికీ ఎప్పటికప్పుడు ప్రజాసంఘాలను కొత్త కొత్త రూపాలలో నిర్మించడం, ప్రజల మధ్య పనిచేయడం అవసరం. గత అనుభవాలు యథాతథంగా ఉపయోగ పడకపోవచ్చు. మారుతున్న పరిస్థితులలో కొత్త రూపాల పనివిధానాలు అవసరం కావచ్చు. అటువంటి నిరంతర ఆలోచనలు, అన్వేషణలు, ప్రయోగాలు చేయడమే ఇవాళ్టి అవసరం.

సైనిక అంశాలలో ఈ దశాబ్ది అద్భుతమైన విజయాలు నమోదు చేసినప్పటికీ, భారతదేశం వంటి సువిశాల దేశంలో, ప్రపంచంలోనే రెండవ అత్యధిక సైనిక శక్తి ఉన్న రాజ్యంతో తలపడడానికి, అంతిమంగా గెలవడానికి ప్రజామద్దతుతో పాటు మరింత సైనిక పాటవం పెరగడం కూడ అవసరం. ఇవాళ ఇంటర్నెట్ వల్ల ఆధునిక సైనిక సాంకేతిక పరిజ్ఞానం, ఆయా రంగాల ప్రత్యేక నిపుణులకు మాత్రమే కాక, సాధారణ ఆసక్తి ఉన్నవారికి కూడ పెద్ద ఎత్తున అందుబాటులోకి వచ్చింది. దాన్నంతా అంది పుచ్చుకోవడం, సాంప్రదాయిక సైనిక పద్ధతుల నుంచి అత్యాధునిక సైనిక పద్ధతుల దాకా అన్నిటినీ ఆకళించుకోవడం, ప్రచారం చేయడం, శిక్షణ ఇవ్వడం, ఒకవైపు సైనిక ప్రత్యేక నైపుణ్యానికి స్థానం ఇస్తూనే ప్రతి విప్లవోద్యమ కార్యకర్తకూ సైనిక చైతన్యం అందించడం అవసరం.

ఈ దశాబ్ది లోపాలలో కీలకంగా గుర్తించవలసినవీ, ఎప్పటికప్పుడు సవరించడానికి ప్రయత్నించవలసినవీ సాంస్కృతిక రంగంలో, విలువల రంగంలోని కొరతలు. భారత పాలకవర్గాలు ఉద్దేశపూర్వకంగానూ, హిందూ బ్రాహ్మణీయ భావజాలం చాపకింద నీరు లాగానూ సమాజాన్ని శకలాలు శకలాలుగా విభజిస్తున్నది. ఒక శకలానికీ మరొక శకలానికీ మధ్య ఘర్షణ సృష్టించి, పెంచి పోషిస్తున్నది. భావజాల ప్రభావాల వల్ల ఈ శకలీకరణ విప్లవోద్యమ నిర్మాణాలలోకి, విప్లవోద్యమ శక్తులలోకి కూడ చొరబడే అవకాశం ఉంది. మన సమాజంలో కులం వల్ల సాగుతున్న ఆధిపత్య ధోరణుల భావజాలం, ప్రపంచీకరణ, వినియోగదారీ సంస్కృతుల వ్యక్తివాదం వల్ల బలపడుతున్నది. అటు శకలీకరణ అయినా, ఇటు ఆధిపత్య అహంభావమైనా మౌలికంగా అన్యవర్గ ధోరణులు. ఈ అన్యవర్గ ధోరణులను ఎప్పటికప్పుడు గుర్తించి, చైతన్యం ద్వారా, చర్చ ద్వారా, సవరణల ద్వారా, విమర్శ-ఆత్మవిమర్శల ద్వారా తగ్గించడానికి, తొలగించడానికి ప్రయత్నించడం నిరంతర అవసరం. అలాగే బైటి సమాజం మీద మీడియా ప్రభావం అంతకంతకూ పెరిగిపోతున్నట్టుగానే, విప్లవ, ప్రగతిశీల ఆలోచనాపరులుగా ఉన్నవారిలో కూడ మీడియా కల్పిస్తున్న అపోహలు, అబద్ధాలు, అర్ధసత్యాలు ప్రభావం వేస్తున్నాయి. మీడియా ప్రభావం కొంతవరకు విప్లవ శక్తులమీద కూడ పడుతున్నట్టు అనిపిస్తున్నది. ఆధునిక సమాజంలో సమాచార వినిమయానికి, ప్రచారానికి, అభిప్రాయాలు రూపొందించడానికి మీడియా చాల అవసరమే గాని దాని పట్ల విమర్శనాత్మక దృష్టి లేకపోవడం, దాన్ని నిస్సందేహంగా, నిరభ్యంతరంగా నమ్మడం భావజాలపరమైన దుష్పరిణామాలకు దారి తీస్తుంది. పాలకవర్గ భావజాల సాధనాలలో మీడియా చాల ప్రధానమైనది గనుక దాని పట్ల జాగరూకత ముందుముందు ఇంకా ఎక్కువ అవసరం అవుతుంది. పాలకవర్గ ప్రయోజనాలను కాపాడే, పాలకవర్గ భావజాలాన్ని ప్రచారం చేసే మీడియా పెద్దఎత్తున పెరుగుతున్నది గనుక ప్రజా ఉద్యమ ప్రయోజనాలను కాపాడే, ప్రజా ఉద్యమాలను ప్రచారం చేసే ప్రచారసాధనాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవడం కూడ ఇవాళ్టి అవసరం.

ఈ దశాబ్ది సమస్యలలో చెప్పుకోవలసిన ఒక ముఖ్యమైన సమస్య భద్రతా లోపాల వల్ల జరిగిన నష్టాలు. భారత విప్లవోద్యమానికి అత్యవసరమైన ప్రతిభావంతమైన నాయకులు చాల మంది ఈ దశాబ్దిలో పాలకవర్గ బలగాల చేతికి చిక్కి ఎక్కువమంది హత్యకు గురయ్యారు. కొందరు జైలుపాలయ్యారు. భద్రతా లోపాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, వాటిని అధిగమించడం వ్యక్తిగత రక్షణ కోసం మాత్రమే కాదు, భారత పీడితప్రజా విముక్తి కోసం అవసరంగా గుర్తించవలసి ఉంది.

మొత్తం మీద జయాపజయాలను తులనాత్మకంగా బేరీజు వేసినప్పుడు, ఈ దశాబ్ది భారత విప్లవోద్యమంలో తప్పనిసరిగా ఎక్కువ విజయాలను నమోదు చేసుకున్న దశాబ్దిగా నమోదవుతుంది. భారత విప్లవ విజయాన్ని చేరువలోకి తీసుకురావడానికి అపజయాలను, లోపాలను తగ్గించుకోవడం ఇవాళ్టి చారిత్రక అవసరం.

(రచయిత పాత్రికేయులు) వీ

లెవెల్ క్రాసింగ్‌ల వద్ద భద్రత తీరు

ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లెవెల్ క్రాసింగ్‌ల వద్ద వేలాదిగా దుర్ఘటనలు జరుగుతున్నాయనీ, ఈ ప్రమాదాల్లో ఎన్నో విలువైన ప్రాణాలు పోతున్నా ప్రభుత్వాలకు పట్టింపు లేకుండా ఉందనీ అంటున్నారు మారుతి

లెవెల్ క్రాసింగ్స్ వద్ద కాపలా, రైళ్లలో భద్రత పెంచే అంశాలు, దూర ప్రయాణం చేసే ప్రయాణికుల కనీస సౌకర్యాల వంటి మౌలిక వసతుల మీద శ్రద్ధ చూపలేని ప్రభుత్వం, అరవై వేల కోట్ల వ్యయంతో, బుల్లెట్ రైళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది (ఒక్క అహ్మదాబాద్ – ముంబై మార్గానికి మాత్రమే అయ్యే వ్యయం 60 వేల కోట్లు). ఈ బుల్లెట్ రైళ్ల నిర్మాణం రాజకీయ నాయకుల, పెట్టుబడిదారుల సొంత లాభం కోసం తప్ప సామాన్య మానవుడికి ఏమాత్రం ఉపయోగపడనిది.

ఇక, రైల్వేశాఖ వారి లెక్కల ప్రకారం మొత్తం దేశంలో, 2010 సంవత్సరం వరకూ ఉన్న కాపలా లేని లెవెల్ క్రాసింగ్స్ సంఖ్య 15,993 గా ఉంది. అదే సంవత్సరంలో ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో తెలిపిన అంశాల ప్రకారం, రాబోయే ఐదు సంవత్సరాలలో (అంటే 2015 లోపు) అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి లేదా కాపలా ఏర్పాటు (గేట్లు) చేయడం ద్వారా దేశంలోని మొత్తం, అంటే 15,993 లెవెల్ క్రాసింగ్స్‌ను ప్రమాదాల నుంచి తప్పించాలనే ఆచరణకు నోచుకోని ఒక మోసపూరిత ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ ప్రణాళిక ప్రకారం, 2014వ సంవత్సరం వరకూ జరిగిన ప్రగతి చూస్తే,ఇంకా 13,530 లెవెల్ క్రాసింగ్స్ ఏ అభివృద్ధికీ నోచుకోక, ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లుగా పడి ఉన్నాయి. అంటే ఈ నాలుగు సంవత్సరాలలో నిర్మాణాలు చేపట్టి, పూర్తి చేసిన లెవెల్ క్రాసింగ్స్ సంఖ్య 2463. అంటే, నలభై ఎనిమిది నెలలకు గానూ నెలకు యాభై చొప్పున దేశ వ్యాప్తంగా నిర్మాణాలు పూర్తి చేసిన లెవెల్ క్రాసింగ్స్ సంఖ్య ఇది. ఇదే నిష్పత్తిలో, దేశంలోని మిగిలిన మొత్తం (13,530) లెవెల్ క్రాసింగ్స్ పూర్తి కావడానికి (అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి లేదా కాపలా) కనీసం ఇరవై రెండు సంవత్సరాలు పడుతుంది!

ఈ సంవత్సరంలో జరిగిన రైల్వేశాఖ హైలెవెల్ సేఫ్టీ కమిటీ ప్రకారం 2011-12 సంవత్సరంలో జరిగిన రైలు ప్రమాదాల్లో చనిపోయిన వారి సంఖ్య 15,000. దీనిలో కాపలాలేని లెవెల్ క్రాసింగ్స్ వద్ద చనిపోయిన వారి సంఖ్య దాదాపు 10,500 మందిగా లెక్క చేయబడింది. ఇవి లెక్కలోకి వచ్చిన చావులు మాత్రమే. ప్రజలకు తెలియని లేదా తెలియపరచని చావులు మరెన్నో. ప్రజల చావుల గురించి పట్టించుకునే తీరిక ప్రభుత్వానికి ఎక్కడుంది? ప్రజల సొమ్ముతో నడిచే పార్టీ మీటింగులు, విదేశీ ప్రయాణాలూ, ప్రచారాలూ, శంకుస్థాపనలూ ఒకటేమిటి? ఎన్ని పనులో! ఒక్కసారి ఎన్నికల్లో గెలిస్తే చాలు. ఎక్కడాలేని బిజీ బిజీ. ఎన్నికల సమయంలో బిజీ, ఎన్నికల తర్వాత ఇంకా బిజీ.

ఒక్క సంవత్సరానికే దేశ వ్యాప్తంగా పదివేల మంది ప్రజలు చచ్చిపోతే, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ ఎంత మంది ప్రజల ప్రాణాలు పోయినట్లు? ఇన్ని వేల మంది ప్రాణాలు పోతున్నా, ఇంకా ఇప్పటికీ రైల్వే శాఖ, లెవెల్ క్రాసింగ్స్ వద్ద కాపలా పెట్టేందుకు, 'ఆప్షన్ల' గురించీ, 'పాజిబిలిటీ' గురించీ లెక్కలు వేస్తోందంట. మరి ఆ పక్కా, ఈ పక్కా గేట్లు పెట్టి, ఒక కాపలా మనిషిని పెట్టడం ప్రపంచంలో ఎక్కడా లేని ఒక పెద్ద ప్రాజెక్టు గదా! రెండు గేట్లు పెట్టే ఈ మెగా ప్రాజెక్టు పూర్తి కావాలంటే, మొదట మన 'బిజీ' ప్రభుత్వానికి తీరిక దొరికి, ఒక ఇంటర్నేషనల్ కన్సల్టెన్సీని నామినేషన్ పద్ధతి ద్వారా (ఆ తీరిక కొద్దిగా ఎక్కువ దొరికి, వీలైతే ఓపెన్ టెండర్ల ద్వారా) ఎన్నిక చేసి, గేట్లు పెట్టడానికి కావలసిన 'పాజిబిలిటీ'ని, 'ఫీజిబిలిటీ'ని సర్వే చేసి, ప్రాజెక్టు రిపోర్ట్ ఇవ్వమని ఆ కన్సల్టెన్సీకి ఒక వర్క్ ఆర్డర్ పడేసి, సదరు కన్సల్టెన్సీకి అన్ని రకాలుగా వీలు కుదిరి, వీలైతే ఏ మూడు నాలుగు సంవత్సరాల లోపో ఒక చెత్త 'ప్రాజెక్టు రిపోర్టు' తయారు చేసి ఇస్తే, ఆ రిపోర్టును దేశంలోని అన్నీ రైల్వే ఆఫీసుల చుట్టూ నత్తనడక నడిపించి, గేట్లు పెట్టే పెద్ద మెగా ప్రాజెక్టు వర్క్ తీసుకున్న పాపానికి, ఆ కన్సల్టెన్సీ కంపెనీ ఇంజనీర్ల చేత ముప్పై చెరువుల నీళ్లు తాగించి, కనీసం ఓ యాభై సార్లు ఆ 'ప్రాజెక్టు రిపోర్టు'ను సవరించి, రిపోర్టు అంతా గందరగోళంగా చేసి, చివరకు, నాలుగైదు సంవత్సరాలలో ఎలాగోలా ఆ రిపోర్టును ఖరారు చేస్తుంది. ఆ ఇంటర్నేషనల్ కన్సల్టెన్సీకయ్యే ఫీజుతో, ఆ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసేందుకు పట్టే సమయంలోపే, కనీసం దేశంలోని పది శాతం లెవెల్ క్రాసింగ్స్ వద్దనైనా కాపలా ఏర్పాటు చేయవచ్చు.

ఇదిలా ఉంటే, ఇంకో వైపు కేంద్ర ఉపరితల రవాణా, నేషనల్ హైవేస్ మంత్రి నితిన్‌గడ్కరీ, జూన్ 24వ తేదీన చేసిన ప్రకటన ప్రకారం, కేంద్ర ప్రభుత్వం రోజుకు 30 కిలోమీటర్ల పొడవు రోడ్డు (నాలుగు లేన్ల నేషనల్ హైవే) పూర్తి చేసే లక్ష్యం దిశగా 40,000 కోట్ల వ్యయం గల పెండింగ్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇచ్చింది.అంతేకాక, రహదారుల నిర్మాణం కొరకై, లక్ష కోట్ల రూపాయల టార్గెట్ దిశగా, వరల్డ్ బ్యాంక్‌తో సహా ఇతర అప్పులిచ్చే దేశాల వద్ద తక్కువ వడ్డీకి అప్పుకోసం బేరాలు కూడా ప్రభుత్వం చేస్తోంది. నేషనల్ హైవే ఇండస్ట్రీ లెక్కల ప్రకారం ఒక్క కిలోమీటరు నేషనల్ హైవే నిర్మాణం పూర్తి చేయడానికి అయ్యే వ్యయం కిలోమీటరుకు ఎనిమిది కోట్ల నుంచి పన్నెండు కోట్ల దాకా ఉంటుంది. అంటే సరాసరి కిలోమీటరుకు పదికోట్ల లెక్కన రోజుకు మూడు వందల కోట్లూ, నెలకు తొమ్మిది వందల కోట్లూ, సంవత్సరానికి పదివేల కోట్లూ ప్రభుత్వం వ్యయం చేస్తుంది. ప్రభుత్వం కాకపోతే, పిపిపి మోడ్ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) అనే ముద్దు పేరుతో ప్రజల సొమ్మును, పెట్టుబడిదారుడు 'కార్పొరేట్ లోన్' రూపంలో బ్యాంక్ నుంచి వడ్డీకి తెచ్చుకుంటాడు. అది వేరే విషయం. ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండానే, నేషనల్ హైవేల్లో టోల్ ద్వారా ప్రభుత్వానికి వేల కోట్లు ఆదాయం వస్తుంది. అందుకని అనుమతులన్నీ త్వరత్వరగా ఇచ్చివేయ బడతాయి. బోడి లెవెల్ క్రాసింగ్స్ వద్ద ఎంతమంది పిల్లలు చచ్చిపోతే ప్రభుత్వానికేం? అక్కడి నుంచేమైనా

మాసాయిపేట మృతులు లేవనెత్తిన ప్రశ్నలు

***ప్రభుత్వ నిర్వహణలో ఉండి సమాజ అభ్యున్నతి కోసం ఉపయోగపడాల్సిన విద్యను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించిన ఫలితమే మాసాయిపేట దుర్ఘటనకు దారితీసిందని అంటున్నారు* బి. రామకృష్ణ**

మాసాయిపేట రైల్వే క్రాసింగ్ వద్ద తగు రక్షణ చర్యలు తీసుకోక పోవడం, రైల్వే అధికారుల, స్థానిక రోడ్డు రవాణా భద్రతా అధికారుల బాధ్యతారాహిత్యం, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం 2014 జూలై 24న 20 మంది చిన్నారుల ప్రాణాలను బలి తీసుకున్నది. ఇది ఒక పార్శ్వమైతే అసలు పిల్లలు ఆ బస్సులో ప్రయాణించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎక్కడెక్కడి నుండో చిన్నారులను ఏరుకొచ్చి బడికి బస్సులో తీసుకు పోవాల్సిన ఆగత్యం ఎందుకొచ్చింది? పిల్లల తల్లిదండ్రులు ఫీజుల మోతతో పాటు బస్సు రవాణా ఖర్చుకు సైతం వెనకాడకపోవడం దేన్ని సూచిస్తున్నది? ఎన్నో కిలోమీటర్ల దూరంలో ఉన్న బడులకు తమ పిల్లలను పంపడానికి ఎందుకు సిద్ధపడుతున్నారు? ఎందుకు ప్రైవేట్ బడులపై అంతగా క్రేజ్ ఏర్పడి పోయింది? ఆంగ్ల మాధ్యమంపై మోజుపడి అటువైపుగా ఎందుకంతగా నెట్టివేయబడుతున్నారు?

నిజంగానే కొందరు అంటున్నట్లు లేదా అనుకుంటున్నట్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో చదువులు లేకపోవడమేనా? 'సర్కార్ బడులల్లో సదువులు సత్తెవాస్' అని నెమ్మది నెమ్మదిగా ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం సన్నగిల్లుతుండడం ఎందుకు జరుగుతుంది? అటు, ఇటు ఎటోపోయి చివరకు ప్రభుత్వ పంతుళ్ల మీదకు గాలి మళ్లడం సునాయసంగా జరిగిపోతున్నది. సామాన్య ప్రజల నుండి మొదలుకొని ప్రభుత్వాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, మేధావులు, మంత్రుల వరకు ఈ ధోరణి ప్రబలడం ఈ మధ్య పెరిగి పోతున్నది.

ప్రభుత్వ పంతుళ్ల అలసత్వం కారణంగానే ప్రజల్లో ఆంగ్ల మాధ్యమంపై, ప్రైవేట్ బడులపై మక్కువ ఏర్పడుతున్నదా? ఒకవేళ అదే నిజమైతే ప్రభుత్వ పాఠశాలలను పటిష్ట పరుచుకునే ప్రయత్నాలేవి? దీన్ని నివారించడం కొరకు పాలనా యంత్రాంగం, చట్టసభలు, ప్రజా ప్రతినిధుల వ్యవస్థ ఏం చేస్తున్నట్లు? ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులైన ఆటస్థలం, గ్రంథాలయం, ప్రయోగశాల, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, టెలివిజన్, కంప్యూటర్, ఇంటర్‌నెట్, తరగతికో గది, తరగతికో టీచర్, ఆరోగ్య వ్యాయామ విద్య, సంగీత, చిత్రలేఖన, కళావిద్య, కంప్యూటర్ విద్యలు మొదలగు అత్యంతావశ్యకమైన అంశాలకు సంబంధించిన సిబ్బంది గురించి, పిల్లలకు పౌష్టికాహారం అందించడంపై ప్రశ్నలు వేసుకుంటున్నారా? సమాధానాలకై మూలాల్లోకి వెళుతున్నారా? విద్య అంటే మార్కులు, ర్యాంకులుగా మారిన నేటి దుస్థితికి కారకులెవరని ఆలోచిస్తున్నారా?

70వ దశకం నుండి విద్యా ప్రైవేటీకరణ నడకలు వేస్తూ, వడివడిగా కదులుతూ నేడు రాకెట్ వేగంతో దూసుకుపోవడానికి ప్రభుత్వ పంతుళ్లే కారణమా? దీనికొరకు క్రమబద్ధంగా, ప్రణాళికా యుతంగా అమలు చేయబడుతున్న ప్రభుత్వాల, పాలకుల విధానాలు కొందరు మేధావులకు తట్టకపోవడాన్ని ఏమనుకోవాలి? కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలను కల్పించడంలో అలసత్వం, నిర్లక్ష్యం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తూ చాపకింద నీరులా సర్కారు బళ్లల్లో చదువులను చిదిమేస్తున్న ప్రభుత్వ విధానాలు వీరి గమనంలోకి రావడం లేదు ఎందుకనో? అదే క్రమంలో తమ వద్ద ఆర్థిక వనరులు లేవనే సాకుతో విద్యారంగ బాధ్యతల నుండి తప్పుకోవడం వీరి కండ్లకు కనిపించక పోవడాన్ని ఏమనాలి?

అవసరమున్నా లేకున్నా విస్తృతంగా ప్రైవేట్ సంస్థలకు విచ్చలవిడి అనుమతులివ్వడం వెనుక ఉన్న ప్రభుత్వాల, ప్రభుత్వ అధికారుల, పాలకవర్గాల దుర్నీతిని తెలుసుకోవడం ఏమైనా బ్రహ్మ పదార్థమా? అవసరమైన చోట ప్రభుత్వమే విద్యా సంస్థలను నెలకొల్పి, ఉన్న వాటిలో శాస్త్రీయ పద్ధతిలో సరిపోయే అన్నిరకాల వసతులను కల్పించకుండా, నెమ్మది నెమ్మదిగా వాటిలో గుణాత్మకతను దెబ్బతీస్తూ, సరైన పర్యవేక్షణను చేపట్టకుండా పోవడం మూలంగా అవి చెదలు పట్టే స్థితికి దిగజార్చడం ఒకవైపు చేస్తూ మరోవైపు విద్యను వ్యాపారమయం చేసే విధానాలను పకడ్బందీగా అమలు చేస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలకు పోటీగా మరొక వ్యవస్థను (ప్రైవేట్) ఏర్పాటు చేయడం జరిగిపోయింది.

స్వాతంత్రానంతర కాలంలో ఎన్నెన్నో కుంభకోణాల్లో ఎంతో ప్రజా ధనం, సంపదలు కొద్దిమంది చేతుల్లోకి ఎలా దారదత్తం అవుతున్నదో తెలియనిది కాదు. ఫీజు రియంబర్స్‌మెంట్ పేరుతో కోట్లాది రూపాయలు ప్రైవేట్ విద్యా సంస్థల అధిపతుల జేబుల్లోకి ఎలా ప్రయాణిస్తున్నాయో తెలుసుకోవడం కష్టమైన పనేమీకాదు. రాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను, నిబంధనలను తుంగలో తొక్కి విద్య ప్రైవేటీకరణను పెంచి పోషిస్తూ మొత్తంగా ప్రభుత్వ విద్యా సంస్థలకు కాలం చెల్లేలా చేస్తున్న ప్రభుత్వ విధానాలు అనేవి కొట్టక తిట్టక గొంతు నులిమినట్లుగానే ఉన్నాయి.

ప్రైవేటైజేషన్ గాని, పెట్టుబడిదారీ విధానం గాని, మొత్తంగా వీటిని

ఆదాయం వస్తుందా? ఖర్చు తప్ప. అవేమైనా టోలు గేట్లా ఆదాయం కురిపించడానికి? టోలు రోడ్లకైతే, సంవత్సరానికి 10,000 కోట్లు ఖర్చు పెట్టేందుకు లేదా పెట్టించేందుకు లేదా లక్షల కోట్లు అప్పుచేసి పెట్టుబడిదారులకు ఊడ్చి పెట్టడానికైతే ఏ నిబంధనలూ అడ్డు రాకపోగా, వాటికి అత్యవసరంగా అనుమతి లభిస్తుంది. కానీ, ప్రజల చావుకు కారణమయ్యే 13,530 లెవెల్ క్రాసింగ్స్ కైతే, ఒక్కోదానికి ముప్పై లక్షల చొప్పున (అండర్ బ్రిడ్జీ, ఓవర్ బ్రిడ్జీ కాకుండా, కాపలా మాత్రమే. అంటే ఒక గార్డు రూం, రెండు వైపులా గేట్లు), నాలుగు వేల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేయాలంటే, మన బిజీ ప్రభుత్వాలకు కనీసం పాతిక సంవత్సరాలు పడుతుంది. ఆ లోపు ఇంకా ఎంత మంది ప్రాణాలు అర్పించుకోవాలో!

(రచయిత సివిల్ ఇంజనీర్) వీ

వేగవంతం చేస్తూ ప్రపంచాన్ని శాసిస్తూ వస్తున్న సామ్రాజ్యవాదం వాటి తాత్వికతలోనే వ్యక్తులను, వ్యవస్థలను కరప్ట్ చేసే తత్వం ఇమిడి ఉన్నది. వీటికి తలొగ్గుతూ సాగిలపడిపోతున్న ప్రభుత్వాలను, వ్యవస్థలను అర్థం చేసుకోకుంటే గనుక ప్రభుత్వ వ్యవస్థల్లో ఎందుకు అలసత్వం, అవినీతి పేరుకుపోతుందో తెలుసుకోవడం కష్టమే. అలాంటప్పుడు వ్యక్తులుగా ఉద్యోగులను, వారి తప్పులను నిందించడం సహజంగా, సులభంగా, సరిగ్గానే కన్పిస్తుంది. అది న్యాయమనే తోస్తుంది. అధికారులు లేదా ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికి వారు, ఎవరి పరిధుల్లో వారు అవినీతి, అలసత్వాన్ని ప్రదర్శించడంపై ప్రజలు కోపాన్ని పెంచుకోవడం సహజమే. అయితే అసలు సమస్య ఇలాంటి అవినీతికర, అలసత్వ వ్యవస్థను సరిచేయాల్సిందెవరనేది. సరైన రాజకీయ వ్యవస్థలు లేనందున లేదా వాటిని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న పెత్తందారీ శక్తులు, పెట్టుబడిదారీ శక్తులు, సామ్రాజ్యవాద శక్తులు తిరోగమన ప్రమాదకర గూడుపుఠానిగా ఎదిగి ప్రభుత్వ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న తీరును అర్థం చేసుకోవాల్సి ఉన్నది.

నిర్లక్ష్యం, అలసత్వం, అధికార దుర్వినియోగాలపై నిజంగా ప్రభుత్వాలు నిక్కచ్చిగా, నిజాయితీగా పని చేసుకుంటూపోతే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇది ప్రభుత్వాలు చేయవలసిన తప్పనిసరి పనులేనన్నది మరిచిపోవద్దు. విద్యా ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ విధానాలు, ప్రభుత్వ బళ్లల్లో పిల్లల సంఖ్య, గుణాత్మకత తగ్గడం, టీచర్లలో జవాబుదారీ తనం సన్నగిల్లుతుండడం అనేవి ప్రభుత్వ బాధ్యతారాహిత్య ఫలితాలే.

ప్రజాస్వామిక ఉద్యమాలపై నిర్బంధాలను అమలు చేస్తూ చైతన్యయుతమైన యువతను, బాధ్యతా యుతమైన మేధావులను వేధిస్తూ పోలీసు రాజ్యాన్ని ఎగదోస్తున్నప్పుడు ప్రజలు అవినీతికర అధికారులను, శక్తులను నిలదీసే అవకాశాలు సన్నగిల్లి పైరవీలకు, లాబీయింగ్‌లకు, లంచాలిచ్చి పనులు చక్కబెట్టు కోవడానికి అలవాటుపడకుండా ఎలా ఉంటారు? విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల చైతన్యవంతమైన ఉద్యమాలు పురోగమిస్తున్నప్పుడు ప్రభుత్వ అధికారులెవరైనా బాధ్యతగా, జవాబుదారీ తనంతో పనిచేసే పరిస్థితి ఉంటుంది. అలాగని వ్యక్తులుగా తమ బాధ్యతలను విస్మరిస్తూ మొత్తంగా వ్యవస్థ మీదకు తోసేసి మిన్నకుండిపోవడం సరైంది కాదు. ఎవరైనా సరే చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉంటుంది. అలా పనిచేస్తున్న క్రమంలోనే వ్యవస్థాపరంగా, రాజకీయ విధానాల పరంగా వారి విధుల సక్రమ నిర్వహణలో, గుణాత్మకతను సాధించడంలో వచ్చే సమస్యలపై నిలదీస్తే వారి మాటలకు విలువ ఉంటుంది. ఇది చేయకుండా వ్యవస్థాగత కారణాలను చెపుతూ తమ కర్తవ్యాల నుండి తప్పించుకునే ప్రయత్నం ఎంతమాత్రం క్షంతవ్యం కాదు. ఇక్కడే ప్రభుత్వ పంతుళ్లు సమాజం నుండి ఎన్నో ప్రశ్నలను ఎదుర్కోవలసి వస్తున్నది. ఇదొక సవాల్‌గా పరిణమించింది. దీన్ని అధిగమించడం కోసం ఉపాధ్యాయలోకం నడుం బిగించాల్సి ఉన్నది. కామన్ స్కూల్ వ్యవస్థ కొరకు పోరాడుతూ సాధించుకునే దిశలో అడుగులు వేయడం ద్వారా దీన్ని తిప్పికొట్టే అవకాశం ఉంటుంది.

ఏ ప్రభుత్వ శాఖలో చూసినా అవినీతి, లంచగొండితనం, రెడ్‌టేపిజం పెరిగిపోయింది. ప్రభుత్వ ఉద్యోగుల్లో తాము ప్రజా సేవకులమనే భావన సన్నగిల్లుతున్నది. సామాన్య ప్రజానీకం ఇలాంటి వ్యవస్థలో అనేక ఇక్కట్లకు లోనవ్వడం సర్వ సాధారణం అయిపోయింది. ఎన్నో పోరాటాల, త్యాగాల ఫలితంగా సాధించుకున్న అనేక హక్కుల ఉల్లంఘనలు ఎల్లెడలా జరుగుతూనే ఉన్నాయి.

పాఠశాల విద్య గురించి మాట్లాడేటప్పుడు, ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యత ఉన్నట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత లోపించిందని, అక్కడ టీచర్లు సరిగ్గా చెప్పరనీ, వారిలో జవాబుదారీ తనం లోపించిందని, వారిది బెల్‌బిల్లు పద్ధతని, సరిగ్గా బళ్లకు రారని, వారి పిల్లలను మాత్రం ప్రైవేట్ బడులల్లో చదివిస్తారని అంటున్నారు. ఇవి పూర్తి వాస్తవాలైతే కావుకాని, అర్ధ సత్యాలుగానైనా మిగిలిపోవడం విచారించాల్సిన విషయం. వీటిపై ఉపాధ్యాయలోకం స్పందించాల్సి ఉన్నది. పంతుళ్ల పైకి ఈ ప్రశ్నలు వేసేవారు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కిందిస్థాయి నుండి మొదలుపెట్టి గవర్నర్, ముఖ్యమంత్రుల వరకు అందరూ కూడా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించవచ్చు కదా! అందుకొరకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తూ, గుణాత్మకత కొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు కదా! అసలు ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు రద్దు చేసే విషయమై ఏ కలెక్టర్, ఎస్‌పి, ఐఎఎస్, ఐపిఎస్, మరితర ఉన్నతాధికారుల నుండి కిందిస్థాయి ఉద్యోగుల వరకు అలాగే ముఖ్యమంత్రి స్థాయిలో ఆలోచించడం లేదు ఎందుకని? ప్రైవేట్ బడుల వ్యవస్థను మొత్తంగా రద్దు చేస్తే ప్రభుత్వ పంతుళ్లు కూడా తమ పిల్లలను అనివార్యంగా ప్రభుత్వ బడుల్లోనే చదివిస్తారు కదా! ప్రభుత్వ పాలనా భాష ప్రజల భాషలో ఎందుకుండకూడదని ఎవరైనా ప్రశ్నిస్తున్నారా? ఇంగ్లిష్‌లో ఎందుకని అడగకుండా ఆంగ్లమాధ్యమంలో పాఠశాల విద్య ఉండాలని డిమాండ్ చేయడానికి ఉత్సుకత చూపుతున్నారు. కోర్టు తీర్పులు, ప్రభుత్వ ఉత్తర్వులు మొత్తంగా స్థానిక ప్రజల భాషల్లో ఉండాలనే డిమాండ్ కాకుండా ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల విద్యను డిమాండ్ చేయడం అనేది రివర్స్‌గేర్‌లో నడుస్తున్నట్లేనని అనిపిస్తుంది.

అంతర్జాతీయ భాషగా, అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య అనుసంధాన భాషగా ఇంగ్లిష్ ప్రాధాన్యతను విస్మరించలేం. అయితే ఇంగ్లిష్ నేర్చుకోవడానికి ఇంగ్లిష్ మాధ్యమంలోనే విద్యా బోధన జరగాలని అనుకోవడం శాస్త్రీయం కాదు. ఆంగ్లంను ఒక భాషగా నేర్చుకోవడంలో ఎవరికీ అభ్యంతరం ఉండక్కర్లేదు. అందుకొరకు విద్యా వ్యవస్థలో దాన్ని ఒక సబ్జెక్టుగా గుణాత్మకంగా బోధించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తే సరిపోతుంది. అలా కాకుండా సైన్స్, గణితం, సామాజిక శాస్త్రాలను తమ ఇళ్లల్లో, ఇరుగు పొరుగుల్లో మాట్లాడుకొని పరాయి భాషలో అర్థం చేసుకొమ్మనడం, ఆ పరాయి భాషలోనే వాటిని ఆలోచించ మనడం, వ్యక్తీకరించమనడం అనేది పిల్లలపై ఎంతో భారాన్ని మోపుతుంది. వారిని గందరగోళానికి గురిచేస్తుంది. వారిపై తీవ్రమైన ఒత్తిడికి కారణం అవుతుంది. ఇటు మాతృ భాషలోగాని, అటు పరాయి భాషలోగాని అవగాహన చేసుకోలేక, వ్యక్తీకరించలేక రెంటికీ చెడ్డ రేవడిలా తయారవుతారు. మాతృభాషలో అర్థం చేసుకుని ఆలోచించి, విశ్లేషించి వ్యక్తీకరించినంతగా పరాయి భాషలో సాధ్యమవుతుందా? అలా చేయడం వల్ల మనుషులను తమ పరిసరాల నుండి, సమాజం నుండి, చివరకు తమ నుండి తమనే దూరం చేసినట్లవుతుందేమో ఆలోచించాల్సిన విషయం.

నిజానికి ఉన్నత విద్య, పరిశోధనా స్థాయిలో కూడా మాతృ భాష మాధ్యమంలో జరగాలి. పోని ఒక స్థాయికొచ్చాకా పరాయి భాషలో ప్రావీణ్యత సాధిస్తే ఆయా భాషల్లో ఐచ్ఛికంగా ఉన్నత చదువులు పరిశోధనలకు అవకాశం ఉండేలా చూడడం ద్వారా మేలు జరుగుతుంది. అయినా అలాంటి పరిస్థితులు ఎంత మందికి వస్తాయి? వచ్చిన వారు దాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తారు, సాధించుకుంటారు. అంతేగాని

నర్సరీ నుండే ఆంగ్ల మాధ్యమంలో బోధన జరగాలనుకోవడం సరైంది కాదు. ఇక్కడొక ప్రశ్న వస్తుంది. మీ పిల్లలు ఏ మాధ్యమంలో చదువుతున్నారని? అందుకే అందరికి ఉచితంగా మాతృ భాషలోనే చదువులు అందించే ప్రభుత్వ యంత్రాంగం ఆవశ్యకత ఉన్నది. ఆ అనివార్య పరిస్థితి కల్పించబడితే తల్లిదండ్రులు వారి హోదాలు, స్థాయిలకు అతీతంగా తమ పిల్లలను మాతృ భాష పాఠశాలలోనే చదివిస్తారు. అలా కాకుండా అంతర దొంతరాలున్న పాఠశాల వ్యవస్థలను సృష్టించిన ప్రభుత్వ విధానాలను ప్రశ్నించకుండా మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారు, ఏ మీడియంలో చదువుతున్నారు అనే ప్రశ్నకు సాధికారత కష్టసాధ్యమే.

మెదక్ జిల్లాలోని మాసాయిపేట రైల్వే గేటువద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పసిపిల్లల సంఘటన ఎన్నో ప్రశ్నలను చర్చకు పెట్టింది. అది విద్యా ప్రైవేటీకరణను, ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తున్నది. ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ చదువులపై పెరుగుతున్న మోజును అందుకు సహకరిస్తున్న పాలనా విధానాలను ప్రశ్నిస్తున్నది. పేదలు తమ పిల్లల చదువుల ఖర్చు కొరకు రెక్కలు ముక్కలు చేసుకుంటున్న దయనీయతను సూచిస్తున్నది. చేరువలో ఉచిత గుణాత్మక ప్రభుత్వ పాఠశాలల అవసరాన్ని నొక్కి చెపుతున్నది. తరతమ భేదాలు లేకుండా అందరికి ఒకే గుణాత్మక విద్యను అందచేయడంలో పాలకుల అలసత్వంను, నిర్లక్ష్యాన్ని, వివక్షా పూరిత దుర్నీతి విధానాలపై ప్రశ్నగా వేలాడుతున్నది. కామన్ స్కూల్ విధానాన్ని పాటించకుండా రకరకాలుగా విద్యా వ్యవస్థను విభజించి ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అంతరాల చదువుల దొంతరలను సృష్టించి నాటకం ఆడుతున్న ప్రభుత్వ విధానాలపై ఒక సవాల్‌గా నిలిచి ఉంటుంది. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనైనా విద్య అనేది సమాజ పురోగామి అభివృద్ధికి, సమానత్వంను సాధించడానికి, ప్రజాతంత్ర, విలువలను వ్యాప్తి చేయడానికి, మనిషిని ఉన్నత మానవునిగా తీర్చి దిద్దడానికి సమాజ సమస్యల పరిష్కార దిశలో తోడ్పడే ఒక శక్తివంతమైన సాధనం. అలాంటిది వ్యాపారమయం కావడం సరైనది కాదు. దాన్ని డబ్బులుపోసి కొనుక్కునే దౌర్భాగ్య పరిస్థితి దాపురించడం సిగ్గుపడాల్సిన విషయం. ఆ దుర్మార్గ పరిస్థితిని తీసుకొస్తున్న దేశీయ, అంతర్జాతీయ విధానాలు, వ్యవస్థలను ఎదురించాల్సిన అవసరాన్ని ఈ సంఘటన తెలియపరుస్తున్నది. ప్రపంచ బ్యాంక్ విధానాలు జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్ (జిఎటిటి) ఒప్పందాల్లో భాగంగా పెట్టుబడి దారీ విధానం, సామ్రాజ్యవాదం కట్టకట్టుకుని విద్యను ప్రైవేట్ పరం, కార్పొరేటీకరణ చేసి సామాన్యులకు అందకుండా చేస్తున్న విధానాన్ని ధిక్కరించే అవసరాన్ని నొక్కి చెపుతున్నది. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల బాధ్యత తమదే అని, విద్య అనేది వ్యక్తిగత వ్యవహారమనీ అనుకునే అనివార్య స్థితికి నెట్టవేయబడడం నుండి బాలలందరి విద్యా బాధ్యత అనేది సమాజానిది, ప్రభుత్వానిది అనే దశకు చేరుకునే స్థితిని మాసాయిపేటలో చిన్నారుల మృతి డిమాండ్ చేస్తున్నది.

(రచయిత ఉపాధ్యాయులు, డిటిఎఫ్ సభ్యులు) వీ

వీక్షణం రచయితలకు సూచనలు

పన్నెండు సంవత్సరాలలో, నూట నలభైకి పైగా సంచికలలో వీక్షణం దాదాపు రెండు వేల ఐదు వందలకు పైన వ్యాసాలు, రచనలు ప్రచురించింది. వీటిలో నిడివిలోనూ, వస్తువులోనూ, చెప్పిన పద్ధతిలోనూ, సుబోధకతలోనూ చాల వైవిధ్యం ఉంది. ఈ వైవిధ్యాన్నంతా గౌరవిస్తూనే, పత్రికలో అచ్చయ్యే వ్యాసాలను ప్రామాణికం చేయడానికి రచయితలు ఈ కింది సూచనలు పాటిస్తే బాగుంటుందని భావిస్తున్నాం.

- రచన మరీ చిన్నది (ఒక పేజీ కన్న తక్కువ) కాకుండానూ, మరీ పెద్దది (నాలుగు పేజీల పైన) కాకుండానూ ఉంటే బాగుంటుంది. రచన ఐదు పేజీలకు మించితే రెండు మూడు సంచికలలో వేయవలసి వస్తుంది గనుక రచయిత అభిప్రాయం పాఠకులకు అందడం కష్టమవుతుంది. మూడు-నాలుగు పేజీల రచన (1800 - 2500 పదాలు) వీక్షణంకు సరిగ్గా సరిపోతుంది.
- చేతిరాతతో పంపేవారయితే వీలయినంత కుదురుగా, చదవడానికి వీలుగా, పంక్తుల మధ్య ఖాళీ వదులుతూ, కాగితానికి ఒకవైపునే రాసి పంపాలి. కంపోజ్ చేసి పంపేవారయితే, డబుల్ లైన్ స్పేసింగ్‌లో కాగితానికి ఒకవైపునే అచ్చువేసి పంపాలి. యూనికోడ్‌లో గాని, పేజ్‌మేకర్‌లో గాని కంపోజ్ చేసేవారు సాఫ్ట్ కాపీ సి.డి. ద్వారాగాని, ఇ మెయిల్ లోగాని పంపితే మంచిది.
- రచయితలు తప్పనిసరిగా తమ రచన ఫొటో కాపీ తమ దగ్గర ఉంచుకోవాలి.
- రచనతో పాటు తప్పనిసరిగా రచయిత సంక్షిప్త పరిచయం, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, ఇమెయిల్ వగైరా వివరాలు పంపాలి.
- వీక్షణం కార్యాలయానికి రచన అందిన వెంటనే అందినట్టుగా రచయితలకు సమాచారం పంపుతాం. రెండువారాలలోగా ఆ రచనను ప్రచురణకు స్వీకరిస్తున్నదీ లేనిదీ తెలుపుతాం. తక్షణ ప్రాముఖ్యత ఉన్న అంశం మీద రచన అయితే రెండు-మూడు నెలల లోపు అచ్చువేస్తాం. సాధారణ రచనలు అచ్చువేయడానికి ఆరు నెలల వరకూ పట్టవచ్చు.
- మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణం కు పంపగూడదు.
- దీర్ఘకాలిక తాత్విక, రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద మాత్రమే కాక, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపైన కూడ రచనలు పంపాలని రచయితలకు విజ్ఞప్తి. ఆ విషయం మీదనే మరొకరు రాసినా, అన్ని దృక్పథాల రచనలు అచ్చు వేయడం వీక్షణం ఉద్దేశ్యం. క్షేత్ర పరిశోధనా నివేదికలు, విధానాల అమలు తీరుతెన్నులు, ప్రజాజీవితంలో మార్పులు, వివిధ దృక్కోణాలు, విభిన్న సామాజిక శాస్త్ర పరిశీలనాంశాలు వీక్షణంలో ప్రాధాన్య ప్రచురణాంశాలు. సాహిత్య రంగానికి సంబంధించిన రచనలకు వీక్షణంలో చోటు కల్పించడం సాధ్యం కాదు.
- రచయిత అభిప్రాయాలను మార్చడం ఎప్పుడూ జరగదు. కాని నిడివి దృష్ట్యాగాని, సాంకేతిక కారణాల దృష్ట్యాగాని రచనలు కుదించే, మార్చే పరిస్థితి రావచ్చు. ఇలా ఎడిట్ చేయడానికి రచయితలు ఆమోదించాలి.

దళితులకు భూమి భూసంస్కరణల ద్వారానే

భూపంపిణీ పథకాల పేరుతో ప్రభుత్వాలు దళితులను తమ ఓటు బ్యాంకుగా మార్చుకుంటూ, సాగు యోగ్యంకాని భూమి ఇస్తూ, భూసంస్కరణల విధానాలను కాలరాస్తున్నాయని అంటున్నారు ఆశాలత

తెలంగాణ ప్రభుత్వం భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలన్నిటికి 3 ఎకరాల భూమిని ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని అమలు చేయడానికి చర్యలు చేపట్టింది. అందుకోసం ఒక జి.ఒను (నెం.4, 2-8-2014) మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రతి గ్రామంలో భూమిలేని దళిత కుటుంబాలను గుర్తించి వారికి ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులతో ఎకరానికి 2-7 లక్షల వరకు ధర నిర్ణయించి కొనుగోలు చేసి పంపిణీ చేస్తారని ప్రకటించారు. ఆ మేరకు ఆగస్టు 15వ తేదిన దీనిని లాంచనంగా ప్రారంభించి దాదాపు 600 మంది దళిత మహిళలకు 1650 ఎకరాల భూమి పట్టాలు పంచిపెట్టడం జరిగింది. ఈ పథకం మూలంగా భూమిలేని దళితులందరికి సాగు యోగ్యమైన భూమి లభిస్తుందా లేదా, దాని సాధ్యసాధ్యాలను చర్చించే ముందు గతంలో ప్రభుత్వం భూమిలేని వారికి చేసిన భూముల పంపిణీ తీరు తెన్నులను పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మెదక్ జిల్లా మిర్దొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో 21 మంది దళిత మహిళలకు 2005లో ప్రధానమంత్రి చేతి మీదుగా ఒక్కొక్కరికి ఒక ఎకరం చొప్పున అసైన్మెంట్ భూమి పట్టాలు వచ్చాయి. ఆ భూమి నల్ల రాయితో నిండి, సాగుకి పనికిరాని ఒకే చెక్కగా ఉన్న ఉమ్మడి భూమి. పట్టాలు వచ్చిన తర్వాత దానిని స్వాధీనం చేసుకుని సాగులోకి తెచ్చుకోవడానికి ఆ 22 కుటుంబాల వారు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి, దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేసి చాలా ప్రయత్నాలే చేశారు. కాని పట్టాలు వచ్చి 10 సంవత్సరాలు కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా ఉంది. ఆ భూమిలో సమతలంగా ఉన్న కొంత భూమిని ఆ గ్రామానికి, పక్క గ్రామానికి చెందిన రైతులు తమ భూమిలో కలుపుకుని ఆక్రమించుకున్నారు. భూమి కొలతలు వేయడానికి వచ్చిన రెవెన్యూ అధికారులను కూడా వాళ్లు బెదిరించి వెళ్లగొట్టారు. ఆ 22 మందిలో 11 మంది మాలలు, 10 మంది మాదిగలు కావడం, వారిలో 18కి పట్టాదారు పాస్ పుస్తకాలు అంది మిగిలిన వారికి రాకపోవడం, ఆ ఊరిలో ఇతర భూమిలేని దళిత కుటుంబాలకు భూమి అందకపోవడం వంటి అనేక కారణాల వల్ల దళితులలో ఐక్యత లేకుండా పోయింది. ఆ గ్రామ సర్పంచ్‌తో సహా బిసి కులాల వారు ఆ 22 ఎకరాలపై దళితులకు కబ్జా హక్కు రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ గ్రామస్తులు ఇల్లు కట్టుకునేందుకు పునాది నింపడానికి ఆ 22 ఎకరాల భూమిలో ఉన్న నల్ల రాయిని తవ్వి తెచ్చుకుంటారు కనుక ఉమ్మడి అవసరానికి వాడుకునే భూమిపై దళితులకు హక్కు ఇవ్వకూడదని మిగిలిన కులాల వారి వాదన. దీనికి తోడు దళితులు, బిసిలు వివిధ రాజకీయ పార్టీలకు చెందినవారు కావడం వల్ల కూడా ఈ సమస్యకు రాజకీయ రంగు పులుముకుంది. రెవెన్యూ యంత్రాంగం ఆ భూమిలో సర్వే జరిపి, భూమి అభివృద్ధికి సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ సమస్య తెగకుండా జటిలమై కూర్చుంది. దళిత మహిళలకు పేరుకే భూమి వచ్చింది కాని అనుభవంలోకి రాలేదు.

తెలంగాణలో 20 వేలకు పైగా ఉన్న గ్రామాలలో ఇటువంటి కథలు కోకొల్లలు. ప్రతి గ్రామంలోనూ ఒక్కొక్క రకం భూమి సమస్య ఉందంటే అతిశయోక్తి కాదు. భూమి పట్టాలు ఇచ్చిన వారికి భూమి చూపించలేదు. భూమి చూపించిన వారికి విడివిడిగా సరిహద్దులు కొలతలు వేయలేదు. చాలా చోట్ల పంపిణీ చేసిన భూమి రెండు గ్రామాల మధ్య వివాదంలో ఉండి, అది గ్రామాల మధ్య, కులాల మధ్య తగువులకు దారి తీసిన సంఘటనలు ఉన్నాయి. మరికొన్ని గ్రామాలలో పశువులు మేపుకోవడానికి ఉపయోగించే ఉమ్మడి భూములను పంచి ఇవ్వడం వల్ల గ్రామంలో భూమి అందిన వారికి గతంలో ఆ భూమిని వినియోగించుకుంటున్న వారికి మధ్య తగాదాలు తలెత్తాయి. ఉమ్మడి సామాజిక అవసరాలకు భూములు లేకుండా పోయాయి. ఈ తగవులు కొన్ని గ్రామాలలో ఏళ్ల తరబడి సాగుతున్నాయి. భూములు అనుభవంలోకి వచ్చిన చాలా సందర్భాలలో రాళ్లు రప్పలతో నిండి సాగుకు పనికిరాకుండా ఉంది. అసైన్డు భూమిని సాగు యోగ్యం చేసుకోవడానికి పెట్టుబడి పెట్టి దళితులు రెక్కలు ముక్కలు చేసుకోవలసి వచ్చింది.

భారతదేశంలో అణచివేత స్వభావం గల కుల వ్యవస్థ, వర్గ వ్యవస్థ అనాదిగా దళితులను భూమి తదితర ఉత్పత్తి వనరులకు దూరంగా నెట్టివేశాయి. వ్యవసాయానికి ప్రధాన వనరైన భూమి మొదటి నుండి కొన్ని వర్గాలు, కులాల చేతుల్లో కొంత మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతమైంది. పాలేర్లుగా, జీతగాళ్లుగా, వ్యవసాయ కూలీలుగా, పొలాలకు నీరుకట్టే వారిగా, పంటలకు కాపలాదార్లుగా అత్యధిక శ్రమ చేస్తూ వ్యవసాయంలో ముఖ్య భూమిక పోషిస్తూ వచ్చింది భూమిలేని దళితులే. భూమి వంటి ఉత్పత్తి సాధనాలను తమ చేతులలో పెట్టుకున్న కొన్ని వర్గాలు, కులాలు దళితులపైన సామాజిక అణచివేతతో పాటు ఆర్థిక దోపిడి, పీడన సాగిస్తూ వస్తున్నాయి. ఇది వారికి జరిగిన, జరుగుతున్న చారిత్రక అన్యాయం. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ సాయుధ పోరాటాలు, రైతు కూలీల ఉద్యమాలు, దళితుల ఆత్మగౌరవ పోరాటాల ఫలితంగా భూమిలేని వారికి భూమి హక్కులు కల్పించాలనే డిమాండ్ ప్రధాన స్రవంతిలోకి వచ్చింది.

దీని పర్యవసానంగానే అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు, భూ పంపిణి చట్టాలు, విధానాలు అమలులోకి వచ్చాయి. 1969 నుండి నేటివరకు 42 లక్షల భూమిలేని కుటుంబాలకు 75 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెపుతున్నాయి. పంపిణీ

చేసినా ఈ భూమిలో అత్యధిక శాతం (68 శాతం) అసైన్మెంట్ భూములే (51. 42 లక్షల ఎకరాలు). సీలింగ్ పరిమితి దాటిన భూముల పంపిణీ జరిగింది చాలా తక్కువ (ఆరు లక్షల ఎకరాలు అంటే 8 శాతం మాత్రమే). అంటే ప్రభుత్వం మొదటి నుండి కూడా భూ గరిష్ట పరిమితి చట్టాన్ని అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శించింది, విఫలమైంది. ఆధిపత్య కులాల, వర్గాల చేతుల్లో కేంద్రీకృతమైన భూమిని వెలికితీయడం ఆ వర్గాలకే ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక పార్టీలకు సమ్మతం లేకపోవడం వల్ల అది నత్తనడక నడిచింది. చట్టం అమలులో జరిగిన జాప్యంతో గరిష్ట పరిమితికి మించి భూమి ఉన్న భూస్వాములందరూ జాగ్రత్త పడి బినామీ పట్టాలు సృష్టించుకున్నారు.

ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిలో 50 శాతం ఎస్‌సి, ఎస్‌టిలకే అందింది. అయితే ఇప్పటికీ ఎస్‌సిలలో అత్యధిక శాతం మందికి భూమి లేదని గణాంకాలు తెలియ చేస్తున్నాయి. జాతీయ సాంపిల్ సర్వే (2000) లెక్కల ప్రకారం 85 శాతం ఎస్‌సి కుటుంబాలకు భూమి అందలేదని తెలుస్తున్నది. 2010లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో 25000 గ్రామాల్లో చేసిన సర్వేలో 63 శాతం ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు భూమి లేదని తేలింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలో దాదాపు 11.92 లక్షల దళిత కుటుంబాలు ఉన్నాయి. వాటిలో 9.2 లక్షల కుటుంబాలు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నాయి. ఈ కుటుంబాల వారందరు కూడా వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. వారిలో 6 లక్షల మందికి ఏదో ఒక రకమైన భూమి కొంతమేరకు ఉంది. మిగిలిన 3 లక్షల కుటుంబాలకు ఏ మాత్రం భూమిలేదు అనేది ఒక అంచనా.

ప్రస్తుతం తెలంగాణలో భూమి లేనివారికి పంపిణి చేయడానికి ప్రభుత్వ భూములు కానీ, సీలింగ్ పరిమితి దాటిన భూములు కానీ లేవు అనేది ప్రధానంగా వినిపిస్తున్న వాదన. అందుకే భూమిలేని దళితులకు 3 ఎకరాల భూమిని ఇవ్వాలని నిర్ణయించుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధులతో భూములను కొనుగోలు చేసి పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. భూమి కొనుగోలు పథకాలు గతంలో కూడా అమలు జరిగాయి. ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్, సెర్ప్ సంస్థల ద్వారా జరిగిన భూమి కొనుగోలు పథకాలలో అనేక లోపాలున్నాయి. ప్రభుత్వం భూమి గొనుగోలు చేస్తున్నదనగానే భూముల ధరలు అనూహ్యంగా పెరిగిపోవడం, అమ్మేవాళ్లు సారవంతమైన నీటి వసతి ఉన్న భూములను కాక పనికిరాని భూములను అమ్మిన సందర్భాలు ఉన్నాయి. గతంలో అమలు జరిగిన పథకాల నుండి గుణపాఠాలను తీసుకోకుండా ఎంత ఖర్చయినా వెనుకాడకుండా భూమిని కొనుగోలు చేసి దళితులకు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నది.

నిజానికి భూమిలేని వారికి భూమి పంపిణీ చేయడానికి చిత్తశుద్ధి ఉంటే మార్గం లేకపోలేదు. అనర్హులైన వారి దగ్గర దాదాపు లక్షన్నర ఎకరాల సాగుయోగ్యమైన ప్రభుత్వ భూమి దురాక్రమణలో ఉందని ప్రభుత్వ లెక్కలే చెపుతున్నాయి. ఇది కాకుండా వ్యవసాయం చేయకుండా, వ్యవసాయేతర ఆదాయ వనరులున్న వందలాది ఎకరాల భూమి గలవారు పట్టణాలలో, నగరాలలో, విదేశాలలో ఉన్నారు. వాటిని భూమిలేని రైతులు కొంత మేరకు కౌలుకు చేయడం జరుగుతుంది. మిగిలింది పడావు పడి ఉంది. అటువంటి వారి భూములను దళితులకు అభివృద్ధి కోసం, వారికి భూ పంపిణి కోసం సేకరించవచ్చు. భూ గరిష్ట పరిమితి చట్టాన్ని సవరించి, వివిధ కేటగిరీలకు చెందిన కుటుంబాలకు వ్యక్తులకు వివిధ రకాల సీలింగ్ స్థాయిలను నిర్ధారించడం ద్వారా కొన్ని భూములను సేకరించవచ్చు. ఈ మార్గాలన్నిటినీ వదిలేసి టిఆర్ఎస్ ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి దళితులకు పంపిణీ చేయాలనే దగ్గరి దారిని అవలంభించింది.

ఈ పథకం చర్చకు వచ్చి గ్రామాలలో సర్వే జరుగుతున్నప్పటి నుండి భూముల ధరలు ఒక్క సారిగా పెరిగాయనీ, గ్రామాలలో భూములు అమ్మడానికి ఎవరు సిద్ధంగా లేరని, ఒకవేళ అమ్మినా సాగునీటి వసతిలేని సారవంతం కాని భూములు మాత్రమే అమ్మడానికి సుముఖంగా ఉన్నారని ప్రభుత్వాధికారులే చెపుతున్నారు. అంటే దళితుల సామాజిక ఆర్థిక అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఇటువంటి పనికిరాని భూములను కొనుగోలు చేయడానికి వినియోగించి భూములున్న వారి జేబుల్లోకి మరల్చడమే అవుతుంది. ఈ నిధులకు కూడా పరిమితి ఉంది కాబట్టి దీని ద్వారా భూమిలేని 3 లక్షల దళిత కుటుంబాలకు భూమి అందుతుందని హామీ లేదు.

ఇకపోతే భూమిలేని దళిత కుటుంబాల ఎంపికలో కూడా అనేక సమస్యలున్నాయి. గతంలో జరిగిన భూ పంపిణీ కార్యక్రమంలో సాగుయోగ్యం కాని భూమిని పొంది అందులో సాగు చేయని వారిని కూడా భూమి ఉన్న వారిగా పరిగణించి వారిని లబ్ధిదారులుగా పరిగణించకపోవడం చేత వారికి తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది. గతంలో భూ పంపిణీలో జరిగిన అన్ని రకాల అవకతవకలను సరిదిద్దకుండా ఈ పథకాన్ని అమలు చేస్తామంటే దళితులకు న్యాయం జరగదు.

ఈ పథకం కింద పంపిణీ చేసిన భూములను అమ్ముకునే హక్కు లేకుండా ప్రభుత్వం డి పట్టాలను ఇచ్చి 15 ఏళ్ల వరకు తన వద్దనే ఉంచుకునేటట్లు నిర్ణయం తీసుకుంది. ఇది ఆ భూములు చేతులు మారకుండా ఉండడానికి ఉత్తమమైన మార్గమే అయినప్పటికీ గతంలో అభివృద్ధి ప్రాజెక్టులకు డి పట్టా భూములను తిరిగి తీసుకున్న అనుభవం రీత్యా ఈ భూములను తిరిగి తీసుకోకుండా జాగ్రత్త చర్యలు, వ్యవస్థలు ఏర్పరచుకోవలసిన అవసరం ఉంది. లేకపోతే గతంలో సెజ్‌లకు, పారిశ్రామిక కారిడార్లకు, సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ జరిగినప్పుడు అసైన్డ్ భూములను తిరిగి తీసుకున్నట్లు ఒక చేత్తో భూమి ఇచ్చి మరొక చేత్తో అభివృద్ధి కార్యక్రమాల కంటూ తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగే ప్రమాదం ఉంది.

ఇక ఈ భూమిని దళిత మహిళల పేరుమీద పంపిణీ చేయడం ఆహ్వానించదగిన విషయం. నేడు ప్రధానంగా వ్యవసాయం చేస్తున్నది మహిళలే కాబట్టి వారిపేరు మీద భూమి పట్టాలను ఇవ్వడం న్యాయం. దళిత మహిళలకు భూమి అనేది ఒక ఆస్తి కాదు, ఆర్థిక స్వావలంబన, ఆత్మ విశ్వాసం, సామాజిక హోదాను కల్పించే ఒక ఉత్పత్తి వనరు. ఈ పథకంలో భూమిని పొందుతున్న దళిత మహిళలకు సాగునీటి వసతితో సహా ఒక ఏడాది వరకు సాగుచేయడానికి అవసరమైన అన్ని రకాల మద్దతు కల్పిస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఇది కూడా చాలా అవసరమైనదే. దీనిపై ఇంతవరకు ఎటువంటి వివరాలు మార్గదర్శకాలు వెలువడలేదు. కానీ ఈ సహాయం ఒక సంవత్సరం సరిపోదని కనీసం 3-5 సంవత్సరాల వరకు దశల వారిగా ఉండాలనీ మహిళా రైతులు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్షీణిస్తున్న భూసారం, మారుతున్న

పోలవరం - మానవ మూల్యం

మూడు లక్షల మంది ఆదివాసులను నిర్వాసితులను చేసి పర్యావరణాన్ని విధ్వంసం చేసే, బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్ట్‌ను అడ్డుకొని, ఆదివాసులను రక్షించుకోవాలని అంటున్నారు **షేక్ కరీముల్లా**

పోలవరం ప్రాజెక్టు వలన ఖమ్మం జిల్లాలో ముంపుకు గురయ్యే పలు మండలాలనూ, గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపేందుకు ఉద్దేశించిన ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2014కు పార్లమెంట్ ఆమోదించడంతో, ముంపు ప్రాంతాలలో ఆందోళనలు మొదలయ్యాయి. ఇటీవలే శ్రీకాకుళం నుంచి పోలవరం వరకు గిరిజనులు నిరసన ర్యాలీ చేపట్టారు. గత ఏప్రిల్‌లో జరిగిన ప్రాదేశిక ఎన్నికలను ఖమ్మం జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు తమను ఆంధ్రప్రదేశ్ కలుపడానికి వ్యతిరేకంగా బహిష్కరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గడ్ రాష్ట్రాలు పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుతుండగా ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉండడంతో విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం మాట్లాడుతుంది. డిజైన్ మార్చి ముంపు తగ్గించి నిర్మించాలని అనేక రాజకీయ పార్టీలు మాట్లాడుతున్నాయి.

పోలవరం నిర్మాణం వల్ల దాదాపు 400 పై చిలుకు గ్రామాలు ముంపుకు గురికాబోతున్నాయి. దాదాపు 1,93,357 ఆదివాసులతో కలుపుకుని మొత్తం 2,75,000 మంది ప్రజలు నిర్వాసితులు అవ్వనున్నారు. ఇంతేకాక కొండ రెడ్ల జాతి అంతరించి పోయే ప్రమాదం ఉంది. ప్రకృతి రమణీయమైన పాపికొండలు కనుమరుగవుతాయి. అరుదైన పక్షి, జంతు జీవజాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి ఇరువైపుల ఉన్న ఆదివాసి ప్రాంతాలలోని సారవంతమైన భూములు మునిగిపోతాయి. మొత్తంగా ఆదివాసి సంస్కృతి, జీవవిధ్వంసం జరుగనుంది. ఏ కారణం చేతనైన ప్రాజెక్టు దెబ్బతింటే, రాజమండ్రి పట్టణం క్షణాల్లో కొట్టుకుపోతుందని ఇక్కడి ప్రముఖులు హెచ్చరిస్తున్నారు. అలాగే భద్రాచలంతో పాటు దేవాలయం కూడా మునిగిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇన్ని కారణాల రీత్యా పోలవరానికి ఆది నుండి అడ్డంకులే. కాబట్టి మేధావులారా! మౌనం వీడండి! ప్రజలకు వాస్తవాలు చెప్పండి! లేకుంటే చరిత్ర మిమ్మల్ని క్షమించదు. ఇంత కష్టం, నష్టం తెచ్చే పోలవం ప్రాజెక్టు అవసరమా? ప్రత్యామ్నాయ మార్గం లేదా? బహుశ దేశ చరిత్రలోనే ఇంత లోతుగా అధ్యయనం, పరిశోధన జరిగిన సాగునీటి ప్రాజెక్టు మరొకటి లేదు.

ఈ ప్రాజెక్టు నిర్మించాలనే ఆలోచనను 145 సంవత్సరాల క్రితమే బ్రిటిష్ ప్రభుత్వం చేసింది. 1870లో డిజైన్ రూపొందించిన అక్కడి నేల అనువుగా లేకపోవడంతో విరమించుకుంది. మరలా 1940 దశకంలో ప్రయత్నించి ఆ ప్రాంతం డ్యాం నిర్మాణానికి అనుకూలం కాదని పలు నివేదికలు తేల్చి చెప్పడంతో ఆగిపోయింది. 1976లో ఎత్తు తగ్గించి ప్రాజెక్టులను డిజైన్ చేయాలని చూసిన ముందగుడుగు పడలేదు. 1986లో ప్రయత్నించిన కేంద్ర జల సంఘం వ్యతిరేకించింది.

వాతావరణ పరిస్థితులు, సర్వత్రా నెలకొన్న వ్యవసాయ సంక్షోభం దృష్ట్యా ఆ భూములలో ఎటువంటి పంటలు వేసుకోవాలి, ఏ పద్ధతులు వాడాలి అని చెప్పే సరైన విస్తరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఈ పథకంలో భూమిని పొందుతున్న మహిళలకే కాదు, గతంలో ప్రభుత్వ భూ పంపిణీలో భూమిని పొందిన వారందరికీ కూడా ఇటువంటి మద్దతు వ్యవస్థలు కల్పించాలి. వైవిధ్యం గల ఆహార పంటలను తక్కువ ఖర్చుతో పండించుకునే విధంగా, వాటికి గిట్టుబాటు ధరలను కల్పించి ప్రోత్సహించాలి. లేనట్టయితే ఈ దళిత మహిళా రైతులు కూడా పత్తి లాంటి వాణిజ్య పంటల వైపు మళ్లి, వ్యవసాయంలో ఖర్చులు పెరిగిపోయి, అప్పుల పాలై వ్యవసాయం చేయలేని స్థితిలోకి నెట్టబడి అప్పుల ఊబి నుండి బయట పడలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి చేరుకుంటారు.

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న భూమిలేని దళితులకు ముఖ్యంగా మహిళలకు భూములు దక్కాలంటే అన్యాక్రాంతమైన అసైన్మెంట్ భూములను తిరిగి రాబట్టాలి. అనర్హుల చేతిలో దురాక్రమణలో ఉన్న సాగు యోగ్యమైన భూముల లెక్కలను వెలికి తీయాలి. బినామీల పేరుతో సీలింగ్ పరిమితి నుండి తప్పించుకుని భూమిని కలిగి ఉన్నవారి నుండి భూమి సేకరించాలంటే సీలింగ్ చట్టాన్ని సవరించి పరిమితిని తగ్గించాలి. భూమిలేని వారికి పంపిణీ చేసిన సాగు యోగ్యమైన భూములను ఎట్టి పరిస్థితిల్లోను ఎటువంటి ప్రాజెక్టులకు సేకరించకుండా నిషేధించాలి. రాష్ట్రంలో వ్యవసాయానికీ, పరిశ్రమలకు, ఇతర అవసరాలకు ఎంత భూమి అవసరమవుతుందో అంచనా వేసే భూ వినియోగ విధానం తీసుకువచ్చి వ్యవసాయ భూములను ఇతర అవసరాలకు మళ్లించకుండా చూడాలి. వ్యవసాయేతరులు వ్యవసాయ భూములను కొనకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

(రచయిత రైతుస్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వీనర్)

(రైతు స్వరాజ్యవేదిక, కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్, గ్రామస్థాయి సమాచారం సేకరణలో సహకరించిన గణేష్, ప్రవీణ్, ప్రసాద్‌లకు కృతజ్ఞతలతో)

వీ

2004లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 'జలయజ్ఞం'లో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 1980 పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 అటవి సంరక్షణ చట్టం, వన్యప్రాణి చట్టం, గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. జీవ విధ్వంసం భారీ స్థాయిలో ఉండడంతో ఈ ప్రాజెక్టును ఆదివాసులే కాకుండా పర్యావరణ వేత్తలు అర్థం చేసుకున్న సామాన్య ప్రజలు సైతం వ్యతిరేకిస్తున్నారు. అంతేకాక ఆదివాసి ప్రాంతాలు భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ కిందకు వస్తాయి. వీటికి ప్రత్యేక చట్టాలు, అధికారాలు ఆదివాసులకు కల్పించారు. పోలవరం ముంపు ప్రాంతం పూర్తిగా షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉంది. ఇక్కడ అమల్లో ఉన్న 1/70 చట్టం ప్రకారం ఆదివాసుల అనుమతి లేకుండా ఇటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అలాగే పెసా చట్టం ప్రకారం అక్కడి గ్రామసభల అనుమతి లేకుండా ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలకు చట్టబద్ధత లేదు. ఈ చట్టాలు ఆదివాసులకు రక్షణ ఇస్తున్నప్పటికి, ప్రభుత్వాలు వీటిని పెడచెవినపెట్టి రాజ్యాంగబద్ధంగా నడుచుకోవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాలను తుంగలో తొక్కి తాత్కాలిక అనుమతుల పేరుతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నాయి.

ఈనాడు భారీ డ్యాముల నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో వాటి నిర్మాణం నిలిచిపోయింది. వాటిని పేల్చివేస్తున్నారు. భారీ డ్యాములు మేలు కంటే కీడు ఎక్కువగా చేస్తాయనడం ఇప్పుడు ఊహాగానం కాదు. భారీ డ్యాములకు కాలం చెల్లిపోయింది. అవి నిరర్థకమైనవి. అవి అప్రజాస్వామికమైనవని ప్రపంచ అనుభవం తేల్చి చెప్పింది. ఇవి నిరుపేదల నుంచి నీటిని, భూమిని నిస్సిగ్గుగా కొల్లగొట్టి ధనవంతులకు బహుమతిగా అందచేస్తాయి. ఈ జలాశయాలు పెద్ద ఎత్తున ప్రజలను నిర్వాసితులుగా మార్చి నిలువ నీడ లేకుండా చేస్తాయి. దిక్కులేని అనాథలుగా మారుస్తాయి. పర్యావరణ పరంగా కూడా అనేక సమస్యల్ని సృష్టిస్తాయి. భూమిని పనికి రాకుండా చేస్తాయి. అవి వరదలకు కారణమవుతాయి. నీటిని నిలిపి ఉంచి, చిత్తడిని చవుడును సృష్టించి అంటువ్యాధులను వ్యాపింపచేస్తాయి. భారీ డ్యాములకు, భూకంపాలకు మధ్య సంబంధం ఉందనేందుకు ఎన్నో సాక్ష్యాధారాలున్నాయి. కాబట్టే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సర్ ఆర్థర్ కాటన్, కె.ఎల్. రావు లాంటి నిపుణులు వ్యతిరేకించారు. లక్షల్లో ఉన్న ముంపు బాధితులుకు, నిర్వాసితులకు పునరావాసం కల్పించి, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం మామూలు విషయం కాదు. ఇప్పటికే సుమారు నాలుగు నుంచి ఐదు కోట్ల మంది ప్రజలు దేశంలోని డ్యాముల వలన నిర్వాసితులయ్యారు. నిర్వాసిత ప్రజల్లో అత్యధిక శాతం ఆదివాసిలే (సర్దార్ సరోవర్ డ్యాం విషయంలో 57.6 శాతం) దళితులను కూడా కలిపితే ఒక అంచనా ప్రకారం నిర్వాసితుల్లో 60 శాతం వరకు షెడ్యూల్డ్ కులాలు, తెగల వారే. అంటే భారతదేశంలోని అత్యంత పేద ప్రజలు దేశంలోని సకల సంపన్నుల ఉన్నత జీవనం కోసం మూల్యం చెల్లిస్తున్నారు.

ఈ కోట్లాది నిర్వాసిత ప్రజలంతా ఏమైపోయారు? వాళ్లంతా ఇప్పుడు ఎక్కడున్నారు? తమ తిండి తిప్పల్ని ఎలా సంపాదించుకుంటున్నారు. ఈ విషయాలు ఎవరైనా ఆలోచిస్తున్నారా? పునరావాసం విషయానికి వస్తే ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటి? ఒక స్పష్టమైన విధానం ఉన్నదా? అసలు భారతదేశానికి ఒక జాతీయ పునరావాస విధానమనేదే లేదు.

1894 భూసేకరణ చట్టం (దీనిని 1984లో సవరించారు) ప్రకారం నిర్వాసితుడైన వ్యక్తికి ప్రభుత్వం నగదు రూపంలో నష్టపరిహారం తప్ప మరేమి ఇవ్వనవసరం లేదు. చాలా మంది ఆదివాసుల దగ్గర తమ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కాగితాల వంటివేమి ఉండవు. కాబట్టి వాళ్ల చట్ట ప్రకారం నష్ట పరిహారాన్ని అడిగేందుకు వీలులేదు. ఇలా అన్యాయానికి గురవుతూ, సహాయ, పునరావాస కేంద్రాలలో వసతులు, సౌకర్యాలు లేక నిర్వాసితుల్లో అత్యధికులు మహానగరాల శివార్లలోని మురికి వాడల్లో చేరిపోతారు. అక్కడ భవన నిర్మాణ కూలీలుగా కారుచౌక శ్రామికులుగా మారిపోతారు. ఇక్కడ కూడా ఆక్రమణలు తొలగింపులు అంటూ వీరి పూరిగుడిసెల్ని ప్రభుత్వం ప్రొక్లెయినర్లతో నేలమట్టం చేస్తుంది. వీరికి నిలువ నీడ లేకుండా పోతుంది. ఒకసారి కదలడం మొదలు పెడితే ఇక వారికి విక్రయించే స్థలమే దొరకదు.

ఇంత విధ్వంసం 'దేశ పురోగతి' కోసం 'జాతీయ ప్రయోజనం' పేరుతో జరుగుతుంది. కాబట్టి ప్రజలు ప్రశ్నించకూడదు. మాట్లాడ కూడదు. అయితే ఈ ప్రాజెక్టు ఎవరి కోసం? ఎవరి ప్రయోజనాల కోసం? అనేది మౌలిక ప్రశ్న! కోస్తా తీర ప్రాంతంలో నెలకొల్పనున్న కోస్టల్ కారిడార్‌కు కాకినాడ సెజ్‌లకు నీటి సరఫరా కోసమే ఈ ప్రాజెక్టు. ఈ దేశ సంపదను బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టుటకు, కాంట్రాక్టర్ల, రాజకీయ నాయకుల జేబులు నింపుటకు, ఆంధ్ర సంపన్నుల, భూస్వాముల ప్రయోజానాలకు అనేది జగమెరిగిన సత్యం. వీరి కోసం సామాన్యులు, అమాయక పేద ప్రజలు ఇంత మూల్యం చెల్లించాలా? వ్యవసాయం ప్రధాన వృత్తి గల దేశం మనది. వృద్ధిరేటు 5 శాతం లోపు మాత్రమే కలిగి ఉండి, పేదరికం 29.6 శాతం (రంగారాజన్ కమిటీ నివేదిక) గల భారతావనికి ఇంత భారీ వ్యయం (16,01,045 కోట్లు) తో కూడిన భారీ ప్రాజెక్టు భారమవుతాయి. మేలు కంటె కీడు ఎక్కువ జరుగుతుంది.

స్థానిక అవసరాలకు అనుగుణంగా చిన్న చిన్న ప్రాజెక్టుల నిర్మాణమే అభిలషణీయమనేది ఆర్థిక, వ్యవసాయ శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ దిశగా ఆచరణ ఉండాలి. అంతేగాని అభివృద్ధి పేరుతో ప్రజావ్యతిరేక విధానాలు చేపట్టరాదు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఇదే జరుగుతుంది. పెద్దపెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టులు నిర్మాణం కాకుండా అభివృద్ధి సాధ్యం కాదని, అందుకోసం ప్రజలు కొంత మంది నిర్వాసితులు కాక తప్పదని, ప్రజలు త్యాగాలు చేయాలని అంటూ ఈ అభివృద్ధి ముసుగులో విధ్వంసం సృష్టిస్తున్నారు.

కాబట్టి ఇలాంటి అభివృద్ధి అవసరం లేదు. ఈ పేరుతో అడవి బిడ్డలు, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నిరాశ్రయులు కారాదు. ఎందుకంటే ఈ దేశ ఆదివాసి సంస్కృతి చాలా ప్రాచీనమైనది. వీరి సంస్కృతి నశించిపోకూడదు. వారు ఈ దేశ మూలవాసులు. వారిని గౌరవించాలి. ప్రేమించాలి. వారు చిరకాలంగా ఈ అడవిని నమ్ముకుని బతుకుతున్నారు. అడవి తల్లి ఆదివాసుల జీవితంలో అంతర్భాగం. కాబట్టి ఆదివాసి గిరిజనులను రక్షించుకుందాం! పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకిద్దాం! వీ

(రచయిత పాత్రికేయులు)

బంగారు తెలంగాణ అనే ఫాంటసీ

***ప్రజలను మాటలతో వరాల జల్లులో ముంచుతూ, చేతల్లో మాత్రం కార్పొరేట్ కంపెనీలకు డబ్బుల జల్లును కురిపిస్తున్న తెలంగాణ మొట్టమొదటి స్వయంపాలనా ప్రభుత్వం, గత ప్రభుత్వాలకు ఏ రకంగానూ భిన్నం కాదని అంటున్నారు* నర్సింహ**

హైదరాబాద్ శివారులోని ఒక ప్రాంతంలో రోజూ రాత్రి 10 గంటల తర్వాత ఒక తొమ్మిది, పదేళ్ల అమ్మాయి రోడ్డు మీద నిలబడి లిఫ్ట్ అడుగుతుంటుంది. చిరిగిన ఒక ప్యాంట్, షర్ట్‌తో, కురుచ జుట్టుతో ఉంటుంది. ఆ అమ్మాయి తండ్రి అనారోగ్యంతో చనిపోయిండు. తల్లి అనారోగ్యంతో ఉంది. ఆ అమ్మాయి ఒక హోటల్‌లో ఉదయం ఎనిమిది నుండి రాత్రి పది గంటల వరకు గిన్నెలు, ప్లేట్లు, గ్లాస్‌లు కడుగుతుంది. 14 గంటల పనికి యాభై రూపాయలిస్తున్నారు. బస్సులో ప్రయాణిస్తే రానూ, పోనూ ఇరవై రూపాయలు చార్జీలవుతాయని, అందుకే సురక్షితం కాకపోయి నప్పటికీ లిఫ్ట్ అడుగుతున్నానని చెప్పింది.

ఆ అమ్మాయి తెలంగాణకు, అందునా వెనుకబడిన కులానికి, మరీ ముఖ్యంగా అత్యంత పేద వర్గానికి చెందినది. ఈ అమ్మాయి దుస్థితికి సీమాంధ్ర పాలకుల దోపిడీ, వివక్షనే కారణమని అనడానికి మనమిప్పుడు సమైక్య రాష్ట్రంలో లేం. స్వయంపాలన మొదలై మూడు నెలలు గడుస్తున్నది. అయినా ఆ అమ్మాయి ప్రమాదపు అంచులలో, బాల్యాన్ని కరిగిస్తూ, తన తల్లి ఆసుపత్రి ఖర్చుల కొరకు రోజు 14 గంటలు పని చేస్తున్నది.

దశాబ్దాల ప్రజా పోరాటాల తర్వాత ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోని మొట్టమొదటి ప్రభుత్వం నిజంగా ప్రజా ప్రభుత్వమే అయితే, కేవలం మొదటి నెల రోజుల స్వయంపాలనలోనే యుద్ధ ప్రాతిపదికన న్యాయం జరుగవలసిన అత్యంత ప్రమాదకర పరిస్థితులలో బతుకుతున్న పేద వర్గానికి చెందిన అమ్మాయి. అయితే స్వయంపాలన వచ్చి మూడు నెలలవుతున్నా ఇంకా ఆ ప్రమాదకర పరిస్థితులలోనే రోడ్డుపై నిలబడుతున్నది. మూడు నెలల్లోనే ఏమి మార్పు వస్తుందని కొందరు అడగవచ్చు. విమర్శించాలి కాబట్టి విమర్శిస్తున్నారనవచ్చు. మూడు నెలల్లోనే కెసిఆర్ చాలా చేసి చూపించాడు. ఎవరికి? తెలంగాణకు సంబంధంలేని, దేశంలోనే అత్యంత ధనవంతులకు తెలంగాణ ప్రజా ధనంతో వారికి లాభం చేసి చూపించాడు. ఏంటవి?

అసెంబ్లీ ముందు నుండి మెట్రోరైల్ వెళితే దాని అందం దెబ్బ తింటుందని, అందుకే దాన్ని అసెంబ్లీ వెనుక నుండి వేయాలని కెసిఆర్ మెట్రోరైల్‌ను నిర్మిస్తున్న ఎల్ అండ్ టి కంపెనీకి చెపితే, ఈ మార్పు చేర్పుల ఖర్చు ప్రభుత్వమే భరించాలని, దానికి ఆరు వందల కోట్లు అవుతుందని ఆ కంపెనీ అంటే, కెసిఆర్ ఆరు వందల కోట్ల తెలంగాణ ప్రజల ధనాన్ని ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. అంతే కాదు, మెట్రో రైల్‌ను రెండు వందల కిలోమీటర్లు పొడిగించడానికి సిద్ధమని కెసిఆర్ ఆ కంపెనీకి చెప్పాడు. ఫార్మా కంపెనీలకు ఏడు వేల ఎకరాలు, సినిమా రంగానికి రెండు వేల ఎకరాలు కేటాయించాడు. పారిశ్రామిక వేత్తలకు ఇవ్వడానికి లక్షల ఎకరాల భూమిని తెలంగాణ వ్యాప్తంగా గుర్తించామని ప్రకటించాడు. హైదరాబాద్ శివార్లలో ఇంకా రెండు అంతర్జాతీయ విమానాశ్రయాలు కడుతానని ప్రకటించాడు. బడా పారిశ్రామిక వేత్తలు తమ పరిశ్రమ కొరకు దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు, అది కూడా పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగనవసరం లేకుండా ఆ కంపెనీ తరఫున ప్రభుత్వాధికారే అన్ని అనుమతులు తెస్తాడని, చివరికి పారిశ్రామిక వేత్తను విమానాశ్రయం నుండి ప్రభుత్వ వాహనంలో ఒక ఉన్నతాధికారి స్వయంగా తీసుకొని సెక్రటేరియట్ తీసుకెళ్లేట్లుగా పాలసీ చేశామని అన్నాడు. హైదరాబాద్ ప్రజలపై నిఘా పెట్టడానికి ఒక లక్ష విదేశీ నిఘా కెమెరాలను కొనడానికి కెసిఆర్ ఆర్డర్ ఇచ్చాడు.

ఇన్నోవాల కాంట్రాక్టు కథ

యాభై లక్షలకు మించిన కాంట్రాక్టును టెండర్లు పిలువకుండా ఇవ్వడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ బంగారు తెలంగాణ కాబట్టి టెండర్లు పిలువకుండా 1500 ఇన్నోవా వ్యాన్లను, 1600 ద్విచక్ర వాహనాలను హైదరాబాద్ పోలీసుల కొరకు కెసిఆర్ ఆర్డర్ ఇచ్చాడు. పోలీసులు దశాబ్దాలుగా వాడుతూ వస్తున్న టాటా సుమోలు, మహీంద్రా జీపులు స్వదేశీ వాహనాలు. పైగా ఇవి చాలా చౌక. ఇవి దాదాపు ఐదు లక్షల ఖరీదు. ఇన్నోవా 13 లక్షల పై మాటే. సుమో, మహీంద్రా జీపుల మెయింటెనెన్స్, విడి భాగాలు ఇన్నోవాతో పోల్చినప్పుడు అత్యంత చౌక. ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ జపాన్ దేశానికి చెందిన, ఖరీదైన ఇన్నోవా వ్యాన్లనే కెసిఆర్ ఎందుకు కొన్నాడు? అసలు అత్యంత పేదరికం, అప్పులు, కరువు, కాటకాలలో మగ్గుతున్న తెలంగాణ ప్రజల సంక్షేమాన్ని అత్యవసర ప్రాతిపదికన తీర్చకుండా, అవసరం కూడా లేని ఇన్నోవా కార్లకు అంత అత్యవసరంగా కెసిఆర్ ఎందుకు అర్డర్ ఇచ్చాడు? తెలంగాణ స్వపరిపాలన ఏర్పడిన తరువాత ఇతర ఏ పనులు అమలు చేయకుండా ముందు ఈ పనే ఎందుకు చేశాడు? ఈ ప్రశ్నలకు జవాబు దొరుకాలంటే, ఆ ఇన్నోవాలను ఏ డీలర్ దగ్గర కొన్నారో తెలియాలి. ఆ ఇన్నోవాలను హర్ష టొయోటా అనే డీలర్ వద్ద కొన్నారు. దాని యజమాని కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడి కొడుకు. అదేమిటి, వెంకయ్యనాయుడు, చంద్రబాబునాయుడు కలిసి తెలంగాణ రాకుండా అడ్డుకున్నారని, ఇప్పుడు హైదరాబాద్‌పై గవర్నర్‌కు అధికారాల కొరకు ఇద్దరు కుట్రలు పన్నుతున్నారని కెసిఆర్ ఆరోపించారు కదా? మరి ఆయనకే ఎందుకు కోట్లాదిగా లాభం చేశాడు? అదే రాజకీయమంటే! ఈ విషయాన్ని కనీసం టివి9, ఆంధ్రజ్యోతి లాంటి కెసిఆర్‌ను వ్యతిరేకిస్తున్నట్టు చెప్పబడుతున్న మీడియా కూడా ఎందుకు బయటపెట్టలేదు? అదే రాజకీయమంటే!

వేల కోట్ల ఆస్తులతో రాజభోగాలు అనుభవిస్తున్న పారిశ్రామిక వేత్తలకు తెలంగాణ ప్రజాధనాన్ని, భూమిని మూడు నెలల్లోనే ఈ స్థాయిలో

కట్టబెట్టగలిగిన, ఆ దిశలో చట్టాలు చేయగలిగిన నాయకుడికి, అత్యంత పేదరికంలో మగ్గుతున్న వారికి ఏమైనా చేయడానికి మాత్రం మూడు నెలల సమయం సరిపోదని ఎవరైనా వాదిస్తే అది పచ్చి నయవంచనే అవుతుంది. అమెరికాకు చెందిన హాలీవుడ్ సినిమా రంగం ఫ్యాంటసీ (ఊహ లోకపు) సినిమాలకు పెట్టింది పేరు. బంగారు తెలంగాణ అనే ఫ్యాంటసీ సినిమా హాలీవుడ్ దర్శకులనే ఆశ్చర్యపరిచే స్థాయిలో ఉంది. ఈ ఫ్యాంటసీ సినిమాను విశ్లేషించే ముందు, ఈ మూడు నెలల 'బంగారు తెలంగాణ'లో జరిగిన కొన్ని కఠోర వాస్తవాలను చెప్పక తప్పదు.

అర్థరాత్రి పోలీసు దాడులు

తెలంగాణ స్వయంపాలన ఏర్పడిన కొన్ని రోజుల తర్వాత నుండి కెసిఆర్ హైదరాబాద్‌ను 'సేఫ్ సిటీ'గా (సురక్షిత నగరంగా) మారుస్తానని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాడు. సీమాంధ్ర పాలకుల నుండి మనల్ని కెసిఆర్ సురక్షితంగా కాపాడుతాడని తెలంగాణ వాసులు ఆశించారు. ఆ బంగారు కల ఒక రోజు చెదిరిపోయింది. హైదరాబాద్ శివారులో, అత్యంత పేద తెలంగాణ ప్రజానీకం ఉండే ఒక బస్తీపై రెండు వందలకు పైగా పోలీసులు దాడి చేశారు. ఎప్పుడు? చుట్టు పక్కల ఫ్యాక్టరీలలో పనిచేసి, అలిసి సొలసి పడుకునే అర్ధరాత్రి ఒంటి గంట నుండి తెల్లారి ఐదు గంటల వరకు ఆ బస్తీని చుట్టుముట్టారు. వారు దీనికి పెట్టిన ముద్దు పేరు 'కార్డన్ సెర్చ్' (అంటే దిగ్బంధనం చేసి అన్ని ఇళ్లు వెతుకు). ఒక ఇంటిని పోలీసులు వెతకాలంటే కోర్టు నుండి 'సర్చ్ వారెంట్' తీసుకోవాలని రాజ్యాంగం చెపుతున్నది. బంగారు తెలంగాణలో కాగితంపై రాయబడిన రాజ్యాంగంతో ఏమి పని అనుకున్నట్టుంది తెలంగాణ ప్రభుత్వం. బస్తీవాసుల ఇళ్లని వెతికి, అందరి వివరాలు సేకరించి, కొందరిని అనుమానితుల పేరుతో మీడియాకు చూపారు. తమకు ప్రింట్ చేసుకోవడానికి సరుకు దొరికిందన్న ఆనందంతో వారి ఫోటోలను పత్రికల్లో ప్రింట్ చేశారు. ఇది ఒక్కసారి మాత్రమే జరిగిన అవాంఛిత సంఘటననేమో అనుకొని సంతృప్తి చెందబోతుంటే, వారానికే ఇంకో శివారు పేదల వాడపై అదే జరిగింది. మళ్లీ కొన్ని ఫొటోలు.

లక్షల కోట్లు దోచుకున్న సీమాంధ్ర పాలకులు నివసించే బంజారా, జూబ్లీ హిల్స్‌లను చుట్టుముట్టి వారి నుండి తిరిగి ఆ ధనాన్ని కక్కించినంత ఆనందంగా, విజయోత్సాహంతో, ఇకముందు తరుచుగా ఇలాంటి కార్డన్ సర్చ్‌లు ఉంటాయని పోలీసులు చెప్పారు. అంతేకాదు, గుడిసెల్లో ఉండేవారి వద్ద, వారి ఆదాయానికి మించిన వస్తువులుంటే వారిపై కేసులు కూడా పెడతామని గర్వంగా ప్రకటించారు. అదేంటి, తెలంగాణ కొరకు పోరాడింది లక్షలాది ఎకరాలను అక్రమంగా ఆక్రమించుకున్న, లక్షల కోట్ల రూపాయల తెలంగాణ ప్రజా ధనాన్ని దోచుకున్న సీమాంధ్ర పాలక వర్గాల ఇళ్లను 'కార్డన్ సర్చ్' చేయడానికి కాదా? వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి కాదా? అని ఎవరైనా అమాయకంగా అనుకుంటున్నారా? బంగారు తెలంగాణలో ఇసుమును కూడా కొనలేని పేద ప్రజలే అనుమానితులు. ఈ దాడులు వారం, పది రోజుల కొకసారి జరుగుతూనే ఉన్నాయి. పేపర్లలో వార్తలు వస్తూనే ఉన్నాయి.

బంగారు తెలంగాణలో ఇలాంటి వార్తలు తెలంగాణవాదులు చదవనవసరం లేదు. పొరపాటున చదివినా, విన్నా తీవ్రంగా పరిగణించనవసరం లేదు. బంగారు జీవితాలతో, బంగారు ఆస్తులతో నిండి పోయిన వారికి బంగారు తెలంగాణలో ఏ ఇబ్బందులు కలగకూడదు కాని, ఏ బంగారం లేని మట్టి మనుషుల మానవ హక్కుల హననం గురించి ఎవరికి కావాలి? బంగారు తెలంగాణలో 'సురక్షిత నగరం' అంటే తెలంగాణకు చెందిన పేద ప్రజల బస్తీలపై రాజ్యాంగ విరుద్ధంగా వందలాది పోలీసులు దాడి చేయడం, ఇళ్లు సోదా చేయడం, అందర్నీ నేరస్తుల్లా అనుమానించడం, అనుమానితుల పేరు మీద వారి ఫొటోలను పత్రికలలో అచ్చు వేయడం.

ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే, చివరికి తెలంగాణలో ఉన్న పౌరహక్కుల సంస్థలు, ప్రజాస్వామిక వాదులు కూడా ఈ దాడులపై స్పందించిన దాఖలాలు లేవు. బంగారు తెలంగాణలో బహుశా వారు కూడా చదవడం, వినడం ఆపేశారేమో.

పందికొక్కులు, దొంగలు – సమగ్ర సర్వే

'మన ప్రభుత్వం రాగానే మూడు వేల ఎకరాల రామోజీ ఫిల్మ్ సిటీని నాగళ్లతో దున్నిస్తాను' అని తెలంగాణ ఉద్యమ కాలంలో కెసిఆర్ అన్న మాటలు. రామోజీలా హైదరాబాద్ చుట్టూ కొన్ని వేలాది ఎకరాలను ఆక్రమించుకున్న వారు, లక్షల కోట్ల రూపాయల తెలంగాణ ధనాన్ని దోచుకున్నవారు తెలంగాణ పాలిట పందికొక్కులు, దొంగలు అని తెలంగాణ ప్రజలు అనుకున్నారు. ఉద్యమ కాలంలో కెసిఆర్ కూడా అలానే అన్నారు.

'పందికొక్కుల లాగా రెండేసి రేషన్‌కార్డులతో బియ్యం తీసుకుంటు న్నారు'. ఈ మాటలన్నది ఉద్యోగ సంఘాల నుండి టిఆర్ఎస్‌లోకి వెళ్లి ప్రజా ప్రతినిధి అయిన నాయకుడు. 'బోగస్ రేషన్ కార్డులున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాను', 'దొంగల పాలిట నేను హిట్లర్‌నే. హిట్లర్ తాతలాగా కూడా ఉంటాను. అర్హులైన వారికే సంక్షేమ పథకాల లబ్ధి దక్కాలనేదే మా విధానం. అందుకే సర్వే చేస్తున్నాం'. ఇవి ఆగస్టు 17న కెసిఆర్ అన్న మాటలు.

అదేంటి? తెలంగాణ ఉద్యమ కాలంలో తెలంగాణ ప్రజాధనాన్ని దోచుకున్న, భూములను ఆక్రమించిన వారిని కదా దొంగలని, పంది కొక్కులని అన్నారు? మరిప్పుడు టిఆర్ఎస్ నాయకులు అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలనే దొబ్బితినే వారిగా, పందికొక్కులుగా, దొంగలుగా, బోగస్ పనులు చేసే వారిగా చిత్రీకరిస్తూ, ఈ దొంగల గుట్టురట్టు చేయడానికే సర్వే అంటున్నారని మీకు ప్రశ్న ఉదయిస్తుందా?

నిజానికి ఆగస్టు 19న కెసిఆర్ చేయించిన సమగ్ర సర్వే ప్రపంచ రికార్డ్ లాంటిది. నాలుగు కోట్ల జనాభాను, మొత్తం రాష్ట్రాన్ని స్తంభింప చేసి ఒకే పనిపై దింపారు. లక్షలాది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులను, విద్యార్థులను వాడుకుని, వందల కోట్ల ఖర్చుతో, మొత్తం రాష్ట్రాన్ని, హైదరాబాద్ లాంటి ఒక పెద్ద నగరంతో సహా స్తంభింపచేసి, ప్రపంచ రికార్డుస్థాయి పని కెసిఆర్ ఎందుకు చేయించారు? లక్షల కోట్ల తెలంగాణ ప్రజాధనాన్ని దోచుకున్న సీమాంధ్ర పాలకవర్గం నుండి ఆ ధనాన్ని కక్కించడానికా? వారు ఆక్రమించుకున్న లక్షల ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికా? ఇవే కదా ఉద్యమకాలంలో నాయకత్వం తెలంగాణ ప్రజలకు వాగ్దానం చేసింది.

స్వయం పాలన ఏర్పడిన తర్వాత అకస్మాత్తుగా సామాన్య తెలంగాణ ప్రజలు పందికొక్కులు, దొంగలు ఎలా అయ్యారు? అరవై సంవత్సరాల నుండి తెలంగాణ ప్రజలను దోచుకుని, వారిని కనీసం వంద సంవత్సరాల వెనుకకు నెట్టిన సీమాంధ్ర పాలకవర్గాన్ని స్వయం పాలనలో దొంగలుగా చూడకుండా తెలంగాణ ప్రజల్నే దొంగలుగా ఎందుకు చూస్తున్నారు? సరే, కెసిఆర్ అంటున్నట్లు తెలంగాణ ప్రజలు బోగస్ రేషన్ కార్డులు కలిగి ఉన్నారని అనుకుందాం. కేవలం ఒక్క వ్యక్తే ఐదు వందల రేషన్ కార్డులు కలిగి ఉన్నప్పటికీ కెసిఆర్‌లా ఫామ్‌హౌస్

కొనుక్కోలేదు. కోట్లాది రూపాయల విలువ చేసే రాజభవనాన్ని బంజారాహిల్స్‌లో కట్టుకోలేదు. తన పిల్లల్ని అమెరికాలో చదివించలేదు. హెలికాప్టర్‌లలో తిరగలేదు. ఎందుకంటే, భారతదేశం వ్యాప్తంగా ఎక్కడ కూడా ప్రభుత్వాలు రేషన్ కార్డుపై బంగ్లాలు, బంగారాలు ఉచితంగా ఇవ్వడం లేదు. కేవలం బియ్యం పప్పు, నూనె మాత్రమే దబ్బులకు ఇస్తున్నాయి.

ఒకవేళ జనాభాలో అధిక భాగానికి రెండేసి రేషన్ కార్డులు ఉన్నప్పటికీ దానివలన వారు అదనంగా బియ్యం, పప్పు, నూనెలు కొని వాడుకుంటారు తప్పించి, దానిపై బంగ్లాలు కట్టలేరు. రేషన్ కార్డుతో లక్ష సంపాదించగలిగితే, దేశంలో పేదరికమే ఉండదు కదా?

ఈ రోజుల్లో సినిమా రంగం వారు తమ సినిమా రెండు వారాలు నడిస్తేచాలని, తమకు ఖర్చులు పోగా లాభాలు వస్తాయని అంటున్నారు. అందుకే వాటిని రెండు వారాల సినిమా అంటారు. భారతదేశంలో ఎన్నికల ప్రజాస్వామ్యం ఐదేళ్ల సినిమా లాంటిది. సినిమాలు ప్రజలను రెండు గంటలు ఊహా లోకంలో ఉంచినట్టుగా, రాజకీయ నాయకులు ప్రజలను ఐదేళ్లు ఊహాలోకంలో ఉంచుతారు. ఆ తర్వాత మళ్లీ గెలిస్తే మరీ మంచిది. లేకపోతే, ఐదు సంవత్సరాల తర్వాత ప్రజలు ఎలాగూ తన ప్రత్యర్థి పార్టీపై అసహ్యంతో తమ పార్టీనే గెలిపిస్తారు కదా! ఐదు సంవత్సరాల కొకసారి కొత్తకొత్త కథలతో ప్రజలను ఆకర్షించాలి. సినిమా సక్సెస్ చేయాలి. ఇదే వారి ఆలోచన. సినిమాను పక్కనపెట్టి అసలు వాస్తవాలను చూస్తే కఠోరంగా ఉంటాయి.

ఉద్యోగ కల్పన వెనుక వాస్తవాలు

మొదటగా కెసిఆర్ చెపుతున్న లక్షలాది ఉద్యోగాల కల్పన అనే వాగ్దానాన్ని పరిశీలిద్దాం. ఈ వ్యవస్థలో ప్రభుత్వ ఉద్యోగాలు లక్షల్లో కల్పించడం అసంభవం, బూటకం. ఎందుకంటే ప్రపంచ ద్రవ్యనిధి, భారత రిజర్వ్ బ్యాంక్ షరతుల ప్రకారం ప్రభుత్వ రంగాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కుదించాలి. అందుకే, ప్రభుత్వ ఉద్యోగాలు గణనీయంగా తగ్గాయి. ఇక ప్రైవేట్ ఉద్యోగాల కల్పన విషయం కొస్తే, కేవలం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మాత్రమే అత్యధికంగా ఉద్యోగాలు కల్పించగలుగుతాయి. ఎందుకంటే ఈ తరహా పరిశ్రమల యజమాన్యం దగ్గర (మనుషుల అవసరం దాదాపుగా లేని) మెషిన్‌లను కొనడానికి పెట్టుబడి ఉండదు. బహుళ జాతి కంపెనీలు, భారత కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయల ఖరీదు చేసే మెషిన్‌లు కొని, అతి తక్కువ కార్మికులనే పనిలోకి తీసుకుంటారు. అందుకే, ప్రపంచంలో ఉన్న అన్ని బడా కంపెనీలు వచ్చి తెలంగాణలో కంపెనీలు పెట్టినప్పటికీ అందరికీ ఉద్యోగాలు కల్పించడం అసంభవం. అయినా చిన్న, మధ్య తరహా కంపెనీలను పట్టించుకోకుండా, ఎప్పుడూ బహుళజాతి, కార్పొరేట్ కంపెనీల వెనుక ఎందుకు పరిగెడుతుంటారు? ఎందుకంటే రాజకీయ పార్టీలకు వందల వేల కోట్ల నిధులను అలాంటి బడా కంపెనీల యజమానులే ఇవ్వగలుగుతారు. చిన్న, మధ్య తరహా కంపెనీల యజమానులు కేవలం వేలు, మహా అయితే, లక్షలల్లోనే నిధులను ఇవ్వగలరు. బహుళ జాతి, కార్పొరేట్ బడా కంపెనీల వెనుక పరిగెత్తడం వెనుక ఇంకో ప్రధాన కారణం ఏమిటంటే, వాటిలో ఎన్నో రకాల సబ్ – కాంట్రాక్టు పనులు (ఉదాహరణకు సివిల్, నిర్మాణ రంగ, ట్రాన్స్‌పోర్ట్, క్యాంటీన్ లాంటివి) ఉంటాయి. రాజకీయ నాయకులు తమ బినామీ కంపెనీల ద్వారా ఈ సబ్–కాంట్రాక్టు పనులు తీసుకుని ఆ విధంగా కూడా లాభపడుతుంటారు. అలాగే, బడా కంపెనీల పేరు చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి లాభపడుతారు.

ప్రపంచం మొత్తంలో అమెరికాలో ఉన్నన్ని బడా కార్పొరేట్ కంపెనీలు ఇంక ఎక్కడా ఉండవు. అయినా మొత్తం అమెరికాలోని ఉద్యోగులలో కేవలం ఒక్క శాతం లోపునే ఆ బడా కంపెనీలలో పని చేస్తున్నారు. ఈ కంపెనీలపై పరోక్షంగా ఆధారపడే వారు ఇంకో రెండు శాతం.

ప్రపంచం మొత్తంలో చైనాలో ఉన్నన్ని కంపెనీలు (చిన్న, మధ్య తరహా, బడా కార్పొరేట్ కంపెనీలన్ని కలిసి) ప్రపంచంలో ఏ దేశంలో కూడా లేవు. మీరు హైవేపై కారులో వెళ్తుంటే, అటు, ఇటు వంద యాభై కిలోమీటర్ల వరకు కూడా నాన్‌స్టాప్‌గా కంపెనీలు కనిపిస్తాయి. అయినప్పటికీ చైనాలో పని చేయగలిగే వారిలో 30 శాతం నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారు. ఎందుకలా జరుగుతున్నది? ఎందుకంటే, పెట్టుబడిదారీ పద్ధతిలోనే ఉన్న సంస్థాగత లోపమది.

బడాయిలకే బడా కంపెనీలు

పేరు గొప్ప, ఊరు దిబ్బ లాగుంటుంది ఈ బడా కంపెనీల వ్యవహారం. కెసిఆర్ అనే కాదు, దేశ ప్రధాని నుండి ముఖ్యమంత్రు లందరూ ఫలానా కంపెనీ వేల కోట్లతో పెట్టుబడి పెట్టనుందని గొప్పలు చెపుతుంటారు. కాని అసలు విషయాలు ప్రజలకు చెప్పరు. ఒక కంపెనీ వెయ్యి కోట్లతో పెట్టుబడి పెట్టనుందని ముఖ్యమంత్రి గొప్పలు చెప్పినప్పుడు మనం ఈ కింది ప్రశ్నలు అడగాలి. ఒకటి, ఎంతకాల వ్యవధిలో ఈ వెయ్యి కోట్ల పెట్టుబడి వస్తుంది? ఎంత పెద్ద కంపెనీ అయినా ఒకే సంవత్సరం అంత పెట్టుబడి పెట్టదు. మూడు లేదా ఐదు సంవత్సరాల వ్యవధిలో వారు ఆ పెట్టుబడి పెడుతారు. కాని నాయకులు ఈ విషయాన్ని చెప్పరు. అడగవలసిన రెండవ ప్రశ్న, ఈ వెయ్యి కోట్లలో దేనికి ఎంత కేటాయిస్తారు? ఇక్కడే దాగుంది అసలు రహస్యం. బడా కంపెనీ వస్తుందనంటే వారు బడా మెషిన్‌లతో వస్తున్నారని అర్థం. వెయ్యి కోట్లలో సింహభాగం, అంటే దాదాపు ఎనిమిది వందల కోట్లు కేవలం మెషిన్లు కొనడానికి, దాన్ని ఇన్‌స్టాల్ చేయడానికే పోతుంది. మిగిలిన రెండు వందల కోట్లలో సింహ భాగం ఫ్యాక్టరీ కట్టడానికి తదితరాలకు పోతుంది.

బహుళజాతి, కార్పొరేట్ బడా కంపెనీలు అధికార పార్టీలకు నిధులను ఇచ్చి తమకు పన్ను రాయితీలు, పన్ను మాఫీలు, చవక భూమి, చవక విద్యుత్ లాంటి ఎన్నెన్నో ప్రయోజనాలను ప్రభుత్వం ద్వారా కల్పించుకుంటాయి. ఉద్యోగ కల్పన జరగాలంటే ఇలాంటి రాయితీలు, ప్రయోజనాలు బడా కంపెనీలకు ఇవ్వక తప్పదని అధికార పార్టీలు ప్రజలను మభ్య పెడుతుంటాయి. కాని వాస్తవమేమంటే, వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టే బడా కంపెనీ వెయ్యి మందికి ఉద్యోగాలు ఇవ్వగలిగితే అది మహా గొప్ప. కాని ఈ కంపెనీ వెయ్యి కోట్ల పెట్టుబడికి ప్రభుత్వం పది సంవత్సరాల కాల వ్యవధిలో ఇచ్చే ప్రయోజనాలు కనీసం రెండు, మూడు వందల కోట్లు ఉంటుంది. అదే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీల విషయాలకు వస్తే, కనీసం యాభై వేల కంపెనీలు కలిస్తే వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టగలవు. ఉద్యోగ కల్పన పరంగా చూస్తే అవి మూడు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించగలవు. కాని ఇలాంటి చిన్న కంపెనీలకు పది సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఇచ్చే ప్రయోజనాల విషయాలకు వస్తే దాదాపు శూన్యమని చెప్పవచ్చు. అందుకే ఈ మధ్య రైతుల లాగా చిన్న తరహా పరిశ్రమ యజమానులు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ఇక కెసిఆర్ చెప్తున్నట్లుగా దేశ, విదేశ కంపెనీలు ఎన్నో

తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయనే విషయాన్ని విశ్లేషిద్దాం. ఆగస్టు 14న ది హిందూ పత్రికలోని బిజినెస్ పేజీలో ఒక వార్త వచ్చింది. భారతదేశంలోని బడా కంపెనీలు, బడా ప్రభుత్వరంగ సంస్థలు రానున్న మూడు నుండి పది ఏళ్లలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో ప్రభుత్వానికి తెలిపారు. ఆ రిపోర్టు ప్రకారం వారు ఆరు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టే ఆలోచనలో ఉన్నారు. ఇది కేవలం అంచనా మాత్రమే. పరిస్థితి బాగా లేకపోతే అంచనా తగ్గవచ్చు.

ముఖ్యమైన విషయం ఏంటంటే, ఈ ఆరు లక్షల కోట్లలో కొద్దిభాగం విదేశాల్లో కూడా పెట్టుబడిగా పెడతారు. అలాగే ఇప్పటికే నడుస్తున్న తమ కంపెనీలో పెట్టుబడికి ఇంకొంత భాగం పోతుంది. పైగా ఈ అంచనా మొత్తం దేశానికి సంబంధించింది. ఈ రకంగా చూసినపుడు ఒకవేళ మెజారిటీ దేశ, విదేశ బడా కంపెనీలు తెలంగాణ అన్నా, కెసిఆర్ అన్నా క్రేజీ అయిపోయి ఇక్కడ పెట్టుబడి పెట్టినా, రానున్న ఐదు సంవత్సరాలలో లక్ష కోట్లకు మించి పెట్టుబడి దాటదు. వెయ్యి కోట్ల పెట్టుబడికి వెయ్యి ఉద్యోగాలనే అత్యాశ అంచనా ప్రకారం, లక్ష ఉద్యోగాలు ఏర్పడవచ్చు. అయితే వీటిలో చాలా ఉద్యోగాలు టెక్నికల్ స్కిల్స్ అవసరమయ్యేవిగా ఉంటాయి. కాబట్టి మెజారిటీ ఉద్యోగాలు ఇతర రాష్ట్రాల వారికే దక్కుతాయి. అయితే తెలంగాణ జనాభా ప్రకారం రానున్న ఐదు సంవత్సరాలలో యాభైలక్షల కొత్త ఉద్యోగాలు కల్పించ గలిగితేనే నిరుద్యోగులు లేని తెలంగాణగా మారుతుంది. ఏ లెక్కన చూసిన ఐదు సంవత్సరాలలో ప్రైవేట్ రంగంలో లక్ష కొత్త ఉద్యోగాలు కల్పించగలిగినా అది చరిత్ర కెక్కవలసిన విషయం అవుతుంది.

ఇక హైదరాబాద్‌ను సింగపూర్‌లా చేస్తాననడం, కరీంనగర్‌ను న్యూయార్క్, లండన్‌లా మెరిపిస్తాననడం, మానేర్ డ్యాంను మైసూర్ బృందావనం గార్డెన్‌లా చేస్తాననడం, బంగారు తెలంగాణ అనే ఫ్యాంటసీ సినిమా చూపడంలో భాగమే. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక మరుగు దొడ్డి కట్టాలంటే కనీసం యాభై వేలు అవుతుంది. అలా చూసినప్పుడు కేవలం హైదరాబాద్‌ను సింగపూర్‌లా తయారు చేయాలంటే కనీసంగా రెండు సంవత్సరాల భారతదేశ బడ్జెట్‌ను కేవలం హైదరాబాద్‌కే కేటాయిస్తేనే అలా తయారవుతుంది. లక్షల కోట్లు ఖర్చు అయ్యే వ్యవహారాన్ని మరుగుదొడ్డి కట్టిస్తానన్నంత సులువుగా వాగ్దానం చేయడం, ఫ్యాంటసీ సినిమా దర్శకునికి ఉండవలసిన టాలెంట్‌ను తెలుపుతున్నది.

బంగారు తెలంగాణ - విజన్ 2020

రాజకీయ నాయకులు ప్రజలకు హాలీవుడ్ స్థాయి ఫ్యాంటసీ సినిమాను చూపి, భ్రమలు కల్పిస్తూ పబ్బం గడపడం భారతదేశంలో ఇప్పుడే మొదటిసారి కాదు. కాకపోతే పి.వి. నర్సింహ్మారావు, చంద్రబాబులు ఈ రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. చంద్రబాబు లానే కెసిఆర్ కూడా బహుళజాతి సంస్థలను, కార్పొరేట్ కంపెనీలను, సింగపూర్‌ను అమితంగా ప్రేమిస్తున్నాడు. చంద్రబాబులానే కెసిఆర్ కూడా ఎయిర్‌పోర్టులు, సాటిలైట్ టౌన్‌షిప్‌లు, రింగ్‌రోడ్డులు, మెట్రో రైళ్లు, సింగపూర్ పర్యటనలు అంటూ తన ప్రాధాన్యత గ్రామాలు కాదు, నగరాలేనని చెపుతున్నారు. రియల్ ఎస్టేట్ ద్వారా కోట్లు సంపాదించే రాజకీయ నాయకులకు గ్రామాల పట్ల ప్రేమ ఉంటుందనుకోవడం మూర్ఖత్వం. ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, రిజర్వ్ బ్యాంక్‌ల షరతుల ప్రకారం కూడా పట్టణీకరణ చేయక తప్పదు.

వ్యవసాయరంగ వినాశనంతోనే పట్టణీకరణ

పట్టణీకరణ చేయాలంటే గ్రామాల నుండి ప్రజలు పట్టణాలకు వలస రావాలి. గ్రామాలు సుభిక్షంగా ఉంటే ప్రజలు ఎవరూ పట్టణాలకు స్వచ్ఛందంగా వలసలు రారు. అందుకే గ్రామాల్లో ప్రజలు బతకలేని పరిస్థితులు కల్పించాలి. అంటే, చిన్న, సన్నకారు రైతులు అధికంగా ఉండే వ్యవసాయ రంగాన్ని నష్టదాయకంగా మార్చితే, వారు అప్పుల పాలై బతుకు జీవుడా అనుకుంటూ పట్టణాలకు వలసలు వస్తారు. పట్టణీకరణ అంటే ఆటోమేటిక్‌గా మనం అర్థం చేసుకోవాల్సింది పల్లెలను, వ్యవసాయాన్ని నాశనం చేయడం వలన జరిగేదే. అందుకే, ఆచరణ పరంగా చూసినపుడు కెసిఆర్ పాలనకు చంద్రబాబు పాలనకు తేడా ఏమీ లేదు.

నిజంగా తెలంగాణ వచ్చిందా?

స్వయం పాలన వచ్చిన తర్వాత కూడా ప్రతిరోజు తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. కల్తీ కల్లు అమ్ముతూనే ఉన్నారు. సమైక్య పాలనలో జరిగిన అన్ని రకాల అక్రమాలు, అన్యాయాలు ఇంకా అలానే జరుగుతున్నాయి అదనంగా స్వయంపాలనా ప్రభుత్వం హైదరాబాద్ శివారులో తెలంగాణ ప్రజలుండే బస్తీలపై పోలీసు దాడులు కూడా చేస్తున్నది. రైతుల ఆత్మహత్యలు, కల్తీ మద్యం, కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువుల లంచగొండితనం, అధిక ధరలు, వ్యాపారుల బ్లాక్ మార్కెట్, ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడి, పర్యావరణ విధ్వంసం, కల్తీ ఆహార పదార్థాలు అమ్మడం, ఇలా అన్ని చెడులు అలానే కొనసాగుతున్నాయి. ఒక ప్రభుత్వం నిజంగా ప్రజా ప్రభుత్వమే అయితే ఇవి జరుగకూడదు కదా?

ఫెయిల్ కానున్న సినిమా

బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వాల నుండి అన్నీ అప్పనంగా, ఉచితంగా కావాలని కోరుతుంటాయి. ఇది ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజల అనుభవం. వీరి వద్ద వేల కోట్ల నిధులు రాబట్టే రాజకీయ పార్టీలు సహజంగా అధికారంలోకి రాగానే వారికే సేవ చేస్తాయి. వారి ప్రయోజనాలను నెరవేర్చడమంటే, ప్రజలకు నష్టం చేయడమే. ప్రజలకు న్యాయం చేయాలంటే బహుళ జాతి, కార్పొరేట్ కంపెనీలను వ్యతిరేకించాలి. ఈ కంపెనీలు ఇచ్చే నిధులతోనే రాజకీయాన్ని నడిపే పార్టీలు వారినే ఎలా వ్యతిరేకిస్తాయి? ప్రజలకు ఉచిత వాగ్దానాలు ఎన్ని చేసినప్పటికీ అధికారంలోకి వచ్చిన ఈ మూడు నెలల్లో కెసిఆర్ ఆచరణలో మాత్రం తాను కార్పొరేట్ బహుళజాతి కంపెనీల ప్రతినిధినే అని నిరూపించుకున్నాడు.

అరవై ఏళ్ల ఆకాంక్ష తీరి, స్వయం పాలన మొదలైనందున అధికార పార్టీ తమ జీవితాలు బాగు చేస్తుందని ఆశపడుతున్న తెలంగాణ ప్రజలు, బంగారు తెలంగాణ నిజం కాదు, అది ఒక ఫ్యాంటసీ సినిమా అని అర్థం చేసుకోవడానికి పెద్ద సమయం పట్టదు. ఇప్పటికే ఇది ఫ్లాప్ సినిమా అనే టాక్ తెలంగాణ గ్రామీణ ప్రజలల్లో మొదలైందన్నది వాస్తవం. తెలంగాణ స్వయం పాలనలో ప్రభుత్వం కాని, కెసిఆర్ కాని తమకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉంటే రైతుల ఆత్మహత్యలు రోజూ జరుగవు కదా? చైతన్యానికి నిలయం అయిన తెలంగాణ సమాజం ఈ ఫ్యాంటసీ సినిమా బూటకత్వాన్ని అర్థం చేసుకుని ఇంటి దొంగలను ఓడించక తప్పదు, ప్రజా తెలంగాణ నిర్మించక తప్పదు. వీ

(రచయిత సామాజిక పరిశోధకులు)

తెలంగాణలో సామాజిక శాస్త్రాల అధ్యయనం

***సామాజిక శాస్త్రాల అధ్యయనం తెలంగాణ పునర్నిర్మాణ క్రమంలో అత్యవసరమైన సామాజిక విశ్లేషణా సాధనాలను అందిస్తుందని అంటున్నారు* డా. అక్కెనపల్లి పున్నయ్య**

ప్రపంచంలో ఎప్పుడైనా ఎక్కడైనా ఆ ప్రాంత భౌగోళిక, చారిత్రక సామాజిక మూలాల అధ్యయనమే అక్కడి జాతి సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తుందని చరిత్ర చెప్పిన సత్యం. గతిశీలన సమాజంలో జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సాహితీవేత్తలు, సామాజిక తత్త్వవేత్తలు, ప్రజాకవులు సమాజ పయనం ఎలా ఉందో విశ్లేషిస్తూనే ఎలా ఉండాలో కూడా నిర్దేశిస్తారు. అరిస్టాటిల్, ప్లేటో, మాక్స్‌వెల్లీ వంటి సామాజిక తత్త్వవేత్తల లోతైన సామాజిక అధ్యయనమే పాలకుల కళ్లు తెరిపించి సమాజాభివృద్ధికి తమ తమ దృక్పథాల్లో రావాల్సిన మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రపంచంలో జరిగిన అన్ని పోరాటాలు, తిరుగుబాట్లు తమ సమాజపు అస్తిత్వం కోసం సాగినవే. తమవంటూ ఏర్పడిన సామాజిక ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక మూలాలను కూలదోసి, విలువలకు పాతరేసి వలసవాద సామ్రాజ్యవాద ధోరణి వేళ్లూనుకున్నప్పుడు సామాజికవేత్తల నిరంతర అధ్యయనమే ఆ జాతి పురోగాభివృద్ధికి సరైన మార్గం చూపుతుంది. ఈ నేపథ్యంలో ప్రపంచ చరిత్రలో తెలంగాణ అస్తిత్వ పోరాటానికి ప్రత్యేక స్థానముంది. వందల ఏళ్ల సాంస్కృతిక చారిత్రక భౌగోళిక వైవిధ్యం ఉంది. వలసవాద ఆధిపత్య ధోరణితో ఉనికిని కోల్పోయి ఆరు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటాలు చేసి, తెగనరికిన తెలంగాణ గాన కోకిల పాట సాక్షిగా, దేహాన్ని కాగడాగా చేసి పోరాట జ్వాలలైన విద్యార్థి యవకిశోరాల సాక్షిగా ప్రపంచ చరిత్రలో తెలంగాణ ఉద్యమం కొత్త అధ్యాయాన్ని సృష్టించి ప్రపంచ చరిత్రకే కొత్త పాఠాలు నేర్పింది. అనన్య ప్రాణ త్యాగాల అనంతరం ఊపిరి పోసుకున్న తెలంగాణకు సామాజిక ఆర్థిక, రాజనీతి శాస్త్రవేత్తలు పునర్నిర్మాణానికి మార్గ నిర్దేశనం చేయాల్సిన తక్షణ అవసరమేర్పడింది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ప్రభావం వచ్చిన తర్వాత అభివృద్ధి అంటే కేవలం శాస్త్ర సాంకేతిక అభివృద్ధే అభివృద్ధిగా, వస్తు సంస్కృతి అభివృద్ధే అభివృద్ధిగా వెరసి మార్కెట్‌ను విస్తరించడమే అభివృద్ధికి నమూనాగా సాధారణీకరించారు. అందుకే అటు దేశంలోను, ఇటు రాష్ట్రంలోనూ ఎన్ని ప్రభుత్వాలు మారిన అభివృద్ధి నమూనాలో వస్తుత్పత్తులు, సామాన్యశాస్త్రాల అధ్యయనమే అభివృద్ధికి సూచికగా భావిస్తున్నారు. పైగా మానవీయ కోణాలను అవిష్కరించే వికాసానికి, మనిషి సామాజిక జీవన విధానానికి జరిగిన, జరుగుతున్న, జరగాల్సిన మార్పుల అధ్యయనానికి అనగా సామాజిక శాస్త్రాల అధ్యయనానికి ముగింపు పలకడం ప్రారంభమైంది. దీనిని మనం 90వ దశకం నుండి స్పష్టంగా చూస్తున్నాం. నిజానికి అభివృద్ధి ప్రణాళికలన్నీ సామాజిక అధ్యయన స్థాయి మీదనే ఆధారపడి ఉంటాయి. నాణ్యమైన నిజమైన, పరిశోధనాత్మకమైన సామాజిక అధ్యయనం అటు పాలకులకు ఇటు పాలితుల ప్రయోజనాలకు సమగ్ర ప్రణాళికా రచనకు మార్గ నిర్దేశం చేస్తుంది.

సామాజిక ప్రయోజనం కలిగిన శాస్త్రాల అధ్యయనం 1991 తర్వాత సంస్కరణల ప్రభావం వలన మరింత సంక్షోభంలో పడింది. కార్పొరేట్ విద్యా విధానంలో పాఠశాల స్థాయి నుండి కళాశాల, విశ్వ విద్యాలయాల వరకు సామాజిక శాస్త్రాలకు ప్రాధాన్యత తగ్గించి, ఒక దశలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక శాస్త్రాల పట్ల తన అసహనాన్ని, వ్యతిరేకతను చాటుకున్నారు. సామాజిక శాస్త్రాలకు మూలంగా పేర్కొన్న చరిత్రను కళాశాల స్థాయిలో విరమింప జేస్తూ చరిత్రకు చరమగీతం పాడాలనుకున్నాడు.

ఈ నేపథ్యంలో పాఠశాల స్థాయి నుండి సాంఘిక శాస్త్రాల ప్రాధాన్యత తగ్గిస్తూ కాన్సెప్ట్, టాలెంట్, టెక్నో పేరుతో చదువంటేనే డాక్టర్, ఇంజనీరు అని నిర్వచించి ఇంటర్ స్థాయిలో బైపిసి, ఎంపిసి గ్రూపుల ప్రవేశంతో రెండు కార్పొరేట్ కళాశాలల శక్తులు గుత్తాధిపత్యాన్ని సాధించుకున్నాయి. ఆర్ట్స్ గ్రూపుల వైపు పిల్లలను మళ్లించడంలో గాని ఆయా సబ్జక్టుల అధ్యయనాల పట్ల ఆసక్తి కలిగించుటలో ప్రభుత్వాలు గాని, ఉపాధ్యాయులు గాని తల్లిదండ్రులు గాని ఆలోచించకపోవడం దురదృష్టకరం ఇది ప్రైవేట్, సరళీకరణ, ప్రపంచీకరణ, మార్కెట్ ప్రభావం వలన మాత్రమే అనక తప్పదు.

'మనిషి సంఘజీవి' అన్న ప్రాథమిక విషయాన్ని మరిచి, మానవుడు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలకు మూలాలు సమాజంలోనే ఉన్నాయనే విషయాన్ని అర్థం చేసుకోలేక దానికి తాత్విక పునాది సామాజిక శాస్త్రాలు మాత్రమేనని మనిషి, మానవీయత మానవ సంబంధాల పునాదిగా సమస్త శాస్త్రాలను కళలను సామాజిక శాస్త్రాలు మాత్రమే అధ్యయనం చేస్తాయని మానవ వనరుల పనికల్పన, స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం, జీవితావసరాలు, సామాజిక సంక్షేమం, సామాజిక న్యాయం మొదలగు అంశాల గురించి సామాజీకరించబడి నాయని, మార్గ నిర్దేశనం చేస్తాయని గ్రహించిక పోవడం వలన 'సామాజిక శాస్త్రాల అధ్యయనం' అనివార్యంగా సంక్షోభంలో చిక్కుకుంది.

జూలై మాసం ఒకటవ, రెండవ తేదీల్లో తెలంగాణ విశ్వవిద్యాలయం నిజామాబాద్‌లో నిర్వహించిన 'నేటి సామాజిక శాస్త్రాల స్థితి' సదస్సులో ఉస్మానియ విశ్వ విద్యాలయ ఉపకులపతి ప్రొ. సత్యనారాయణ, తెలంగాణ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. అక్బర్ అలీఖాన్, సామాజిక శాస్త్రవేత్తలు ప్రొ. హరగోపాల్, ప్రొ. ఘంటా చక్రపాణి, ప్రొ. కృష్ణారెడ్డి, ప్రొ. అరుణ్ పట్నాయక్, ప్రొ. అడప సత్యనారాయణ, ప్రొ. లింబాద్రి, ప్రొ. మాదరపు యాదగిరి తదితరులు ప్రసంగిస్తూ సామాజిక శాస్త్రాల అధ్యయనంలో విశ్వ విద్యాలయాల వెనుకబాటు తనంపై ప్రభుత్వాల నిర్లక్ష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, తెలంగాణ ప్రాంతంలో నూతనంగా ఏర్పడిన అన్ని విశ్వ విద్యాలయాల్లో సమాజ శాస్త్రాల విభాగాలను పెంచాలని, తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రజా క్షేత్రాన్ని ప్రతిబింబించే సామాజిక శాస్త్రాల పరిశోధనల అవసరం గురించి నొక్కి చెప్పారు. వాస్తవానికి విశ్వవిద్యాయాల్లో బలమైన, లోతైన పరిశోధనలు జరగాలని, ఈ పరిశోధన ఫలాల ఫలితమే సామాజాభివృద్ధి అని గ్రహించాలన్నారు. ఇందుకోసం ఐసిసిఎస్ఎస్ఆర్, యుజిసి వంటి

మోహనరాగం - రాజ్యాంగ నైతికత

మహబూబ్‌నగర్ దుర్భర కరువు పరిస్థితుల నేపథ్యంలో అక్కినేని కుటుంబరావు రాసిన 'మోహనరాగం' నవలను విశ్లేషిస్తూ రాజ్యాంగ నైతికతను చర్చిస్తున్నారు ఓల్గా

కుటుంబరావు రాసిన మూడవ నవల మోహనరాగం 1987లో 'చతుర' మాస పత్రికలో అచ్చయింది. మోహనరాగం పేరుకి తగ్గట్టు ప్రేమ కథే. అయితే ఆ ప్రేమనూ, నాయికా నాయకులు ఒకరి నొకరు కలుసుకుని, తెలుసుకుని ఒకటయ్యే అపురూపమైన కాలాన్నీ, వారి జీవితాలనూ రచయిత కరువు జిల్లాగా పేరు పడిన మహబూబ్‌నగర్ జిల్లాలో నడిపించారు. ఇదొక పారడాక్స్. ఒకే సమయంలో రెండు విరుద్ధ భౌతిక మానసిక పరిస్థితులను మోహనరాగం నవలలో రచయిత నడిపించిన తీరు అపూర్వం. ఒకవైపు విద్యావంతులైన యువతీ యువకులు ఆవేశపూరితమైన తొలి ప్రేమానుభవానికి లోనై శారీరకంగా, మానసికంగా ఒకటవుతారు. ఇంకోవైపు వారి చుట్టూ భయంకరమైన పేదరికం, ఆకలి. ఆ పేదరికం, ఆకలి వారిలో మానవత్వ భావనలు నింపితే, ఆ మానవత్వం వారికి ప్రేమానుభవాన్ని అందిస్తుంది.

రబ్బీ ఇజ్రాయిల్ చెప్పిన 'మన పొరుగువారి భౌతిక అవసరాలు మన ఆధ్యాత్మిక అవసరాలు అవుతాయి' అన్న మాటలు మధ్య తరగతి మనుషులలో కొందరిపట్ల నిజమవుతాయి. ముఖ్యంగా యువతరం తన ఆధ్యాత్మిక అవసరాల అన్వేషణ చేసినప్పుడు రబ్బీ ఇజ్రాయిలీ మాటలు వాస్తవరూపం దాలుస్తాయి. అట్లాంటి యువతరం నాయికా నాయకులతో నడిచిన కథ మోహనరాగం. ఈ నవలలో మోహన్, సుజాతలు అప్పుడే చదువు ముగించుకుని తమ భౌతిక అవసరాల కోసమే మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యోగాలకు వచ్చారు. కానీ వారిచుట్టూ ఉన్న ప్రపంచం వారిలోని మనుషులను తట్టి లేపింది. ఆ ప్రపంచాన్ని చూసి దుఃఖిస్తున్న సమయంలో, ఆర్ద్రమైన వారి మనసులలోకి ప్రేమ అతి వేగంగా, సహజంగా సారవంతమైన భూమిలో విత్తనాలు మొలకెత్తినట్లు మొలకెత్తింది. వారి ఆధ్యాత్మిక ప్రపంచాలు తోటివారి పట్ల కరుణతోనూ, పరస్పర ప్రేమతోనూ నిండి ఒకదానినొకటి ప్రభావితం చేసుకున్నాయి. ఈ క్రమాన్ని రచయిత గొప్ప నేర్పుతో చిత్రించాడు. ఏమాత్రం సంయమనం, సమతూకం కోల్పోయినా వెగటు కలిగించే సందర్భాలను అతి సున్నితంగా తీర్చిదిద్ది మోహనరాగంగా మార్చాడు.

కాన్సర్ వ్యాధిని బాండ్ ఎయిడ్ చికిత్సతో నయం చేద్దామనే తెలివిమాలిన ప్రభుత్వ పథకాలను ప్రశ్నించడం మోహనరాగం నవల

సంస్థలు సూక్ష్మస్థాయి పరిశోధనలకు మరింత ప్రోత్సావాన్ని అందించాలన్నారు. అమెరికాలో సామాజిక శాస్త్రాల అధ్యయనంపై ఏటా 12 లక్షల పరిశోధనా పత్రాలు ప్రచురితమవుతుంటే మనదేశంలో కేవలం మూడు లక్షలు మాత్రమే ప్రచురితమవుతున్నాయి.

సామాన్య శాస్త్రాల అధ్యయన పరిశోధనలు ప్రయోగశాలలో జరిగితే, సామాజిక శాస్త్రాల పరిశోధనలు మాత్రం మానవ సంబంధాలు, విలువలు ప్రతిబింబించే సమాజంలో జరుగుతాయి. సామాజిక శాస్త్రాల భావనే మార్పు. ఈ మార్పు చైతన్యవంతంగా విలువల ఆధారిత అభివృద్ధికి ప్రధానం కావాలి.

సామాజిక శాస్త్రాల పరిశోధనలు నాలుగు దశల్లో చూడాల్సింది. వలసవాదం, స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యనంతరం, సంస్కరణల అనంతరం ప్రస్తుతం మనం సంస్కరణల అనంతర కాలంలో కొనసాగుతున్నాం. ఈ దశలో పరిశోధనలు లక్ష్యానికి అనుగుణంగా ఉండాలి. కేవలం ప్రతిష్ట కోసం వివిధ జర్నల్స్‌లో పేయింగ్ ఆర్టికల్స్ కాకుండా, అత్యంత పరిశోధనాత్మకంగా. నాణ్యంగా, సత్యానికి నిలబడేవిగా ఉండాలి. ఇందుకోసం ఐఎస్‌బిఎన్, ఐఎస్ఎస్ఎన్ గుర్తింపు గల జర్నల్స్ కృషి కూడా అవసరం. ప్రధానంగా విశ్వ విద్యాలయాల్లో పరిశోధనకు ప్రత్యేక కృషి జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 1970కి ముందు సామాజిక శాస్త్రాల పరిశోధనలు గరిష్టంగా బ్రహ్మణ భావజాల నేపథ్యంలో వాళ్ల అధీనంలో నడిచేవి. చరిత్ర, సాంస్కృతిక పరిశోధనలు కూడా అండర్ బ్రహ్మనిజంగానే ఉండేవి. కాని 1990 తర్వాత అన్ని వర్గాల్లో విభిన్న సామాజిక కోణాల్లో పరిశోధనలు ప్రారంభమైనవి. నవ జాత శిశువైన తెలంగాణ పునర్నిర్మాణం కొరకు అత్యంత లోతైన పరిశోధనలు వివిధ రంగాల్లో రావాలి. ఇందుకోసం భాష ఆటంకం కాకూడదు. తెలంగాణ ప్రాంతంలో ఆంగ్ల పరిజ్ఞానం తక్కువన్న అపోహతో ఇక్కడి చరిత్ర సంస్కృతి సంప్రదాయాలు మరుగున పడేలా చేసిన చరిత్ర విధ్వంసాన్ని గమనించి, తెలంగాణ చరిత్ర, సామాజిక, సాంస్కృతిక పునాదులను తవ్వితీసి ప్రజల ఆకాంక్షల కనుగుణంగా ప్రణాళిక రచనలో భాగస్వామ్యమయ్యే పటిష్ట సామాజిక పరిశోధనలో చారిత్రక పోరాటాలు ఉద్యమాలు. అనన్య ప్రాణ త్యాగాలు వృథా కాకుండా వారి త్యాగాలను సజీవంగా ఉంచాల్సిన అవసరముంది.

ఇందుకోసం విరివిగా సామాజిక శాస్త్రాల అధ్యయన అవకాశాలు కల్పించాలి. ఈ శాస్త్రాల పట్ల చులకన భావం విడనాడాలి. సిలబస్‌లో మార్పు రావాలి. సామాజిక శాస్త్రాల అధ్యయనం నిత్య జీవితంలో ప్రతిబింబించేలా పరిశోధనల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. పాలన, ఆర్థిక, పార్లమెంటరీ రాజకీయాలకు సమాజ శాస్త్రాల అధ్యయనం పరిశోధన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించి, సమాజంలో డాక్టర్లు, ఇంజనీర్లు మాత్రమే గౌరవ స్థానంలో ఉంటారని, సామాజిక శాస్త్రాలకు, శాస్త్రవేత్తలకు ప్రాధాన్యత లేదన్న భ్రమను తొలగింపచేయాలి. మరీ ముఖ్యంగా నూతనంగా ఏర్పడిన తెలంగాణలోని, ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మూలాలపైన పరిశోధనతో కూడిన చరిత్ర నిర్మాణానికి, సామాజిక శాస్త్రాల అధ్యయన పరిశోధన అవశ్యకతను గుర్తించి, అందుకోసం అన్ని విశ్వ విద్యాలయాల్లో ప్రాధాన్యతను పెంచాల్సిన అవసరముంది. మానవ విలువలన్నింటిని మార్కెటీకరణ చేయబడుతున్న తరుణంలో, ముందుగా మనిషిని కాపాడుకోవాలి. తెలంగాణలో మానవీయ కోణాన్ని ఆవిష్కరించే దిశలో సామాజిక శాస్త్రాల అధ్యయనంతో పాటు నూతన పరిశోధనలు అత్యంత ఆవశ్యకం

(రచయిత తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకులు) వీ

ప్రధాన లక్ష్యం. కరువు జిల్లాగా పేరుపడిన మహబూబ్‌నగర్ జిల్లాలో, ఆ జిల్లా తీవ్రమైన కరువు బారిన పడిన సందర్భంలో తిండిలేక జనం చచ్చిపోతున్న రోజులలో కథ నడవడం వల్ల ఈ నవలలో ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలనూ, పథకాలనూ పరామర్శించే వీలు కలిగింది. ఈ నవలలో రచయిత ప్రధానంగా చూపించదల్చుకున్నది మహబూబ్‌నగర్ గ్రామీణ ప్రాంతపు మనుషులను, అక్కడి కరువును. ఒక కరువు ప్రాంతంలోని జీవితాన్ని బైటినుంచి వచ్చినవారి దృష్టి నుంచి చూపించారు. వాళ్లు విద్యా వంతులు. ఆ ప్రాంతంలో మార్పు తీసుకురావాలని వచ్చినవాళ్లు. తమంత తాము ఆ నిర్ణయం తీసుకుని వచ్చినవాళ్లు కాదు. ప్రభుత్వ ఉద్యోగులుగా వచ్చారు. అప్పుడే చదువు ముగించుకుని కాలేజీ చదువులు తప్ప జీవితపు కఠిన వాస్తవాలు తెలియనివాళ్లు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్నాసాగర్ ప్రాంతపు మనుషులు వారికి వింతగా ఉంటారు. ఈ వింతను పోగొట్టుకుని ఆ మనుషులను అర్థం చేసుకుని ప్రేమించే సంస్కారాన్ని నాయికా నాయకులు పొందుతారు.

ప్రభుత్వోద్యోగులుగా ఒక ప్రభుత్వ పథకాన్ని ఆ పలెల్లో అమలు చేయడానికి వచ్చిన వారు మోహన్, సుజాత, ఛాయ, పంకజవల్లి, సుందర్రావు మొదలైనవారు. ఆ పథకం మాతా శిశు సంక్షేమ విద్యా పథకం. కుటుంబరావు నవలలు వాస్తవంగా జరిగిన కథలనే చెపుతాయి. ఈ పథకం 1972 – 75 ప్రాంతాలలో తెలంగాణ జిల్లాల్లో నిజంగానే అమలు జరిగింది. ఆ సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా కరువు కోరల్లో చిక్కుకుని ఉంది. ముఖ్యంగా అన్నాసాగర్ ప్రాంతంలో మరింత కరువు పరిస్థితులు. ఆ పరిస్థితులకూ ఈ పథకానికీ ఏమీ సంబంధం లేదు. అలాగే వయోజనులైన స్త్రీలకు చదువు చెప్పడం గురించి కూడా ఈ పథకానికి రూపకల్పన చేసిన వారికి ఏమీ అవగాహన లేదని రచయిత నవలలో రుజువు చేస్తాడు. అభివృద్ధి పథకంలో, అందునా గ్రామీణ స్త్రీల గురించిన అభివృద్ధి పథకంలో మహిళలకు అనుకూలమైన అంశం ఒక్కటి లేదు. వాళ్లకు అప్పటి పరిస్థితుల్లో తీరవలసిన కనీసవసరాలలో ఒక్కటి కూడా తీర్చే యోచన ఆ పథకంలో కనిపించదు. దానిని రచయిత చాలా స్పష్టంగా మానవీయ కోణంతో చెప్పడంతో అసలు 'అభివృద్ధి' గురించిన అనేక ప్రశ్నలు పాఠకులకు చుట్టుముడతాయి.

ఎవరు ఎవరిని అభివృద్ధి చేస్తున్నారు? అభివృద్ధి చేసేవారిగా తమను తాము భావించుకుంటున్న వారెవరు? అభివృద్ధి చెందాల్సిన ప్రజలను ఎన్ని వర్గాలుగా విభజించవచ్చు? ఆ ప్రజల సాంఘిక, ఆర్థిక పరిస్థితుల భిన్నత్వాన్ని గురించిన కనీస అవగాహన అభివృద్ధి చేస్తామంటూ వచ్చేవారికి ఉందా? వారు ప్రజలతో తమ సంబంధాన్ని ఎలా నిర్వచించుకుంటారు? ఎలా ఏర్పరుచుకుంటారు? ఫలానా విధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చేసుకున్న ఎంపికలు ఏ విధంగా ఎండోజినియస్‌గా మిగిలిపోతాయి? మార్పుకోసం ప్రభుత్వం ఏర్పర్చుకున్న ఎజెండా ఏ ప్రజలకోసమో, ఆ ప్రజల బాధలకూ, అవసరాలకూ అది బాధ్యత వహిస్తుందా? లేక ఆ ప్రజలతో ఏమాత్రం సంబంధంలేనివారు బైట ఎక్కడి నుంచో తయారు చేసిన ఎజెండాను ఈ ప్రజల మీద రుద్దుతుందా? ఇవన్నీ అభివృద్ధిని గురించిన కీలకమైన ప్రశ్నలు. ఈ ప్రశ్నలన్నిటినీ మోహనరాగం అడుగుతుంది. అభివృద్ధి చేసేవాళ్లకూ, అభివృద్ధి చెందాల్సిన వాళ్లకూ మధ్య అంతరం అపనమ్మకం, దూరం ఎట్లా తగ్గించాలనే దృష్టి అభివృద్ధి ప్రణాళికా రచయితలకు బొత్తిగా లేకపోవడాన్ని ఈ నవలలో అక్కినేని కుటుంబరావు చాలా నగ్నంగా చూపిస్తాడు.

పథకంలో భాగంగానే ఆ పథకాన్ని అమలు చేసేవారిలో అంకితభావాన్ని ఇంటిగ్రిటీనీ చేకూర్చే విధి విధానాలను చేర్చాలనే ఇంగితం లేని పథక రూపకర్తల పట్టని తనాన్ని , బాధ్యతా రాహిత్యాన్ని రచయిత బైటపెడతాడు.

దేశంలోని ప్రాంతీయ, భౌగోళిక, ఆర్థిక, సాంఘిక పరమైన తేడాలను తుడిచివేసి దేశాన్నంతా ఒక సమతల ప్రదేశంగా ఊహించుకుని అభివృద్ధి పాలసీలు తయారవడంలోని మూర్ఖత్వాన్ని రచయిత చాలా కోపంతో అవహేళన చేస్తాడు.

రాజ్యాంగం వాగ్దానం చేసిన ప్రజల జీవించే హక్కుని, దానిని కాపాడేందుకు ప్రభుత్వం అనుసరించాల్సిన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను ప్రభుత్వ ప్రణాళికా కర్తలు బేఖాతరు చేసిన తీరే ఈ నవలా వస్తువు. కథానాయకుడు, ఈ పథకంలో ఒక ఉద్యోగి అయిన మోహన్ తన స్నేహితుడికి రాసిన ఉత్తరంలో సంక్షిప్తంగా ఈ పథకం పాఠకులకు పరిచయమవుతుంది.

అయిదు కోట్ల రూపాయల గ్రాంటుతో 'మాతా శిశు సంక్షేమ విద్య' అనే పేరుతో ఇంటింటా దీపాలు వెలిగించాలనే సంకల్పంతో నడుస్తోంది ఈ కౌన్సిల్. దీనిలో నెలకి 1200 రూపాయల జీతం మీద ఓ సంవత్సరం పాటు నిరుద్యోగ రాకాసి నుండి తప్పించుకోడానికొచ్చి చేరాన్నేను.

నేనూ, ఇక్కడి టీచర్లు, మా అసిస్టెంట్ డైరెక్టర్, డైరెక్టర్ ఇంకా మరో ఇద్దరు పెద్దలూ, నా కొలీగ్స్ మరో ముగ్గురమ్మాయిలు మేమంతా కలిసి ఈ శిశువులున్న మాతలకు 'కమలకు తొలిచూలు' లాంటి పాఠాలు నేర్పుతాం. 'దానివల్ల మాకేం లాభం' అంటున్నారు వాళ్లు.

'మీరు చేత్రాలు చేయవచ్చు. కథలు చదువుకోవచ్చు. మీ అమ్మకి, నాయనకి ఉత్తరాలు రాసుకోవచ్చు' అంటాం మేము.

'మా పిల్లగానికి జరమొచ్చింది చూస్తావా?' అని అడుగుతారు వారు. వాళ్లని చదువుకి సమర్పించడం కోసం కొన్ని ఆకర్షణలు కావాలి. అందుకోసం మేం కొన్ని మందులు సప్లయి చేస్తాం. మెడికల్ టెస్టులు కూడా చేస్తాం. ఇదీ స్థూలంగా ఆ పథక స్వరూపం స్వభావం.

ఆకలి, పోషకాహారలోపం, దానివల్ల సంక్రమించే అనేకనేక రోగాలు, వీటిని గురించి ఆ ఊళ్లకు ఏ పథకాలూ లేవు. కనీసం మహిళలకు ప్రసూతి సౌకర్యాలు కూడా లేవు. కానీ 'మతా శిశు సంక్షేమ విద్య' కోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పరిచింది. ఈ పథకం వారి ఆలోచనల్లోకి ఎలా వచ్చి ఉండవచ్చు?

అన్ని అనర్థాలకీ కారణం అవిద్య, చదువుకోకపోవడం అనే నమ్మకం చదువుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్న వర్గాలకు ఉంటుంది. చదువు అవసరమే కానీ నాలుగు అక్షర ముక్కలు నేర్పిస్తే చాలు వాళ్ల సంక్షేమం వాళ్లు చూసుకుంటారని అనుకునే చదువుకున్న ఆఫీసర్లు, ప్రణాళిక కర్తలు అర్థం చేసుకోలేనిదేమిటంటే ఆ నాలుగు అక్షర ముక్కల విలువ నాలుగువేళ్లు నోటిలోపలికి పోయినపుడేననేది. ఈ విషయం అభివృద్ధి చెందాల్సిన మహిళలకు బాగా తెలుసు. ఈ నవలలోని బీద మహిళలు సూటిగానూ, పరోక్షంగానూ కూడా ఈ సంగతిని ప్రభుత్వోద్యోగులకు పదేపదే చెప్తారు, మోహన్, సుజాతలకు అర్థమయ్యేలా చేస్తారు.

ఈ ప్రభుత్వ పథకాల గురించి కొంత లోతుగా వాటి ఆవిర్భావం నుంచి తెలుసుకుంటే అవి అంతగా మహిళల జీవిత వాస్తవాలకు దూరంగా ఎందుకున్నాయో అర్థమవుతుందేమో చూద్దాం. మూడవ ప్రపంచ దేశాలలోని బీద మహిళలు లబ్దిదారులుగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అనేక దేశాలలో జాతీయ, అంతర్జాతీయ సంక్షేమ ఏజెన్సీలు మొదలయ్యాయి. ఈ సంక్షేమ కార్యక్రమాలు బీద మహిళల అవసరాలను గుర్తించడంలో తల్లులుగా, గృహిణులుగా వారి పాత్రలకు మాత్రమే పరిమితమై తయారు చేయబడ్డాయి. (బువినిక్, 1983, పి24).

మన దేశంలో మహిళలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు రాజ్యాంగ రచన తర్వాత కూడా సమానత్వ ప్రాతిపదికమీద గానీ స్త్రీలుగా వారి ప్రత్యేకతను గుర్తించి ప్రాతిపదిక మీద గాని తయారు కాలేదు. కొంతకాలం తర్వాత సమీక్షలలో ఫలితాలు కనపడకపోవడంతో, ఆ కార్యక్రమాలను మార్చి 1970వ దశాబ్దంలో 'విమెన్ ఇన్ డెవలప్‌మెంట్' (విడ్) అనే దానిని ముఖ్యం చేసుకుని కొన్ని పథకాలను రూపొందించారు. కానీ ఈ విడ్ పథకాలలో నిజానికి జరిగిందేమీ లేదు. ఈ పథకాలను రచించేవారు, అమలు చేసేవారు జండర్‌కి సంబంధించి అసలైన. మౌలికమైన సైద్ధాంతిక విషయాల జోలికి వెళ్లేవారు కాదు. అప్పుడు ఆ సమయంలో దేశంలో అమలు జరుగుతున్న అభివృద్ధి చర్యలలోనే, పనులలోనే స్త్రీలకు లబ్ధిచేకూరే అంశాలను కూడా సర్దుదామని చూసేవారు. స్త్రీలను, ముఖ్యంగా అల్ప ఆదాయ వర్గాలలోని స్త్రీలను గృహిణులుగా కుటుంబ అవసరాలను తీర్చేవారిగా పరిగణించడ మనేది ఈ 'విడ్'లో కూడా అలాగే కొనసాగుతూ వచ్చింది. అంతకు ముందున్న సంక్షేమ పథకాలలోంచి ఆ భావన అంతరాయం లేకుండా వస్తోంది. కుటుంబం, పిల్లల సంక్షేమం స్త్రీల ప్రధాన బాధ్యత అనే దృష్టే వాటిలో ప్రధానంగా ఉండేది. స్త్రీలను సామాజిక వ్యక్తులుగా, సామాజిక ఆర్థిక ఉత్పత్తిలో భాగస్వాములుగా చూడడం జరిగేది కాదు. కనీసం ఈ పథకాలలో వారు కూడా చురుకైన ఏజెంట్స్‌గా ఉండాలన్న ఆలోచన కూడా ఆ పథకాలలో లేదు. అందువల్ల లబ్ధిదారులైన స్త్రీలు ఆ పథకాలలోకి అతి ఉదాసీనంగా, అమాయకంగా, అర్థం కాకుండా వచ్చేవారు. నిజానికి లబ్ధిదారులుగా వారు ఎంతో ఆసక్తితో, తమ భవిష్యత్తు బాగుచేసుకోవాలనే ఆరాటంతో రావాలి. అట్లా వచ్చినప్పుడు ఆ పథకాలకు ఆ స్త్రీలు అందించేది ఎంతో ఉంటుంది. ముఖ్యంగా వారి భాగస్వామ్యమే ఆ పథకాలకు జవ జీవాలనిస్తుంది. కానీ స్త్రీలు అక్కడ తమకేదో ఇస్తారు అది తీసుకుని వెళదాం, అంతే మనపని అనుకునేలా ఆ పథకాల అమలు ఉంటుంది. ఆ పథకాలలోకి స్త్రీలు ఒక ఏజెన్సీతోని రారు. రాకపోవడానికి ప్రధాన కారణం స్త్రీలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే చూడడం ఆ చూపుతో అభివృద్ధి ప్రణాళికలు, పథకాలు రచించడం అనే అవగాహనను ఈ నవల ఇస్తుంది.

మహబూబ్‌నగర్ జిల్లా కరువుబారిన పడినపుడు అక్కడి ప్రధాన సమస్య ఆకలి. ఆ ఆకలి సమస్య తీవ్రతను అర్థం చేయించడానికి రచయిత అందరికంటే అతి దయనీయ స్థితిలో ఉన్న ఈరమ్మ పాత్రను నవలలోకి తీసుకువచ్చాడు. ఈరమ్మది నూరేళ్లు పైబడిన వయసు. కొడుకులు, కూతుళ్ళు, మనమలు ఉన్నారు గానీ ఎక్కడున్నారో తెలియదు. వాళ్ల బతుకు దెరువుల వెతుకులాటలో వాళ్లు ఎక్కడికో వెళ్లారు. ఊళ్లో ఒకరిద్దరు ఉన్నా వాళ్లకు ఈరమ్మను చూసుకునే శక్తి లేదు. ఒక ముద్ద పెట్టగలిగిన పరిస్థితి కాదు వాళ్లది. ఆ ముసలమ్మతో మోహన్, సుజాత, ఇతర ఉద్యోగులు మాటలు కలిపినపుడు ఎన్నో చేదు నిజాలు బైటపడతాయి. 'మరి ఎవరు చూస్తున్నారు' అని ఈరమ్మను అడిగినపుడు జరిగిన సంభాషణ. 'ఎవరు జూస్తరు. ఊరొల్లే ఇంత పెడ్తరు. నా సిన్న మనవడు అప్పుడొక చారనా ఇప్పుడొక చారనా చేత్ల పెడ్తడు'

ఇలాంటి ఈరమ్మతో ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియని ఉద్యోగులు ఈరమ్మ లాంటి వాళ్లను ఉద్ధరించడానికి పెద్ద చదువులు చదివి పట్నాల నుండి వచ్చారు. ఛాయ అనే ఉద్యోగి ఈరమ్మను అడుగుతుంది. 'వంటచేసుకున్నావా? కూరేమి వండినావు' అని 'ఎండ్లకు' అంటుంది ఈరమ్మ. కూర ఎండ్లకు? అసలైన అన్నం ఒండుకోవాలిగా కూరొండుకోవాలంటే అసల్దే లేదు. ఇంక కూరేంటి. అన్నం తిని ఎన్నాళ్లయిందో. ఎందుకా ప్రశ్న. ఈరమ్మ ఊరొళ్లు తనకు నాలుగు మెతుకులు పెట్టడం లేదనే అనుకుంటుంది. వాళ్లకీ కష్టంగానే ఉంటుందనీ అనుకుంటుంది ఈరమ్మ.

'ముసల్దానికింత పెట్టకపోతే పోయింది. మీరంత ఏం దినకుండానే పంటుర్రా' అంది ఈరవ్వ.

'చెప్తే సిగ్గు బోతది. మా ఇంట్లో అన్నం దిని ఎన్నాల్లయిందో ఎర్కనా?' అందొకావిడ. 'మీ ఇల్లేంది......మనొల్లంతా ఇంతింత అంబలి తాక్కుంట బతుకుతుర్రు' అంది మరొకావిడ. 'నాగ్గాద ఆ అంబలే జరంత పోయిర్రి' అంది ఈరమ్మ. 'నీకెవలు పోయకుండనె బత్కుతున్నవా మల్ల మేం బొయ్యకుంటె నీ పోరలు పోస్తున్నరా' అందొకావిడ కోపంగా. 'అరె.....పోస్తున్నరమ్మా! పోయలేదని నేనెట్లంట? నా పోరలు పోసెటొల్లయితే మీతోని మాటలు బడ్తన' అంది ఈరమ్మ. 'మనం రోజు అన్నం దినుకుంట ఆమెకు అంబలి పోస్తున్నం అనుకుంటుందామె' 'లే బిడ్డా....లే నేనట్ట అనుకుంటలే గని ఎన్నాల్లాయె అన్నందిని.....' అని ఎటో చూస్తుంది ఈరమ్మ. మోహన్‌కి గుండె పట్టేసింది. చదివే పాఠకులకూ గుండె పట్టేస్తుంది. రాజ్యాంగాలూ, ప్రాథమిక హక్కులు ఏమీ ఒద్దు. ఈరమ్మలాంటి వాళ్లకు రోజూ వేళకింత అన్నం పెట్టండి చాలు అని అరవాలనిపిస్తుంది.

ఇక్కడ ప్రధాన సమస్య ఆకలి. కనీస మానవ అవసరాలు తీరని పేదరికం కనీసపు పోషకాహారం అందని పేదరికం. మానవ కనీస అవసరాలు కుంబించుకుపోయి ప్రాణం నిలిస్తే చాలనుకునే దాకా తీసికెళ్లే బీదరికం. మానవ అవసరాలను ఆర్థిక శాస్త్రవేత్తలు, సామాజిక సిద్ధాంతిక కర్తలూ ఎంతో ఉదాత్తంగా నిర్వచించి పెట్టారు.

మానవ జీవనావసరం అంటే కేవలం ప్రాణాలతో ఉండడమే కాదు. మానవ అవసరమంటే ఆరోగ్యవంతమైన, చురుకైన జీవితం జీవించడం. కమ్యూనిటీ జీవితంలో భాగస్వామ్యం ఉండడం. శారీరకంగా బాగుండడమంటే సాంస్కృతిక నిర్వచనంలో ఆరోగ్యం, ఇల్లు, బట్టలు, పరిశుభ్రత ఇవన్నీ ఉండాలి. ఇంకా విశాలార్థంలో 'లేమి' అనేదానికి అధికారం లేకపోవడం, పరాధీనత, ఒంటరితనం (ఛాంబర్స్ 1988) ఇవన్నీ కూడా గుర్తులు. ఈరమ్మలో ఇవన్నీ రూపుకట్టి ఉన్నాయి. ఒక ప్రభుత్వ పథకాన్ని అమలు చేసే కేంద్రంలో కొందరు గ్రామీణ స్త్రీల మధ్య జరిగిన ఈ సంభాషణ రాజ్యాంగ నిపుణులకు, వ్యాఖ్యాతలకు ప్రణాళికా సంఘ అధ్యక్షులకు, సభ్యులకు ఒక పెద్ద సవాలు. ఆ సవాలు స్వీకరించేందుకు కూడా వారెవరూ సిద్ధంగా లేకపోవడం అసలైన సామాజిక విషాదం. ఆ సవాలుని మీరు ఎదుర్కోగలరా? తప్పించుకుని తిరుగుతారా అని రచయిత ప్రశ్నిస్తున్నట్టే ఉంటుంది ఆ సన్నివేశం చదువుతుంటే. జీవించే హక్కుని పరిహాసం చేస్తున్నట్లు మాట్లాడుతుంది ఈరమ్మ. నిజానికి ప్రాణాలు నిలబెట్టుకోడానికి సరిపోయేంత తిండి మాత్రమే దొరికే వారికి అది దొరికితే చాలు. ఈరమ్మకు ప్రాణాలు నిలబెట్టుకోవాలని కూడా లేదు. తొందరగా చావాలని ఉంది. తననెందుకు తీసుకుపోవడం లేదని దేవుడితో పంచాయితీ పెట్టుకోవాలని ఉంది. ఆ తగవుకి భయపడే దేవుడు తనను తీసుకుపోవడానికి జంకుతున్నాడనే అనుమానం కూడా ఉంది.

ఈరమ్మలకు జీవించే హక్కుకి అర్థం లేదు. మరణించే హక్కు కావాలని కూడా ఈరమ్మ అనుకోవడం లేదు. నాకెందుకు ఆ పాపం అని ప్రాణాలు తీసుకునే పని నుంచి బైటపడింది. చావు బతుకూ రెండింటికీ కాని స్థితిలో నిరామయంగా ఆ పూటకు దొరికే అంబలి మీద ఆశపెట్టుకునే బతుకుల్నేనా రాజ్యాంగ నిర్మాతలు కలగన్నది?

ఈరమ్మ స్థితి ఇలా ఉంటే పోషకాహార లోపంతో బాలింతగా

చనిపోయిన శాంతమ్మ పరిస్థితి మరింత విషాదకరం. బాలింత శాంత ఇంటికి కట్టెలు మోసుకొస్తుంది. ఇంటెడు చాకిరి చేస్తుంది. రోజులకు రోజులు పస్తుంటుంది. పాఠాలు వినమంటే 'పెయ్యంత నెప్పి లేస్తుంది గోలిలిస్తనంటే వస్త' అంటుంది. ఈ టీమ్‌లో ఒకడైన డాక్టర్ సుందర్రావు ఆమెకు గర్భిణిగా ఉన్నప్పటి నుంచే చెప్తున్నాడు పోషకాహారం తీసుకోమని. అసలు అంబలే దొరకని శాంతమ్మకు పాలు, పళ్లు, గుడ్లు తీసుకోమని చెప్తూ వస్తున్నాడు సుందర్రావు. అది అతని ఉద్యోగ ధర్మం.

ఆమె పోషకాహారం ఎక్కడ్నించి తీసుకుంటుందని మోహన్ అడిగితే సుందర్రావు

'మోహన్ – నేను డాక్టర్ని. రోగికి ఏ ఆహారం అవసరమో నేను చెప్పగలను అంతేగాని వాళ్ల పరిస్థితులు గమనించి నేనేం చేయాలి?' అంటాడు. 'ఈ పరిస్థితి మార్చలేమా?' అంటాడు అపుడే తాజాగా యూనివర్సిటీ డిగ్రీ తీసుకుని నగరం నుంచి వచ్చిన మోహన్. 'అది నా పనికాదు' అంటాడు డాక్టర్ సుందర్రావు. 'ఒక డాక్టర్‌గా ప్రభుత్వానికి ఈ విషయం తెలపలేదా? మీ కళ్ల ముందు ఒక మనిషి.....' అంటున్న మోహన్‌కి సుందర్రావు గట్టి జవాబు ఇస్తాడు . సుందర్రావు ధోరణి బాగున్నట్లుండదు గానీ అతని మాటల్లో తప్పుపట్టదానికేమీ లేదు.

ఒక మనిషేమిటయ్య బాబూ! ఏ ఊరెళ్తే ఆ ఊళ్లో లెక్కకు మించి పోషకాహారలోపం వల్ల రకరకాల జబ్బుల్తో నిండి ఉన్న మనుషులు కనపడ్తారు. నువ్వు ఇవ్వాలే ఒక ఊరెళ్లొచ్చి ఆ ఊళ్లో ఒక మనిషిని చూసి 'అయ్యో' అని ఏడుపు ముఖం పెట్టావు. నేను రోజూ చూస్తూనే ఉంటాను. శాంతమ్మ ఒక్కదావిడేమిటి? ఎన్ని వందల మంది స్త్రీలు, గర్భవతులుగా, బాలింతలుగా వారం పది రోజులు, పదిహేను రోజులు, నెలతిరక్కుండా పాలులేక రోగాల్తో చచ్చిపోతున్నారో, అవన్నీ నాకు తెలుసు కాబట్టే శాంతమ్మని చూసి నీలాగా నేను కన్నీళ్లు కార్చలేను. ఒక్కరో, నలుగురో అయితే అది వేరేమాట! వందలకి వందలు స్త్రీలు, పిల్లలు, వృద్ధులు మరణిస్తున్నారు. ఇంకా మరణిస్తారు. వాళ్లందరికీ కావలసింది పోషకాహారం. అది దొరకడం ఈ దేశంలో అంత సులభం కాదు. గవర్నమెంటుకీ సంగతి తెలియదనుకోకు. తెలియకపోతే ఓట్ల కోసం వచ్చిన ప్రతిసారీ మీకు కాల్వలు తెప్పిస్తాం. మీకు ప్రాజెక్టులు కట్టిస్తాం. మీ పొలాలన్నీ సాగు చేసుకునేలా అభివృద్ధి కార్యకలాపాలు మొదలెట్టబోతున్నాం అని అన్ని వాగ్దానాలెందుకు కురిపిస్తారు? అందువల్ల గీతలో చెప్పినట్లు 'నువ్వు చేయవల్సింది నువ్వు చెయ్యి– ఫలితం గురించి ఆలోచించకు, నీపనేమిటి? ఆడవాళ్లకి, ముఖ్యంగా తల్లులకి నాలుగు అక్షరం ముక్కలు నేర్పడం, నీపని నువ్వు చూసుకో'.

తీవ్రమైన బీదరికం, కరువులు, పోషకాహార లోపానికి, ఆకలికీ, అకాల మరణాలకూ దారి తీస్తుందని ఏ అధ్యయనాలు లేకుండానే తెలుసు మనకు. కానీ అధ్యయనాలు జరుగుతున్నాయి. గణాంకాలు విడుదలవుతున్నాయి. నిరూపించి మరీ చెపుతున్నాయి. అలాంటప్పుడు తీసుకోవాల్సిన చర్యలేమిటి? స్త్రీలలో చిన్నతనంలో గర్భం ధరించడం, బిడ్డకు బిడ్డకు ఎడం లేకపోవడం, తరచూ గర్భం ధరించడం ఇవన్నీ అప్పటికే ఉన్న పోషకాహార లోపాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. మన దేశంలో మన రాష్ట్రంలో ఇప్పటికీ మాతా, శిశు మరణాల సంఖ్య తగ్గడం లేదు. దానికి కారణం స్త్రీ, పురుష అసమానతల గురించి అభివృద్ధి పథకాల రూపకర్తలు పట్టించుకోకపోవడమే. స్త్రీ, పురుష సమానత్వం గురించి రాజ్యాంగంలో ఎంత ప్రధానంగా ఆర్టికల్ 15లో పేర్కొన్న ఆచరణలో సమానత్వం ఒక నైతిక భావనగా ప్రజలలో వ్యాపింపచేయడంలో విఫలమయ్యాము.

సాధారణంగా ప్రణాళికా సంఘాలలో, ప్లానింగ్ కమీషన్లలో పురుషులే అధికార స్థానాలలో ఉంటారు. ఈరమ్మ లాంటి, శాంతమ్మ లాంటి వాళ్లను అధికారంతో కాకపోయినా కో ఆప్‌టెడ్ సభ్యులుగానైనా తీసుకుంటే సంక్షేమ, అభివృద్ధి పథకాలను వాళ్లు బాగా రచించగలిగే వాళ్లు. ఆ ప్రణాళికా సంఘ అధికారులకు స్త్రీలు సమాజంలో రెండు రంగాలలో పని చేయాల్సి ఉంటుందనీ, ఆ రెండూ చాలా కీలకమైనవనీ ఒకదాని ఒత్తిడి మరొకదానిపై పడి వారి మానసిక శారీరక ఆరోగ్యాలు దెబ్బ తింటాయనీ తెలియదు.

టింకర్ ప్రణాళికా కర్తలు చేసే మూడు పొరపాట్లను ఎత్తి చూపాడు.

(1) పట్టించుకోకపోవడం – సంప్రదాయిక సమాజంలో స్త్రీల పాత్రను గుర్తించి, దానిని వినియోగించుకోవడంలో విఫలమవడం.

(2) తిరిగి వాటినే బలవంతంగా రుద్దడం – ఇంతకు ముందు సమాజంలో ఉన్న విలువలనే – స్త్రీలను ఇంటికీ, పిల్లలను కనిపెంచే పనికి మాత్రమే పరిమితమైన వారిగా చూడడం.

(3) అదనం – సంప్రదాయ విలువలు, అలవాట్లు అలా ఉండగానే పాశ్చాత్య విలువలను పైనుంచి వారిమీద రుద్దడం.(రివర్స్‌డ్ రియాలిటీస్, నైలా కబీర్, పుట 22)

స్త్రీలకున్న రెండవ తరగతి గుర్తింపును ప్రణాళికా కర్తలు తిరిగి తిరిగి విధించడం మానేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. స్త్రీ, పురుష సమానత్వం సాధించడమనే, స్త్రీ పురుష సమానత్వాన్ని ఉన్నతమైన విలువగా గుర్తించడమనే నైతికతను ప్రణాళికా కర్తలు అలవరచుకోవలసి ఉంది. అన్ని ప్రాజెక్టుల రూపకల్పనలో, విద్యా ఉపాధి రంగాలలో జండర్ వివక్షను తొలగించడమనే దానిని భాగం చేయడమే వారు పాటించవలసిన రాజ్యాంగ నైతికత.

'మోహనరాగం' నవలలో వయోజన మహిళలకు నేర్పుతున్న పాఠం 'కమలకు తొలిచూలు' వచ్చే వాళ్లందరూ పిల్లల తల్లులు – దాని వలన వాళ్లకు కలిగే ప్రయోజనం చాలా తక్కువ. ఈ పాఠాన్ని భాగవతుల చారిటబుల్ ట్రస్టు రూపొందించిన పాఠ్య పుస్తకంలోని ఒక గ్రామంలో సారా నిర్మూలన కార్యక్రమం గురించిన పాఠంతో పోల్చి చూస్తే మనకు విషయం తేలికగా అర్థమవుతుంది. సారా నిర్మూలన పాఠం యాదృచ్ఛికంగా ప్రభుత్వ అక్షరాస్యత కార్యక్రమంలో భాగమై దూబగుంట మహిళలకు ప్రేరణై ఆంధ్రప్రదేశ్‌లో సారా వ్యతిరేకోద్యమాన్ని మహిళలు నిర్మించేలా చేసింది. మహిళలు తమకు తెలియకుండానే రాజ్యాంగ నైతికత కోసం పోరాడారు. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో అధికరణం 47 మత్తు పానీయాలను నిషేధించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి – అనేది. ఆదేశిక సూత్రాలను న్యాయస్థాన ఉత్తర్వులతో అమలు చేయలేము కానీ 'పరిపాలన చేయడంలో ప్రభుత్వములు ఆదేశిక సూత్రములను తప్పనిసరిగా ప్రామాణికములుగా తీసుకోవాలి' అనే దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. మహిళలు పట్టించుకుని రాజకీయ ఉద్యమం చేసి రాజకీయాలను మార్చారు. అంటే మహిళలకు తొలిచూలు పాఠాల బదులు, లేక వాటితోపాటు వారసత్వ పాఠాలు నేర్పడం వల్ల సమాజంలో రాజ్యాంగ నైతికత అభివృద్ధి చెందుతుంది. దురదృష్టవశాత్తు ప్రభుత్వం అది గ్రహించి ఆ కార్యక్రమాల్ని రద్దుచేసి మైక్రో క్రెడిట్ కార్యక్రమాలను పెట్టి రాజ్యాంగ నైతికతలోకి ప్రజలు రాకుండా తను చేయగలిగింది చేసింది.

ఈ నవల చివరి భాగంలో మోహన్ తన మిత్రుడు చంద్రానికి ఉత్తరం రాస్తూ వర్ణించిన దృశ్యం బీదరికపు భయంకర బీభత్స రస ప్రధానం.

(ఇంకా ఉంది)

(రచయిత ప్రముఖ స్త్రీవాద కథా, నవల రచయిత) వీ


davp 22202/13/0027/1415
R.O. NO. 22202/13/0030/1415
Sabka saath,
sabka vikas
Heartiest greetings on
68th Independence day
सत्यमेव जयते
Ministry of Information and Broadcasting
Government of India

Advt.

పోలీసుల సద్భావన యాత్రలు

***మన్యం ప్రాంతంలో సద్భావన యాత్రల పేరుతో పోలీసు అధికారులు ఆదివాసుల హక్కుల్ని, జీవన విధానాన్ని ధ్వంసం చేస్తూ, అక్రమ మైనింగ్ కంపెనీలకు కాపలా కాస్తున్నారని అంటున్నారు* కొర్ర జ్యోతి**

ఆంధ్ర – ఒడిశా బార్డర్‌లో పోలీసులు నిర్వహిస్తున్న సద్భావన యాత్రలు, జాబ్ మేళా, జనమైత్రి, సహపంక్తి భోజనాలు. గాంధీయన్ పోలీసింగ్, సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలు ఎవరిని కాపాడడానికి? 2009 సెప్టెంబర్ ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడి నుండి ఎల్ఐసి (లో ఇన్‌టెన్సిటీ కాంఫ్లిక్ట్) బహుముఖ దాడిని అమలు చేస్తున్నారు. ఈ దాడిని మనదేశ పాలకులు తక్కువ తీవ్రతతో కూడుకున్న యుద్ధం అని పిలుస్తున్నారు. ఈ దాడిని విప్లవ పార్టీ బహుముఖ దాడి అని చెప్పుతుంది. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే, ప్రజలపై ఐదు రకాలుగా అమలు చేస్తుంది. 1) సామాజికంగా, 2) ఆర్థికంగా, 3) సాంస్కృతికంగా, 4) సైద్ధాంతికంగా, 5) మానసికంగా ఈ దాడిని ప్రారంభించారు. గత నాలుగేళ్ల నుండి ఆదివాసి పీడిత ప్రజల్ని ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడికి గురిచేస్తూ, మావోయిస్టు ఉద్యమ ప్రాంతంలో మరీముఖ్యంగా మన్యం ప్రాంతంలో మూడు రకాల దాడులను క్రూరాతి క్రూరంగా (సంస్కరణపరంగా, దుష్ప్రచారం, సాయుధ దాడిని) అమలు చేస్తున్నారు. ఈ దాడిలో ఐపిఎస్ అధికార్ల నుండి కిందిస్థాయి ఎస్ఐల వరకు ప్రత్యేక కేంద్రీకరణ చేసి, ఆదివాసి పీడిత ప్రజల్ని బానిసత్వంలోకి నెట్టుతున్నారు.

పోలీసులు గత నాలుగేళ్ల నుండి, మన్యం ప్రాంతంలో ప్రభుత్వాన్ని (యంత్రాంగాన్ని) నడిపించవలసిన పరిస్థితి ఎందుకు ఎదురవుతుంది? ప్రభుత్వ అధికార్లు ఎక్కడ? ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు తమ ఆస్తులను కూడబెట్టే పనుల్లో ఉన్నారు. నాయకులు చేయవలసిన పనులు పోలీసు అధికార్లు అమలు చేస్తున్నారు. ఎందుకంటే పోలీసులు చేస్తున్న సాయుధ దాడిని ప్రజలకు తెలియకుండా మత్తు ఇంజక్షన్ (షుగర్ బుల్లెట్) సంస్కరణలు అమలు చేయిస్తున్నారు. ఈ దాడినే విప్లవ పార్టీ 'సామ, దాన, భేద, దండోపాయం' అని ఆదివాసి పీడిత ప్రజలకు చెప్పుతుంది. ఇది అక్షరాల నిజం.

అమెరికా సామ్రాజ్యవాదులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం 1980లో రూపొందించి అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశాల్లో, మరీ ముఖ్యంగా విప్లవ పార్టీలు ఉన్న దేశాలల్లో అమలు చేయిస్తుంది. మనదేశం ఖనిజ సంపదకు పెట్టిన కోటగా ఉండడంతో అమెరికా సామ్రాజ్యవాదుల కన్ను మనదేశంపై పడింది. ముఖ్యంగా అధికార మార్పిడికి ముందు నుండి గుప్పెడు మంది దళారుల కోసం 5 లక్షల మందికి పైగా ఆదివాసులు ఖనిజాల తవ్వకాల ద్వారానో పెద్ద పెద్ద భారీ ప్రాజెక్టుల ద్వారానో బలికావాల్సి వచ్చింది. దీంట్లో భాగంగానే భద్రాచలం ప్రాంతాన్ని ఆంధ్రపాలకుల ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రాంతం నుండి విడదీసి ఆంధ్రలో కలిపి, ఆదివాసి ప్రజలకు మరోమారు విద్రోహం తలపెడుతోంది. ఇలాంటి విషయాల్ని మరుగున పరుస్తూ ఐపిఎస్ అధికార్లు, ఆదివాసి పీడిత ప్రజల ప్రయోజనాల్ని దెబ్బతీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మనదేశ పాలకుల చేతుల్లో టివి రిమోట్ లాగా మారిన ఐపిఎస్ అధికార్లు ఆదివాసి పీడిత ప్రజలపై సాయుధ దాడులు చేయిస్తూ, పదుల సంఖ్యలో ఆదివాసులను బూటకపు ఎన్‌కౌంటర్‌ల ద్వారా హత్యలు చేస్తున్నారు. వందల మందిని జైళ్లో పెట్టడం, మహిళలపై అత్యాచారాలు చేయడం పోలీసులకు సర్వ సాధారణ విషయంగా మారింది. ఈ మధ్యకాలంలో జూన్ మొదటివారం గిల్లలబంధ గ్రామంపై దాడిచేసి ఆదివాసి నాయకుడి ఇంట్లో రెండు లక్షల రూపాయలు, రెండు తులాల బంగారం లూటీచేశారు. ఇదే నెల ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా డబ్బుల పాడు గ్రామంపై దాడి చేసి, ఎనిమిది మంది ఆదివాసులను (అందులో 14 ఏళ్ల బాలుడు ఉన్నాడు) చిత్రహింసలకు గురిచేసి, ఎనిమిది విల్లంబులు, ఐదు వేట లైట్లు, ఐదు కత్తులు తీసుకొని పోయారు. తీవ్ర చిత్రహింసలకు గురైన వారిలో ఒక మహిళ మరుసటి రోజు మరణించింది. పోలీసులపై కేసు నమోదు చేయాలని ఆదివాసులు ఎంత మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయింది. చివరికి ఆదివాసులనే తప్పుపట్టారు.

ఇలా గ్రామాలపై వందల మంది బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, గ్రేహౌండ్స్, కమెండో బలగాలు తోడేళ్ల గుంపు మేకల మందపై పడినట్లు పడి దాడులు చేయడం ఎంతవరకు సమంజసం? చివరికి ఆదివాసులే చట్టాన్ని రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని చిత్రీకరించి మరిన్ని దాడుల్ని చేస్తున్నారు. రాజ్యాంగ ముసుగు తొడుక్కుని ఎంపి, ఎంఎల్ఎ, ఐపిఎస్, ఐఎఎస్‌ల నుండి గ్రామ సర్పంచుల వరకు సంపాదించిన ఆస్తులు విదేశీ బ్యాంకుల్లో ఏ రాజ్యాంగం, ఏ చట్టం ప్రకారం దాస్తున్నారు? అక్రమంగా ఆస్తులను కూడబెట్టిన అధికార్లని, నాయకుల్ని ఎంతమందిని శిక్షించారు? మనదేశంలో ప్రజలకు ఒక రాజ్యాంగం, పాలకులకు ఒక రాజ్యాంగం ఉందా? ఈ రోజు మనదేశంలో ప్రజాస్వామ్యం పేరుతో పిడికెడు మంది అయిన సామ్రాజ్యవాద దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాల ప్రయోజనాల్ని కాపాడడంలో పోలీసు వ్యవస్థ తలమునకలై ఉంది. ఐపిఎస్ అధికార్లు చెపుతున్నట్లు ఆదివాసి పీడిత ప్రజల ప్రయోజనాల్ని కాపాడడమే తమ సద్భావన యాత్రల విధి అని చెప్పడం పచ్చి బూటకం. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఆంధ్ర – ఒడిశా బోర్డర్‌లో ఎస్.ఆర్. కంపెనీ ప్రయోజనాల్ని కాపాడడంలో పోలీసు వ్యవస్థ ఎంతటి కీలక పాత్రని పోషించిందో ప్రజలకు తెలుసు. ఆదివాసులు మూడు దశాబ్దాల నుండి జల్ – జంగల్ – జమీన్ కోసం, అటవి చట్టాల అమలుకోసం ఈ దోపిడీ వర్గాలతో పోరాడుతున్నారు.

బ్రిక్స్ కూటమి ఏర్పాటు నేపథ్యం

అభివృద్ధి చెందిన దేశాలకు పోటీగా ఏర్పడిన ఆసియా, దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల కూటమి ఒకతాటిపై నిలబడి తమ దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలని అంటున్నారు బి.ఎస్. రాజు

సంక్షోభపు పెనుకుదుపులకు గురవుతూ ఉండడం దాని స్వాభావిక లక్షణం. కాబట్టి, పెట్టుబడి ఎప్పుడూ లాభాల వేటలో దౌడు తీయాల్సిందే. ఈ దౌడుకై దానికి మేలు జాతి అశ్వాలు కావాలి. అందుకై తన గుర్రపు శాలలో చురుకైన ఆర్థికవేత్తలనే అశ్వాలను ఎప్పటికప్పుడు తర్ఫీదుచేసి తయారుగా పెట్టుకుంటుంది. వారిచేత వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో చోటుచేసుకుంటున్న మార్పులను, చోటు చేసుకోబోయే పరిణామాలను నిరంతరం అధ్యయనం చేయిస్తూ, అంచనాలు కట్టిస్తూ ఉంటుంది.

వనరుల దోపిడీ, దురాక్రమణలు, పరపీడన, రుణం-రణం, పర్యావరణ హననం అనే పునాదులపై నిర్మితమైన పెట్టుబడి వికృత సౌధంపై నిలబడి ఈ ఆర్థిక శాస్త్రవేత్తలు, మిలటరీ-సాంకేతిక నిపుణులు, శాస్త్ర విజ్ఞానవేత్తలు దుర్భిణీలు పెట్టి వెతుకుతూ ఉంటారు. పెట్టుబడి చొచ్చుకుపోయేందుకు అనువైన వనరులు, ముడి సరుకులు, మార్కెట్లు, దేశాలు, ప్రాంతాలు, జాతులు ఎక్కడెక్కడ ఉన్నాయోనని. బలహీన, నిస్సహాయ జన సమూహాలు ఎక్కడెక్కడ కుప్పపడి ఉన్నాయో, వారి శ్రమను కారుచవకగా ఎలా దొంగిలించి అధిక లాభాలు రాబట్టుకోవచ్చో; వారిపై వలవిసిరి ఎలా పట్టుకోవాలో తెలియచెప్పే రంగు-రంగుల నివేదికలు, ప్రణాళికలు వీరు తయారుచేస్తూ ఉంటారు. వాటికి మృదు మధురమైన చాక్లెట్ల వంటి పేర్లు పెడతారు. అలా తెరపైకి వచ్చిందే బ్రిక్ (బిఆర్ఐసి) అనే పదం.

అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మెన్ సాక్స్ ఆర్థిక శాస్త్రవేత్త జిమ్ ఓనీల్ 2001లో 'ప్రపంచానికి మెరుగైన ఆర్థిక బ్రిక్స్ అవసరం' అనే పేరుతో ఓ పత్రం ప్రచురించాడు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాల ఇంగ్లిష్ పేర్లలో మొదటి అక్షరాలను కలిపి బ్రిక్ అనే కుదింపు నామాన్ని అతను మొట్టమొదటిగా ఆ పత్రం ద్వారా పెట్టుబడిదారీ రాజకీయ ఆర్థిక పరిభాషలో చేర్చాడు.

ఆ పత్రంలో అతను చెప్పింది- ఆర్థిక మందగమనంలో కూరుకు పోయిన పడమటి దేశాల సాంప్రదాయ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే కన్నా, వేగంగా విస్తరిస్తున్న బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా మార్కెట్లలో పెట్టుబడిని విస్తరించడం కడు శ్రేయస్కరం అని. ఇది ఎలా శ్రేయస్కరమో నిర్ధారించడానికి ఈ నాలుగు దేశాల బలాబలాలను ఆ పత్రంలో వివరించాడు. అసలు ఈ నాలుగు దేశాలనే అతను ఎందుకు ఎన్నుకున్నాడు?

సాంస్కృతిక, రాజకీయ అంశాలలో పొంతనలేని ఈ నాలుగు దేశాలను ఒక కూటమిగా జిమ్ ఓనీల్ ఊహించడానికి కారణభూతమైన ప్రధాన అంశాలు:

1. ఈ నాలుగు దేశాల ఆర్థిక వ్యవస్థలు వేగంగా అభివృద్ధి చెందుతూ ఉండడం.
2. అవి మరింతగా బలపడే అవకాశాలను మెండుగా కలిగి ఉండడం.
3. ఈ నాలుగు దేశాల జనాభా ప్రపంచ జనాభాలో 43 శాతం కలిగి ఉండడం.
4. ప్రపంచ భూబాగంలో ఈ నాలుగు దేశాల భూబాగం 30 శాతంగా ఉండడం.
5. ప్రపంచ గరిష్ట ఆదాయంలో (జిడిపిలో) ఈ నాలుగు దేశాల వాటా 25 శాతంగా ఉండడం.
6. ప్రపంచ ఆర్థిక అభివృద్ధిలో ఈ నాలుగు దేశాల వాటా 50 శాతం ఉండడం.
7. ప్రపంచ విదేశీ మారక ద్రవ్య నిలువల్లో బ్రిక్స్ దేశాల వాటా 40

ఇందులో భాగంగానే మన్యం ప్రాంతంలో 1/70 చట్ట ప్రకారమే మర్రిపాకల ప్రాంతంలో 67 హెక్టార్ల కాఫీ తోటల్ని, బలపం ప్రాంతంలో 110 హెక్టార్ల కాఫీ తోటల్ని ఆదివాసులు ఎపిఎఫ్‌డిసి నుండి స్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటున్నారు. ఈ ప్రాంత ఆదివాసులపై, వీరి నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారు. సాయుధ దాడులు చేస్తున్నారు. అక్రమ అరెస్టులు, బూటకపు సరెండర్స్ చేయించడం, నాయకుల కుటుంబాల్ని వేధించడం, మరో పక్కన మన్యం ప్రజానీకాన్ని పోరాటాల నుండి మళ్లించడానికి సద్భావన యాత్రలతో పేరుతో ఐపిఎస్ అధికార్లు పని చేస్తున్నారు.

మన్యం ప్రజలారా! ఈ మేక వన్నె పులులు (పోలీసులు) నిర్వహిస్తున్న సద్భావన యాత్రలు ఆదివాసి పోరాటాల్ని, హక్కుల్ని, చట్టాల్ని మోసం చేయడమే, దగా చేయడమే తప్ప మరి ఏమి కాదు.˝ ఆదివాసి ప్రజల్లో ఐక్యతను సాధిస్తూ పోరాట మార్గం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోవాలి. ఈ ఐపిఎస్ అధికార్లు నిర్వహిస్తున్న సద్భావన యాత్రలు మన ఆదివాసులను మరింత బానిసత్వంలోకి నెట్టి అధికార పార్టీ నాయకులైన నరేంద్రమోడీ, చంద్రబాబు వెనకాల లెఫ్ట్‌రైట్ కవాతులు చేయడమే సద్భావన యాత్రల ఉద్దేశం ఈ దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా మన్యం ప్రాంతాన్ని జనతన సర్కార్లు నడిపించుకునే వైపు ఆదివాసి పీడిత ప్రజలు ప్రయాణం సాగించాలి.

(రచయిత ఆదివాసి మహిళా సంఘం సభ్యులు) వీ

శాతం (రమారమి 4.4 ట్రిలియన్ డాలర్లు) నమోదై ఉండడం


8. 2020 నాటికి బ్రిక్స్ దేశాల్లో మధ్యతరగతి ప్రజల సంఖ్య జి-7 దేశాలను మించిపోవడం

ఈ కింది పట్టికల్లో ఈ వివరాలు మరింత స్పష్టంగా పొందుపర్చ బడ్డాయి, చూడండి.

పట్టిక-2

బ్రిక్స్ దేశాల వివరాలు

	బ్రెజిల్	రష్యా	ఇండియా	చైనా
జనాభా	197 మిలియన్	142 మిలియన్	1.15 బిలియన్	1.33 బిలియన్
జాతీయాదాయం (2009, డాలర్లు) జాతీయాదాయం	1,573 బిలియన్	1,232 బిలియన్	1,310 బిలియన్	4,985 బిలియన్
పెరుగుదల రేటు (శాతం) (1990 - 2008)	2.6	0.7	6.3	10.2
ఊహిస్తున్న పెరుగుదల రేటు (శాతం) (2011-14, 2009 అంచనా)	3.7	4.4	7.6	10.3
వాణిజ్య ఎగుమతులు (2009)	153 బి	303 బి	162 బి	1,201 బి
మానవాభివృద్ధి సూచికలో మార్పులు (శాతం) (1990-2010; బ్రెజిల్ 2000-10)	7.6	3.8	33.3	44.2



సంవత్సరాదాయం ఆరువేల డాలర్ల నుంచి ముప్పై వేల డాలర్ల వరకు ఉన్నవారిని మధ్యతరగతిగా గుర్తించిన గోల్డ్‌మెన్ సాక్స్ జి7 దేశాలకన్న బ్రిక్స్ దేశాలలోనే 2020 నాటికి ఎక్కువ మంది మధ్యతరగతి జనాభా ఉంటుందని తేల్చింది.

పెట్టుబడులు, లాభాల దృష్టికోణం నుండి గోల్డ్‌మెన్ సాక్స్ ఆర్థిక శాస్త్రవేత్త ఊహకన్నా వేగంగా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలు బ్రిక్ కూటమిగా ఏర్పడ్డాయి. తదుపరి దక్షిణ ఆఫ్రికాను కలుపుకొని అవి బ్రిక్స్ కూటమిగా స్థిరపడి 2014 జూలై నెల 14-16 తేదీల్లో బ్రెజిల్‌లోని ఫోర్టలిజా నగరంలో 6వ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించుకున్నాయి. ఈ సమావేశం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

రెండవ ప్రపంచ యుద్ధంలో మొత్తం యూరప్ దేశాలు, అందునా

బ్రిక్స్ కూటమి జరుపుకున్న సమావేశాల పట్టిక

సం.	తేదీ	దేశం	అధ్యక్షుడు	ప్రదేశం
1	16-6-2009	రష్యా	దిమిత్రి మెద్వదేవ్	యకటెరిన్‌బర్గ్
2	15-4-2010	బ్రెజిల్	లాలా డిసిల్వా	బ్రసిలియా
3	14-4-2011	చైనా	జు జిన్ లూవో	సన్యా
4	29-3-2012	ఇండియా	మన్మోహన్ సింగ్	న్యూ ఢిల్లీ
5	26-3-2014	దక్షిణాఫ్రికా	జుకోబ్ జుమ్మా	దర్బన్
6	14-7-2014	బ్రెజిల్	దిల్మా రౌస్సెఫ్	ఫోర్టలిజా
7	2015లో	రష్యా	వ్లాదిమిర్ పుతిన్	

రష్యా ఎనలేని నష్టాలకు గురైతే, అమెరికా ఒంటిమీద ఏమాత్రం గీతలు, వాతలు పడకుండా తప్పించుకుంది. యుద్ధంలో అతి ఎక్కువగా లబ్ధిపొందింది. అప్పటికే అమెరికా ఖండంలోని జనజాతులను ఊచకోత కోసి, వారి భూములను ఆక్రమించుకున్న యూరప్ తెల్లజాతులు ఆఫ్రికన్ జాతీయులను బానిసలుగా తెచ్చి వారి శ్రమ దోపిడితో బలపడి అమెరికా ప్రపంచ పెట్టుబడికి అధిపతిగా అవతరించింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన అనంతరం తన ఆర్థిక బలంతో యావత్ ప్రపంచంపై పెత్తనం చలాయించడానికి 1944లో పశ్చిమ యూరప్‌ను తన చెప్పుచేతుల్లో పెట్టుకుని బ్రెట్టన్ వుడ్స్ కవలలుగా పిలవబడుతున్న వరల్డ్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థలను స్థాపించింది. అప్పటి నుండి ఇప్పటివరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తమ గుప్పెట పట్టి ఈ రెండు సంస్థలు ఆర్థిక పోలీసు పాత్రను పోషిస్తూ వస్తున్నాయి.

బ్రిక్స్ కూటమిగా ఏర్పడిన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు ఒకప్పుడు సోషలిస్టు బాటలో కొన్ని దశాబ్దాల పాటు నడిచినవి, లేక ఆ బాటలో నడవాలని అనుకున్నవి. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి సోషలిస్ట్ నిర్మాణపు మార్గం ఎన్నుకున్న దేశం సోవియెట్ రష్యా, అదే మార్గంలో పయనించిన రెండవ దేశం చైనా. బ్రిటన్ కబంధ హస్తాల నుండి విముక్తమై సోషలిస్ట్ గణతంత్ర రాజ్యంగా పయనిస్తానని చెప్పుకున్న దేశం ఇండియా. తెల్లజాతి జాత్యహంకారం, వలసవాదం, బానిసత్వం నుండి విముక్తి చెందడానికి వీరోచితంగా పోరాడిన దేశం దక్షిణ ఆఫ్రికా. బ్రెజిల్లో అధికారంలో ఉన్న ఇప్పటి ప్రభుత్వం మిలిటరీ ప్రభుత్వాలను ఓడించి శ్రామికుల తరఫున అధికారం లోకి వచ్చిందే; సోషలిజం దారిలో పయనిస్తామని చెప్పుకున్నదే. అయితే, ఈ దేశాలన్నీ కూడా అక్కడి విశాల ప్రజారాశుల ఆకాంక్షలను తుంగలోతొక్కి, వారిని దగాచేసి సోషలిజానికి హారతి పాడినవే. నయా ఉదారవాద సంస్కరణలను ఆలింగనం చేసుకుని పెట్టుబడిదారీ మార్గంలో అమెరికా, యూరప్ దేశాలతో నడుస్తున్నవే. అయితే మరి ఈ బ్రిక్స్ దేశాలు అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని ఎందుకు ఎదిరించాలనుకుంటున్నాయ్? ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్‌లకు ప్రత్యామ్నాయంగా తమ సొంత స్వతంత్ర ఆర్థిక వ్యవస్థల నిర్మాణానికి అవి ఎందుకు పూనుకోవాల్సి వచ్చింది?

(ఇంకా ఉంది)

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

గాజాలో ఇజ్రాయిల్ నరమేధం

ఆరు దశాబ్దాలకు పైగా పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణను వివరిస్తున్నారు

ఎ. నర్సింహారెడ్డి

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్, అమెరికా సామ్రాజ్యవాద దేశాలు ఐక్యరాజ్య సమితి సహకారంతో పాలస్తీనా భూభాగంలో 1948లో ఇజ్రాయిల్ దేశాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు ఇజ్రాయిల్– పాలస్తీనా సమస్య పరిష్కారం కాకుండా రగులుతూనే ఉంది. అప్పుడప్పుడు పరిష్కార దిశగా ఒకడుగు ముందుకు వేసినా ఆ వెంటనే పదడుగులు వెనక్కి వేయడం ఆనవాయితీగా మారడంతో సమస్య మరింత జటిలమవుతోంది. పశ్చిమాసియాలో స్వీయ ప్రయోజనాలు లక్ష్యంగా వ్యవహరిస్తున్న అమెరికా, పాశ్చాత్య దేశాలు, అవి ఇస్తున్న మద్దతుతో ఇజ్రాయిల్ దుందుడుకు జియోనిస్టు అరబ్ వ్యతిరేక మత దురహంకార వైఖరితో పాలస్తీనాపై అనాగరిక దాడులు చేస్తోంది.

ఇజ్రాయిల్ మరోసారి పాలస్తీనాలోని గాజాలో జూలై 8 నుండి దురాక్రమణ దాడులు ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ ప్రొటెక్టివ్ ఎడ్జ్' (రక్షణచర్య) అని ముద్దు పేరు పెట్టింది. ఇద్దరు పాలస్తీనా గుర్తు తెలియని వ్యక్తులు వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో పర్యటిస్తున్న ముగ్గురు టీనేజ్ ఇజ్రాయిలీ బాలలను జూన్ 12న అపహరించి, బంధించి ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న తమ వారిని విడిపించుకునేందుకు ఈ దుందుడుకు చర్యకు పాల్పడ్డారని, అది బెడిసి కొట్టడంతో హత్య చేశారని ఇజ్రాయిల్ దేశ అధ్యక్షుడు బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించాడు. ఆ యువకులను అపహరించిందెవరో అటుపై ఎందుకు హత్య చేశారో ఇంత వరకు నిర్ధారణ కాలేదు. కాని ఇజ్రాయిల్ మాత్రం ఈ పని హమస్‌దేనని తేల్చేసింది. ఆ వెంటనే గాజాపై దాడులు ప్రారంభించింది. అదే సమయంలో ఈ హత్యలను అమానుష చర్యగా పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ ఖండించారు. హమస్ కూడ ఖండించింది. నిందితులను పట్టుకోవడంలో సహకరి స్తామన్న పాలస్తీనా అధ్యక్షుడి హామీ ఇజ్రాయిల్ చెవికెక్కలేదు.

యువకుల అపహరణ జరిగిన చోటు ఇజ్రాయిల్ ఆక్రమించిన పాలస్తీనా ప్రాంతం. పోలీసు, సైన్యం పహారా ఉన్న ప్రాంతమైనందున కిడ్నాపర్లు ఎక్కువ కాలం ఆ యువకులను దాచలేరన్నది వాస్తవం. తమను కిడ్నాప్ చేశారంటూ పది నిమిషాల్లోనే ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్‌కు సమాచారం అందించినట్లు నమోదయింది. అయినా పోలీసులు పట్టించుకోలేదు. ఐదు గంటల తరువాత తన కుమారుడు కనిపించడం లేదని ఒక విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత రెండు ఇజ్రాయిలీ భద్రతా దళాల మధ్య 54 ఫోన్ సంభాషణలు నమోదయ్యాయి. తొలి ఫిర్యాదు అందిన తొమ్మిది గంటల వరకు పోలీసులు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఆ విద్యార్థులు మరణించినట్లు జూన్ 15 నాటికే ప్రభుత్వానికి తెలుసని తరువాత వెల్లడైంది. అయినప్పటికీ వెతికే పేరుతో పదిహేను రోజుల పాటు పాలస్తీనియన్లపై గాజాలో దాడులు జరిపేందుకు ఆ విషయాన్ని వెల్లడించలేదన్నది స్పష్టం. ఇజ్రాయిలీ భద్రతా దళాలే పథకం ప్రకారం వారిని హత్య చేశాయా అంటే అవుననే సిఎన్ఎన్ వీడియో కెమెరా రికార్డు రుజువు చేస్తున్నది. ఇదంతా పోలీసులు ఉద్దేశపూర్వకంగానే చేశారని పలువురి ఆరోపణ. వారు హత్యకు గురైనట్లు మూడు రోజుల్లోనే తేలిపోయినా వెతుకులాట పేరిట పాలస్తీనా పశ్చిమ గట్టు (వెస్టుబ్యాంక్) ప్రాంతంలోకి ప్రవేశించి ఇజ్రాయిల్ సైన్యం, పోలీసులు అమానుషంగా దాడులు జరిపారు, అనేక మందిని అక్రమంగా నిర్బంధించారు, అనేక ఇళ్లను కూలగొట్టారు. ప్రజాప్రతినిధులు, శాసన సభ్యులతో సహా ఆరువందల మందిని చితక్కొట్టారు. ఎంతోమందిని జైళ్లలో నిర్బంధించారు. గాజాలోని పాలస్తీనా అరబ్బుల బతుకులను ఛిద్రం చేశారు. ఇజ్రాయిల్ భద్రత దళాలే వారినీ, కిడ్నాపర్లనూ చంపి యుద్ధానికి తెరదీశాయని పాలస్తీనియన్లు దృఢంగా విశ్వసిస్తున్నారు.

అంతర్జాతీయ చట్టాల ప్రకారం పాలస్తీనియన్లకు ప్రతిఘటించే హక్కు ఉంది. ఎందుకంటే 1948 నుంచి పాలస్తీనా ప్రాంతాన్ని ఇజ్రాయెల్ ఏదో ఒక పేరుతో ఆక్రమించుకుంటూనే ఉంది. చివరికి పాలస్తీనియన్ ప్రాంతాలను కాన్‌సంట్రేషన్ క్యాంపుల స్థాయికి మార్చింది. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంబంధాలను తెంచివేసింది. పాలస్తీనాపై దాడి చేయడానికి ఇజ్రాయిల్ ప్రతిసారి ఏదో ఒక సాకు వెతుకుతుంది. ఇజ్రాయిల్ యువకులు అదృశ్యం కావడానికి కొద్ది ముందుగా ఇద్దరు పాలస్తీనా యువకులను హత్య చేయడానికి ఇజ్రాయిల్ సైనికుడు ట్రిగ్గర్ నొక్కుతున్న దృశ్యాన్ని సిఎన్ఎన్ రికార్డు చేసింది. అయినప్పటికీ దీని పైన అంతర్జాతీయ మీడియా, పాశ్చాత్య దేశాలు స్పందించలేదు. ఇజ్రాయిల్ తగిన వ్యవధి తీసుకుని విచారణ జరిపి హంతకులు ఎవరో తెలుసుకోవచ్చు. హత్యకు కారణమైన వారు హమస్‌కు చెందిన వారైతే వారిని తమకు అప్పగించమని కోరవచ్చు. పాలస్తీనా అందుకు నిరాకరిస్తే అంతర్జాతీయ వేదికలపై దాన్ని లేవనెత్తి న్యాయం కోరవచ్చు. ఇలాంటి వివాదాలు తలెత్తినప్పుడు ఏ దేశమైనా అనుసరిస్తున్న విధానం ఇదే. అలాకాకుండా తనకు అలవాటైన ప్రతీకార చర్యలకు పాల్పడింది. విమానాల నుండి, నావికాదళ గన్ బోట్ల నుండి జనావాసాలపై, మసీదులపై, పాఠశాలలపై, హస్పిటల్స్‌పై, శరణార్థ శిబిరాలపై బాంబులు వేస్తున్నది. కాల్బలంతో యుద్ధానికి సిద్ధమైంది.

పాలస్తీనా ప్రాంతాలైన పశ్చిమ గట్టు–గాజా ప్రాంతాలు 2006 నుంచి ఇజ్రాయిల్ దిగ్బంధనంలో ఉన్నాయి. ఇజ్రాయిల్ భద్రతా దళాలు గాజాలో ఎప్పుడూ ఉంటాయి. యూదు సైనికుల కళ్లు కప్పి చీమ కూడా అటూ ఇటూ కదలడానికి వీలుండదు. ఆ ప్రాంతంలో కూడా సోదాల పేరుతో దాడులు జరపడాన్ని బట్టి ముందస్తు పథకం ప్రకారమే ఇదంతా జరిగిందన్నది స్పష్టం. ఈ దాడులను ఆపించమని గాజా ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిని కోరింది. ఆ పనిచేయకపోగా కిడ్నాప్‌లను ఖండిస్తున్నామని, ఇరుపక్షాలు శాంతిని పాటించాలని ఆ సంస్థ పేర్కొనడం గర్హనీయం. 2000 నుంచి ఇప్పటి వరకు 1500 మంది పాలస్తీనియన్ పిల్లలను ఇజ్రాయిల్ సైనికులు చంపివేస్తే 132 మంది ఇజ్రాయిల్ పిల్లలు పాలస్తీనియన్ల చేతుల్లో మరణించారన్నది ఒక సమాచారం. గాజా మారణకాండలో 2009 నుంచి ఇజ్రాయిల్ ఏడు వేల మంది పాలస్తీనియన్ పౌరులను చంపితే, ఆ కాలంలో కేవలం

13 మంది ఇజ్రాయిలీ సైనికులు మరణించారని, ఎక్కువ మంది అది కూడా వారిలో వారు ఎవరు ఎవరో తెలియక జరిపిన కాల్పుల ఫలితమే అని మానవహక్కుల సంస్థలు ప్రకటించాయి.

గాజా ప్రాంతం విస్తీర్ణం కేవలం 365 చదరపు కిలోమీటర్లు. జనాభా 17 లక్షలు మించరు. ఆ చిన్న ప్రాంతం తాజా పరిణామాల నేపథ్యంలో రుధిరధారలతో తడిసిముద్దయింది. ఎందరు ఎంతగా తెగనాడుతున్నా నిరాయుధులు, నిస్సహాయులూ అయిన సామాన్య పౌరులపై ఎడతెగకుండా బాంబుల వర్షం కురిపిస్తూ ఇప్పటికి వేలాది మందిని పొట్టనబెట్టుకున్నది. ఇందులో సగం మందికిపైగా పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు. వేలాది మంది గాయాలతో ఆస్పత్రులపాలయ్యారు. ఎన్నో భవనాలు నేలమట్టమయ్యాయి. ఆస్పత్రులు, పాఠశాలలు, జనావాసాలపై నిరంతరం బాంబులు వేస్తూనే ఉన్నారు. రోజుకు పదుల సంఖ్యలో అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. వేలాదిమంది వలసపోతున్నారు. జనావాసాలపై దాడులేమిటని నిలదీస్తే హమస్ మిలిటెంట్లు ఆ ప్రాంతంలోనే స్థావరాలు ఏర్పర్చుకున్నారని, ఆయుధాలు పోగేశారని ఇజ్రాయిల్ జవాబిస్తున్నది. పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ రెండు మాసాలుగా వైమానిక, నావికాదళాలు, కాల్బలం ద్వారా గావిస్తున్న మారణకాండ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. కాని దానికి కొమ్ముగాసే అమెరికా, పశ్చిమ రాజ్యాలు వినోదంగా చూస్తున్నాయి. కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేయడం మినహా యూదు జాత్యహంకార ఇజ్రాయిల్‌ను నిలువరించేందుకు చేసిన ప్రయత్నం లేదు. 'సంయమనం' పాటించమని ఇజ్రాయిల్‌ను కోరడం మినహా ఇతరేతర ప్రయత్నాలేమీ చేయడంలేదు.

ఐక్యరాజ్య సమితి ఈ సంవత్సరాన్ని పాలస్తీనా ప్రజల పట్ల అంతర్జాతీయ సౌహార్దతా సంవత్సరంగా ప్రకటించింది. ఏదీ సౌహార్దత? ఇజ్రాయిల్ ముష్కరదాడులు గాజా ప్రాంతాన్ని రక్తసిక్తం చేస్తుంటే ప్రపంచ దేశాలు చేష్టలుడిగి ప్రేక్షకపాత్ర వహించడం ఎంతమాత్రం సమంజసం కాదు. భారత ప్రభుత్వానికి అలీనోద్యమంలో భాగంగా పాలస్తీనా ప్రజా పోరాటాన్ని సమర్థించిన ఘనచరిత్ర ఉండేది. కానీ 1980ల మధ్య నుంచి అమెరికా కనుసన్నలలో నడవడం ప్రారంభించిన భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజా ఆకాంక్షలకు ద్రోహం చేస్తోంది. ఒకప్పుడు పాలస్తీనా ప్రజా పోరాటాన్ని నిర్ద్వంద్వంగా సమర్థించిన భారత ప్రభుత్వం మౌనం వహించడం అనైతికం. 1990 వరకు స్వంత భూభాగాన్ని కోల్పోయి బాధలు పడుతున్న పాలస్తీనియన్లకు భారత్ వెన్నుదన్నుగా నిలిచింది. ఐక్యరాజ్య సమితిలోనే కాదు, అవకాశం దొరికిన అన్నిచోట్ల ఇజ్రాయిల్ దాష్టీకాన్ని భారత్ ఖండించింది. అమెరికాతో అంటకాగడం మొదలయ్యాక మన పాలకుల నోళ్లు మూతపడ్డాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు ఆకళింపు చేసుకొని, అమెరికన్ కార్పొరేట్ సంస్థలతో పాటు ఆ దేశ విధానాలను వంట పట్టించుకున్నాక వివేచనతో నిమిత్తం లేకుండా అమెరికా మిత్రులు మన మిత్రులు, అమెరికా శత్రువులు మన శత్రువులై పోయారు. ఇజ్రాయిల్‌తో దోస్తీ ఇప్పుడు మన మిలిటరీ, పోలీసు అధికారులకు శిక్షణ ఇప్పించే వరకు చేరింది. ఆ దేశం నుండి ఆయుధాలు కొనేంత వరకు పెరిగింది.

పాలస్తీనాలో 2006లో స్వేచ్ఛాపూరితంగా, న్యాయబద్ధంగా జరిగిన ఎన్నికల్లో పాలస్తీనా ప్రజలు హమస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ పరిశీలకునిగా ఉన్నారు. అయినా, అమెరికా, ఇజ్రాయిల్ ప్రభుత్వాలు హమస్‌ను గుర్తించలేదు. గాజా ప్రాంతంపై కొద్ది సంవత్సరాలుగా ఆధిపత్యం వహిస్తున్న హమస్ ఇటీవలనే పాలస్తీనా అథారిటీకి నేతృత్వం వహిస్తున్న ఫతాగ్రూపుతో సఖ్యత ఏర్పరుచుకుంది. సంయుక్త సామరస్య ప్రభుత్వం 2014 జూన్ 2న ఏర్పడింది. పాలస్తీనా గ్రూపులు ఏకంకావడం ఇజ్రాయిల్‌కి ఎంతమాత్రం ఇష్టంలేదు. పాలస్తీనా ఉద్యమ ప్రధాన గ్రూపులు రెండింటిలో హమస్ మిలిటెంట్ సంస్థ. దానికి టెర్రరిస్టు ముద్ర వేసింది ఇజ్రాయిల్. గాజాలో అనేక ప్రాంతాలను ఆక్రమించుకుని, అంతర్జాతీయ అభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా అక్కడ ఇజ్రాయిలీలకు ఆవాసాలు నిర్మిస్తున్న ఇజ్రాయిల్ దుశ్చర్య ఆ పాలకుల దృష్టిలో టెర్రరిజం కాదు. దాన్ని ఎదిరించడమే టెర్రరిజం కింద లెక్క. ఇప్పటివరకు జరిగిన మానవ విషాదంతో రక్తదాహం తీరని ఇజ్రాయిల్ పాలకుల్లో కొందరు గాజా ప్రాంతానికి విద్యుచ్ఛక్తి, నీరు, పౌర సరఫరాలు బంద్ చేయాలంటున్నారు. అదే జరిగితే అక్కడి ప్రజలను ఆకలిదప్పులకు గురిచేస్తుంది. అంతటి ఘోరవిపత్తు జరక్కముందే ప్రపంచ రాజ్యాలు జోక్యం చేసుకోవాలి.

ఇజ్రాయిల్ ఈ దురాక్రమణ దాడుల ద్వారా అన్నిరకాల అంతర్జాతీయ ఒప్పందాలనూ, చట్టాలనూ ఉల్లంఘించింది. చివరికి రెండు పక్షాలు 2012 లో అంగీకరించిన కాల్పుల విరమణను కూడా అది ఉల్లంఘించింది. కానీ సామ్రాజ్యవాద మీడియాలో ఈ విషయాలేవీ రావు, వచ్చినా ఎక్కడో చిన్న వార్తగా రిపోర్టవుతాయి అంతే. రెండు పక్షాలకు మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాల్లో అత్యధిక ఒప్పందాలను ఇజ్రాయిల్ ఉల్లంఘించింది. ప్రపంచంలో ఏ ఇతర దేశం కన్నా కూడా ఎక్కువగా ఇజ్రాయిల్ ఐక్యరాజ్య సమితి ఒప్పందాలను ఉల్లంఘించింది.

చరిత్రలోకి వెళ్లిచూస్తే జెరూసలెం, ఆ చుట్టుపక్కల ప్రాంతాన్ని క్రైస్తవులు, ముస్లింలు, యూదులు పవిత్రమైనదిగా భావిస్తారు. వారి మతాలు ఇక్కడే పుట్టాయని మూడు మతాలవారూ నమ్ముతారు. 1897 థియొడర్ హెర్జెల్ అనే యూదు సిద్ధాంతకర్త జియోనిజం అనే సిద్ధాంతాన్ని ప్రవచించాడు. బైబిల్‌లోని బుక్ ఆఫ్ జెనెసిస్‌లో ఈ ప్రాంతాన్ని అబ్రహం వారసులకు ఇస్తున్నట్టుగా భగవంతుడు చెప్పాడని, దానిపేరు ఇజ్రాయిల్ అని, తాము అబ్రహం వారసులమని, అందువల్ల ఇది తమకు చెందాలని వాదించడమే జియోనిజం. టెల్ అవీవ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ. సి. జెజెవ్ హెరోగ్ గత ఒకటిన్నర శతాబ్ద కాలంలో వెల్లడైన పురాతత్వ పరిశోధనాంశాలను సమీక్షిస్తూ ఇలా రాశారు: 'ఇజ్రాయిల్‌లో పురాతత్వ శాస్త్రవేత్తలు జరిపిన తవ్వకాలను బట్టి ఇజ్రాయిలీలు ఏనాడూ ఈజిప్టులో నివసించలేదు. ఆ ఎడారుల్లో ఏనాడూ సంచరించలేదు. యుద్ధాల్లో అక్కడి భూభాగాలను జయించలేదు.'

ఇక్కడ మొట్టమొదటి యూదు నివాసం 19వ శతాబ్దం రెండవ భాగంలో నిర్మించబడింది. అప్పుడు ఇక్కడి జనాభాలో యూదులు 3 శాతం కన్నా తక్కువే. జనాభాలో 97 శాతం మంది పాలస్తీనా అరబ్బులుండేవారు. ఈ ప్రాంతంలో అత్యధిక భాగం నాడు ఒట్టమన్ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. బ్రిటన్ నాడు ఒట్టమన్ సామ్రాజ్యంతో ఘర్షణ పడుతుండేది. మొదటి ప్రపంచ యుద్ధంలో రెండు సామ్రాజ్యాలూ తలపడ్డాయి. ఒట్టమన్లు ఓడిపోయారు. 1930వ దశకంలో జర్మనీలో నాజీలు బలం పుంజుకుని,యూదులపై మారణహోమం సాగించడంతో ఐరోపా వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున యూదుల వలసలు ప్రారంభమైనాయి. వారిలో కొందరు పాలస్తీనా చేరుకుని అక్కడ స్థిరపడడం ప్రారంభించారు. తమ ప్రాంతాలకు వలస వచ్చే యూదుల సంఖ్యను పరిమితం చేయాలని స్థానిక అరబ్బులు ప్రయత్నించారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అనేక అరబ్బు ప్రాంతాలను ఆక్రమించుకున్న బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఆ ప్రాంతాలను విడిచి వెళ్లాల్సి వచ్చింది. కానీ చమురు వనరులతో తులతూగుతున్న ఈ ప్రాంతాలను వదిలిపెట్టడానికీ, అక్కడి దేశాలను స్వతంత్రంగా, సార్వభౌమాధికారంతో ఉంచడానికి ఇష్టపడని సామ్రాజ్యవాదులు కొత్తగా ఏర్పడిన ఐక్యరాజ్య సమితిని ఉపయోగించుకుని అన్యాయంగా పాలస్తీనా భూభాగాన్ని రెండు దేశాలుగా ఇజ్రాయిల్, పాలస్తీనాగా 1948లో విడగొట్టారు.

1947 నవంబర్ 29న పాలస్తీనాను అరబ్బు దేశం. యూదు దేశం, జెరూసలెం నగరం అనే మూడు భాగాలుగా విడగొడు తున్నట్లు ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ఆమోదించింది. పాలస్తీనా భూభాగం విభజనలో ఐరాస యూదుల పట్ల పక్షపాత ధోరణి చూపించింది. ఈ ప్రతిపాదనను పాలస్తీనియన్లు నిరసించారు. జనాభాలో 3వ వంతు ఉన్న యూదులకు 55 శాతం భూభాగాన్ని కేటాయించారు. కాబట్టి డేవిడ్ బెన్ – గురియెన్ నాయకత్వంలోని యూదులు దాని పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ దేశం ఏర్పడినట్లు 1948 మే 15న గురియెన్ ప్రకటించాడు.

అర్థాంతరంగా మాయమైన పాలస్తీనాకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. దీని విస్తీర్ణం 10000 చదరపు మైళ్లు. ఇక్కడ అరబ్ ప్రజలు ఎక్కువ శాతం ముస్లింలు. కొంతమంది క్రైస్తవులూ, యూదులూ కూడా ఉండేవారు. ఇజ్రాయిల్‌ను దేశంగా ప్రకటించడంతోనే పాలస్తీనియన్లను వారి సొంత భూభాగాల నుండి తరిమేయడం ప్రారంభమైంది. పాలస్తీనియన్లను ఈ ప్రాంతం నుండి పూర్తిగా తరిమివేసి వారి భూమినీ, జల, ఇతర వనరులనూ స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా నాటి నుండి నేటి వరకు ఇజ్రాయిల్ కిరాతకంగా దాడులు చేస్తూనే ఉంది.

ఇజ్రాయిల్ ఒక దేశంగా ఏర్పడిన వెంటనే పాలస్తీనా వాసులకు సానుభూతిగా ఉండే ఈజిప్ట, సిరియా, లెబనాన్, జోర్డాన్ వంటి దేశాలపై అది పలుమార్లు దురాక్రమణలకు పాల్పడింది. అప్పటి నుండి ఇజ్రాయిల్ విస్తరణ ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది. ఇజ్రాయిల్ జననంతో వేడి పుట్టిన అరబ్ కూటమి 1949లో యుద్ధానికి దిగింది. ఈ సమయంలో పశ్చిమాసియా వ్యవహారాల్లో బ్రిటన్ వైదొలిగాక అమెరికా తలదూర్చింది. ఇజ్రాయిల్‌కు అండగా నిలబడింది. సంవత్సరం పాటు సంఘర్షణ కొనసాగింది. 1949లో ఇతర అరబ్ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకొని ఇజ్రాయిల్ 77శాతం పాలస్తీనాను సొంతం చేసుకొంది. మిగిలిన పాలస్తీనా భూభాగాన్ని చిన్నముక్కలు చేసి అరబ్ దేశాలు తలోకాస్త పంచుకున్నాయి. జోర్డాన్ తూర్పు జెరూసలేంను, మధ్య పాలస్తీనాలోని కొండ ప్రాంతాలను ఆక్రమించింది (ఈ రోజు 'వెస్ట్ బాంక్'గా పిలవబడే ప్రదేశం ఇదే). ఈజిప్ట గాజా చుట్టూ ఉన్న ప్రాంతాన్ని తాత్కాలికంగా తన నియంత్రణలో ఉంచుకుంది. ఈ యుద్ధంలో పాలస్తీనియన్లు ఏడు లక్షల మంది ఇల్లు వాకిలి కోల్పోయి నిరాశ్రయుల య్యారు. వీరిలో చాలా మందిని యుద్ధ విరమణ తరువాత కూడా ఇజ్రాయిల్ తిరిగి రానివ్వకుండా అడ్డుపడింది. యూదులు మాత్రం పెద్ద సంఖ్యలో ఇజ్రాయెల్ వచ్చి చేరేందుకు ఆ దేశం అన్ని విధాలా కృషి చేసింది. అమెరికా చేస్తున్న ఆర్థిక, మిలటరీ సహకారంతో ఇజ్రాయెల్ ఒక చిన్నపాటి సూపర్ పవర్‌గా తయారయ్యింది.

ఇజ్రాయిల్ ద్వారా పశ్చిమాసియాలోని అన్ని వ్యవహారాల్లో అమెరికా చొరబడేందుకు అవకాశం పెరిగింది. దాదాపు 20 సంవత్సరాలు గడిచాక 1967లో ఇజ్రాయిల్ అరబ్ దేశాలపై యుద్ధం ప్రకటించింది. ఈజిప్ట, జోర్డాన్‌ల నుండి పాలస్తీనా భూభాగాలను లాక్కుంది. అంతటితో ఆగక ఈజిప్టులోని సినాయ్ పెనిన్సులా, సిరియాలోని గోలాన్ హైట్స్ ప్రాంతాలను ఆక్రమించింది. ఇజ్రాయిల్ లాక్కున్న పాలస్తీనా భూభాగమే నేడు మనం పిలిచే వెస్ట్‌బాంక్, గాజా స్ట్రిప్. ఇవి 1967 తరువాత ఆక్రమిత ప్రాంతాలుగా వ్యవహ రింపబడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఇజ్రాయిల్ యూదుల కాలనీలను స్థాపించింది. కొన్ని వందల ఏళ్ల చరిత్ర గల పాలస్తీనా ప్రజలు తమ దేశంలోనే కాందిశీకులై చిన్నచిన్న సెటిల్‌మెంట్లలో ఉండసాగారు. చాలా మంది చుట్టు పక్కల అరబ్‌దేశా లకు పారిపోయారు. ఒక అంచనా ప్రకారం ప్రపంచం మొత్తంలో పాలస్తీనియన్ల సంఖ్య 50 లక్షలు. ఇందులో 22 లక్షలు పాలస్తీనాలోని ఆక్రమిత ప్రాంతాల్లోనే ఉన్నారు. 13 లక్షలు జోర్డాన్‌లో తలదాచు కున్నారు. తక్కిన వారు లెబనాన్, సిరియా, కువైట్ దేశాలలో ఉన్నారు.

ఈ రోజు పిఎల్ఓ ఫతాగా పిలువబడే పాలస్తీనా విమోచన సంస్థ 1964లో పుట్టింది. అరబ్‌దేశాల కూటమి పిఎల్ఓను, దాని కార్యక్రమాన్ని ప్రోత్సహించింది. ఇది పూర్తిగా పాలస్తీనా ప్రజల ఉద్యమంగా రూపుదిద్దుకోసాగింది. 1964 నుండి మరణించే వరకు యాసర్ అరాఫత్ పిఎల్ఓ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. ఐరాస భద్రతమండలి 242వ తీర్మానం ప్రకారం ఆక్రమించిన భూమిని తిరిగి ఇచ్చేయమని ఇజ్రాయిల్‌ను కోరింది. ఈ మెత్తనైన మందలింపులు ఇజ్రాయిల్ పట్టించుకోలేదు. 1967 ఇజ్రాయిల్ దురాక్రమణకు ముందటి పాలస్తీనా, అరబ్బు భూభాగాలన్నిటినీ తిరిగి అప్పగించడానికి ఇజ్రాయిల్ హామీ ఇచ్చింది. ఇజ్రాయిల్ ఆ ఒప్పందాన్ని గౌరవించక తూర్పు జెరూసలెం, వెస్ట్ బ్యాంక్, గాజాలలోకి యూదులను దించి అక్రమ సెటిల్మెంట్లను చేపడుతూనే ఉంది. ఐరాస సరిహద్దులను దాటి ఇజ్రాయిల్ సాగించిన దురాక్రమణాలతో నేటి పాలస్తీనా 10 శాతం కంటే తక్కువగా మిగిలింది. అది కూడా వెస్ట్ బ్యాంక్, గాజా అనే రెండు విడి విడి ముక్కలుగా ఉంది. ఇజ్రాయిల్ పాలస్తీనాలు రెండు స్వతంత్ర దేశాలుగా అస్తిత్వంలో ఉండడాన్ని ఇజ్రాయిల్ ఆచరణలో తిరస్కరిస్తోంది. చివరకు 1970లో ఈజిప్ట అధినేత అన్వర్ సాదత్ ఈ విషయంలో అమెరికా మధ్యవర్తిత్వం కోరాడు. అమెరికా కిమ్మనలేదు. సిరియాతో కలసి 1973లో సాదత్ ఇజ్రాయిల్‌పై యుద్ధం ప్రకటించాడు. అమెరికా ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా పెంచింది. అరబ్ ఐక్యత బలహీన పడిందని గ్రహించిన ఇజ్రాయిల్ 1978లో ఈజిప్టతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా ఈజిప్ట – ఇజ్రాయిల్‌కు మైత్రి కుదిరినా పశ్చిమాసియాలో శాంతి కోసం పాలస్తీనా సమస్య పరిష్కారం విషయమై ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నాయి. దీని ప్రకారం వెస్ట్‌బ్యాంక్, గాజాస్ట్రిప్‌లోని పాలస్తీనియన్లు ఐదేళ్లపాటు ఒక స్వయం నిర్ణాయక ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవచ్చు. కనీసం తమను మాట మాత్రమైనా సంప్రదించకుండా తీసుకున్న ఈ నిర్ణయం పాలస్తీనా ప్రజలకు ఆమోదయోగ్యం కాలేదు. పరిస్థితి మళ్లీ పూర్వం మాదిరే కొనసాగింది.

ఈ దశలోనే ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ ఎటువంటి వ్యూహాత్మక విధానం అనుసరించాలో నిర్దేశిస్తూ యినోన్ ప్రణాళిక 1980వ దశకంలో రూపొందించబడింది. ఇజ్రాయిల్ ఒక ప్రాంతీయ సూపర్ పవర్‌గా మారాలనీ, తనకన్నా బలంగా ఉన్న ఇరాక్ వంటి దేశాలను బలహీనపరచాలనీ దానికి దిశానిర్దేశం చేయబడింది. ఈ కాలంలోనే ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్లను ప్రోత్సహిస్తూ మిగిలిన అరబ్బు ప్రాంతాలను కూడా ఒక క్రమపద్ధతిలో ఆక్రమించు కోవడం ప్రారంభించింది. ఇజ్రాయిలీ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా విమోచనా సంస్థ (పిఎల్ఓ) తొలి ప్రజాయుద్ధం – ఇంతెఫతా – ప్రారంభించింది. అయితే సోవియట్ యూనియన్ పతనంతో పిఎల్ఓ సాయిధ పోరాటాన్ని విడనాడి 1990 ప్రారంభంలో ఇజ్రాయిల్‌తో శాంతి చర్చలకు పూనుకున్నది. ఫలితంగా 1993లో ఓస్లో శాంతి ఒప్పందం కుదిరింది.

1993లో 'బిగ్ ఫోర్' (అమెరికా, బ్రిటన్ ఫ్రాన్స్, రష్యా) మధ్య వర్తులుగా ఇజ్రాయిల్ – పాలస్తీనాల మధ్య ఓస్లో శాంతి ఒప్పందం కుదిరింది. ఓస్లో ఒప్పందంలో భాగంగా పిఎల్ఓ సాయుధ పోరాటాన్ని విరమించి, ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని గుర్తించింది. ఇందుకు ప్రతిగా పాలస్తీనీయులకు గాజా నగరంలో, వెస్ట్ బ్యాంక్‌లో, జెరికోలో పరిమిత స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వడానికి ఇజ్రాయిల్ అంగీకరించింది. అంటే ఒక దేశపు పౌరులను అణచివేసి, నిర్వాసితులను చేసి, చివరికి వారి దేశంలో పదోవంతు భూభాగం మీద వారికి పరిమిత స్వతంత్ర ప్రతిపత్తి ఇచ్చారన్నమాట. పాలస్తీనాకు సంపూర్ణ స్వాతంత్ర్యం కోరుతూ పిఎల్ఓ రాజీని వ్యతిరేకించే సాయుధ పోరాట సంస్థలెన్నో పుట్టుకు వచ్చాయి.

అటువంటి సంస్థలలో ఒకటైన హమస్ గాజా నగరంలో 2006లో అధికారానికి కూడా వచ్చింది.

ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాకు 'సభ్యత్వం లేని పరిశీలక దేశం' హోదా లభించింది. 2012 నవంబర్ 29న జరిగిన ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది. తీర్మానానికి ప్రపంచ దేశాల నుంచి మద్దతు లభించింది. 193 సభ్యదేశాలున్న ఐరాస సర్వసభ్య సమావేశంలో భారత్‌తో సహా 138 దేశాలు ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయి. ఇందులో ఫ్రాన్స్, రష్యా, చైనాలు కూడా ఉన్నాయి. మరోవైపు అమెరికా, ఇజ్రాయిల్‌తోపాటు జర్మనీ, కెనడా, చెక్ రిపబ్లిక్ సహా తొమ్మిది దేశాలు తీర్మానాన్ని వ్యతిరేకించాయి. బ్రిటన్ సహా 41 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. ఓస్లో తరువాత చర్చోపచర్చల అనంతరం 1999లో క్యాంప్ డేవిడ్ ఒప్పందం కుదిరింది. రెండు దేశాలూ తమ మధ్య సఖ్యత పెంచుకుని భవిష్యత్తులో మరింత క్లిష్ట సమస్యల పరిష్కారానికి పూనుకోవాలన్నది ఈ ఒప్పంద సారాంశం. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలు అమలుకు దారితీసే విధంగా ఇరు దేశాలు సహకరించాలి. ఎవరి భూభాగాలు కూడా బలప్రయోగంతో ఆక్రమించకూడదనీ, ఆక్రమిత భూభాగాల నుండి ఇజ్రాయిల్ క్రమంగా తన సేనలను ఉపసంహరించుకోవాలనీ తీర్మానించారు.

ఈ శతాబ్దంలో ఇజ్రాయిల్ దురాక్రమణ మరింత ఘోరంగా మారింది. పాలస్తీనా ప్రజలను వారి చారిత్రక ప్రాంతంలో 12 శాతానికి పరిమితం చేస్తూ అక్రమంగా, న్యాయ విరుద్ధంగా ఒక గోడ నిర్మాణం చేపట్టింది. 320 కిలోమీటర్ల ఈ గోడ 1967లో ఇజ్రాయిల్ సరిహద్దుకు రెండింతలు పొడవైంది. ఇది అన్ని రకాల అంతర్జాతీయ న్యాయచట్టాలకు విరుద్ధం. ఓస్లో చర్చల్లో అది ఇచ్చిన హామీలకు కూడా విరుద్ధం. ఈ దురాక్రమణతో ఇజ్రాయిల్ పశ్చిమ తీర భూమిలోనూ, నీటి వనరుల్లోనూ 60 శాతాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకుంది. మిగిలిన 40 శాతం భూభాగాన్ని కూడా ముక్కలు ముక్కలుగా చేసి, అన్ని వైపులా ముట్టడించింది. ఈ రోజున పరిస్థితి ఏమిటంటే ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనియన్లను వారి ఇళ్ల నుండీ, భూముల నుండీ తరిమేయడంతో 70 శాతం పాలస్తీనియన్లు శరణార్థులుగా మారారు.

పాలస్తీనా గాజా ప్రాంతం నేడు కేవలం 146 చదరపు కిలోమీటర్లకు పరిమితమైంది. ఈ చిన్న ప్రాంతంలో 17 లక్షల మంది పాలస్తీనియన్లు నివసించాల్సి వస్తోంది. ఈ భాగానికి మూడువైపులా ఇజ్రాయిల్, మరోవైపు మధ్యధరా సముద్రం ఆక్రమించి ఉన్నాయి. ఈజిప్టుతో ఒక చిన్న సరిహద్దు మాత్రమే ఉంది. ఇజ్రాయిల్ అధికారుల అనుమతి లేకుండా పూచికపుల్ల కూడా ఈ ప్రాంతంలోకి వెళ్లకూడదు, ఇక్కడి నుండి బయటకు వెళ్లకూడదు. ఇజ్రాయిల్ గాజా ప్రాంతాన్ని తన కబంధ హస్తాల్లో నలిపేస్తున్నది.

తూర్పు జెరూసలెం రాజధానిగా, 1967 నాటి సరిహద్దులతో స్వతంత్ర, సార్వభౌమాధికార పాలస్తీనా ఏర్పడాలన్న విజ్ఞప్తులను కూడా ఇజ్రాయిల్ తిరస్కరిస్తోంది. ఇలా పాలస్తీనా దేశం ఏర్పడడం అంటే దాని సొంత భూమిలో 22 శాతం మాత్రమే దానికి దక్కినట్లు. అయినా ఇజ్రాయిల్ వినిపించుకోవడం లేదు సరికదా ఇంకా దురాక్రమణ కొనసాగిస్తూనే ఉంది. ఇప్పటికొచ్చేసరికి చారిత్రక పాలస్తీనాలోని 88 శాతం భూభాగాన్ని తన ప్రత్యక్ష నియంత్రణలోకి తెచ్చుకుంది. 1967 నుండి పాలస్తీనా జల వనరులను పూర్తిగా ఇజ్రాయిల్ అదుపులో పెట్టుకుంది. నీటిలో పాలస్తీనియన్లకు న్యాయమైన వాటా అందకుండా చేస్తోంది. మొత్తం నీటిలో 89 శాతాన్ని ఇజ్రాయిల్ తీసుకుని 11 శాతం కన్నా తక్కువ నీటిని పాలస్తీనియన్లకు వదిలిపెడుతోంది. దాంతో ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో నివసిస్తున్న 60 శాతం మందికి పరిశుద్ధమైన నీరు లభించడం లేదు. మంచినీరు పరిశుద్ధంగా లేకపోవడం వల్ల గాజా ప్రాంతంలోని 60 శాతం మంది పాలస్తీనియన్లు అనేక రోగాల బారిన పడుతున్నారు.

గాజా ప్రాంతంలో ప్రజలకు వచ్చే అంటురోగాలకు రోగనిరోధక మందులు సరఫరా చేయడానికి కూడా ఇజ్రాయిల్ అంగీకరించడం లేదు. ఈ మందులు ఇజ్రాయిల్‌కు జీవ రసాయన ప్రమాదం తెస్తాయని అది వాదిస్తోంది. పాలస్తీనా జాతీయ పాలనా సంస్థ విదేశాలనుండి రేడియేషన్ థెరపీ పరికరాలను తెచ్చుకోడానికి కూడా ఇజ్రాయిల్ అంగీకరించడం లేదు. ఈ పరికరాలను బాంబుల తయారీకి ఉపయోగిస్తారని సాకు చెపుతోంది. 2006లో ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చి. తమ నేల మీద తమ పాలన నడుపుకుంటున్న హమస్ ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి, పాలస్తీనియన్లకు మిగిలిన కొద్దిపాటి నేలను కూడ కబళించడానికి, ఇజ్రాయిల్ చేస్తున్న నిరంతర కుటిల ప్రయత్నాలలో భాగమే తాజా బాంబుదాడులు. పాలస్తీనా అథారిటీకి డిసెంబర్‌లోగా ఎన్నికలు జరుగనున్నాయి. పాలస్తీనాకు వెళ్లే సరుకులన్నింటినీ ఇజ్రాయిల్ నియంత్రిస్తుంది. అక్కడకు వెళ్లే సరుకులన్నీ కూడా ఇజ్రాయిల్ చెక్‌పోస్టుల ద్వారా వెళ్లాల్సిందే. ఇది పాలస్తీనా వాణిజ్యాన్ని పూర్తిగా నష్టపరుస్తోంది. 2000 సెప్టెంబర్ నుండి ఇజ్రాయిల్ దిగ్బంధనం వల్ల పాలస్తీనాలో నిరుద్యోగం, పేదరికం బాగా పెరిగిందనీ ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది. తాజా దాడుల్లో 3000కు పైగా పౌరులు మరణించారు. ఐదు వేలకు పైగా క్షతగాత్రులయ్యారు. వేలాది మంది వలస పోయారు. ఒక రకంగా ఇది ఏకపక్ష యుద్ధమే. ఎందుకంటే అమెరికా, పశ్చిమ దేశాల నుండి అందుతున్న ఆర్థిక, మిలిటరీ సహకారం, మరోవైపు ప్రపంచ దేశాల్లోని యూదుల నుండి అందుతున్న విరాళాలతో ఇజ్రాయిల్ పాలస్తీనియన్లపై యుద్ధం చేస్తుంటే, నిరాశ్రయులై కాందిశీకులుగా వివిధ దేశాల్లో తల దాచుకుంటూనే మాతృభూమి విముక్తి కొరకు పోరాడుతున్న పాలస్తీనియన్ల స్వాతంత్ర్య కాంక్షకు ప్రపంచ ప్రజలు సంఘీభావం తెలుపడం నైతిక బాధ్యత.

ఇప్పటివరకు ఐక్యరాజ్య సమితి చేసిన 69 తీర్మానాలను తుంగలో తొక్కి తన ఇష్టారాజ్యంగా వాటిని ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్ ప్రపంచంలో కెల్లా అతిపెద్ద దురాక్రమణదారు. దానికి వత్తాసు పలుకు తున్న అమెరికా, బ్రిటన్‌ల సామ్రాజ్యవాద విధానాలు మానవత్వానికే మాయని మచ్చ. ఇంతటి భయానక స్థితిలోనూ ఇజ్రాయిల్ చెపుతున్న సాకులు, కట్టు కథలు ప్రపంచ సామ్రాజ్యవాద దేశాలు ఆమోదించడం సిగ్గుచేటు. ఈ విచక్షణారహిత కిరాతక దాడులను భారత ప్రభుత్వం ఖండించక పోవడం మరీ దారుణం. ఇజ్రాయిల్ గత రెండు మాసాలుగా ఎడతెరపి లేకుండా నిర్వహిస్తున్న దాడుల్లో అమాయకులైన ప్రజలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు అహుతి అవుతున్నారు. ప్రపంచంలోని ప్రముఖులు ఖండిస్తున్నారు. పలు దేశాల ప్రజలు ఇజ్రాయిల్ ముప్పేట దాడులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. బేషరతుగా కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేస్తున్నారు. అయినా అగ్రరాజ్యాలకు చీమకుట్టినట్లైనా లేదు. మరోవైపు గాజాపై దాడులను మరింత తీవ్రం చేస్తానని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించడం గర్హనీయం. అందువలన ఇజ్రాయిల్, అమెరికా దేశాలను ప్రపంచ దేశాలు సామూహికంగా నిలదీయాలి. సామ్రాజ్యవాదుల నిజ స్వరూపాన్ని యుద్ధోన్మాదాన్ని దురాక్రమణ విధానాలను ప్రజల్లో బట్టబయలు చేయాలి. గతంలో దక్షిణాఫ్రికా జాత్యాహంకార ప్రభుత్వంపై ఆంక్షలు విధించినట్లు ఇప్పుడు ఇజ్రాయిల్‌పై అటువంటి ఆంక్షలు విధించాలి. పాలస్తీనా ప్రజల న్యాయమైన డిమాండ్ అమలయ్యేలా అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకరావాలి. అందుకు గాను దేశదేశాల్లోని ప్రభుత్వాలపైనా గట్టి ఒత్తిడి తేవడానికి స్వాతంత్ర్య ప్రియులు, ప్రజాస్వామికవాదులు ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన సందర్భం ఇది. వీ

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి)

రైతులపై లాఠీ చార్జీ

మెదక్ జిల్లా చేగుంట మండలం నార్సింగి గ్రామం వద్ద ఆగస్టు 4న 44వ జాతీయ రహదారిపై కరెంట్ కోతలకు వ్యతిరేకంగా ఆరు గ్రామాల రైతులు ధర్నా చేశారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులపై ట్రాఫిక్ జామ్ పేరుతో పోలీసులు లాఠీ చార్జీ చేశారు. ఈ లాఠీ చార్జీలో కొంత మంది రైతులు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే రైతులు లాఠీ చార్జీకి వ్యతిరేకంగా పోలీసులపై తిరగబడ్డారు.

రైతు సదస్సు

రాజమండ్రిలో ఆగస్టు 4న 'పోలవరం సాధన సమితి, ఆధ్వర్యంలో పోలవరం సాధన కోసం ఉభయ గోదావరి జిల్లాల రైతు సంఘాల ప్రతినిధుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే సాగునీటి, తాగు నీటి అవసరాలు తీరుతాయన్నారు, అలాగే ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏడు మండలాలతో పాటు ఖమ్మం జిల్లాలోని దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాలయశాఖ మంత్రి పైడికొండ మాణిక్యాలరావుతో పాటు రైతు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వాన్‌పిక్, లేపాక్షి భూముల స్వాధీనం

ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు నేతృత్వంలో హైదరాబాద్‌లో ఆగస్టు 1న మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గుంటూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో వాన్‌పిక్, లేపాక్షి నాలెడ్జ్ హబ్ సంస్థలకు కేటాయించిన మొత్తం 26 వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని తీర్మానించింది. ఈ మొత్తం భూమి విషయంలో ఎపిఐఐసితో కుదుర్చుకున్న ఒప్పందంలోని ఏ అంశాన్ని ఈ రెండు సంస్థలు నెరవేర్చలేదని తెలిపారు.

అఖిల భారత వ్యవసాయ కార్మికుల మహాసభలు

వరంగల్‌లోని సుందరయ్యనగర్‌లో జూలై 30 నుంచి ఆగస్టు 2 వరకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 8వ జాతీయ మహాసభలు జరిగాయి. ఈ సంఘానికి నూతన అధ్యక్షులుగా ఎస్. తిరునవుక్కరసు, ప్రధాన కార్యదర్శిగా విజయరాఘవన్ ఎన్నికయ్యారు. ఈ సభల్లో భూసంస్కరణలు అమలు చేసి మిగులు భూములు పంచాలని, అటవి హక్కుల చట్టాన్ని అమలు చేసి అటవి భూములు పంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కమిటీ తీర్మానాలు చేసింది.

ఎర్రచందనం కూలీల కాల్చివేత

శేషాచలం అడవుల్లో ఆగస్టు 6న గాదెలబీట్‌లోని నీచుకుంట ప్రాంతంలో పోలీసులు ఇద్దరు ఎర్రచందనం కూలీలను కాల్చి చంపారు. ఈ ఇద్దరు కూలీలు తమిళనాడుకు చెందినవారని చిత్తూరు జిల్లా ఎస్‌పి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు.

ధర్నా

హైదరాబాద్‌లో ఆగస్టు 9న 'పీపుల్ ఎగెనెస్ట్ పోలవరం ప్రాజెక్టు' (పిఎపిపి) ఆధ్వర్యంలో పోలవరం నిర్మాణానికి వ్యతిరేకంగా ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వక్తలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జార్ఖండ్ కళాకారుడు జీతన్ మారాండీ, విరసం సభ్యులు వరవరరావు, ప్రజా గాయకులు గద్దర్, టిఎన్‌జిఒ అధ్యక్షులు దేవిప్రసాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఆదివాసులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి.

రాజధాని కోసం ర్యాలీ

శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలోనే రాష్ట్ర రాజధానిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 'రాయలసీమ రాజధాని సాధన సమితి' ఆధ్వర్యంలో ఆగస్టు 16న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో సమితి నాయకులు రిటైర్డ్ ఐజి హనుమంతరెడ్డి, శ్యామలరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, నాగభూషణ, ఎం.ఎన్.రెడ్డిలతో పాటు అనేక మంది ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే

తెలంగాణలోని 10 జిల్లాల్లో నివసిస్తున్న అన్ని కుటుంబాల వివరాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 19న సమగ్ర సర్వేను నిర్వహించింది. ఆగస్టు 20 నాటికి 1,05,76,922 కుటుంబాలను సర్వే చేశారు. 2,30,655 కుటుంబాలు సర్వే చేయకుండా మిగిలిపోయాయి. ఈ సర్వే కోసం 20 కోట్లు కేటాయించారు. ఈ సర్వేలో నాలుగు లక్షల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎం.టి. ఖాన్ మృతి

ప్రముఖ పౌరహక్కుల నాయకులు, సీనియర్ పాత్రికేయులు మహ్మద్ తాజుద్దీన్ ఖాన్ (ఎం.టి. ఖాన్) (79) ఆగస్టు 20న హైదరాబాద్, పురానపూల్ దర్వాజాలో ఉన్న ఆయన స్వగృహంలో చనిపోయారు. ఆయన విరసం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. ఆయన పిలుపు పత్రికకు సంపాదకులుగా, సియాసత్, ఈనాడు పత్రికల్లో పాత్రికేయులుగా పని చేశారు. అలాగే కోట్ల అలిజాలోని ధర్మవంత్ విద్యాసంస్థలో ఉపాధ్యాయులుగా కూడా పని చేశారు.

ఆంధ్ర పోలీసులకు అమెరికా ఆయుధాలు

మావోయిస్టులను ఎదుర్కోవడానికి ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ పోలీసులకు అమెరికా ఆయుధ తయారీ కంపెనీ (కోల్ట్) నుంచి కోల్ట్ 7.62, కోల్ట్ 5.56 రకం ఆయుధాలు కేటాయిస్తున్నారు. మొదటి విడుతలో వెయ్యి ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నారు. ఈ వెయ్యి ఆయుధాల కోసం 15 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 19 నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ఆగస్టు 20న ప్రవేశపెట్టారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్ రు. 1,11,824 కోట్లు. అందులో ప్రణాళికేతర వ్యయం రు. 85151 కోట్లు, ప్రణాళికా వ్యయం రు. 26673 కోట్లు, మొత్తం రెవెన్యూ వ్యయం రు. 98142 కోట్లు, రెవెన్యూ లోటు రు.6063 కోట్లు. అలాగే రాష్ట్ర స్థూల ఉత్పత్తి రు. 5,23,445 కోట్లు. వీ

చుండూరు నిందితులకు నోటీసులు

చుండూరు మారణకాండ కేసులో నిందితులందరికీ సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ కేసులో జైలు శిక్షపడిన వారిని హైకోర్టు విడుదల చేసిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం, బాధితులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ సి. నాగప్పన్‌లతో కూడిన ధర్మాసనం జూలై 30న కేసును విచారించింది. ఈ విచారణలో బాధితుల పిటిషన్‌లు విచారించకుండా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్న వాదనలు విన్న జస్టిస్ లోకూర్, ఈ కేసులోని నిందితులందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నోటీసులపై మూడు వారాల్లోగా స్పందించాలని ఆదేశించారు.

భోపాల్ గ్యాస్ బాధితుల పోరాటం

1984లో జరిగిన భోపాల్ గ్యాస్ దుర్ఘటనపై జూలై 31న అమెరికా కోర్టు తీర్పునిచ్చింది. దుర్ఘటన జరిగిన కార్బైడ్ కంపెనీ స్థలంలో ఇంకా విడుదలవుతున్న విష రసాయనాలకు ఆ కంపెనీ బాధ్యత వహించాల్సిన అవసరంలేదని ఆ కేసును విచారిస్తున్న సదరన్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి జస్టిస్ కీనన్ తీర్పు ఇచ్చారు. కార్బైడ్ కంపెనీ నుండి ఇప్పటికీ వెలువడుతున్న విష రసాయనాల వల్ల అక్కడి నీరు, భూమి విషతుల్యంగా మారాయని బాధితులు అమెరికా కోర్టులో వేసిన వ్యాజ్యంలో భాగమే ఈ తీర్పు.

హిందుత్వ పాలనలో...

నేనే నియంతనైతే, ఒకటో తరగతి నుంచే మహాభారతం, భగవద్గీతలను ప్రవేశపెట్టేవాడిని అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దవే ఆగస్టు 2న అహ్మదాబాద్‌లో జరిగిన ఓ సదస్సులో అన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, ప్రపంచదేశాలన్నీ భారతీయులను హిందువులుగానే భావిస్తున్నాయని అన్నారు. శివసేన సామ్నా పత్రికలో మహిళలు అత్యాచార ఆరోపణలు చేయడం ఓ ఫ్యాషన్ అయిపోయిందని సంపాదకీయంలో పేర్కొంది.

మాళిన్ ప్రమాదం

మహారాష్ట్రలోని పునె జిల్లా మాళిన్ గ్రామంపై కొండచరియలు విరిగిపడడంతో ఆగస్టు 4 వరకు 130 మృతదేహాలు వెలికితీసినట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. మరికొంత మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని అంటున్నారు. మాళిన్ గ్రామంలో మిగిలిన ఇళ్లను ఖాళీ చేయాలని ఎన్‌డిఆర్ఎఫ్, జిల్లా అధికారులను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచించింది.

భారతదేశంలో కోటీశ్వరులు

2014 జూన్ నాటికి ప్రపంచంలోకి 700 కోట్ల జనాభాలో కోటి ముప్పయి లక్షల మంది కోటీశ్వరులు ఉన్నారని నూవరల్డ్ వెల్త్ సంస్థ సర్వేలో తేలినట్లు ఆగస్టు 6న వెల్లడించింది. కోటి ముప్పయి లక్షల మందిలో 2,26,800 మంది కోటీశ్వరులు భారతదేశంలోనే ఉన్నారని నివేదిక తెలియజేస్తోంది. గత పదేళ్ల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా కోటీశ్వరుల సంఖ్య 58 శాతం, మల్టీ మిలియనీర్ల సంఖ్య 71 శాతం పెరిగింది.

హైదరాబాద్‌పై గవర్నరే సర్వాధికారి

ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లోని జిఎచ్ఎంసి పరిధిలోని ప్రత్యేక అధికారాలను కేంద్ర హోంశాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్‌కు అప్పగించింది. జిఎచ్ఎంసి పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు సంబంధించిన శాంతి భద్రతలు, ఆస్తుల రక్షణ, ప్రజల భద్రత, కీలక సంస్థల భద్రత, ప్రభుత్వ భవనాల కేటాయింపు, నిర్వహణకు సంబంధించి గవర్నర్‌కే అధికారాలుంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ సిఎస్ రాజీవ్ శర్మ, గవర్నర్ ముఖ్య కార్యదర్శి రమేశ్ కుమార్‌లకు కేంద్ర హోంశాఖ ఆగస్టు 8న మార్గదర్శకాలు పంపించింది.

మీడియాలో జ్యోతిష్య ప్రచారం

ప్రజలలో మూఢ విశ్వాసాలను ప్రోత్సహించే విధంగా మీడియా ప్రచారం చేయకూడదని ప్రెస్ కౌన్సిల్ అధ్యక్షుడు జస్టిస్ మార్కండేయ కట్జూ అన్నారు. వివిధ చానళ్లు, పత్రికలు జ్యోతిష్య అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఇప్పటికే ప్రజలు మూఢ నమ్మకాల్లో ఉన్నారన్నారు. ప్రజల జ్ఞానాన్ని పెంచేందుకు ప్రసార, ప్రచార మాధ్యమాలు ఉపయోగపడాలని చిన్న, మధ్యతరహా పత్రికల సంఘం భువనేశ్వర్‌లో ఆగస్టు 18న ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. దేశం వేదనాభరితమైన దశలో కొనసాగుతుందని, సమాజంలోని భూస్వామ్య పోకడలకు, మూఢవిశ్వాలకు వ్యతిరేకంగా పోరాటానికి మీడియా నేతృత్వం వహించాలన్నారు. దేశం ఇప్పుడు అటు భూస్వామ్య సమాజం కాదు, ఇటు ఆధునిక పారిశ్రామిక సమాజం కాదు. ప్రస్తుతం వేదనాభరిత దశలో కొనసాగుతోందన్నారు.

ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ ధర్నా

పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ చేస్తున్న మానవ హననాన్ని నిరసిస్తూ ఆగస్టు 18న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 70 ప్రజాస్వామిక సంస్థలు ధర్నా నిర్వహించాయి. గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ చేస్తున్న వైమానిక దాడులని ఆపాలని డిమాండ్ చేస్తూ కళాకారులు, మేధావులు, మానవ హక్కుల కార్యకర్తలు, వామపక్ష పార్టీల కార్యకర్తలు తమ నిరసనను వ్యక్తం చేశారు.

బొగ్గు నుసి అంటిన ఎన్‌డిఎ, యుపిఎ

1993 నుండి 2010 మధ్యలో ఎన్‌డిఎ, యుపిఎ ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలకు బొగ్గు గనులు కేటాయించిన పద్ధతిని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. వేలం వేయకుండా, చట్ట విరుద్ధంగా, విచక్షణను ఉపయోగించకుండా అడ్‌హాక్ పద్ధతిలో కేటాయించాయని విమర్శించింది. 17 ఏళ్లుగా ప్రభుత్వాలు జరిపిన 218 బొగ్గు గనుల కేటాయింపును పరిశీలించిన సుప్రీం కోర్టు పారదర్శకత లేకుండా కేటాయించాయని అంది. ఈ కేటాయింపుల వల్ల జరిగిన నష్టాన్ని మొదట 10.7 లక్షల కోట్లుగా అంచనా వేసి దాన్ని 1.86 లక్షల కోట్లకు తగ్గించారు. ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎం. లోథా సారధ్యంలోని ధర్మాసనం ఆగస్టు 25న ఈ తీర్పునిచ్చింది. వీ

గాజాపై కొనసాగుతున్న దాడులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈజిప్ట్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో మళ్లీ దాడులు ప్రారంభమయ్యాయి. ఇజ్రాయిల్ ఏకపక్షంగా తన దుర్మార్గ పాశవిక నీతిని అవలంభిస్తోంది. గాజాలోని ఇళ్లపై, ఆసుపత్రులపై, పాఠశాలలపై, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేసింది. తాజాగా ఈ నెల కాలంలో జరిగిన దాడిలో సుమారు యాభై మందికిపైగా చనిపోయారు. ఇజ్రాయిల్ భూమిపై నుంచి, ఆకాశం నుంచి దాడులను తీవ్రతరం చేసింది. తీవ్ర ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవిస్తోంది. దాడులు ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి వరకు దాదాపు పన్నెండు వందల మందికి పైగా మరణించారు. ప్రాణభీతితో శిబిరాలలో దలదాచుకుంటున్న వారి రోజు రోజుకూ పెరిగిపోతోంది. దాదాపు రెండు లక్షల మంది వరకు శిబిరాల్లో ఉన్నారు.

థాయ్ ప్రధానిగా ప్రయుథ్ చాన్ ఓఛా

థాయ్‌లాండ్ కొత్త ప్రధానిగా ప్రయుథ్ చాన్ ఓఛా ఎన్నికయ్యారు. కొద్దికాలంగా సైనిక కుట్ర ఫలితంగా ప్రభుత్వం పతనం కావడంతో సైన్యం ఆధీనంలో ఉన్న పార్లమెంట్ ఓఛాను ప్రధానిగా ఎంపిక చేసింది. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలు జరిగే ముందే దేశంలో రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రయుథ్ చెప్పారు. తాజా పరిణామాల నేపథ్యంలో దేశంలో సైనికీకరణ విస్తరిస్తుండడంపై దేశ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చైనాలో భూకంప బీభత్సం

చైనాలో ఆగస్ట్ మొదటి వారంలో వచ్చిన భూకంపం వల్ల భారీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఆగస్ట్ 5న వచ్చిన ఈ భూకంపంలో నాలుగు వందలకు పైగా ప్రాణాలు పోయాయి. వేలాదిగా ఇళ్లు కూలిపోయాయి. చైనా దక్షిణ ప్రావిన్స్‌లలో వచ్చిన గాలి తుఫానులు భారీ ప్రాణనష్టాన్ని, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఈ తుఫానులో చిక్కుకొని 77 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక ఇళ్లు, పంటలు ధ్వంసమయ్యాయి. దేశ ఆర్థిక వ్యవస్థకి 3,370 కోట్ల యువాన్ల నష్టం వాటిల్లిందని చైనా ప్రభుత్వం తెలిపింది. గత నాలుగేళ్లలో చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్ ఇది. భారీ వర్షాలు, వరదల వల్ల చైనా దక్షిణ ప్రాంతంలోని దాదాపు 1.1 కోట్ల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పాకిస్తాన్‌లో పెరుగుతున్న అనిశ్చితి

పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఎన్నికలలో రిగ్గింగ్‌కు పాల్పడి భారీ మెజారిటీతో అక్రమంగా అధికారం చేపట్టాడనీ, రాజీనామా చేసి తిరిగి ఎన్నికలలోకి వెళ్లాలనీ డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ నేత ఇమ్రాన్ ఖాన్ ఆందోళన సాగిస్తున్నారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆందోళనను విరమింపజేసేందుకు ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది. దీంతో ఆందోళనకారులు తమ నిరసన స్థాయిని మరింత పెంచారు. వేలాది మంది నిరసనకారులు ప్రతిపక్ష కార్యకర్తలతో కలిసి పాకిస్తాన్ పార్లమెంట్ హౌస్, ప్రెసిడెంట్ నివాసం, సుప్రీంకోర్టులతో పాటు దౌత్య కార్యాలయాలు, ముఖ్యమైన భవంతులను ముట్టడించారు. ప్రధానమంత్రి రాజీనామా చేసే వరకు ప్రభుత్వంతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఇమ్రాన్ ఖాన్ స్పష్టం చేశారు.

ఇరాక్‌లో భీకర పోరు

ఇరాక్‌లో ఐఎస్ఐఎస్ మిలిటెంట్లకూ, ప్రభుత్వ బలగాలకూ తీవ్ర పోరు నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఇంటర్నెట్‌లో ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు ఒక అమెరికా పాత్రికేయుడి తల నరికిన వీడియో తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. అమెరికా ఈ ఉదంతాన్ని తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇరాక్ ప్రభుత్వ బలగాలు దాడులు తక్షణమే నిలిపివేయాలని ఐఎస్ఐఎస్ డిమాండ్ చేసింది.

రిచర్డ్ అటెన్‌బరో మృతి

గాంధీ జీవితాన్ని తెరకెక్కించిన చిత్ర దర్శకుడు, సుప్రసిద్ధ బ్రిటిష్ నటుడు రిచర్డ్ అటెన్‌బరో (90) ఆగస్ట్ 25న గుండెపోటుతో మరణించారు. 1923 ఆగస్టు 29న ఆయన బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్‌లో జన్మించారు. ఆరు దశాబ్దాల తన కెరీర్‌లో తొలుత నటుడిగా ఎంతో పేరు తెచ్చుకున్నారు. తర్వాత క్రమంగా దర్శకత్వం వైపు దృష్టి సారించారు.

ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ఎబోలా

ఎబోలా వైరస్ ఆఫ్రికా దేశాలను తీవ్రంగా భయపెడుతోంది. ఇప్పటి వరకు దాదాపు తొమ్మిది వందల మంది దీని బారినపడి మరణించారు. నైజీరియా, లైబీరియా, సియోర్రా లియోన్ దేశాలకు ఈ వైరస్ పాకింది. గినియా అటవీ ప్రాంతాల్లో వెలుగు చూసిన ఈ వ్యాధి ఆఫ్రికా దేశాలకు వేగంగా విస్తరిస్తోంది. దీని బారినపడి మరణిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఎబోలా వైరస్ ప్రబలడంతో ఆఫ్రికా దేశాల నుండి వచ్చే ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ వైరస్ తీవ్రస్థాయిలో కోసిన సియెర్రా లియోన్, లైబీరియా, గినియా దేశాలకు ఆఫ్రికా బ్యాంక్, ప్రపంచ బ్యాంక్ ఇప్పటి వరకు 26 కోట్ల డాలర్లు సాయం అందించింది.

సిరియా సైనికుల ఊచకోత

సిరియా ఉత్తరాన ఉన్న రకా ప్రావిన్స్‌లో తిరుగుబాటు దళాలు సైనికుల ఊచకోతకు పాల్పడ్డాయి. దాదాపు ఎనభై ఐదు మంది సైనికుల తలలు నరికి హత్యచేశాయి. మరో రెండు వందల మంది సైనికుల జాడ తెలియడం లేదు. జిహాదిస్టులు రకా ప్రావిన్స్‌ను ఆక్రమించు కోవడంతో అక్కడి సిరియా దళాలు వెనక్కి తగ్గాయి. రకాలోని 17వ డివిజన్ సైనిక స్థావరంపై జిహాదిస్టులు దాడిచేసి వారిని బంధించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాయి. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 జూలై నుండి 31 జూలై 2014 వరకు తెలంగాణలోని 7 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 6 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1274)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	2	6	-	23	20	12	14	12	4	2	3	3	1	2	18	23	-	-	-	1	-
హైదరాబాద్	-	-	-	10	9	-	-	-	1	3	5	8	-	-	19	15	-	-	-	7	-
కరీంనగర్	వివరాలు అందలేదు																				
ఖమ్మం	-	1	-	3	2	1	3	2	-	1	1	1	-	8	14	12	-	-	-	-	4
మహబూబ్‌నగర్	-	7	27	21	-	-	-	3	-	1	17	30	20	16	48	15	-	-	-	-	-
మెదక్	2	14	3	19	22	9	12	-	4	9	9	11	6	3	19	4	-	1	-	4	2
నల్గొండ	వివరాలు అందలేదు																				
నిజామాబాద్	-	-	-	7	11	-	1	-	1	2	5	10	1	5	22	15	-	-	-	-	-
వరంగల్	-	3	-	8	5	6	9	9	-	-	-	-	-	8	24	8	-	-	-	-	6
తెలంగాణ	**4**	**31**	**30**	**91**	**69**	**28**	**39**	**26**	**10**	**18**	**40**	**63**	**28**	**42**	**164**	**92**	**-**	**1**	**-**	**12**	**12**
అనంతపురం	-	-	-	13	15	2	5	4	1	2	3	11	2	4	21	2	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	7	3	11	12	-	-	-	3	8	15	1	22	2	-	-	-	-	2
కడప	-	1	-	4	8	-	2	-	-	-	2	-	6	-	36	2	-	-	-	-	-
కర్నూలు	వివరాలు అందలేదు																				
ప్రకాశం	-	2	-	18	16	2	3	2	2	5	-	-	-	-	-	-	-	-	-	-	-
శ్రీకాకుళం	-	-	-	2	6	4	4	3	-	1	12	3	4	4	31	16	-	-	-	-	7
విశాఖపట్నం	-	-	-	8	11	1	6	-	-	3	3	2	6	4	20	11	-	-	-	13	1
ఆంధ్రప్రదేశ్	**-**	**3**	**-**	**58**	**59**	**20**	**32**	**9**	**3**	**11**	**23**	**24**	**33**	**13**	**130**	**33**	**-**	**-**	**-**	**13**	**10**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
సామాజిక విద్య – ఒకమిథ్య	ఎ. నర్సింహారెడ్డి	100
ప్రజా ఎజెండా లేని		
పార్లమెంటరీ రాజకీయాలు	ఎ. నర్సింహారెడ్డి	40
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
సమాధిలోకి సామ్రాజ్యవాదం	డి. పాపారావు	200
కొత్తకోణం	ఎనిశెట్టి శంకర్	80
ఫారన్‌హీట్ 451	ఎనిశెట్టి శంకర్	90
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్సీ, ఎస్టీ నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్సి, ఎస్టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా ఫూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు – రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు – అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు – మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ – వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–1	శారదాంబ స్మారక కమిటీ	300
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–2	శారదాంబ స్మారక కమిటీ	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–3	శారదాంబ స్మారక కమిటీ	250
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40
సామాజికం	వి. చెంచయ్య	30
స్త్రీవాద సాహిత్యం	డా. నళిని	70
రియాలిటీ చెక్	పూడూరి రాజిరెడ్డి	250
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75

చరిత్ర–జీవిత చరిత్ర

కశ్మీర్‌లో ఒక నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	రు. 150
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
టాల్‌స్టాయ్ పరిచయ వ్యాసాలు	యన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు	30
నూరేళ్ల కాళోజీ	వరవరరావు	60
ఆకుల భూమయ్య రచనలు	తెలంగాణ విద్యార్థి గళం	40

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	న్యూవిస్టా పబ్లికేషన్స్	100
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని		

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్–1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్–2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
రివిజనిజం	విరసం ప్రచురణ	75
జనతన జైత్రయాత్ర	విరసం ప్రచురణ	20
అంతర్యుద్ధంలో ఆదివాసులు	విరసం ప్రచురణ	20
ఆదర్శ జీవులు ఆమరులు	విరసం ప్రచురణ	30

కథ – నవల

దండకారణ్యంలో కథలు(2005–2012)	విరసం ప్రచురణ	100
రేపు కథ	వెర్నన్ గొంజాల్విస్	20
మిగిలేటోళ్లు	బాసిత్	50
కాంత పున్నం వెన్నెల	పద్మకుమారి	20
గంగానమ్మ	విజయ	15
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50
ఒంద్రుమట్టి	నల్లూరి రుక్మిణి	170

డివిడి

వీక్షణం (2003 – 2012)	200
సృజన (1966–1992)	240
అరుణతార (1970–2013)	125

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 158 - September 2014 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/08/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16

వేలాది మంది అభిమానుల కోరిక
వీక్షణంను కాపాడుకుందాం
ఎందరో శ్రేయోభిలాషులు చాస్తున్న స్నేహహస్తం
వీక్షణం మనుగడ కోసం శాయశక్తులా కృషి చేద్దాం,
మూలనిధి ఏర్పాటు చేద్దాం

వీక్షణం ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కి చిరకాలం కొనసాగాలంటే చందాదారులు, పాఠకులు పెరగాలి. ప్రతినెలా కనీసం మూడు పేజీల ప్రకటనలు రావాలి. శక్తి ఉన్న దాతలు ఇతరులకు కానుకగా చందాలు, విరాళాలు ఇవ్వాలి. వీక్షణం చిరకాలం మనుగడ సాగించడానికి వీలుగా మూలనిధి ఏర్పడాలి. ఈ విశాల సహాయ చర్యలలో భాగంగా:

- **వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ కనీసం మరొక చందా చేర్పించవచ్చు**
- **వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ మన చందాతో పాటు కనీసం రు. 100 వీక్షణం మూలనిధికి విరాళంగా ఇవ్వవచ్చు**
- **కళాశాలలను, విద్యాసంస్థలను, ప్రభుత్వ, ప్రైవేటు గ్రంథాలయాలను వీక్షణం చందాదారులుగా చేర్పించి వీక్షణం మరింత మంది పాఠకులకు చేరువయ్యేలా చూద్దాం**
- **ప్రతి న్యూస్ ఏజెంట్ దగ్గరా వీక్షణం విడిప్రతులు అమ్మకానికి ఉండే ఏర్పాట్లు చేయవచ్చు**
- **ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న వీక్షణం పాఠకులు తమ బాధ్యతగా వారి సంవత్సరాదాయంలో కనీసం ఒక శాతం వీక్షణం మూలనిధికి విరాళంగా ఇవ్వవచ్చు**
- **సామాజిక జీవితంలో క్రియాశీలంగా ఉన్న, విస్తృత పరిచయాలు ఉన్న వీక్షణం అభిమానులు తమకు తెలిసిన దాతల నుంచి వీక్షణం మూలనిధికి విరాళాలు సేకరించవచ్చు**
- **విద్యాసంస్థల, ఆరోగ్య సంస్థల, సాధారణ వ్యాపార సంస్థల నిర్వాహకులతో పరిచయాలు ఉన్న అధ్యాపకులు, మిత్రులు, సామాజిక కార్యకర్తలు వీక్షణం కోసం ఆయా సంస్థల వ్యాపార ప్రకటనలు సేకరించవచ్చు**
- **వీక్షణం ప్రచారం కోసం, ఆర్థిక సహాయం అర్థించడం కోసం మీ ప్రాంతాలలో సమావేశాలు ఏర్పాటు చేయవచ్చు**

వివరాలకు

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao